www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

సామాజిక న్యాయం... కాంగ్రెస్‌తోనే సాధ్యం
SC వర్గీకరణ వాగ్దానం నెరవేర్చుకున్న కాంగ్రెస్ పార్టీకి మరియు
రాష్ట్ర ముఖ్యమంత్రి
గౌ॥ శ్రీ ఎనుముల రేవంత్‌రెడ్డి గారికి
సబ్ కమిటి చైర్మన్ గౌ॥ శ్రీ ఎన్. ఉత్తమ్ కుమార్‌రెడ్డి గారికి
కో-చైర్మన్ గౌ॥ శ్రీ దామోదర రాజనర్సింహ్మ గారికి
మరియు సబ్ కమిటి సభ్యులందరికీ మా కృతజ్ఞతలు.

గురువారం | 20-3-2025 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 351 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, బహుళపక్షం; తిథి: షష్ఠి రా.2.46 తదుపరి సప్తమి; నక్షత్రం: అనూరాధ రా.11.32 తదుపరి జ్యేష్ఠ; వర్జ్యం: తె.5.39 మొ; అమృతఘడియలు: ఉ.11.57-1.44; దుర్ముహూర్తం: ఉ.10.22-11.10, మ.3.10-3.58; రాహుకాలం: మ.1.30-3.00; సూర్యోదయం: 6.22; సూర్యాస్తమయం: 6.22 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



జీసీసీ ఉద్యోగులకు జీతాల జోష్



వచ్చే ఏడాది కాలంలో 9.8% వేతన వృద్ధి

» ఏఐ, క్లౌడ్, సైబర్ సెక్యూరిటీ నిపుణులకు గరిష్ఠం
» హైదరాబాద్, ముంబై కేంద్రాలు టాప్ పేయర్స్
» ఎన్ఎల్‌బీ సర్వీసెస్ నివేదికలో వెల్లడి

ముంబై: వచ్చే ఏడాది కాలంలో దేశంలోని గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లలో (జీసీసీ) వేతనాలు 9.8 శాతం మేర పెరగవచ్చని డిజిటల్ నైపుణ్య పరిష్కారాల సంస్థ ఎన్ఎల్‌బీ సర్వీసెస్ తాజా నివేదిక అంచనా వేసింది. ఉద్యోగుల వేతనాలు, వృద్ధిలో జీసీసీలు సంప్రదాయ ఐటీ కంపెనీలను విుంచిపోయాయని పేర్కొంది. 2030 వరకు జీసీసీల రంగం వేతనాల్లో 9-12 శాతం సంచిత వృద్ధిని నమోదు చేయనుందని అంచనా వేసింది. "ప్రపంచవ్యాప్త జీసీసీల్లో 55 శాతానికి పైగా భారత్‌లోనే ఉన్నాయి. 2030 నాటికి జీసీసీల మార్కెట్ సైజు 11,000 కోట్ల డాలర్లకు చేరవచ్చని అంచనా. క్రియాశీలత, వ్యయ దక్షత, భారీ సంఖ్యలో నిపుణులను కోరుకునే సంస్థలకిప్పుడు జీసీసీలు కీలక కేంద్రాలుగా మారాయి. జీసీసీలు వేగంగా వృద్ధి చెందుతుండటంతో వాటిల్లో పనిచేస్తున్న ఉద్యోగుల వేతనాలు కూడా గణనీయంగా పెరుగుతున్నాయి. ప్రత్యేక నైపుణ్యాలు కలిగిన వారు ఇదివరకంటే అధిక వేతన పెంపు డిమాండ్ చేయగలుగుతున్నారు" అని ఎన్ఎల్‌బీ సర్వీసెస్ సీఈఓ సచిన్ అలుగ్ అన్నారు. దేశంలోని 6 నగరాల్లోని 10 రంగాలకు చెందిన 207 జీసీసీల నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా ఈ నివేదికను రూపొందించినట్లు తెలిపింది.

● హైదరాబాద్, ముంబైలోని జీసీసీలు అధిక జీతాలు చెల్లిస్తున్నాయి. ముఖ్యంగా ఐటీ సాఫ్ట్‌వేర్ అండ్ కన్సల్టింగ్, బ్యాంకింగ్/ఫైనాన్షియల్ సర్వీసెస్ రంగాల జీసీసీలు భారీ జీతాలు ఆఫర్ చేస్తున్నాయి. ఢిల్లీ/ఎన్‌సీఆర్, బెంగళూరులో బలమైన పోటీతత్వం కనబరిచాయి. కాగా, టెలికాం, ఇంటర్నెట్ సేవల విభాగాల్లో సమానత్వం కనిపించింది.

● కృత్రిమ మేధ (ఏఐ), మెషీన్ లెర్నింగ్ (ఎంఎల్), క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ నైపుణ్య రంగాల్లో డిమాండ్ కారణంగా జూనియర్, మధ్య స్థాయి సిబ్బంది వేతనాలు అధికంగా వృద్ధి చెందనున్నాయి. కంపెనీలు నాయకత్వ పదవుల్లో వ్యయ దక్షతకు ప్రాధాన్యం ఇస్తున్న కారణంగా సీనియర్ స్థాయి ఉద్యోగుల వేతనాలు మాత్రం స్వల్పంగా వృద్ధి చెందనున్నాయి.

● జీసీసీలు ప్రత్యేక నైపుణ్యాలకు ప్రాధాన్యమిస్తున్నాయి. అది వేతన చెల్లింపుల్లోనూ ప్రతిబింబిస్తుంది. ఏఐ, ఎంఎల్, డేటా సైన్స్ నిపుణులు సంప్రదాయ ఐటీ నిపుణుల కంటే 30-50 శాతం అధికంగా వేతనం అందుకుంటున్నారు. జనరేటివ్ ఏఐ, హైబ్రిడ్ క్లౌడ్ వినియోగం పెరగడంతో క్లౌడ్ ఆర్కిటెక్ట్‌లు, ప్రొడక్ట్ డిజైనర్లకు భారీ జీతాలు లభిస్తున్నాయి.

● నాలుగో తరం పారిశ్రామిక రంగాల్లో ఫౌండేషనల్ డిజిటల్ అండ్ ఆటోమేషన్ ఇంజనీర్లకు మిగతా వారికంటే 20-50 శాతం అధిక వేతనం లభిస్తోంది. కాగా, కంపెనీల్లో డేటా భద్రత కీలకంగా మారుతున్న తరుణంలో సైబర్ సెక్యూరిటీ నిపుణుల జీతం రెండంకెల్లో వృద్ధి చెందనుంది.

● జీసీసీలు కేవలం ఐటీ సేవల రంగానికే పరిమితం కావడం లేదు. ప్రస్తుతం ఆర్థిక సేవల రంగానికి చెందిన జీసీసీలు ముందంజలో ఉన్నాయి. వీటిల్లో ఎంట్రీ లెవెల్ ఉద్యోగుల వార్షిక వేతనం రూ.6-12 లక్షల స్థాయిలో ఉంటోంది. మధ్య స్థాయి ఉద్యోగులు రూ.18-35 లక్షలు, సీనియర్ అధికారులు రూ.45-90 లక్షల వార్షిక జీతం అందుకుంటున్నారు. ప్రతిభ కలిగిన వారిని కాపాడుకోవడంతో పాటు నాయకుల అభివృద్ధిపై జీసీసీలు గట్టిగా దృష్టిసారించాయనడానికి ఇది నిదర్శనం.

అమెరికాలో వడ్డీరేట్లు యథాతథం

వాషింగ్టన్: కీలక వడ్డీరేట్లను 4.25-4.5% వద్దే యథాతథంగా కొనసాగించాలని అమెరికా కేంద్ర బ్యాంకు ఫెడ్ రిజర్వు నిర్ణయించింది. బ్యాంకు ఛైర్మన్ జెరోం పోవెల్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. అయితే ఆర్థిక పరిస్థితులు విషమిస్తే ఈ సంవత్సరం రెండు విడతలుగా వడ్డీరేట్ల కోత ఉండే అవకాశం ఉందని స్పష్టమైన సంకేతాలిచ్చింది. ట్రంప్ వాణిజ్య సుంకాల నేపథ్యంలో తలెత్తే పరిస్థితులపై స్పష్టత ఏర్పడే వరకు వడ్డీరేట్ల తగ్గింపు జోలికి పోకపోవడమే మంచిదని ఫెడ్ రిజర్వు నిర్ణయించినట్టు భావిస్తున్నారు.

యూసీబీలు పటిష్ఠంగా ఉండాలి: మల్హోత్రా

నానాటికీ పెరుగుతున్న ఐటీ, సైబర్ రిస్కుల నేపథ్యంలో దేశంలో పట్టణ సహకార బ్యాంకులు (యూసీబీ) నిర్వహణాపరంగా పటిష్ఠంగా ఉండాలని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా సూచించారు. ఆయన బుధవారం ఎంపిక చేసిన యూసీబీల ఛైర్మన్లు, ఎండీలు, సీఈఓలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అట్టడుగు స్థాయిలు ప్రజలకు సేవలందిస్తూ ఫైనాన్షియల్ ఇంక్లూజన్‌ను మరింత లోతుగా పాదుకునేలా చేయడంతో యూసీబీల పాత్రను ప్రశంసించారు. డిపాజిటర్లు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు కృషి చేయాలని సూచించారు.

ఉక్కు దిగుమతులపై 12% సుంకం!

కేంద్ర వాణిజ్య శాఖ సిఫారసు

న్యూఢిల్లీ: దేశీయ ఉక్కు తయారీదారుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు విదేశాల నుంచి దిగుమతయ్యే కొన్ని స్టీల్ ఉత్పత్తులపై 200 రోజులపాటు 12 శాతం తాత్కాలిక రక్షణ సుంకం విధించాలని కేంద్ర వాణిజ్య శాఖకు చెందిన దర్యాప్తు విభాగం డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ట్రేడ్ రెమిడీస్ (డీజీటీఆర్) సిఫారసు చేసింది. పలు పరిశ్రమల్లో ఉపయోగించే నాన్ అల్లాయ్, అల్లాయ్ స్టీల్ ఫ్లాట్ ఉత్పత్తుల దిగుమతులు ఒక్కసారిగా పెరగడంతో ఇండియన్ స్టీల్ అసోసియేషన్ చేసిన ఫిర్యాదు మేరకు గత ఏడాది డిసెంబరులో డీజీటీఆర్ దర్యాప్తు ప్రారంభించింది.



ఈ ఉత్పత్తుల దిగుమతులు ఆకస్మికంగా, వేగంగా పెరిగాయని, ఇది దేశీయ స్టీల్ తయారీదారులకు నష్టం చేకూర్చే ప్రమాదం ఉందని డీజీటీఆర్ ప్రాథమిక దర్యాప్తులో తేలింది. దేశీయ సంస్థల ప్రయోజనాలను కాపాడేందుకు విదేశాల నుంచి దిగుమతి అవుతున్న స్టీల్ ఉత్పత్తులపై 12 శాతం సుంకం విధించాలని ఈనెల 18న జారీ చేసిన నోటిఫికేషన్‌లో డీజీటీఆర్ సిఫారసు చేసింది. ఈ ప్రతిపాదనపై కేంద్ర ఆర్థిక శాఖ తుది నిర్ణయం తీసుకోనుంది.

స్టీల్ స్టాక్స్ జూమ్: ఈ ప్రతిపాదనతో బుధవారం స్టీల్ రంగ కంపెనీల షేర్లు భారీగా పుంజుకున్నాయి. ఎన్ఎండీసీ షేరు ఏకంగా 6.88 శాతం ఎగబాకింది. సెయిల్ 3.99 శాతం, టాటా స్టీల్ 2.52 శాతం, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ 1.33 శాతం, జిందాల్ స్టెయిన్‌లెస్ 1.15 శాతం, జిందాల్ స్టీల్ అండ్ పవర్ 0.25 శాతం పెరిగాయి.

92,000 చేరువలో బంగారం



న్యూఢిల్లీ: బులియన్ మార్కెట్ రేసు గుర్రంలా పరిగెడుతోంది. బంగారం, వెండి ధరలు బుధవారం జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో మరో జీవితకాల గరిష్ఠానికి చేరాయి. ఢిల్లీలో 10 గ్రాముల మేలిమి (24 కేరట్స్) బంగారం రూ.700 లాభంతో రూ.91,950కు చేరి సరికొత్త రికార్డు సృష్టించింది. కిలో వెండి ధరా రూ.1,000 లాభంతో మరో ఆల్ టైమ్ హై రూ.1,03,500కు చేరింది. అంతర్జాతీయ మార్కెట్ లోనూ ఇదే పరిస్థితి. బుధవారం ఒక దశలో ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం 3,045.39 డాలర్లకు చేరి సరికొత్త రికార్డు సృష్టించింది. ప్రధాన ఆసియా మార్కెట్లలో అయితే ఔన్స్ ధర ఇంట్రా డేలో 3,052.31 డాలర్లు పలికింది. పరిస్థితులు ఇలానే కొనసాగితే ఈ ఏడాది చివరికల్లా అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్స్ పసిడి ధర 4,000 డాలర్లకు చేరుతుందనే అంచనాలు వినిపిస్తున్నాయి. అదే జరిగితే భారత మార్కెట్‌లో 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.లక్షకు చేరుతుందని అంచనా.

యూపీఐ లావాదేవీల ప్రోత్సాహానికి ప్రత్యేక పథకం

న్యూఢిల్లీ: దేశంలో యూపీఐ లావాదేవీల ప్రోత్సాహానికి రూ.1500 కోట్ల విలువ గల ఒక పథకానికి కేంద్ర కేబినెట్ ఆమోదముద్ర వేసింది. దీని కింద 2024-25 ఆర్థిక సంవత్సరంలో కొనుగోలుదారుడు వ్యాపారికి చెల్లించే రూ.2,000 లోపు మొత్తంపై మర్చంట్ డిస్కౌంట్ రేట్‌ను (ఎండీఆర్) కేంద్రమే భరిస్తుంది. వ్యక్తిగత కొనుగోలుదారులు, వ్యాపారుల మధ్య (పీ2ఎం) తక్కువ విలువ గల భీమ్-యూపీఐ లావాదేవీలను ప్రోత్సహించడం ఈ పథకం లక్ష్యమని కేంద్రం ఒక ప్రకటనలో తెలిపింది. 2014 ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు జరిగే రూ.2,000 లోపు విలువ గల పీ2ఎం యూపీఐ లావాదేవీలకు మాత్రమే ఇది వర్తిస్తుందని స్పష్టం చేశారు.

జేపీఎల్ కొనుగోలు రేసులో జీఎంఆర్

న్యూఢిల్లీ: దివాలా పరిష్కార ప్రక్రియలో భాగంగా జైప్రకాశ్ అసోసియేట్స్ లిమిటెడ్ (జేపీఎల్) కంపెనీని చేజిక్కించుకునేందుకు జీఎంఆర్ గ్రూప్ సహా పలు కార్పొరేట్ దిగ్గజాలు పోటీపడుతున్నాయి. జేపీఎల్ ఆస్తుల కొనుగోలుకు జీఎంఆర్, జేఎస్‌డబ్ల్యూ, దాల్మియా భారత్, జిందాల్ పవర్, వేదాంత, వెల్‌స్పన్, టొరెంట్ పవర్ ఇప్పటికే ఆసక్తి వ్యక్తీకరణ (ఈఓఐ) సమర్పించినట్లు తెలిసింది. తుది గడువు (ఈనెల 25) లోగా అదానీ గ్రూప్ సైతం ఈఓఐ సమర్పించనున్నట్లు సమాచారం. సిమెంట్ ప్లాంట్లు, హోటళ్లు సహా భిన్న వ్యాపారాల్లోకి విస్తరించిన జేపీఎల్ ఆస్తుల ప్రస్తుత విలువ రూ.17,300 కోట్ల స్థాయిలో ఉండవచ్చని అంచనా. ఐసీఐసీఐ బ్యాంక్, ఎస్‌బీఐ, పీఎన్‌బీ, ఐడీబీఐ బ్యాంక్‌తోపాటు మరో 21 మంది రుణదాతలకు జేపీఎల్ రూ.48,000 కోట్లకు పైగా బకాయిపడింది.

3 రోజుల్లో రూ.14 లక్షల కోట్ల లాభం

22,900 ఎగువకు నిఫ్టీ

న్యూఢిల్లీ: ఈక్విటీ సూచీలు వరుసగా మూడో రోజూ లాభపడ్డాయి. బుధవారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ ఒకదశలో 267 పాయింట్ల మేర పుంజుకున్నప్పటికీ, చివరికి 147.79 పాయింట్ల లాభంతో 75,449.05 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 73.30 పాయింట్ల వృద్ధితో 22,907.60 వద్ద ముగిసింది. కన్స్యూమర్ డ్యూరబుల్స్, కేపిటల్ గూడ్స్, రియల్టీ షేర్లలో మదుపరులు కొనుగోళ్లు పెంచడంతోపాటు విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు మళ్లీ మన మార్కెట్లో పెట్టుబడులు పెడుతుండటం ఇందుకు దోహదపడింది. గడిచిన మూడు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 1,620.14 పాయింట్లు (2.19 శాతం) పుంజుకుంది. మూడు రోజుల ర్యాలీలో బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.13.82 లక్షల కోట్లు పెరిగి రూ.405.01 లక్షల కోట్లకు (4.68 లక్షల కోట్ల డాలర్లు) చేరింది. బీఎస్ఈ మార్కెట్ క్యాప్ మళ్లీ రూ.400 లక్షల కోట్ల మైలురాయిని దాటడం దాదాపు నెల రోజుల తర్వాత ఇదే మొదటిసారి.

జీఆర్‌టీ జువెలర్స్ 'స్వర్ణ ఉగాది'

హైదరాబాద్: స్వర్ణాభరణాల రిటైలింగ్ దిగ్గజం జీఆర్‌టీ జువెలర్స్ ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని "స్వర్ణ ఉగాది" ప్రచారం చేపట్టింది. ఇందులో భాగంగా కంపెనీ తమ కస్టమర్లకు పలు ఆఫర్లు ప్రకటించింది. బంగారు ఆభరణాల కొనుగోలుపై గ్రాముకు రూ.50 తగ్గింపు ఇవ్వడంతో పాటు పాత బంగారం మార్పిడిపై గ్రాముకు రూ.75 అదనపు ప్రయోజనం కల్పిస్తోంది. అలాగే వజ్రాల కొనుగోలుపై (సాలిటైర్స్ మినహా) 10 శాతం తగ్గింపు, వెండి వస్తువుల మేకింగ్ చార్జీలపై 25 శాతం తగ్గింపు, వెండి ఆభరణాల ఎంఆర్‌పీపై 10 శాతం తగ్గింపు ప్రకటించింది.

ఎన్‌విడియాతో టెక్ మహీంద్రా భాగస్వామ్యం

న్యూఢిల్లీ: కాలిఫోర్నియా ప్రధాన కేంద్రంగా పని చేస్తున్న చిప్ తయారీ సంస్థ ఎన్‌విడియాతో టెక్ మహీంద్రా, విప్రో, ఎల్ అండ్ టీ టెక్నాలజీ వ్యక్తిగత భాగస్వామ్య ఒప్పందాలు కుదుర్చుకున్నట్టు ప్రకటించాయి. ఈ భాగస్వామ్యం కింద ఆయా సంస్థలు వివిధ పరిశ్రమలకు ఏఐ ఆధారిత సొల్యూషన్లు అందిస్తాయి. ఇందులో భాగంగా ఎన్‌విడియాకు చెందిన ఏఐ సాఫ్ట్‌వేర్ సహాయంతో పనిచేసే ఫార్మకోవిజిలెన్స్ (పీవీ) సొల్యూషన్‌ను టెక్ మహీంద్రా ఆవిష్కరించింది. ఇది ఔషధ భద్రతా నిర్వహణను మెరుగుపరుస్తుంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

20వ తేదీ			
హైదరాబాద్	420	విజయవాడ	440
వరంగల్	422	గోదావరి	420
చిత్తూరు	470	విశాఖపట్నం	420
		దజను గుడ్లు రూ. 60	



ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	96	విజయవాడ	105
వరంగల్	96	గుంటూరు	103
కరీంనగర్	96	ఒంగోలు	103
మహబూబ్‌నగర్	96	చిత్తూరు	96
కర్నూలు	96	నెల్లూరు	101
విశాఖపట్నం	99	అనంతపురం	101
గోదావరి	105		



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	90,440 ▲	82,900 ▲	1,14,000 ▲
విజయవాడ	90,800 ▲	87,000 ▲	1,00,700 ▼
విశాఖపట్నం	89,050 ▼	81,630 ▼	1,00,820 ▼
రాజమండ్రి	90,440 ▲	82,500 ▲	1,03,100 ▲
ప్రొద్దుటూరు	89,900 ▲	83,250 ▲	1,01,000 ▼
ముంబై	88,650 ▲	81,200 ▲	99,970 ▼

స్పోర్ట్స్

క్రీడలకు రూ.465 కోట్ల భారీ బడ్జెట్

హకీంపేటలోనే స్పోర్ట్స్ వర్సిటీ

శాట్ ఛైర్మన్ శివసేనా రెడ్డి హర్షం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): రాష్ట్ర వార్షిక బడ్జెట్‌లో క్రీడా రంగానికి రికార్డు స్థాయిలో రూ.465 కోట్ల భారీ కేటాయింపులు చేశారు. 206 ఎకరాల విస్తీర్ణంలోని హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌లోనే క్రీడా విశ్వవిద్యాలయాన్ని నిర్మించనున్నామని బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి క్రీడా రంగానికి రూ.137 కోట్లు అదనంగా కేటాయించారు. ఈ విశ్వవిద్యాలయంలో అంతర్జాతీయ ప్రమాణాలతో పన్నెండు ఎంపిక చేసిన క్రీడాంశాల్లో ప్రత్యేక అకాడమీలను ఏర్పాటు చేయనున్నారు. ఎన్నడూ లేని విధంగా తొలిసారి రూ.465 కోట్లు క్రీడలకు కేటాయించిన సీఎం రేవంత్ రెడ్డి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క చరిత్రలో నిలిచిపోతారని 'శాట్' ఛైర్మన్ శివసేనా రెడ్డి కొనియాడారు. ఎల్బీ స్టేడియంలో పలువురు క్రీడాకారులతో కలిసి ఈ ఇరువురి చిత్ర పటాలకు శివసేనా రెడ్డి క్షీరాభిషేకం చేశారు. శాట్ సిబ్బంది, క్రీడాకారులతో కలిసి బాణాసంచా కాల్చి సంబరాలు చేశారు. రాష్ట్రంలో కొత్త స్టేడియాల నిర్మాణం కోసం రూ.81.81 కోట్లు, ప్రతిభావంతులైన క్రీడాకారులకు నగదు ప్రోత్సాహకాలు అందించేందుకు రూ.16.6 కోట్లు, స్పోర్ట్స్ స్కూల్స్ అభివృద్ధికి రూ.51.68 కోట్లు ప్రత్యేకంగా కేటాయించినట్టు తెలిపారు.



భరణం రూ. 4.75 కోట్లు?

చాహల్, ధనశ్రీ విడాకుల కేసులో తీర్పు నేడు!

న్యూఢిల్లీ: టీమిండియా స్పిన్నర్ యజ్వేంద్ర చాహల్, ధనశ్రీ వర్మ పరస్పర అంగీకారంతో విడిపోయేందుకు సిద్ధమైన నేపథ్యంలో.. ఈ జంట విడాకులకు సంబంధించి ఓ కీలక అంశం వెలుగులోకి వచ్చింది. భరణం కింద ధనశ్రీకి రూ. 4.75 కోట్లు ఇచ్చేందుకు చాహల్ అంగీకరించినట్టు సమాచారం. ఇందుకు సంబంధించి రూ. 2.37 కోట్లు ఫిబ్రవరిలోనే చెల్లించినట్టు జాతీయ మీడియా పేర్కొంది. తమకు విడాకులు మంజూరు చేయాలంటూ ఇద్దరూ గత నెల 5న ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించారు. అయితే, పరస్పర అంగీకారంతో విడిపోవాలని నిర్ణయించుకున్నందున తమకు ఆరునెలల కూలింగ్ పీరియడ్ (చట్టప్రకారం విడిపోయేముందు ఆరునెలలు కలిసుండడం) నుంచి మినహాయింపు ఇవ్వాలన్న వారి అభ్యర్థనను ఫ్యామిలీ కోర్టు తిరస్కరించింది. దీన్ని బాంబే హైకోర్టులో సవాల్ చేయగా.. వీరికి అనుకూలంగా తీర్పు వచ్చింది. ఈనెల 22 నుంచి జరిగే ఐపీఎల్‌లో ఆడాల్సి ఉండడంతో ఆలోపే విడాకుల అంశాన్ని తేల్చాలన్న చాహల్ వాదనతో ఏకీభవించిన హైకోర్టు గురువారం తీర్పు వెల్లడించాలంటూ ఫ్యామిలీ కోర్టును ఆదేశించింది. దీంతో వీరిద్దరి విడాకుల అంశంపై గురువారం తీర్పు వెలువడే అవకాశం ఉంది.

హారికకు తొలి ఓటమి

నికోసియా (సైప్రస్): ఫిడే మహిళల గ్రాండ్ ప్రీ చెస్‌లో భారత గ్రాండ్ మాస్టర్ ద్రోణవల్లి హారికకు తొలి ఓటమి ఎదురైంది. బుధవారం జరిగిన ఐదో రౌండ్ గేమ్‌లో ఎలిజబెత్ పెహెట్జ్ చేతిలో హారిక పరాజయం పాలైంది. నల్లపావులతో ఆడిన హారిక 50 ఎత్తుల అనంతరం ఓటమిని అంగీకరించింది. కాగా, ననా డిజాంగ్‌నిడ్జే (జార్జియా)తో గేమ్‌ను దివ్య దేశ్‌ముఖ్ డ్రాగా ముగించింది. ఐదు రౌండ్ల తర్వాత హారిక 2.5, దివ్య 2 పాయింట్లతో ఉన్నారు.



> మాజీ కోశాధికారి సురేందర్ అగర్వాల్‌పై అభియోగాలు
> అజర్ చుట్టూ బిగుస్తున్న ఉచ్చు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): ఉప్పల్ స్టేడియం నిర్మాణం, ఆ తర్వాత జరిగిన ఆధునీకరణ పనుల్లో జరిగిన అక్రమాలపై ఈడీ చేస్తున్న దర్యాప్తులో పురోగతి లభించింది. బుధవారం హెచ్‌సీఏ మాజీ కోశాధికారి సురేందర్ అగర్వాల్‌కు సంబంధించిన అవినీతిపై ఈడీ పక్కా ఆధారాలను సేకరించి రూ.90.86 లక్షల అక్రమ సొమ్మును సీజ్ చేసింది. మహ్మద్ అజరుద్దీన్ హెచ్‌సీఏ అధ్యక్షుడిగా ఉన్న కాలంలో (2019-23) స్టేడియం ఆధునీకరణ పనుల్లో క్విడ్ ప్రోకో కింద అజర్ సహా అపెక్స్ కౌన్సిల్ సభ్యులకు పెద్ద మొత్తంలో ముడుపులు అందాయన్న ఆరోపణలు ఉన్నాయి. స్టేడియం నిర్మాణం, ఆతర్వాత ఆధునీకరణ పనుల కేసులను సమాంతరంగా దర్యాప్తు చేస్తున్న అధికారులకు సురేందర్ చిక్కారు. 2019-23 మధ్య స్టేడియంలో కొత్త సీట్ల ఏర్పాటు, జిమ్ పరికరాలు, క్రికెట్ బంతుల కొనుగోలులో తక్కువ రకం ఉత్పత్తులను ఎక్కువ మొత్తానికి కొనేలా తమకు లబ్ధి చేకూర్చే కంపెనీలకు కాంట్రాక్టులను ఇచ్చి అవినీతికి తెరలేపారు. సురేందర్ భార్య, కొడుకు, కోడలు వ్యక్తిగత బ్యాంకు ఖాతాలకు సారా స్పోర్ట్స్ సంస్థ నుంచి రూ.17లక్షలు, ఎక్సలెంట్ ఎంటర్‌ప్రైజెస్ నుంచి రూ.21.86 లక్షలు, బాడీ డ్రెంజ్ సంస్థ నుంచి రూ.52 లక్షలు బదిలీ అయినట్టు ఈడీ విచారణలో తేలింది. సురేందర్‌తో పాటు ఈ కేసుల్లో అజరుద్దీన్, కార్యదర్శి విజయానంద్‌పై కూడా ఆరోపణలున్నాయి.

సింధుకు షాక్

ఆరంభ రౌండ్లో పరాజయం

ప్రణయ్‌పై శ్రీకాంత్ గెలుపు

బాసెల్: స్టార్ షట్లర్, పీవీ సింధు ఫామ్‌లేమి కొనసాగుతోంది. తాజాగా స్విస్ ఓపెన్‌లోనూ నిరాశపరుస్తూ ఆరంభరౌండ్లోనే వెనుదిరిగింది. బుధవారం జరిగిన సింగిల్స్ పోరులో డెన్మార్క్‌కు చెందిన జూలీ దావల్ జాకబ్‌సెన్ 21-17, 21-19తో సింధుకు షాకిచ్చింది. ఇక, కిడాంబి శ్రీకాంత్ 23-21, 23-21తో భారత్‌కే చెందిన హెచ్ఎస్ ప్రణయ్‌ను ఓడించగా, శంకర్ ముత్తుస్వామి 21-5, 21-16తో మాగ్నస్‌పై నెగ్గి రెండోరౌండ్ చేరారు. డబుల్స్‌లో గాయత్రి/ట్రీసా జాలీ ద్వయం 21-16, 21-17తో ముల్లర్ (స్విట్జర్లాండ్)/కెల్లీ వాన్(నెదర్లాండ్స్) జంటపై గెలిచింది. మిగతా భారత షట్లర్లలో ఇషా రాణి, అనుపమ సింగిల్స్‌లో రెండోరౌండ్‌కు దూసుకెళ్లారు.

ఆ ఒక్క మ్యాచ్‌కి..

ముంబై కెప్టెన్ సూర్య


ముంబై : ఈ సీజన్ ఐపీఎల్‌ను చెన్నై సూపర్ కింగ్స్‌తో ఆదివారం జరిగే మ్యాచ్ ద్వారా ముంబై ఇండియన్స్ ప్రారంభించనుంది. అయితే గత సీజన్‌లో మూడుసార్లు నిర్ణీత సమయంలో పూర్తి ఓవర్ల కోటాను పూర్తి చేయని కారణంగా హార్దిక్ పాండ్యా ఒక మ్యాచ్ సస్పెన్షన్ ఎదుర్కొంటున్నాడు. ఈనేపథ్యంలో సీఎస్‌కేతో పోరుకు సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు.

ఆ నిబంధన మార్చం: బీసీసీఐ

న్యూఢిల్లీ: బీసీసీఐ ఇటీవల కొత్తగా అమలుల్లోకి తెచ్చిన 'క్రికెటర్లతో కుటుంబ సభ్యులు' నిబంధన విషయంలో పునరాలోచన చేస్తున్నదంటూ వస్తున్న వార్తలను కార్యదర్శి దేవజిత్ సైకియా ఖండించాడు. ఈ ఆంక్షలపై విరాట్ కోహ్లీ విమర్శలు చేయడంతో..నిబంధనలను బీసీసీఐ సడలించనున్నదనే వార్తలు వస్తున్నాయి. దీనిపై సైకియా స్పందిస్తూ 'కొత్త నిబంధన అమలులో ఉంటుంది. అది దేశానికి, బీసీసీఐకి ఎంతో ముఖ్యమైనది' అని స్పష్టంజేశాడు.

శ్రేయాస్ అయినా..

పంజాబ్ రాత మార్చేనా?



మెగా లీగ్‌లో ఉనికిని కోల్పోయిన జట్టు పంజాబ్ కింగ్స్.! ఐపీఎల్ చరిత్రలో ఒక్కసారి కూడా ట్రోఫీని ముద్దాడలేకపోయింది. పేరు మార్చుకొన్నా.. తరచూ జట్టును సమూలంగా ప్రక్షాళన చేస్తున్నా.. ఎంతో అనుభవం ఉన్న కోచ్‌లను నియమించుకొంటున్నా జట్టు తలరాత మాత్రం మారడం లేదు. టోర్నీ చరిత్రలో రెండుసార్లు మాత్రమే ప్లేఆఫ్స్‌కు చేరుకొంది. 2008 సెమీస్‌లో ఓడగా.. 2014లో ఫైనల్లో కోల్‌కతా చేతిలో పరాజయం పాలైంది. గత పదేళ్లలో ఎన్ని ప్రయోగాలు చేసినా.. పంజాబ్ ఆటతీరు మాత్రం మారడం లేదు. అయితే, గతేడాది కోల్‌కతాకు టైటిల్ సాధించి పెట్టిన శ్రేయాస్ అయ్యర్‌ను వేలంలో రూ. 26.75 కోట్ల భారీ ధరకు కొనుగోలు చేసిన పంజాబ్.. అతడికే జట్టుపగ్గాలు అప్పగించింది. పేసర్ అర్ష్‌దీప్ సింగ్, స్పిన్నర్ యజ్వేంద్ర చాహల్‌ను చెరో రూ. 18 కోట్లకు ఖరీదు చేసింది. కోచ్‌గా రికీ పాంటింగ్‌ను నియమించడంతో ఈసారి జట్టు మెరుగైన ప్రదర్శన చేసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. బ్యాటింగ్ లైనప్ బలంగానే కనిపిస్తున్నా నిలకడలేమి ఇబ్బందిపెడుతోంది. ఓపెనర్లుగా ప్రభ్‌సిమ్రన్ సింగ్, జోష్ ఇంగ్లిస్ బరిలోకి దిగే అవకాశాలున్నాయి. ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్లు మ్యాక్స్‌వెల్, స్టొయినిస్, జెన్సన్‌తో మిడిలార్డర్ బలంగా కనిపిస్తోంది. గత సీజన్‌లో ఫినిషర్‌గా ఆకట్టుకొన్న శశాంక్ సింగ్ నుంచి జట్టు అదే తరహా ప్రదర్శనను ఆశిస్తోంది. అర్ష్‌దీప్, ఫెర్గూసన్, జెన్సన్‌తో పేస్ విభాగం ఫర్వాలేదనిపిస్తున్నా.. చాహల్ మినహా మరో స్పెషలిస్ట్ స్పిన్నర్ లేకపోవడం మైనస్. పైగా టీమిండియాకు ఆడుతున్న ఆటగాళ్లు ఇద్దరే జట్టులో ఉండగా.. కోర్ టీమ్‌ను తయారు చేసుకోలేకపోవడం పెద్దలోపం.

జట్టు

బ్యాటర్లు: శ్రేయాస్ అయ్యర్ (కెప్టెన్), నేహల్ వదేరా, ఆరోన్ పన్ను, అవినాష్, ప్రభ్‌సిమ్రన్ సింగ్, శశాంక్ సింగ్; **వికెట్ కీపర్లు:** విష్ణు వినోద్, జోష్ ఇంగ్లిస్; **ఆల్‌రౌండర్లు:** మార్కస్ స్టొయినిస్, మ్యాక్స్‌వెల్, హర్‌ప్రీత్ బ్రార్, మార్కో జెన్సన్, అజ్మతుల్లా ఒమర్జాయ్, ప్రియాన్స్ ఆర్య, ఆరోన్, ముషీర్ ఖాన్, సూర్యాంశ్ షెగ్డే; **బౌలర్లు:** అర్ష్‌దీప్ సింగ్, చాహల్, లోకీ ఫెర్గూసన్, వైశాఖ్ విజయ్‌కుమార్, యాశ్ ఠాకూర్, కుల్దీప్ సేన్, బార్ట్‌లెట్, ప్రవీణ్ దూబే.

ఐపీఎల్ 2 రోజుల్లో



టైటిల్ నిలబెట్టుకోవాలని..

రహానె సారథ్యంలో కోల్‌కతా నైట్‌రైడర్స్

డిఫెండింగ్ చాంప్‌గా బరిలోకి దిగుతున్న కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్) టైటిల్‌ను నిలబెట్టుకోవాలన్న పట్టుదలతో ఉంది. 2012, 2014లో గౌతమ్ గంభీర్ కెప్టెన్సీలో ఐపీఎల్ ట్రోఫీ నెగ్గిన కోల్‌కతా.. దశాబ్దం తర్వాత 2024లో మళ్లీ విజేతగా నిలిచింది. గత సీజన్‌లో శ్రేయాస్ అయ్యర్ కెప్టెన్సీలో ఏమాత్రం అంచనాల్లేకుండా బరిలోకి దిగిన నైట్‌రైడర్స్.. ఫైనల్లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను ఓడించి టైటిల్‌ను సొంతం చేసుకొంది. మెంటార్‌గా జట్టు విజయంలో కీలకపాత్ర పోషించిన గంభీర్ టీమిండియా కోచ్‌గా వెళ్లాడు. అయితే శ్రేయాస్ అయ్యర్‌ను వదిలేయడం అందరినీ ఆశ్చర్యపరిచింది. కానీ, రింకూ సింగ్, వరుణ్ చక్రవర్తి, ఆండ్రూ రస్సెల్, సునీల్ నరైన్, హర్షిత్ రాణా, రమణ్‌దీప్ సింగ్‌తో కోర్ టీమ్‌ను రిటైన్ చేసుకోవడం చూస్తే జట్టు విషయంలో మేనేజ్‌మెంట్ స్పష్టతతోనే ఉన్నట్టు అవగతమవుతోంది. రూ. 23.75 కోట్లకు ఆల్‌రౌండర్ వెంకటేష్ అయ్యర్‌ను కొనుగోలు చేయడంతో అతడికే జట్టు పగ్గాలు అప్పగిస్తారని భావించారు. కానీ, అనుభవజ్ఞుడైన అజింక్యా రహానెను వేలంలో కనీస ధరకే దక్కించుకొన్న కోల్‌కతా.. అతడికే సారథ్యం అప్పగించింది. మెంటార్‌గా అవతారం ఎత్తిన డ్వేన్ బ్రావో ఎలా నడిపిస్తాడో చూడాలి. ఓవరాల్‌గా బ్యాటింగ్, బౌలింగ్‌లో మెరుగైన ఆటగాళ్లతో సమతుల్యంగా కనిపిస్తోంది. డికాక్, గుర్బాజ్, రింకూతో బ్యాటింగ్ బలంగానే ఉంది. అయితే, టీమ్ ఎక్కువగా నరైన్, రస్సెల్‌పైనే ఆధారపడి ఉందనేది వాస్తవం. వీళ్లిద్దరూ జట్టుకు బలం.. బలహీనతగా మారారు. రస్సెల్ ఫిట్‌నెస్ ఎప్పుడూ ఆందోళన కలిగిస్తోంది. మిస్టరీ స్పిన్నర్‌గా, ఓపెనర్‌గా నరైన్ ఎప్పుడూ అంచనాలను తలకిందులు చేస్తుంటాడు. ఒకవేళ వీరిద్దరూ విఫలమైనా లేక గాయాలపాలైతే భర్తీ చేయగల బ్యాకప్ ప్లేయర్లు లేకపోవడం జట్టును ఆందోళనకు గురి చేసే అంశం. వేలంలో దక్కించుకొన్న పేసర్ నోకియా కూడా తరచూ ఫిట్‌నెస్ సమస్యలు ఎదుర్కొంటున్నాడు.

జట్టు

బ్యాటర్లు: అజింక్యా రహానె (కెప్టెన్), రింకూ సింగ్, రఘువంశీ, రోవ్‌మన్ పావెల్, మనీష్ పాండే; **వికెట్ కీపర్లు:** క్వింటన్ డికాక్, రహ్మనుల్లా గుర్బాజ్, లువ్‌నిత్ సిసోడియా; **ఆల్ రౌండర్లు:** వెంకటేష్ అయ్యర్, అనుకుల్ రాయ్, మొయిన్ అలీ, రమణ్‌దీప్ సింగ్, రస్సెల్; **బౌలర్లు:** నోకియా, వైభవ్ అరోరా, మయాంక్ మార్కండే, స్పెన్సర్స్ జాన్సన్, హర్షిత్ రాణా, నరైన్, వరుణ్ చక్రవర్తి, చేతన్ సకారియా.

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
గురువారం | 20-3-2025 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 351 | వరంగల్
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

బడ్జెట్‌లో కేటాయింపులు (రూ. కోట్లలో)

వ్యవసాయం	24,439
నీటిపారుదల	23,354
పంచాయతీరాజ్	31,605
పురపాలక శాఖ	17,677
వైద్యం, ఆరోగ్యం	12,393
విద్య	34,708



హామీలకు గ్యారెంటీ!

మొత్తం బడ్జెట్ రూ.3,04,965 కోట్లు.. ప్రభుత్వ ప్రాధాన్య పథకాలకే రూ.లక్ష కోట్లు

ఆరు హామీలతోపాటు యువ వికాసానికి నిధులు
5 లక్షల మంది యువతకు ఒక్కొక్కరికి 3 లక్షలు
సమీకృత గురుకులాలకు 2900 కోట్లు
ఇందిర గిరి జల వికాసానికి 600 కోట్లు
ఇటీవల ప్రారంభించిన పథకాలకు కేటాయింపులు
బడ్జెట్లో రైతులు, యువత, మహిళలకు ప్రాధాన్యం
కూలీలకు 600 కోట్లతో ఆత్మీయ భరోసా
ఇందిరమ్మ ఇళ్లకు ప్రాధాన్యం.. 12,571 కోట్లు
విద్యా రంగానికి పెద్దపీట.. ఎమ్మెల్యేలకూ నిధులు
అంచనాలకు దూరంగా పన్ను, పన్నేతర రాబడి
కేంద్రం నుంచి వచ్చే గ్రాంట్లు, వాటాల్లో ఊరట
2025-26 బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క

ఆరు గ్యారెంటీలకు రూ.56 వేల కోట్లు
గత బడ్జెట్‌లో రూ.49,315 కోట్ల కేటాయింపు
ఖర్చు చేసిన మొత్తం రూ.24,948 కోట్లు

అప్పుల భారం 8,06,298 కోట్లు
రాష్ట్రంలో ఒక్కొక్కరి నెత్తిన రూ.2,30,346 అప్పు

బడ్జెట్ సమగ్ర కథనాలు లోపలి పేజీల్లో..

తెలంగాణ ఆర్థిక వ్యవస్థ మొత్తం రూ.86 లక్షల కోట్లు. పదేళ్లలో ఐదు రెట్లు అభివృద్ధి చేస్తాం. ఆ దిశగా కార్యాచరణ రూపొందిస్తున్నాం. అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలనే తెలంగాణ నమూనా. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో 'తెలంగాణ రైజింగ్-2050' ప్రణాళికతో ముందడుగు వేస్తున్నాం. అన్ని వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా రాష్ట్ర బడ్జెట్‌ను రూపొందించాం. రాష్ట్రాన్ని ప్రగతి బాటలో నడిపేందుకు అందరూ సహకరించాలి.

\- ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క


బడ్జెట్ ప్రతులతో సీఎం రేవంత్‌రెడ్డి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క.. చిత్రంలో మంత్రులు శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి

హైదరాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రైతుకు భరోసా, బోనస్! రైతు కూలీలకు చేయూత! మహిళలకు మహాలక్ష్మి.. గృహ జ్యోతి! యువతకు రాజీవ్ యువ వికాసం! నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు.. కల్యాణ లక్ష్మి.. ఆరోగ్యశ్రీ! వెరసి.. ఎన్నికల ముందు హామీ ఇచ్చి.. ఇప్పటికే అమలు చేస్తున్న పథకాలకు ప్రభుత్వం బడ్జెట్లో నిధుల గ్యారెంటీ ఇచ్చింది! ఆయా పథకాలకు తగినన్ని నిధులు కేటాయించింది! విద్యకు పెద్దపీట వేసింది! ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమానికే ఐదో వంతు నిధులను కేటాయించింది! యువతకు ఉపాధి చూపుతూ.. రైతుకు 'భరోసా' కల్పిస్తూ.. మహిళల సంక్షేమాన్ని కాంక్షిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌ను తీర్చిదిద్దింది. సంక్షేమానికి, అభివృద్ధికి జోడు గుర్రాల తరహాలో ప్రాధాన్యమిచ్చింది! 2025-26 ఆర్థిక సంవత్సరానికి వార్షిక ఆదాయ వ్యయ పట్టిక (బడ్జెట్)ను శాసనసభలో ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క; శాసన మండలిలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

మిగతా 13వ పేజీలో...

ఢిల్లీకి మూటలు పంపే బడ్జెట్
ఊసరవెల్లి ముదిరితే రేవంత్‌రెడ్డి: కేటీఆర్
అన్నీ అబద్ధాలు, అతిశయోక్తులే: హరీశ్‌రావు
బడ్జెట్ సమావేశానికి హాజరుకాని కేసీఆర్
మరోసారి అంకెల గారడీ: కిషన్ రెడ్డి
6 గ్యారెంటీలకు పాతర: బండి సంజయ్
రాష్ట్ర ముఖచిత్రాన్ని మార్చే బడ్జెట్
రేవంత్ విప్లవ నాయకుడు: కాంగ్రెస్ ఎంపీలు
ఉగాది రోజున సన్నబియ్యం పంపిణీ
సూర్యాపేట జిల్లాలో ప్రారంభించనున్న సీఎం


మెక్ డొనాల్డ్స్ ప్రతినిధులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్‌లో మెక్ డొనాల్డ్స్ ఆఫీసు

2 వేల మందితో నెలకొల్పేందుకు కంపెనీ సుముఖం
సీఎం రేవంత్‌ను కలిసిన మెక్‌డొనాల్డ్స్ ప్రతినిధులు
తెలంగాణ ప్రభుత్వంతో పెట్టుబడుల ఒప్పందం

9

వర్గీకరణ ఎవరికీ వ్యతిరేకం కాదు

మాదిగలకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దే యత్నం
ఉద్దండులైన న్యాయవాదులతో కోర్టును మెప్పించాం
న్యాయపరమైన చిక్కులు రాకుండా బిల్లు పెట్టి ఆమోదించాం.. రాహుల్ పట్టుదల వల్లే సాధ్యమైంది
10 లక్షల మందితో సభ జరిపి కృతజ్ఞతలు చెప్పండి
ఆ ఊపుతో మరో 4 రాష్ట్రాల్లో అమలు చేయిస్తారు
మందకృష్ణ నాకు మంచి మిత్రుడే.. భిన్నాభిప్రాయాల్లేవ్
కానీ.. మోదీ, కిషన్‌రెడ్డినే ఆయన నమ్ముతున్నారు
అవకాశాన్ని అందిపుచ్చుకోండి.. అండగా నిలవండి
మాదిగ, ఉపకులాల సంఘాల నేతలతో సీఎం

క్షేమంగా పుడమికి

9 నెలల అనంతరం భూమ్మీదికి సునీతా విలియమ్స్
అంతరిక్షం నుంచి తిరిగొచ్చిన మరో ముగ్గురు
ఫ్లోరిడా సమీపంలో సముద్రంలో దిగిన క్రూ డ్రాగన్
తెల్లవారుజామున 3:27 గంటలకు సేఫ్ ల్యాండింగ్
వ్యోమగాములకు స్వాగతం పలుకుతూ ట్రంప్ పోస్ట్
ట్రంప్ మాటిచ్చారు.. నిలబెట్టుకున్నారు: వైట్‌హౌస్
రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ అభినందనలు



న్యూఢిల్లీ, మార్చి 19: తొమ్మిది నెలల సుదీర్ఘ నిరీక్షణకు తెరపడింది. ఎనిమిది రోజుల పర్యటన నిమిత్తం అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్ఎస్) వెళ్లి 286 రోజులపాటు అక్కడే చిక్కుకుపోయిన భారత సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్ ఎట్టకేలకు సురక్షితంగా భూమిపైకి చేరుకున్నారు. ఆమెతోపాటు నాసాకు చెందిన బుచ్ విల్మోర్, కమాండర్ నిక్ మేగ్, రష్యా వ్యోమగామి అలెగ్జాండర్ గోర్బునోవ్ భారత కాలమానం ప్రకారం బుధవారం తెల్లవారుజామున 3:27 గంటలకు అమెరికాలోని ఫ్లోరిడా తీరంలో సముద్ర జలాల్లో దిగారు. అంతరిక్షం నుంచి 17 గంటల ప్రయాణం అనంతరం స్పేస్‌ఎక్స్‌కు చెందిన క్రూ-9 డ్రాగన్ వారిని క్షేమంగా భూమిపైకి తీసుకొచ్చింది. కేవలం 8 రోజుల మిషన్ కోసం గత ఏడాది జూన్ 5న బోయింగ్

మిగతా 2వ పేజీలో...

క్రూ-9 డ్రాగన్ నుంచి బయటకు వచ్చిన అనంతరం సునీతా విలియమ్స్ విజయ సంకేతం; పారాచూట్‌లతో సముద్రంలో దిగుతున్న డ్రాగన్



సీఎం రేవంత్‌రెడ్డికి హైకోర్టులో ఊరట

14

జన్వాడ ఫాంహౌస్‌పై డ్రోన్ కేసు కొట్టివేత
ఆ ప్రాంతం నిషేధిత జాబితాలో లేదని వెల్లడి

సీఎంపై అనుచిత వ్యాఖ్యల వ్యవహారంలో
కేటీఆర్‌పై కేసు కొట్టివేత



స్మితా సబర్వాల్ కారు అద్దె నెలకు రూ.63 వేలు!

వ్యవసాయ వర్సిటీ నుంచి 90 నెలల పాటు మొత్తం రూ.56.70 లక్షల చెల్లింపు
9
అప్పట్లో సీఎంవో అదనపు కార్యదర్శిగా స్మిత
వర్సిటీ నుంచి అద్దె ఎందుకు చెల్లించారు?
ఏజీ ఆడిట్‌లో అభ్యంతరం.. తప్పు జరిగితే సర్కారు దృష్టికి: వీసీ

రేషన్ కార్డులు కాదు.. పాపులర్ కార్డులు!

తలసరి ఆదాయం పెరుగుతోంది.. అయినా 75% జనాభా దారిద్ర్య రేఖకు దిగువనా?
సబ్సిడీలు అనర్హుల జేబులు నింపరాదు 2
పేదలకు ఉచిత రేషన్‌పై అఫిడవిట్ దాఖలు చేయాలి.. కేంద్రానికి సుప్రీం కోర్టు ఆదేశం

భర్తను చంపి, ముక్కలు చేసి.. సిమెంట్ డ్రమ్ములో వేసి..

2

ప్రియుడితో కలిసి భార్య కిరాతకం.. ఆపై ఇద్దరూ మనాలీకి విహారయాత్ర
హత్యను దాచేందుకు భర్త ఫోన్ నుంచి సోషల్ మీడియాలో పోస్టులు
ఉత్తరప్రదేశ్‌లోని మేరట్‌లో ఘటన.. హతుడు మర్చంట్ నేవీ అధికారి
హంతకురాలైన తమ కుమార్తెను ఉరి తీయాలని తల్లిదండ్రుల డిమాండ్

క్షేమంగా పుడమికి





అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుంచి భూమికి చేరుకుంటున్న సునీత విలియమ్స్, మరో ముగ్గురు వ్యోమగాములు

(మొదటి పేజీ తరువాయి)

స్టార్ లైనర్‌లో ఐఎస్ఎస్‌కు వెళ్లిన సునీత, బుచ్ విల్మోర్.. సాంకేతిక కారణాలతో 286 రోజులు అక్కడే గడపాల్సి వచ్చింది. కాగా, సముద్ర జలాల్లో దిగిన క్రూ డ్రాగన్‌ను నాసా బృందం సురక్షితంగా రికవరీ నౌకలోకి చేర్చింది. అనంతరం క్రూ తలుపు తెరచి ఒక్కొక్కరినీ బయటకు తీసింది. క్యాప్సూల్ నుంచి బయటకు రాగానే సునీతా విలియమ్స్ చిరునవ్వులు చిందిస్తూ, చేతులూపుతూ అభివాదం చేశారు. నాసా బృందం వెంటనే వారిని రికవరీ నౌకలోనే వైద్యసేవలకు తరలించింది.

భూమికి ప్రయాణం సాగిందిలా..

భూమికి 409 కిలోమీటర్ల ఎత్తులో ఉన్న అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) నుంచి తిరిగి భూమికి చేరుకోవడం చాలా క్లిష్టమైన ప్రక్రియ. ఏ మాత్రం తేడా వచ్చినా నలుగురు వ్యోమగాముల ప్రాణాలు గాలిలో కలిసిపోయే ప్రమాదం ఉంది. సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్, నిక్ హేగ్, గోర్బునోవ్‌లను ఐఎస్ఎస్ నుంచి భూమిపైకి తీసుకొచ్చే క్రమంలో కాస్త ఉత్కంఠ రేగినా.. నాసా, స్పేస్‌ఎక్స్ చివరకు ఈ ప్రక్రియను సురక్షితంగా ముగించింది. క్రూ-9 డ్రాగన్ భూమికి బయల్దేరే ముందు ఐఎస్ఎస్‌లో ఉన్న వ్యోమగాములకు సునీత, విల్మోర్, నిక్ హేగ్, గోర్బునోవ్ వీడ్కోలు పలికారు. వారితో కలిసి ఫొటోలు దిగారు. భారత కాలమానం ప్రకారం మంగళవారం ఉదయం 8:15 గంటలకు క్రూ డ్రాగన్ తలుపును మూసివేయగా.. 10:35 గంటలకు క్రూ ఐఎస్ఎస్ నుంచి విడిపోయింది. భూ దిశగా 17 గంటల ప్రయాణం మొదలుపెట్టింది. భూవాతావరణంలోకి ప్రవేశించే క్రమంలో వ్యోమనౌకలోని దిగువ (ట్రంక్) భాగాన్ని అక్కడే వదిలిపెట్టింది. ఆ తర్వాత భూమిపై ల్యాండింగ్ ప్రదేశం దిశగా క్రూ డ్రాగన్ ముందు భాగంలోని నాలుగు డ్రాకో ఇంజన్లు మండుకోవడం మొదలైంది. ఆ తర్వాత భూ వాతావరణంలోకి ప్రవేశం కోసం కోన్ భాగాన్ని వ్యోమనౌక మూసివేసింది. భూవాతావరణంలోకి రీ ఎంట్రీ సమయంలో తలెత్తే తీవ్రస్థాయి వేడి నుంచి వ్యోమగాములను సురక్షితంగా ఉంచే వ్యవస్థను ఆన్ చేసింది.

1600 డిగ్రీల వేడి.. కాపాడిన పికా..!

రీ ఎంట్రీ సమయంలో వ్యోమనౌక గంటకు 28,800 కి.మీ వేగంతో భూవాతవరణంలోకి ప్రవేశించింది. ఆ రాపిడి కారణంగా ఏకంగా 1600 డిగ్రీల వేడి ఉత్పన్నమై వ్యోమనౌక చుట్టూ ప్లాస్మా పేరుకుపోయింది. దాంతో వ్యోమనౌకతో కొద్దిసేపు కమ్యూనికేషన్ తెగిపోయి కాస్త ఉత్కంఠ ఏర్పడింది. అయితే డ్రాగన్ క్యాప్సూల్‌లో నాసా ఫినోలిక్-ఇంప్రెగ్నేటెడ్ కార్బన్ అబ్లేటర్ (పికా) అనే హీట్ రెసిస్టెంట్ పదార్థాన్ని వాడింది. వ్యోమనౌక చుట్టూ ఉన్న ఈ ఉష్ణ కవచం 1600 డిగ్రీల వేడిని తట్టుకుని నిలబడింది. ఈ కవచమే లోపల ఉన్నవారికి వేడి నుంచి రక్షణ ఇచ్చింది. కాసేపటికి కమాండర్ నిక్ హేగ్ మాట్లాడడంతో నాసా కమాండ్ సెంటర్‌లో ఉన్నవారిలో ఉత్కంఠ వీడింది.

ట్రంప్ మాట నిలబెట్టుకున్నారు: వైట్‌హౌస్

అంతరిక్షం నుంచి వ్యోమగాములు క్షేమంగా భూమికి చేరడంపై వైట్‌హౌస్ ఎక్స్ వేదికగా స్పందించింది. 'తొమ్మిది నెలలుగా అంతరిక్షంలో చిక్కుకున్న వారిని భూమిపైకి తీసుకొస్తామని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాటిచ్చారు. ఆ మాట నిలబెట్టుకున్నారు' అని ట్వీట్ చేసింది. ఈ సందర్భంగా ఎలాన్ మస్క్‌కు, స్పేస్ ఎక్స్ బృందానికి అభినందనలు తెలిపింది. కాగా, వ్యోమగాముల రాకపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. వారికి స్వాగతం పలికిన ట్రంప్.. ట్రూత్ సోషల్ వేదికగా వ్యోమగాముల ఫొటోలను పోస్టు చేశారు. ఈ సందర్భంగా స్పేస్‌ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ అధ్యక్షుడు ట్రంప్‌కు ధన్యవాదాలు తెలిపారు.

పుడమికి స్వాగతం: మోదీ

భారత సంతతి వ్యోమగామి సునీత క్షేమంగా భూమిపైకి తిరిగిరావడంపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఇస్రో చైర్మన్ నారాయణన్, ఇతర రాజకీయ, సినీ ప్రముఖులు సైతం అభినందలనలు తెలియజేశారు. ఈ మిషన్ కోసం సునీత చూపిన ద్రుఢ సంకల్పాన్ని, సమష్టి కృషిని రాష్ట్రపతి ముర్ము కొనియాడారు. మోదీ కూడా సునీతకు స్వాగతం పలుకుతూ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. 'వెల్‌కమ్ బ్యాక్ క్రూ-9. ఈ పుడమి మిమ్మల్ని ఎంతో మిస్ అయింది. సునీతా విలియమ్స్ బృందం ధైర్యానికి, స్ఫూర్తికి పరీక్ష ఎదురైంది. వారు సురక్షితంగా తిరిగిరావడానికి అవిశ్రాంతంగా కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు' అని మోదీ పేర్కొన్నారు. కాగా, సునీత క్షేమంగా తిరిగిరావడం నాసా, స్పేస్‌ఎక్స్, అంతరిక్ష పరిశోధనల పట్ల అమెరికాకు ఉన్న నిబద్ధతకు నిదర్శనమని ఇస్రో చైర్మన్ వి నారాయణన్ అన్నారు. సునీతా విలియమ్స్, విల్మోర్ సురక్షితంగా భూమికి తిరిగి రావడం పట్ల ఏపీ సీఎం చంద్రబాబు ఎక్స్ వేదికగా సంతోషం వ్యక్తం చేశారు. ప్రముఖ సినీనటుడు చిరంజీవి కూడా సునీతను ఎక్స్ వేదికగా అభినందించారు.

గంటకు 560 కి.మీ. వేగంతో దూసుకొచ్చి

సముద్ర జలాలకు 18 వేల అడుగుల ఎత్తులో ఉండగా.. వ్యోమనౌకలోని రెండు డ్రోగ్ పారాచూట్లు విచ్చుకున్నాయి. ఆ సమయంలో వ్యోమనౌక గంటకు 560 కి.మీ. వేగంతో ప్రయాణిస్తోంది. డ్రోగ్‌చూట్లు సమర్థంగా పనిచేయడంతో క్రమంగా దాని వేగం తగ్గిపోయింది. ఈ వేగం గంటకు 190 కి.మీ.కి చేరుకోగానే సాగర జలాల నుంచి 6,500 మీటర్ల ఎత్తులో రెండు ప్రధాన పారాచూట్లు విచ్చుకున్నాయి. డ్రోగ్‌చూట్లు, పారాచూట్లు క్రూ డ్రాగన్ వేగాన్ని సమర్థంగా తగ్గించి గంటకు 25 కి.మీ. వేగానికి తీసుకురావడంతో ఫ్లోరిడా తీరంలోని సముద్ర జలాల్లో క్రూ నెమ్మదిగా దిగింది. సహాయక సిబ్బంది స్పీడ్ బోట్లలో నిమిషాల వ్యవధిలోనే అక్కడికి చేరుకుని క్రూ నుంచి విష వాయువులేవీ విడుదల కావడంలేదని నిర్ధారించుకున్నాక.. దాన్ని రికవరీ కోసం సిద్ధంగా ఉంచిన మేగన్ నౌకపైకి చేర్చారు. ఆ తర్వాత స్పేస్ ఎక్స్ సిబ్బంది లోపల ఉన్న నలుగురిని వరుసగా బయటకు తీసుకొచ్చారు. తొలుత కమాండర్ నిక్ హేగ్. ఆ తర్వాత గోర్బునోవ్, సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్ క్రూ నుంచి బయటకు వచ్చారు.

సునీతకు ఎదురయ్యే సమస్యలు..

అంతరిక్షంలో సుదీర్ఘకాలం గడిపి వచ్చిన వారు తిరిగి ఇక్కడి భూవాతావరణానికి అలవాటు పడడం కష్టమే. అంతరిక్షంలో గురుత్వాకర్షణ శక్తి ఉండదు.. కాబట్టి శరీరం తేలికగా మారుతుంది. సునీత అంతరిక్షంలో ఎక్కువకాలం ఉండడం వల్ల ఆమె ఎముకలు పెళుసుబారి, కండరాలు క్షీణించి ఉంటాయి. రేడియేషన్ కారణంగా దృష్టి లోపం వంటి సవాళ్లను ఎదుర్కోవచ్చు. రక్త ప్రసరణలోనూ తేడా వస్తుంది. రక్తం గడ్డకట్టే ప్రమాదం కూడా ఉంది. ఈ సమయంలో వైద్యుల పర్యవేక్షణలో సరైన జాగ్రత్తలు తీసుకుని మళ్లీ భూవాతావరణానికి అలవాటు పడేందుకు నెలల సమయం పడుతుంది.

సునీత పూర్వీకుల గ్రామంలో సంబరాలు


సునీతా విలియమ్స్ అంతరిక్షం నుంచి క్షేమంగా భూమికి చేరుకోవడంతో గుజరాత్‌లో ఉన్న ఆమె పూర్వీకుల గ్రామంలో సంబరాలు మిన్నంటాయి. మెహసానా జిల్లాలోని ఝులాసన్ గ్రామంలో ఆమె బంధువులు, గ్రామస్తులు బాణసంచా కాల్చి, డ్యాన్స్‌లు చేసి సంబరాలు చేసుకున్నారు.

కుటుంబ నేపథ్యం ఇదీ..

భారత సంతతికి చెందిన న్యూరోఅటానమిస్ట్ దీపక్ పాండ్యా, స్లోవీన్ అమెరికన్ ఉర్సులైన్ బోనీల దంపతులకు 1965 సెప్టెంబరు 19న ఒహాయోలో సునీత జన్మించారు. పాండ్యా దంపతులకు ముగ్గురు సంతానం కాగా.. సునీత చిన్నకుమార్తె. దీపక్ పాండ్యా గుజరాత్‌లో జన్మించారు. మసాచుసెట్స్‌లో 1983లో హైస్కూల్ విద్యను పూర్తిచేసిన సునీత.. 1987లో యూఎస్ నావల్ అకాడమీ నుంచి బీఎస్సీ పూర్తిచేశారు. 1995లో ఫ్లోరిడా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి ఇంజనీరింగ్ మేనేజ్‌మెంట్‌లో ఎమ్మెస్సీ పూర్తిచేశారు. 1997లో అమెరికా మిలటరీలో చేరారు. 1998లో నాసా వ్యోమగామిగా ఎంపికయ్యారు. కాగా, సునీత విలియమ్స్ త్వరలోనే భారత్‌కు రానుందని ఆమె బంధువు పాల్గుణి పాండ్య సూచనప్రాయంగా చెప్పారు. గుజరాత్‌లోని ఝులాసన్‌లో ఉండే పాల్గుణి ఇప్పుడిక సునీతకు కుటుంబంతో గడిపే సమయం దొరుకుతుందని ఆయన అన్నారు.

అంతరిక్షంలో ఏం తిన్నారు.. 9 నెలలు ఎలా ఉన్నారు?

ఎనిమిది రోజుల యాత్ర కోసం ఐఎస్ఎస్‌కు వెళ్లిన సునీత, విల్మోర్.. సాంకేతిక సమస్యల కారణంగా అక్కడే తొమ్మిది నెలలు ఉన్నారు. ఈ క్రమంలో వారు అక్కడ ఏం తిన్నారు.. ఇన్నాళ్లు ఎలా ఉండగలిగారు అనే సందేహాలు అందరికీ వ్యక్తమవుతున్నాయి. గత ఏడాది నవంబరు 18న న్యూయార్క్ పోస్ట్ వెల్లడించిన వివరాల ప్రకారం.. సునీత, విల్మోర్.. ఐఎస్ఎస్‌లో పిజ్జా, రోస్ట్ చికెన్, రొయ్యలు ఆహారంగా తీసుకున్నారు. వ్యోమగాములకు మిల్క్‌పౌడర్, పిజ్జాలు, రోస్ట్ చికెన్, రొయ్యలు, ట్యూనా ఫిష్‌తోపాటు తృణధాన్యాలు అందుబాటులో ఉంచుతామని నాసా అధికారి ఒకరు వెల్లడించారు. నాసా వైద్యులు ఎప్పటికప్పుడు వారి ఆరోగ్యాన్ని పర్యవేక్షిస్తారని తెలిపారు. గత ఏడాది సెప్టెంబరు 9న నాసా విడుదల చేసిన ఫొటోలో విల్మోర్, సునీత ఐఎస్ఎస్‌లో భోజనం చేస్తున్నట్టు కనిపించింది. మొదట్లో వారికి తాజా పండ్లు, కూరగాయలు అందుబాటులో ఉండేవని, కానీ మూడు నెలల్లోనే అవి అయిపోయాయని నాసా అధికారి పేర్కొన్నారు. మాసం, గుడ్లు భూమిపై నుంచి ముందే వండి పంపిస్తారని, అక్కడ తినేముందు వేడి చేసుకుంటారని తెలిపారు. ఐఎస్ఎస్‌లో 530 గ్యాలన్ల మంచినీటి ట్యాంకు ఉంటుందని, ఆ నీటిని వాడుకుంటారని చెప్పారు. వ్యోమగాముల మూత్రం, చెమటను రీసైకిల్ చేసి మంచినీటిగా మార్చే వ్యవస్థ ఐఎస్ఎస్‌లో ఉందని ఆయన తెలిపారు.



పాల ఉత్పత్తికి దన్ను

- 2 పథకాల వ్యయాలు 6,190 కోట్లకు పెంపు
- రూ.2వేలలోపు యూపీఐ లావాదేవీల ప్రోత్సాహానికి రూ.1,500 కోట్లు
- కేంద్ర క్యాబినెట్ ఆమోదం

న్యూఢిల్లీ, మార్చి 19: దేశంలో పాల ఉత్పత్తిని పెంచే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం 2 పథకాలకు వ్యయాలను రూ.6,190 కోట్లకు పెంచింది. ఈ మేరకు సవరించిన రాష్ట్రీయ గోకుల్ మిషన్ (ఆర్‌జీఎం), నేషనల్ ప్రోగ్రామ్ ఫర్ డెయిరీ డెవలప్‌మెంట్ (ఎన్‌పీడీడీ)లకు కేంద్ర క్యాబినెట్ ఆమోద ముద్ర వేసినట్టు కేంద్ర సమాచార, ప్రసారాలశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ బుధవారం తెలిపారు. ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర క్యాబినెట్ పశుసంవర్థక రంగంలో వృద్ధిని పెంచేందుకుగాను సవరించిన ఆర్‌జీఎంకు ఆమోదం తెలిపిందని కేంద్రం మంత్రి తెలిపారు. రూ.1,000 కోట్ల అదనపు వ్యయంతో సవరించిన ఆర్‌జీఎంను అమలు చేస్తారు. దీంతో 15వ ఆర్థిక సంఘం కాలంలో (2021-22 నుంచి 2025-26) మొత్తం వ్యయం రూ.3,400 కోట్లకు చేరుతుంది. సవరించిన ఎన్‌పీడీడీకి రూ.1,000 కోట్ల అదనపు కేటాయింపుతో 15వ ఆర్థిక సంఘం కాలంలో మొత్తం బడ్జెట్ రూ.2,790 కోట్లకు చేరుతుంది. కాగా రూ.2వేలలోపు బీమ్-యూపీఐ లావాదేవీలను ప్రోత్సహించడానికిగాను దాదాపు రూ.1,500 కోట్ల విలువైన ప్రోత్సాహకాల పథకానికి కేంద్ర క్యాబినెట్ బుధవారం ఆమోదం తెలిపింది. ఇది 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31 వరకు వర్తిస్తుంది. ఇదిలా ఉండగా.. మహారాష్ట్రలో జేఎన్‌పీఏ పోర్ట్ (పగోటే) నుంచి చౌక్ (29.219కిలో మీటర్లు) వరకు 6 లేన్ల యాక్సెస్ కంట్రోల్డ్ గ్రీన్‌ఫీల్డ్ హైస్పీడ్ నేషనల్ హైవే నిర్మాణానికి కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. కాగా అసోంలో రూ.10,601.4కోట్లతో యూరియా ప్లాంట్‌ను ఏర్పాటు చేయడానికి కేంద్ర క్యాబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.

గేట్ ఫలితాల్లో తెలుగు విద్యార్థుల సత్తా

- జాతీయ స్థాయిలో ఒకటి, 25, 28 ర్యాంకులు



నిఖిల్ చౌదరి

శ్రీకాకుళం, కందుకూరు, హైదరాబాద్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్(గేట్)- 2025 ఫలితాల్లో తెలుగు విద్యార్థులు సత్తా చాటారు. జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్ నెల్లూరు జిల్లా కందుకూరుకు చెందిన సాదినేని నిఖిల్ చౌదరి మొదటి ర్యాంకు, శ్రీకాకుళం జిల్లాకు చెందిన పైడి పూజిత 25వ ర్యాంకు, వినోద్‌కుమార్ 28వ ర్యాంకు సాధించారు.

జేఎన్‌టీయూ విద్యార్థుల విజయదుందుభి

గేట్-2025 ఫలితాల్లో జేఎన్‌టీయూ విద్యార్థులు విజయదుందుభి మోగించారు. క్యాంపస్‌లోని ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగంలో 2024లో బీటెక్ పూర్తిచేసిన చింతలపాటి వెంకట శివకార్తీక్ గేట్ పరీక్షలో 63వ ర్యాంకు సాధించాడు. కెమికల్ ఇంజనీరింగ్ విభాగంలో ఫైనలియర్ బీటెక్ చదువుతున్న కురచా హేమంత్ 459వ ర్యాంకును, ఇదే విభాగం నుంచి మొగిలిపాక హరినాథ్ 2,607 ర్యాంకును సొంతం చేసుకున్నారు. కాగా, అభ్యర్థులు తమ ఫలితాలను www. iitr.ac.in లేదా gate2025. iitr.ac.in వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చు. ఈనెల 28వ తేదీ నుంచి మే 31వ తేదీ వరకు స్కోర్ కార్డులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఆ తర్వాత స్కోర్ కార్డు పొందాలంటే ఒక్కో పేపర్‌కు రూ.500 చెల్లించాల్సి ఉంటుంది.

ఆర్ఆర్‌బీ లోకో పైలెట్ పరీక్ష వాయిదా

రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డ్ (ఆర్ఆర్‌బీ) లోకో పైలెట్ పరీక్షను రైల్వేశాఖ చివరి నిమిషంలో వాయిదా వేసింది. మార్చి 19న జరగాల్సిన ఈ పరీక్షను కొన్ని కేంద్రాల్లో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో నిర్వహించలేకపోతున్నట్లు తెలిపింది. పరీక్ష నిర్వహించే తేదీ కోసం తరచూ www.rrbapply.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని రైల్వే శాఖ సూచించింది.

ఢిల్లీ మాజీ మంత్రి సత్యేందర్ జైన్‌పై ఏసీబీ కేసు

న్యూఢిల్లీ, మార్చి 19: ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుడు, ఢిల్లీ మాజీ మంత్రి సత్యేందర్ జైన్‌పై ఢిల్లీ అవినీతి వ్యతిరేక బ్రాంచ్(ఏసీబీ) కేసు నమోదు చేసింది. ఢిల్లీలో రూ.571 కోట్ల సీసీటీవీ కెమెరాల ఏర్పాటు ప్రాజెక్టులో చోటు చేసుకున్న అక్రమాలకు సంబంధించి ఈ కేసు నమోదు చేసినట్లు అధికారులు బుధవారం తెలిపారు. భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బెల్) సంస్థ ఢిల్లీలో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయడంలో ఆలస్యం చేసినందుకు విధించిన రూ.16 కోట్ల పరిహారం చెల్లించాల్సిన అవసరం లేకుండా సడలింపు ఇచ్చారనేది జైన్‌పై ఆరోపణ. దీనికి బదులుగా రూ.7 కోట్ల లంచం తీసుకున్నారని పేర్కొంటున్నారు. అంతేగాక అదే సంస్థకు అదనపు కాంట్రాక్టులు ఇచ్చారని ఏసీబీ అధికారులు వెల్లడించారు.

జమ్మూలో మిస్టరీ మరణాల కేసు.. మృతుల శరీరాల్లో విష పదార్థాలు..!

జమ్మూ, మార్చి 19: జమ్మూకశ్మీర్ మధ్య రాజౌరీ జిల్లాలోని బధాల్ గ్రామంలో ఇటీవల నెలన్నర వ్యవధిలో మూడు కుటుంబాల్లో 17 మంది అనుమానాస్పద రీతిలో మృతి చెందడం సంచలనమైంది. తాజాగా దీనిపై అసెంబ్లీలో స్పందించిన జమ్మూ ప్రభుత్వం మృతుల శరీరాల్లో విష పదార్థాల అవశేషాలు ఉన్నట్లు పరిశోధనల్లో గుర్తించినట్లు తెలిపింది. "బ్యాక్టీరియా లేదా వైరస్ మూలంగా వారు మరణించలేదని క్లీనికల్ రిపోర్టులు, ల్యాబొరేటరీ పరిశోధనలు, పర్యావరణ విభాగాలు చేసిన విశ్లేషణలు పేర్కొన్నాయి. చనిపోయిన వారు తిన్న ఆహార నమూనాల్లో అల్యూమినియం, క్యాడ్మియంతోపాటు కొన్ని రకాల రసాయన మూలకల అవశేషాలు అలాగే సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ చేసిన విశ్లేషణలో క్లోర్‌ఫెనాపైర్ అనే పురుగుమందు అవశేషం ఉన్నట్లు తేలింది. అయితే ఈ విషపదార్థాల మూలాలు ఎక్కడివనే దానిపై దర్యాప్తు కొనసాగుతోంది." అని జమ్మూకశ్మీర్ వైద్య ఆరోగ్య మంత్రి సకీనా ఇటూ వెల్లడించారు. కాగా, బధాల్ గ్రామంలో అనుమానాస్పద రీతిలో చనిపోయిన 17 మందిలో 12 మంది చిన్నారులే ఉన్నారు. మరో 50 మంది అస్వస్థతకు గురై ఆసుపత్రి పాలయ్యారు. దీనిపై దర్యాప్తు కొనసాగుతోంది.

సంరక్షణ కొరవడితే 'గిఫ్ట్' రద్దు

- ఆ హక్కు వృద్ధ తల్లిదండ్రులకు ఉంది
- మద్రాస్ హైకోర్టు కీలక తీర్పు

చెన్నై, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కుటుంబంలోని పెద్దవాళ్ల నుంచి ఆస్తులు తీసుకుని, వారి ఆలనాపాలన చూడని పిల్లలు, బంధువులకు మద్రాస్ హైకోర్టు షాక్ ఇచ్చింది. తమకు సరైన సంరక్షణ దొరకడం లేదని పెద్దలు భావిస్తే తాము రాసిన సెటిల్‌మెంట్ డీడ్‌లను, గిఫ్ట్ డీడ్‌లను ట్రిబ్యునల్ ద్వారా రద్దు చేసుకోవచ్చునని కీలక తీర్పు ఇచ్చింది. 'నన్ను బాగా చూసుకుంటే ఇంటిలో, పొలంలో, ఆస్తిలో భాగం ఇస్తాను' అని సాధారణంగా సెటిల్‌మెంట్ డీడ్‌ల్లో ప్రస్తావిస్తుంటారు. అయితే, అటువంటి ప్రస్తావన చేయకపోయినా వాటిని రద్దు చేసుకోవచ్చునని జస్టిస్ ఎస్ఎమ్ సుబ్రమణియమ్, జస్టిస్ కె. రాజశేఖర్‌ల ద్విసభ్య ధర్మాసనం స్పష్టం చేసింది. మరణించిన తన అత్త ఎస్. నాగలక్ష్మికి చెందిన ఆస్తి విషయంలో ఆమె కోడలు ఎస్. మాల వేసిన పిటిషన్‌ను తాజాగా కోర్టు కొట్టివేసింది. ఆ వివరాల్లోకి వెళితే.. కుమారుడు కేశవన్‌కు నాగలక్ష్మి సెటిల్‌మెంట్ డీడ్ రాశారు. అవసానదశలో తన మంచిచెడ్డలు కుమారుడు చూస్తాడని ఆమె నమ్మారు. కానీ, కుమారుడు ఆమె నమ్మకాన్ని వమ్ము చేశాడు. ఆ తర్వాత అతడు మరణించగా, కోడలు తన అత్తను పూర్తి గా నిర్లక్ష్యం చేసింది. తనకు న్యాయం చేయాలంటూ నాగలక్ష్మి నాగపట్టణం ఆర్‌డీవోను కలిశారు. ఆమె చెప్పిందంతా విన్న ఆర్డీవో.. కోడలును పిలిచి మాట్లాడారు. చివరకు.. కుమారుడికి నాగలక్ష్మి రాసిన సెటిల్‌మెంట్ డీడ్‌ను బాధితురాలి విజ్ఞప్తిపై ఆర్డీవో రద్దు చేశారు. కోడలు మాల దీనికి వ్యతిరేకంగా మద్రాస్ హైకోర్టుకు వెళ్లారు. విచారణ జరుగుతుండగానే నాగలక్ష్మి మరణించారు. కోడలు వేసిన పిటిషన్‌ను సింగిల్ జడ్జి జీకే ఇలంతిరయాన్ తోసిపుచ్చారు. ఆ తర్వాత ఆమె చేసిన అప్పీలుపై ద్విసభ్య ధర్మాసనం విచారించింది. సింగిల్ జడ్జి తీర్పును సమర్థిస్తూ తీర్పు వెలువరించింది.

నాగ్‌పూర్ అల్లర్ల సూత్రధారి అరెస్టు

- వదంతులు వ్యాప్తి చేసిన ఫాహిమ్ ఖాన్

నాగ్‌పూర్, మార్చి 19: మహారాష్ట్రలోని నాగ్‌పూర్ నగరంలో చెలరేగిన అల్లర్ల ప్రధాన సూత్రధారి ఫాహిమ్ ఖాన్(38)ను పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. అతను ఎండీపీ(మైనారిటీస్ డెమొక్రటిక్ పార్టీ) నగర అధ్యక్షుడు. యశోధర నగర్‌లోని సంజయ్ బాగ్ కాలనీలో అతను నివసిస్తున్నాడు. అతన్ని కోర్టులో హాజరుపరచగా ఈనెల 21వ తేదీ వరకు పోలీసు కస్టడీ విధించింది. ఆందోళనకారులపై గణేశ్‌పేట్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అందులో 51 మంది ఎండీపీ నాయకుల పేర్లు కూడా ఉన్నాయి. ఎఫ్ఐఆర్‌లో ఫాహిమ్ ఖాన్ పేరును చేర్చిన కొన్ని గంటల వ్యవధిలోనే పోలీసులు అతన్ని అ రెస్టు చేశారు. అంతకు ముందు బుధవారం ఉదయం అతని విద్వేష ప్రసంగాల వీడియోను, ఫొటోను పోలీసులు విడుదల చేశారు. ఫాహిమ్ ఖాన్ విద్వేష ప్రసంగం వల్లే ఆ ప్రాంతంలో వదంతులు వ్యాపించి, మత ఘర్షణలు జరిగినట్టు ప్రాథమిక దర్యాప్తు, వీడియో ఆధారంగా నిర్ధారణకు వచ్చినట్టు పోలీసు అధికారులు తెలిపారు. ప్రస్తుతం శాంతి భద్రతల పరిస్థితి నియంత్రణలోనే ఉందన్నారు.

రేషన్ కార్డులు కాదు.. పాపులర్ కార్డులు!

- తలసరి ఆదాయం పెరుగుతుంటే 75% జనాభా దారిద్ర్య రేఖకు దిగువనా?
- సుప్రీంకోర్టు తీవ్ర ఆక్షేపణ



న్యూఢిల్లీ, మార్చి 19: 'అభివృద్ధి సూచీ గురించి అడిగితే.. తలసరి ఆదాయం ఇబ్బడిముబ్బడిగా పెరిగిందని రాష్ట్రాలు చెబుతున్నాయి.. అదే సబ్సిడీల విషయానికొస్తే మాత్రం 75% జనాభా దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నారని అంటున్నాయి.. రేషన్ కార్డులు పాపులర్ కార్డులుగా మారాయి' అని సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. కొవిడ్ మహమ్మారి విజృంభించిన సమయంలో వలస కార్మికుల సమస్యలను సుమోటో కేసుగా పరిగణించి కోర్టు విచారణ చేపట్టింది. ఆ అంశంపై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్‌సింగ్‌ల ద్విసభ్య ధర్మాసనం బుధవారం మరోసారి విచారణ జరిపింది. 'సబ్సిడీల ప్రయోజనాలు అసలైన లబ్ధిదారులకే దక్కాలి. పేదలకు ఉద్దేశించిన రాయితీలు అనర్హుల జేబులను నింపుతున్నాయా అన్నదే మా ఆందోళన. రాష్ట్రాలు మేం ఎన్నో రేషన్ కార్డులు జారీచేశామని చెబుతున్నాయి. మీ అభివృద్ధి గురించి చెప్పండని అడిగితే.. కొన్ని రాష్ట్రాలు తమ తలసరి ఆదాయం పెరుగుతోందని చెబుతున్నాయి. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారి (బీపీఎల్) గురించి అడిగితేనేమో.. 75% బీపీఎల్ కుటుంబాలేనని అంటున్నాయి. రెండూ పరస్పర విరుద్ధంగా ఉంటున్నాయి. అసలైన లబ్ధిదారులకే ప్రయోజనాలు అందేలా చూడాలి' అని జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. కొందరు దరఖాస్తుదారుల తరఫున న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదనలు వినిపించారు. ప్రజల ఆదాయంలో అసమానతల కారణంగానే ఈ తేడా కనిపిస్తోందని తెలిపారు. 'ప్రభుత్వ ఈ-శ్రమ పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకున్న పేద వలస కూలీలు సుమారు 8 కోట్ల వ రకు ఉన్నారు. వారందరికీ ఉచితం గా రేషన్ అందించాల్సిన అవసరం ఉంది' అని తెలిపారు. జస్టిస్ సూర్యకాంత్ స్పందిస్తూ.. రేషన్ కార్డుల జారీలో రాజకీయ ప్రమేయం ఉండదని ఆశిస్తున్నామని అన్నారు. కేం ద్రం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భట్టి స్పందిస్తూ.. జాతీయ ఆహార భద్రతా చట్టం కింద దేశంలో 81.35 కోట్ల మందికి కేంద్రం రేషన్ అందిస్తోందని తెలిపారు. ఇలాంటి పథకం కిందే మరో 11 కోట్ల మందికి లబ్ధి చేకూరుస్తోందన్నారు. దరిమిలా ఉచిత రేషన్ పంపిణీ స్థితిగతులపై అఫిడవిట్ దాఖలు చేయాలని కేంద్రాన్ని ధర్మాసనం ఆదేశించింది. తదుపరి విచారణను వాయిదావేసింది.

భర్తను చంపి, ముక్కలు చేసి.. సిమెంట్ డ్రమ్ములో వేసి..

ప్రియుడితో కలిసి భార్య కిరాతకం

మేరఠ్, మార్చి 19: తన కంటే వయస్సులో చిన్నవాడితో వివాహేతర సంబంధం పెట్టుకున్న ఓ వివాహిత.. ఆ సంబంధం కోసం ప్రేమించి పెళ్లాడిన వ్యక్తినే అత్యంత కిరాతకంగా చంపేసింది. కూతురి పుట్టినరోజు కోసం లండన్ నుంచి ఇంటికొచ్చిన భర్తను ప్రియుడితో కలిసి కత్తితో పొడిచి చంపేసింది. ఆపై, భర్త శరీరాన్ని ముక్కలు ముక్కలు చేసి వాటిని తడి సిమెంట్‌తో నింపిన డ్రమ్ములో వేసి అత్యంత రాక్షసంగా వ్యవహరించింది. చివరకు పోలీసులకు చిక్కింది.

ఉత్తరప్రదేశ్‌లోని మేరఠ్‌లో మార్చి 4న జరిగిన ఈ ఘటన 14 రోజుల తర్వాత మంగళవారం బయటపడింది. ఈ దారుణ ఘటనలో సౌరభ్ రాజ్‌పుత్(29) అనే మర్చంట్ నేవీ అధికారి.. తన భార్య ముస్కాన్ రస్తోగి(27), ఆమె ప్రియుడు సాహిల్(25) చేతిలో దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసుల కథనం ప్రకారం.. మేరఠ్‌కు చెందిన సౌరభ్, ముస్కాన్ 2016లో ప్రేమ వివాహం చేసుకున్నారు. భార్యతో ఎక్కువ సమయం గడపాలనే ఆలోచనతో పెళ్లి అయిన కొన్నాళ్లకు సౌరభ్ తన మర్చంట్ నేవీ ఉద్యోగాన్ని వదిలేశాడు. ఈ నిర్ణయంతో సౌరభ్ కుటుంబంలో గొడవలు జరగ్గా.. సౌరభ్ భార్యతో కలిసి మేరఠ్‌లోనే వేరు కాపురం పెట్టాడు. సౌరభ్ దంపతులకు 2019లో ఓ కుమార్తె జన్మించింది. కానీ, ముస్కాన్‌కు మరొకరితో వివాహేతర సంబంధం ఉందనే సంగతి బయటపడడంతో దంపతుల మధ్య విభేదాలు మొదలయ్యాయి. ఈ క్రమంలో భార్యకు విడాకులు ఇచ్చేందుకు సిద్ధమైన సౌరభ్ కుమార్తె భవిష్యత్తు కోసం ఆలోచించి వెనక్కి తగ్గాడు. ఆపై, మర్చంట్ నేవీలో తిరిగి చేరేందుకు 2023లో లండన్ వెళ్లాడు. అయితే, ఫిబ్రవరి 28న తన కుమార్తె ఆరో పుట్టిన రోజు సందర్భంగా 2025 ఫిబ్రవరి 24న సౌరభ్ ఇంటికి తిరిగొచ్చాడు. మరోపక్క, సౌరభ్‌ను ఎలాగైనా హతమార్చాలని ముస్కాన్, ఆమె ప్రియుడు సాహిల్ అప్పటికే నిర్ణయించుకున్నారు. ముందస్తు పథకం ప్రకారం.. మార్చి 4న నిద్రమాత్రలు కలిపిన భోజనాన్ని ముస్కాన్ తన భర్తకు వడ్డించింది. ఆ ఆహారం తిని అతను నిద్రలోకి జారుకోగానే.. ముస్కాన్, సాహిల్ కలిసి సౌరభ్‌ను కత్తితో పొడిచి చంపేశారు. అనంతరం సౌరభ్ శరీరాన్ని దాదాపు 15 ముక్కలు చేసి.. వాటిని ఓ ప్లాస్టిక్ డ్రమ్ములో వేసి.. తడి సిమెంట్‌తో నింపేశారు. ఆపై, ఆ డ్రమ్మును ఇంట్లోనే ఉంచేసి.. ముస్కాన్, సాహిల్ కలిసి హిమాచల్ ప్రదేశ్‌లోని మనాలీకి వెళ్లారు. తమ వెంట తీసుకెళ్లిన సౌరభ్ ఫోన్‌తో అతని సోషల్ మీడియా ఖాతాల్లో పోస్టులు పెడుతూ తాము చేసిన కిరాతకాన్ని కప్పిపుచ్చేందుకు యత్నించారు. అయితే, ఎన్నిసార్లు ఫోన్లు చేసినా సౌరభ్ నుంచి స్పందన లేకపోవడంతో అనుమానించిన అతని కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ముస్కాన్, సాహిల్‌ను అదుపులోకి తీసుకుని పోలీసులు విచారించగా.. చేసిన ఘోరాన్ని ఒప్పుకున్నారు.

మా అమ్మాయిని ఉరి తీయండి..

భర్తను హత్య చేసిన ముస్కాన్‌కు ఉరి శిక్ష విధించాలని ఆమె తల్లిదండ్రులు విలేకరులతో అన్నారు. కోటీశ్వరుడైన సౌరభ్ తమ కుమార్తెను ఎంతో ప్రేమించాడని, అతనిని తల్లిదండ్రులకు దూరం చేసిన ముస్కాన్ చివరికి ప్రాణాలు కూడా తీసిందని ఆవేదన వ్యక్తం చేశారు.

14 వేల మంది ఉద్యోగుల తొలగింపునకు అమెజాన్ సిద్ధం!

న్యూఢిల్లీ, మార్చి 19: ప్రముఖ ఈ కామర్స్ సంస్థ అమెజాన్ 14 వేల మంది ఉద్యోగులను తొలగించడానికి సిద్ధమయింది. ఖర్చులు తగ్గించుకోవడంతో భాగంగా మేనేజర్ స్థాయిలోని 14 వేల మందిని తొలగించాలని అమెజాన్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. దీని వల్ల సంస్థకు సంవత్సరానికి రూ.210 కోట్ల నుంచి రూ.360 కోట్ల వరకు ఆదా కానున్నట్లు అంచనా. కంపెనీ పునర్‌వ్యవస్థీకరణ ప్రణాళికలో భాగంగా అమెజాన్ ఇటీవల కమ్యూనికేషన్స్, సస్టెయినబిలిటీ విభాగాల్లో ఉద్యోగులను తొలగించింది. తాజాగా మేనేజర్ స్థాయి ఉద్యోగులను ఇంటికి పంపేందుకు సిద్ధమయింది. కాగా, 2022, 2023 సంవత్సరాల్లో అమెజాన్ 27,000 మంది ఉద్యోగులను తొలగించింది.

గాజా రెండు ముక్కలు?

- చొచ్చుకెళ్లిన ఇజ్రాయెల్ సైన్యం

టెల్ అవీవ్, న్యూఢిల్లీ, మార్చి 19: ఇజ్రాయెల్ బలగాలు గాజాలోకి జొచ్చుకెళ్లాయి. గాజాను రెండు ముక్కలు చేసినట్లు సమాచారం. ఇజ్రాయెల్ బలగాలు ఇప్పటికే నెజారిమ్ కారిడార్‌ను తిరిగి స్వాధీనం చేసుకున్నాయి. వాస్తవానికి కాల్పుల విరమణ ఒప్పందం ప్రకారం నెజారిమ్ కారిడార్‌ను ఇజ్రాయెల్ తిరిగి అప్పగించింది. అయితే తమ వద్ద ఉన్న మిగతా బందీలను విడుదల చేసేందుకు హమాస్ నిరాకరించడంతో ఇజ్రాయెల్ మంగళవారం మళ్లీ వైమానిక దాడులకు పాల్పడింది. ఈ దాడుల్లో 183 మంది చిన్నారులు సహా 436 మంది పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారు. ఇది ఆరంభం మాత్రమేనని, మరిన్ని దాడులు కొనసాగుతాయని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు హెచ్చరించారు. కాగా, గాజాలో నెలకొన్న పరిస్థితిపై భారత్ ఆందోళన వ్యక్తం చేసింది. గాజా వాసులకు నిరంతరాయంగా మానవతా సాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించింది. అదే సమయంలో బందీలను విడిచిపెట్టాలని కూడా భారత్ డిమాండ్ చేసింది. గాజాపై ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడిని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ వాద్రా ఖండించారు. పాశవిక హత్యాకాండగా అభివర్ణిస్తూ ఆమె ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు.


హైడ్రా టార్గెట్ పేదలే అనిపిస్తోంది!

- డబ్బున్న వారికి ఆ చట్టం అమలవుతోందా?
- సంపన్నులు, నేతల జోలికి ఎందుకు పోవట్లేదు?
- పేదల ఇళ్లు కూల్చి మీడియాలో చూపిస్తారా?
- హైడ్రా తీరుపై హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు



హైదరాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో నీటి వనరులు, సర్కారు భూముల పరిరక్షణే ప్రధాన ధ్యేయంగా ఏర్పాటైన హైడ్రా పేద, మధ్య తరగతి ప్రజలను మాత్రమే టార్గెట్ చేస్తున్నట్లు కనిపిస్తోందని హైకోర్టు వ్యాఖ్యానించింది. సంపన్నులు, రాజకీయ నేతలు, ఇతర ప్రముఖుల జోలికి ఎందుకు వెళ్లడం లేదని ప్రశ్నించింది. ఒకసారి వారికి చెందిన నిర్మాణాల్లో నిబంధనలు పాటించారా? లేదా? అన్నది చూడాలని ఘాటు వ్యాఖ్యలు చేసింది. అసలు సంపన్నులకు హైడ్రా ప్రత్యేక చట్టాన్ని అమలు చేస్తోందా అని నిలదీసింది. పేద, మధ్య తరగతికి చెందిన ఇళ్లను కూల్చి మీడియాలో ఫొటోలు వేయించుకోవడం కాదని.. దుర్గంచెరువు సహా పలు చోట్ల సర్కారు భూములను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన ప్రముఖుల పరిస్థితేంటని ప్రశ్నించింది. అందరికీ ఒకేలా న్యాయం దక్కినప్పుడే హైడ్రా ప్రజాప్రయోజనాలను పరిరక్షించినట్లు అవుతుందని తేల్చి చెప్పింది. 'ఒకప్పుడు హైదారాబాద్ అంటే చెరువులు, సరస్సుల నగరంగా పేరుండేది. 2 వేలకు పైగా చెరువులు, ఇప్పుడు 200 కూడా లేవు. చెరువుల రక్షణకు నాడు ప్రత్యేక చట్టాలు అమల్లో ఉండేవి. హైడ్రా ఏర్పాటు తీరు బాగానే ఉన్నా.. పని తీరు మాత్రం ఆశాజనకంగా లేదు. పేదలతో పాటు పెద్దలకు చెందిన అక్రమ నిర్మాణాలను కూల్చేసినప్పుడే నిజమైన సార్థకత చేకూరుతుంది. ఇప్పటి ప్రభుత్వాల కంటే నాడు నిజాం చేపట్టిన చెరువుల పరిరక్షణ చర్యలే పకడ్బందీగా ఉండేవి' వ్యాఖ్యానించింది. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలం అత్తాపూర్ సర్వే నంబర్ 329/1, 329/2, 329/3లోని 6 ఎకరాలకు సంబంధించి తహసీల్దార్ జారీ చేసిన నోటీసులను సవాల్ చేస్తూ ఫాతిమా అనే మహిళ, ఇతరులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. సదరు భూమికి సంబంధించి వక్ఫ్ బోర్డు సీఈవో లేఖ మేరకు తహసీల్దార్ చర్యలు చేపట్టడం చెల్లదన్నారు. దీనిపై ప్రభుత్వ న్యాయవాది స్పందిస్తూ.. హైకోర్టులో దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యం మేరకు మీరాలం చెరువు పరిధిలో ఆక్రమణల తొలగింపునకు చట్టప్రకారం చర్యలు తీసుకుంటున్నామన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. మీరాలం చెరువుకు సంబంధించి తొలుత పిటిషనర్ అభ్యంతరాలపై ఉమ్మడి సర్వే నిర్వహించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించింది. ప్రభుత్వానిదే అని తేలితే అప్పుడు పరిరక్షణ చర్యలు చేపట్టాలని సూచించింది.

కాళోజీ వర్సిటీ వీసీగా నందకుమార్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న డాక్టర్ పివి. నంద కుమార్‌రెడ్డి

వరంగల్ మెడికల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లోని కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉపకులపతిగా డాక్టర్ పీవీ నంద కుమార్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. వరంగల్‌లోని ఆరోగ్య విశ్వవిద్యాలయం వీసీ చాంబర్‌లో బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు బాధ్యతలు స్వీకరించారు. ఈ నెల 18వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం డాక్టర్ నంద కుమార్‌రెడ్డిని వీసీగా నియమిస్తూ జీవో ఎంఎస్ నెంబరు 59ను ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. నారాయణపేట జిల్లాకు చెందిన డాక్టర్ నంద కుమార్‌రెడ్డి రాములమ్మ - పుల్లారెడ్డి దంపతులకు జన్మించారు. ప్రాథమిక విద్యాభ్యాసం నుంచి ఇంటర్ వరకు నారాయణపేటలోనే కొనసాగింది. హైదరాబాద్‌లోని రెడ్డి హాస్టల్‌లో ఉంటూ గాంధీ ప్రభుత్వ ఆస్పత్రిలో ఎంబీబీఎస్, ఉస్మానియా ఆస్పత్రిలో ఎంఎస్ ఆప్తమాలజీ విద్య అభ్యసించారు. 1982-83లో ఉమ్మడి ఖమ్మం జిల్లా కామయ్యపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిగా ప్రభుత్వ సేవలను ప్రారంభించారు. ఆ తరువాత రంగారెడ్డి జిల్లాలోని పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో విధులు నిర్వర్తించారు. 1998లో హైదరాబాద్‌లోని సరోజిని కంటి ఆస్పత్రిలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా, 2014లో ప్రొఫెసర్‌గా, సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టారు. అడిషనల్ డైరెక్టర్ హోదాలో ప్రభుత్వ సర్వీసుల నుంచి ఉద్యోగ విరమణ పొందారు. అప్పటి నుంచి పదేళ్లుగా రాష్ట్రంలోని పలు ప్రయివేట్ వైద్య కళాశాలలో ప్రిన్సిపాల్‌గా, డీన్‌గా కొనసాగారు. 2023-24 కాలంలో వరంగల్‌లోని ఫాదర్ కొలంబో ఆస్పత్రి డీన్‌గా కొనసాగారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2010-2015 మధ్య కాలంలో ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ పాలక వర్గ సభ్యుడిగా, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడిగా పని చేశారు. ఆయనకు కుమార్తె నేహారెడ్డి, ఇద్దరు కుమారులు డాక్టర్ నిశాంత్‌రెడ్డి, డాక్టర్ నిఖిల్‌రెడ్డి ఉన్నారు. కాగా, కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉపలకుతిగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ నందకుమార్‌రెడ్డికి విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ సంధ్య, వివిధ విభాగాల అధిపతులు, ఉద్యోగులు, వైద్య సంఘాల నేతలు అభినందనలు తెలిపారు.

వైసీపీ ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ రాజీనామా

- వెంటనే ఆమోదించాలని చైర్మన్‌కు వినతి

అమరావతి/చిలకలూరిపేట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్‌కు సన్నిహితుడిగా పేరుపొందిన వైసీపీ ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ శాసనమండలి సభ్యత్వానికి రాజీనామా చేశారు. బుధవారం శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజును కలిసి స్పీకర్ ఫార్మాట్‌లో రాజీనామా లేఖను అందించారు. వెంటనే ఆమోదించాలని కోరారు. కొందరు వైసీపీ నేతలు అసెంబ్లీ లాబీల్లో ఆయనను కలిసి రాజీనామా యోచన మానుకోవాలని ఒత్తిడి తెచ్చారు. అయితే నిర్ణయం తీసేసుకున్నానని రాజశేఖర్ తేల్చిచెప్పారు. వైసీపీ ప్రాథమిక సభ్యత్వానికి కూడా రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. పదవీకాలం ఇంకా నాలుగేళ్లు ఉండగానే ఆయన వైదొలగడం గమనార్హం. ఇప్పటికే నలుగురు ఎమ్మెల్సీలు.. పోతుల సునీత, బల్లి కల్యాణ చక్రవర్తి, కర్రి పద్మశ్రీ, జయమంగళ వెంకటరమణ ఆ పార్టీకి, మండలి సభ్యత్వానికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే.

దేవాదులలోని దేవన్నపేట మోటార్ ప్రారంభం రేపు

హైదరాబాద్, మార్చి19 (ఆంధ్రజ్యోతి): దేవాదుల ఎత్తిపోతల పథకం మూడో దశలో భాగంగా హనుమకొండ జిల్లా దేవన్నపేట వద్ద నిర్మించిన పంప్‌హౌస్‌లోని ఓ మోటార్ శుక్రవారం ప్రారంభమయ్యే అవకాశం ఉంది. అదే జరిగితే 50 వేల ఎకరాలకు సాగునీరు అందనుంది. దేవన్నపేట పంప్‌హౌస్‌లో ఒక్కోటి 31 మెగావాట్ల సామర్థ్యం కలిగిన మూడు మోటార్లను ఏర్పాటు చేశారు. ఇందులో ఓ మోటార్‌ను మంగళవారం(ఈ నెల 18న) ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, ఇతర మంత్రులు, నేతలు మంగళవారం సాయంత్రం అక్కడికి చేరుకున్నారు. కానీ, సాంకేతిక సమస్యల వల్ల మోటార్‌ను ప్రారంభించడం కుదరలేదు. రాత్రి వరకు అక్కడే వేచి ఉన్న నేతలంతా తిరుగుముఖం పట్టారు. అయితే, ఈ నెల 21 నాటికి మోటార్ సిద్ధమవుతుందని, ఆ రోజు నుంచి పంపింగ్ కూడా ప్రారంభించవచ్చునని నిర్మాణసంస్థ ప్రతినిధులు మంత్రి ఉత్తమ్‌కు బుధవారం సమాచారమిచ్చారు.

గేట్స్ ఫౌండేషన్‌తో ఏపీ ఒప్పందం

విద్య, వైద్యం, సాగు రంగాల్లో టెక్నాలజీ వినియోగానికి సహకారం.. ఢిల్లీలో బిల్ గేట్స్‌తో చంద్రబాబు భేటీ

- త్వరలో రాష్ట్రానికి బిల్ గేట్స్ : చంద్రబాబు
- టెక్నాలజీ వినియోగంలో చంద్రబాబు దార్శనికుడు: గేట్స్



ఢిల్లీలో బిల్‌గేట్స్‌తో చంద్రబాబు నాయుడు

న్యూఢిల్లీ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌తో 'గేట్స్ ఫౌండేషన్' చేతులు కలిపింది. కీలక రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు, సమర్థంగా సేవలందించడంలో ప్రభుత్వానికి సహకరించేందుకు ముందుకు వచ్చింది. ఆరోగ్య సంరక్షణ, మెడికల్ టెక్నాలజీ, విద్య, వ్యవసాయం వంటి రంగాల్లో టెక్నాలజీ వినియోగం పెంపొందించడం, కృత్రిమ మేధ (ఏఐ) వంటి అధునాతన సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై ఉమ్మడి కార్యాచరణ ప్రారంభించాలని ఏపీ ప్రభుత్వం, గేట్స్ ఫౌండేషన్ నిర్ణయించాయి. బుధవారం ఢిల్లీలో ఏపీ సీఎం చంద్రబాబు, గేట్స్ ఫౌండేషన్ అధినేత, మైక్రోసాఫ్ట్ సంస్థ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ సమావేశమయ్యారు. దాదాపు గంట సేపు కీలక చర్చలు జరిపారు. అనంతరం ఏపీ ప్రభుత్వం, గేట్స్ ఫౌండేషన్ అవగాహన ఒప్పంద పత్రం (ఎంఓయూ)పై సంతకాలు చేశాయి. ఆయా రంగాల్లో ఖర్చు తగ్గించడంతో పాటు విస్తృత ప్రయోజనాలు కలిగేలా పనిచేయనున్నాయి. బిల్ గేట్స్‌తో సమావేశం తర్వాత చంద్రబాబు మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. 2047 కల్లా స్వర్ణాంధ్రప్రదేశ్ సాధించాలనే లక్ష్యానికి తన ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని, తమ లక్ష్యం సాధించేందుకు బిల్ గేట్స్ ఫౌండేషన్‌తో ఏర్పడిన ఈ భాగస్వామ్యం కీలక పాత్ర పోషిస్తుందని ఆకాంక్షించారు. త్వరలో బిల్ గేట్స్ ఏపీకి వచ్చేందుకు అంగీకరించారని, తిరుపతిని కూడా సందర్శించాలని కోరానని చంద్రబాబు తెలిపారు. ఎంఓయూ ప్రకారం ఆరోగ్య సంరక్షణ, విద్య, వ్యవసాయం, ఉపాధి కల్పన రంగాల్లో అధునాతన టెక్నాలజీని అందించే భాగస్వామ్య సంస్థలను గేట్స్ ఫౌండేషన్, ఏపీ ప్రభుత్వం గుర్తిస్తాయని, ఈ సంస్థలకు ఫౌండేషన్ మద్దతు అందిస్తుందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

ఏపీ ఆదర్శంగా నిలుస్తుంది: బిల్ గేట్స్

వినూత్న సాంకేతిక పరిష్కారాల ద్వారా అభివృద్ధి సాధించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనిక దృక్పథంతో కోరుకోవడం హర్షణీయమని బిల్ గేట్స్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, గేట్స్ ఫౌండేషన్‌ల మధ్య భాగస్వామ్యం ప్రోత్సాహకరంగా ఉందన్నారు. తక్కువ ఖర్చుతో కూడిన, స్థానికంగా ఉత్పత్తి చేసే వైద్య పరికరాల ద్వారా అణగారిన వర్గాల ప్రజల జీవితాలను మెరుగుపరచాలని నిర్ణయించడం ముఖ్యమైన విషయమన్నారు. ఏఐ, ఇతర టెక్నాలజీ పరిష్కారాలను ఆరోగ్యం, వ్యవసాయం, మౌలిక విద్య వంటి కీలక రంగాల్లో ఉపయోగించడం ద్వారా దేశంలో ఇతర ప్రాంతాలకు కూడా ఏపీ ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు.

ఏపీ స్పేస్ టెక్నాలజీ గౌరవ సలహాదారుగా సోమనాథ్

- జి.సతీశ్‌రెడ్డి, సుచిత్రా ఎల్లా, కేపీసీ గాంధీలకూ అవకాశం

అమరావతి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : ఏపీ స్పేస్ టెక్నాలజీ గౌరవ సలహాదారుగా ఇస్రో మాజీ చైర్మన్ ఎస్బీ సోమనాథ్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. రెండేళ్లపాటు ఆయన ఈ పదవిలో ఉంటారు. సోమనాథ్‌కు ప్రభుత్వం కేబినెట్ హోదా కల్పించింది. వ్యవసాయ పనులు, విపత్తుల నియంత్రణ, ప్రభుత్వ పాలన, పరిశ్రమల నిర్వహణలో స్పేస్ టెక్నాలజీ వినియోగంపై ఆయన ప్రభుత్వానికి సలహాలు ఇస్తారు. అడ్వాన్స్ స్పేస్ టెక్నాలజీ హబ్, టెస్టింగ్ సౌకర్యాల ఏర్పాటు, రీసెర్చ్ సెంటర్లు, క్లస్టర్ల ఏర్పాటులో ఆయన సూచనలు అందిస్తారు. కాగా, మరో ముగ్గురు ప్రముఖులను కూడా రాష్ట్ర ప్రభుత్వం గౌరవ సలహాదారులుగా నియమించింది. కేంద్రరక్షణ శాఖ శాస్త్రీయ సలహాదారు జి.సతీశ్‌రెడ్డిని ఏపీ ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్ గౌరవ సలహాదారుగా నియమించారు. భారత్ బయోటెక్ ఎండీ, టీటీడీ సభ్యురాలు సుచిత్ర ఎల్లాను హ్యాండ్‌లూమ్స్ అండ్ హ్యాండీక్రాఫ్ట్స్ డెవలప్‌మెంట్ గౌరవ సలహాదారుగా ఎంపిక చేశారు. ఫోరెన్సిక్ సైన్స్ గౌరవ సలహాదారుగా డాక్టర్ కేపీసీ గాంధీని నియమించారు. ఈ ముగ్గురికి కేబినెట్ హోదా కల్పించారు.



గజ్వేల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట బీజేపీ నాయకులు

కేసీఆర్ క్యాంపు కార్యాలయానికి టులెట్ బోర్డు

- గజ్వేల్‌లో బీజేపీ శ్రేణుల ధర్నా

గజ్వేల్/వర్గల్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం కేసీఆర్‌కు తన సొంత నియోజకవర్గం గజ్వేల్‌లో బీజేపీ, కాంగ్రెస్ శ్రేణులు షాకిచ్చాయి. గజ్వేల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి బీజేపీ నాయకులు బుధవారం టులెట్ బోర్డు పెట్టారు. గజ్వేల్ ఎమ్మెల్యే అయిన మాజీ సీఎం కేసీఆర్ నియోజకవర్గానికి రాకపోవడంపై వాంటెడ్ ఎమ్మెల్యే అంటూ నిరసన వ్యక్తం చేశారు. ప్రజల వద్దకు రాని కేసీఆర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మరోపక్క, గజ్వేల్ ఎమ్మెల్యే కేసీఆర్ కనబడటం లేదంటూ గజ్వేల్, గౌరారం పోలీసుస్టేషన్లలో యూత్ కాంగ్రెస్ నేతలు వేర్వేరుగా ఫిర్యాదులు చేశారు. బీజేపీ నేతల నిరసనపై గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి ఫైరయ్యారు. అల్లరిమూకలు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం తాళాలు పగలుగొట్టి కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశాయంటూ గజ్వేల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

తేజా మిర్చికి ధరా ఘాతం

- రూ.10 వేల నుంచి రూ.13 వేలకే కొనుగోళ్లు
- ఖమ్మంలో నెల రోజుల్లో రూ.2 వేలు పతనం

ఖమ్మం మార్కెట్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): తేజా మిర్చి ధర రోజురోజుకూ పతనమవుతోంది. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం జెండాపాట క్వింటా రూ.13,500 నిర్ణయించగా.. వ్యాపారులు నాణ్యతను బట్టి రూ.6,100 నుంచి రూ.11,500 వరకు ఎక్కువ లాట్లను కొనుగోలు చేశారు. మార్కెట్‌లో రెండు, మూడు నెలల క్రితం సీజన్ ప్రారంభంలో రూ.19,000 వరకు పలికిన మిర్చి ధర క్రమంగా తగ్గుతూ వచ్చింది. నెల రోజుల క్రితం రూ.15,000 పలకగా ప్రస్తుతం రూ.13,000 ఉంది. సుమారు రూ.2,000 వరకు ధర పడిపోయింది. తేజా మిర్చికి చైనా, సింగపూర్, మలేషియా, థాయ్‌లాండ్, శ్రీలంక, బంగ్లాదేశ్ తదితర దేశాల నుంచి ఈ ఏడాది ఆర్డర్లు నిలిచిపోవడం వల్లనే ధరలు తగ్గుముఖం పడుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. ఖమ్మం మార్కెట్‌కు బుధవారం సుమారు 70 వేల మిర్చి బస్తాలు అమ్మకానికి వచ్చాయి. ఖమ్మంలో ఉన్న సుమారు 24 కోల్డ్ స్టోరేజీల్లో ఇప్పటికే సుమారు 17 లక్షల బస్తాలను నిల్వ చేశారు.

పుణెలో మినీ బస్సులో చెలరేగిన మంటలు

- నలుగురి సజీవ దహనం, ఐదుగురికి గాయాలు

పుణె, మార్చి 19: పుణెకు సమీపంలో బుధవారం ఉదయం ఓ ప్రైవేటు సంస్థకు చెందిన మినీ బస్సులో మంటలు చెలరేగిన ఘటనలో ఆ కంపెనీకి చెందిన నలుగురు ఉద్యోగులు సజీవ దహనం కాగా మరో ఐదుగురు గాయాలపాలయ్యారు. మినీబస్సు వెనుకభాగంలో ఉన్న ఎమర్జెన్సీ ఎగ్జిట్ తెరచుకోకపోవడం వల్లనే ప్రాణనష్టం సంభవించినట్టు తెలుస్తోంది. పింప్రీ చించ్‌వాడ్ ప్రాంతంలోని హింజెవాడి వద్ద ఉదయం 7.30 గంటల ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. వ్యోమా గ్రాఫిక్స్‌కు చెందిన 12 మంది ఉద్యోగులు వార్జే నుంచి హింజెవాడికి వెళ్తుండగా ఈ సంఘటన జరిగింది. వాహనం దసో సిస్టమ్స్ సమీపానికి చేరుకోగానే డ్రైవర్ పాదాల వద్ద మంటలు చెలరేగాయని, వెంటనే తేరుకున్న డ్రైవర్ వాహన వేగాన్ని తగ్గించాడని, తర్వాత ముందు భాగంలో మంటలు వ్యాపించాయని ఓ పోలీసు అధికారి తెలిపారు. ప్రమాదాన్ని గుర్తించిన నలుగురు ఉద్యోగులు వెంటనే బస్సు నుంచి దిగిపోయారు. వాహనం వెనుకభాగంలో ఉన్న వారు ఎమర్జెన్సీ ఎగ్జిట్ ద్వారా తప్పించుకునే ప్రయత్నం చేశారు. అయితే అది తెరచుకోకపోవడంతో బయటపడలేకపోయారు. ఈ నేపథ్యంలోమంటలు వ్యాపించడంతో వారిలో నలుగురు సజీవ దహనం కాగా ఐదుగురు గాయాలపాలయ్యారు.

ట్యాంక్ బండ్‌పై మల్లు స్వరాజ్యం విగ్రహం

- పాఠ్యాంశంగా ఆమె జీవిత చరిత్ర
- స్వరాజ్యం వర్ధంతి సభలో మంత్రి సీతక్క



రాంనగర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేస్తామని మంత్రి సీతక్క అన్నారు. ఆమె జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేర్చేందుకు కృషి చేస్తామని ఆమె చెప్పారు. బుధవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఐద్వా ఆధ్వర్యంలో మల్లు స్వరాజ్యం మూడవ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మల్లు స్వరాజ్యం చిత్రపటానికి మంత్రి సీతక్క పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ అన్యాయంపై తిరుగుబాటు చేసిన వీరవనిత మల్లు స్వరాజ్యం అని, ఆమె జీవిత చరిత్రను భావితరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఆమె అగ్రకులంలో పుట్టినా.. వందలాది ఎకరాల ఆస్తి ఉన్నా.. జీవితాంతం నిస్వార్థంగా పేదలకు జరుగుతున్న అన్యాయంపై తిరుగుబాటు జెండా ఎగుర వేసిన మహనీయురాలని పేర్కొన్నారు. మల్లు స్వరాజ్యం పేరిట ట్రస్ట్ ఏర్పాటుకు రెండు ఎకరాల భూమి కోరికను పరిశీలిస్తామని పేర్కొన్నారు. ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, సినీ నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ్ నాయకులు జ్యోతి, పీవోడబ్ల్యూ జాతీయ కన్వీనర్ సంధ్య, అరుణోదయ సాంస్కృతిక నాయకురాలు విమలక్క తదితరులు పాల్గొన్నారు.


తీగ లాగితే.. కదిలిన డొంక!

- పిల్లల విక్రయాల కేసులో మరో 27 మంది అరెస్టు
- 10 మంది చిన్నారులను కాపాడిన పోలీసులు
- గతంలోనే 11 మంది అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీపీ సుధీర్ బాబు

హైదరాబాద్ సిటీ/కొత్తపేట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పసిపిల్లలను ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా తీసుకొచ్చి హైదరాబాద్‌లో విక్రయిస్తున్న ముఠాకు చెందిన నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ ముఠాతో సంబంధమున్న 11 మంది నిందితులను గత నెలలోనే కటాకటాల్లోకి నెట్టారు. అయితే కస్టడీలో వారిచ్చిన సమాచారం మేరకు తాజాగా మరో 9 మంది దళారులు, చిన్నారులను కొనుగోలు చేసిన 18 మంది తల్లిదండ్రులను అదుపులోకి తీసుకున్నారు. మొత్తం 21 మంది చిన్నారులను అక్రమంగా విక్రయించినట్లు గుర్తించిన పోలీసులు.. అందులో 10 మందిని రక్షించారు. మిగిలిన వారి ఆచూకీ కోసం వెతుకుతున్నారు. బుధవారం హైదరాబాద్ ఎల్‌బీనగర్‌లో రాచకొండ సీపీ సుధీర్‌బాబు మీడియా సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. 'ఈ వ్యవహారంలో తొలుత అరెస్టయిన కృష్ణవేణి, వందనలను విచారించగా.. ప్రధాన నిందితురాలు మలక్‌పేటకు చెందిన ఆశా వర్కర్ సోము అమూల్య (29) పేరు వెలుగులోకి వచ్చింది. అమూల్య ఆశా వర్కర్‌గా ఆజంపురా యూపీహెచ్‌సీలో పనిచేస్తోంది. అయితే మలక్‌పేట ఏరియా ఆసుపత్రిలో సూపర్‌వైజర్‌గా పనిచేసే ఇస్మాయిల్‌తో ఆమెకు పరిచయమేర్పడింది. పసిపిల్లల కొనుగోలు, విక్రయాలతో పెద్దమొత్తంలో డబ్బులొస్తాయని అమూల్యను అతడు మభ్యపెట్టాడు. దీంతో ఇద్దరు కలిసి పిల్లలు లేని ఓ ఒంటరి మహిళకు మగ శిశువును అమ్మి సొమ్ము చేసుకున్నారు. ఆ తర్వాత అమూల్యకు కృష్ణవేణి, వందన, దీప్తి పరిచయమయ్యారు. అంతా కలిసి అక్రమంగా శిశువుల కొనుగోలు, విక్రయాలు మొదలుపెట్టారు. సోషల్ మీడియా ద్వారా ఇతర రాష్ట్రాల వారినీ పరిచయం చేసుకుని దందా కొనసాగించారు. ఈ నేపథ్యంలోనే వారందరినీ గుర్తించి అరెస్టు చేశాం' అని సీపీ వివరించారు. చట్టబద్ధంగా శిశువులను దత్తత తీసుకోవాలని సూచించారు. అక్రమంగా శిశువులను కొనుగోలు చేయడం, అమ్మడం నేరమని హెచ్చరించారు.



ఆర్ట్స్ కాలేజీ వద్ద రాస్తారోకో చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

ఓయూలో ధర్నాలు, రాస్తారోకోలు

- నేడు ఓయూ బంద్‌కు పిలుపు.. విద్యార్థి సంఘాల నేతల అరెస్ట్

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆందోళనలు, ధర్నాలు, రాస్తారోకోలు నిషేధిస్తూ ఇచ్చిన సర్క్యులర్‌కు వ్యతిరేకంగా నాలుగు రోజులుగా కొనసాగుతున్న నిరసనలు ఉధృతమయ్యాయి. బుధవారం విద్యార్థి సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కాలేజీ ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ.. ఓయూలో అప్రజాస్వామికంగా విడుదల చేసిన సర్క్యులర్‌ను తక్షణమే వాపస్ తీసుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ మేధావులు, ప్రజా సంఘాలు, ప్రతి పక్షాలు, రాజకీయ పార్టీలు.. విద్యార్థుల ఉద్యమానికి మద్దతు తెలపాలని కోరారు. వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురువారం ఓయూ బంద్‌కు పిలుపునిచ్చారు. దాంతో పోలీసులు నాయకులను అరెస్ట్ చేసి నగరంలోని వివిధ పోలీస్‌స్టేషన్లకు తరలించారు. కాగా, ఏబీవీపీ ఆధ్వర్యంలో సర్క్యులర్‌కు వ్యతిరేకంగా టెక్నాలజీ కళాశాలలో సంతకాల సేకరణ చేశారు.

వైసీపీ నుంచి ప్రాణ హాని

- వివేకా హత్య కేసులో ఏ2 సునీల్ ఆందోళన

కడప క్రైం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసుతో ముడిపడిన వ్యక్తుల వరుస మరణాల నేపథ్యంలో... మరో నిందితుడు తనకు ప్రాణ హాని ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వివేకా హత్య కేసులో రెండో నిందితుడు(ఏ2)గా ఉన్న సునీల్ యాదవ్ బుధవారం కడప జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్‌ను కలిశారు. తనకు రక్షణ కల్పించాలని వినతిపత్రం సమర్పించారు. ఆ తర్వాత ఎస్పీ కార్యాలయం వెలుపల మీడియాతో మాట్లాడారు. తననూ చంపేస్తారేమో అని ఆందోళన వ్యక్తం చేశారు. జైల్లో 39 నెలలు ఉన్న సమయంలో తనను కొందరు బెదిరించారని తెలిపారు. "39 నెలలు జైల్లో ఉండి బయటకు వచ్చాక కూడా నరకం అనుభవిస్తున్నాను. గత ప్రభుత్వంవల్లే నేను ఇబ్బందులు పడుతున్నాను. ఆ పార్టీకి(వైసీపీ) చెందిన వారి నుంచే నాకు ప్రాణహాని ఉంది. వారి పేర్లు కూడా ఎస్పీ దృష్టికి తీసుకెళ్లాను. ఆయన సానుకూలంగా స్పందించారు" అని సునీల్ యాదవ్ తెలిపారు. రెండ్రోజుల క్రితం తన ఇంటి వద్ద పోలీసు పికెట్ ఏర్పాటు చేశారన్నారు. తన పైన, నా తల్లిపైన ఆరోపణలు చేస్తూ, వక్రీకరణలతో తీసిన 'హత్య' సినిమాను నిలిపివేయాలని సునీల్ యాదవ్ డిమాండ్ చేశారు. దానిని గతంలో అధికారంలో ఉన్న పార్టీ నిర్మించిందన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

శాంతియత్నాల్లో ట్రంప్!


మూడేళ్ళకు పైగా సాగుతున్న రష్యా–ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించేందుకు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్‌ట్రంప్ గట్టిగానే కష్టపడుతున్నారు. ఆయన సహనం చూస్తుంటే ముచ్చటేస్తున్నది కూడా. మంగళవారం రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో మాట్లాడటానికి ప్రయత్నిస్తే, ఆయన ఎంతకూ అందుబాటులోకి రాలేదని, ఏకంగా గంటపాటు ట్రంప్ చేతిలో ఫోన్‌పట్టుకొని నిరీక్షించాల్సివచ్చిందని అంతర్జాతీయ మీడియాలో కథనాలు వచ్చాయి. అమెరికా అధ్యక్షుడు ఏ సమయంలో ఫోన్‌చేస్తారో తమ అధ్యక్షుడికి తెలియనందువల్ల ఈ సమస్య ఉత్పన్నమైందని రష్యా ఆ తరువాత చిన్నపాటి వివరణ ఇచ్చింది. ఏదో అవగాహన లేక తప్ప ఇది ఎంతమాత్రం తమ అధ్యక్షులవారి అహంకారం కాదని చెప్పడం ఈ వివరణ ఉద్దేశం కావచ్చు. ఆ సమయంలో పుతిన్ పారిశ్రామికవేత్తల సమావేశంలో ఉన్నారట. ఉంటే ఉన్నారు కానీ, అమెరికా అధ్యక్షులంతటివారు ఫోన్ చేస్తే, ఉన్న పళంగా లేచి పరుగున వచ్చి ఫోన్ అందుకోవాలిగానీ, ఇదేమిటి, కచ్చితంగా ఇది ఉద్దేశపూర్వకంగానే జరిగింది అని కొందరు అంటారు. నిజానిజాలు రష్యా అధ్యక్షుడికే ఎరుక. కానీ, ఈ ఘటన అసలే అవమానంతో రగలిపోతున్న ఉక్రెయిన్ అధ్యక్షుడిని సహజంగానే వేడెక్కించింది. పుతిన్‌తో మాట్లాడటానికి ట్రంప్‌కు ఎంత సమయమైనా చిక్కుతుందని, ఎక్కడలేని సహనమూ వస్తుందన్న రీతిలో వ్యాఖ్యానించి కసి తీర్చుకున్నాడాయన. పుతిన్‌తో ట్రంప్ మాట్లాడుతున్న సమయంలో ఐరోపా సమాఖ్య నేతలతో జెలెన్‌స్కీ చర్చల్లో ఉన్నారని కీవ్ ప్రకటించడం వెనుక, మూడేళ్లపాటు ఆయుధాలు అందించిన ఉక్రెయిన్‌కు ముందుగా ఫోన్ పోలేదని మిగతా ప్రపంచం ఎక్కడ అనుకుంటుందోనన్న బాధ ఉండవచ్చు. మొత్తానికి, ఒక రోజు ఆలస్యంగానైనా జెలెన్‌స్కీతో కూడా ట్రంప్ మాట్లాడేశారు. వ్యవహారం సజావుగా సాగుతోందన్న రీతిలో ఓ నాలుగు మంచిమాటలు కూడా అన్నారు. గత నెలలో, ఓవల్ ఆఫీస్‌లో తీవ్ర వాగ్యుద్ధం అనంతరం, దాదాపు గెంటివేసినంత పనిచేశాక, జెలెన్‌స్కీతో ట్రంప్ మాట్లాడింది మళ్ళీ ఇప్పుడే.

ముందుగా షెడ్యూల్ చేసుకున్న ప్రకారమే వైట్‌హౌస్‌నుంచి క్రెమ్లిన్‌కు ఫోన్ వెళ్ళిందని, పుతిన్‌కు సమాచారం చేరినా కూడా ఆయన పట్టించుకోకుండా 'ఆయనకు ఇదే పని' అంటూ కొన్ని వ్యాఖ్యలు చేసి, ఉద్దేశపూర్వకంగానే ఉండిపోయారనడానికి నిదర్శనంగా పారిశ్రామికవేత్తల సదస్సులో జరిగిన ఓ సంభాషణ మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారమైంది. మొత్తానికి, జెలెన్‌స్కీని పక్కనపెట్టేసి, ట్రంప్ పుతిన్ కలసి కథ నడిపిస్తున్నారన్నది నిజం. యుద్ధానికి సంబంధించి పుతిన్–ట్రంప్ చర్చలు ఓ రెండు గంటలు ఆలస్యమైనా, సుదీర్ఘంగా సాగాయని, ఉక్రెయిన్ ఇంధన, మౌలిక సదుపాయాలమీద నెలరోజులు దాడులు నిలిపివేసేలా చూడాలని ఇద్దరూ నిర్ణయించారని వైట్‌హౌస్ ప్రకటించింది. ట్రంప్ కూడా తన సోషల్ మీడియా ఖాతాలో యుద్ధఖైదీల అప్పగింత సహా పుతిన్ చెప్పిన మరికొన్ని విషయాలను పోస్టుచేశారు. ట్రంప్ ప్రతిపాదించిన ముప్పైరోజుల కాల్పుల విరమణకు పుతిన్ సరేనంటూనే చాలా నిబంధనలు పెట్టినట్టుగా వార్తలు వచ్చాయి. అలాగే, యుద్ధం మూలకారణాలమాటేమిటని అడిగారని, నాటో పాత్ర, విస్తరణల సంగతి తేల్చమన్నారని వార్తలు వస్తున్నాయి. ఉక్రెయిన్‌కు సమస్త సహాయాలూ ఆగిపోయినపక్షంలోనే ఈ తాత్కాలిక, స్వల్పకాలిక యుద్ధవిరామం నిలబడుతుందని కూడా పుతిన్ స్పష్టంగా తేల్చేశారట. అంటే, ఉక్రెయిన్‌కు అమెరికానుంచి ఆర్థిక, ఆయుధ సహాయాలు ఆగిపోయి, నిఘా సమాచారం నిలిచిపోతేనే యుద్ధం ఆగుతుందన్నది సారాంశం. ఆదివారం సౌదీ అరేబియాలో జరగబోయే చర్చల్లో ఈ విషయాలన్నీ తేల్చేస్తామని అమెరికా అంటోంది.

యుద్ధానికి తాత్కాలిక విరామం ఇస్తానని ట్రంప్‌కు హామీ ఇచ్చిన పుతిన్, క్షణం కూడా యుద్ధాన్ని ఆపకుండా ఏకంగా ఉక్రెయిన్ ఇంధన స్థావరాలమీదా, వ్యవస్థలమీదా బాంబులు కురిపించారని జెలెన్‌స్కీ ఆరోపిస్తున్నారు. బుధవారం రష్యా క్షిపణులు ఉక్రెయిన్ రైల్వేలకు విద్యుత్ సరఫరా చేసే వ్యవస్థను తీవ్రంగా దెబ్బకొట్టాయి. ఆదివారం చర్చల్లోగా ఉక్రెయిన్‌ను బాగా దెబ్బతీసి, మరింత ఒత్తిడిపెంచాలనీ, భీకరమైన యుద్ధంతో జెలెన్‌స్కీని వంచాలనీ పుతిన్ ఉద్దేశం. తనకు ట్రంప్ ఏం చెప్పారన్నకంటే, పుతిన్‌తో ట్రంప్ ఏం మాట్లాడారన్నది జెలెన్‌స్కీకి ఎక్కువ ఆందోళన కలిగిస్తున్న అంశం. శాంతియత్నాలను రష్యా అడ్డుకుంటోందని జెలెన్‌స్కీ అంటున్నారు కానీ, ఆయన ప్రమేయం లేకుండా ట్రంప్ తాను చేయదల్చుకున్నది చేసుకుపోతున్నారు.

మనం మరిచిపోయిన వాఙ్మయ శిఖరం

కాన్పూర్‌లో జరిగిన ఒక విద్వద్గోష్ఠికి మహాపండిత రాహుల్ సాంకృత్యాయన్, లాహోర్ ఓరియంటల్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మణ్ స్వరూప్ మున్నగు విద్వద్వరేణ్యులు విచ్చేసారు. నేను ఇద్దరికీ పరిచితుడినే. ప్రసంగవశాత్తు 'రామకృష్ణ కవి గారిని ఎరుగుదురా?' అని రాహుల్ జీ ప్రశ్నించారు. 'ఎందుకు?' అన్నాను. 'ఏమీ లేదు, ఆయన ఎంత ధన్యజీవి! ఆయన జీవిత సార్థక్యానికి ఒక్క కుందమాల నాటకం చాలు. ఎంత మంచి నాటకం వెలుగుకు తెచ్చారు? అన్నారు రాహుల్ జీ. 'మరి నాట్య శాస్త్రం సంగతో?' అన్నారు లక్ష్మణ్ స్వరూప్ జీ, 'ఆయన జీవితాన్ని ధన్యం చేయడానికి!' అన్నారు మరొకరు. నాకు మాట పెగల్లేదు. గుండె గొంతుకలో కొట్టుకులాడింది. నేను అప్పుడు అనుభవించింది మానుషానందం కాదు. ఉపనిషత్తులు ఉద్ఘోషించిన అతి మానుషానందభూతి అది! అతి కష్టంతో గద్గద కంఠంతో అన్నాను : 'కవిగారు నాకు చాలా పరిచితులు. ఆయన దగ్గర పనిచేసే భాగ్యం నాకు కలిగింది' అని. అక్కడి వారందరి చూపుల్లో కవిగారిని దర్శించినంత సంతోషం తెలిపే రాగరేఖ ఒక్కసారిగా మెరిసింది... తిరుమల రామచంద్ర తమ స్వీయ చరిత్ర 'హంపీ నుంచి హరప్పా దాకా'లో రామకృష్ణ కవిగారిని గురించి రాసిన భాగంలో ప్రారంభ వాక్యాలివి. 'అందరికంటే నెక్కువగా నాకు చిరకాల మిత్రులు, ఆంధ్ర భాషా వాఙ్మయం నందు విశేష కృషి చేసిన వారును, దేశాటనము చేసి అపూర్వ పుస్తక సంపాదనము చేసిన వారును శ్రీ మానవల్లి రామకృష్ణకవి గారు...' అని కందుకూరి వీరేశలింగం తమ ఆంధ్ర కవుల చరిత్రములో ప్రస్తావించారు. 'సాహిత్య ప్రపంచంలో మా బోంట్లు తిన్నగా కన్నులు తెరవక పూర్వమే రామకృష్ణ కవి గారు ప్రాచీన ప్రబంధములను ప్రకటించిరి' అని వేటూరి ప్రభాకర శాస్త్రి కీర్తించిన మహావ్యక్తి రామకృష్ణ కవి. బాలాంత్రపు రజనీకాంతరావు సైతం తన 'ఆత్మకథా విభావరి'లో మానవల్లి వారి గురించి రెండు అధ్యాయాలు కేటాయించారు. ముందు తరాలపై మహానుభావుల ప్రభావం అలాగే ఉంటుందేమో. అందుకే, యాభై ఏళ్ళ క్రితం సాహిత్య అకాడమీ 555 పుటల్లో ప్రచురించిన మానవల్లి రామకృష్ణకవి రచనల సంపుటికి రాసిన ముందుమాటలో, 'ఆంధ్ర భాషలో సాహిత్య విమర్శకు భిక్షపెట్టినవారు వీరేనని చెప్పిన అతిశయోక్తి కాజాలదు..' అన్న దేవులపల్లి రామానుజరావు, వాఙ్మయ పరిశోధనకై చేసిన తపస్సు కవిగారి జీవితము అంటారు. పై ఉటంకింపులను బట్టి రామకృష్ణ కవి గారి అసాధారణ ప్రతిభ ఎంతటిదో అర్థమౌతుంది.



మహాపండితుడు, అనుపమేయ సారస్వత సేవకుడు మానవల్లి రామకృష్ణ కవి. ఒకనాడు దేశం యావత్తు గౌరవించిన మానవల్లి రామకృష్ణ కవి ఈ రోజు తెలుగు జాతికి సైతం విస్మృతుడయ్యారు. వేటూరి ప్రభాకర శాస్త్రి మొదలుకుని తిరుమల రామచంద్ర వరకూ ఎందరో విజ్ఞాన జిజ్ఞాసువులకు మార్గదర్శకులుగా నిలిచిన రామకృష్ణ కవి విస్మృత జీవితాన్ని వెలుగులోనికి తీసుకురావడమే ఆయనకు మన తరం ఇవ్వదగ్గ కనీస సార్థక నివాళి.

చెన్నపురి (నేటి చెన్నై)లోని నుంగంబాకంలో పండిత వంశంలో జన్మించిన మానవల్లి రామకృష్ణకవి కళాశాల విద్య అక్కడే చదివారు. ఆరుకి పైబడిన భాషల్లో అనర్గళమైన పాండిత్యం కలిగిన మానవల్లివారు 16 ఏళ్ళ వయసులో మృగవతి అనే కవిత రాయడం వల్ల ఆయన్ని అందరూ గౌరవంగా 'కవి గారు' అని పిలిచేవారట. భరత నాట్యంలో పిహెచ్.డి చేసిన తమిళనాడు విద్వాంసురాలు శ్రీమతి శశికళ 2023 లో జాతీయ హిందీ, సంస్కృత పరిశోధన పత్రికకు రాసిన వ్యాసంలో కవిగారు మార్చి 20, 1875న జన్మించారని రాశారు. వనపర్తి సంస్థానంలో కొన్నాళ్ళు పనిచేసిన రామకృష్ణ కవి తదనంతరం మద్రాసు ప్రాచ్యలిఖిత భాండాగారంలో ప్రాచీన తాళపత్ర గ్రంథాల అన్వేషణలో అగ్రభాగాన నిలిచారు. 'విస్మృత కవులు' రచన చేసిన రామకృష్ణ కవి శిథిల స్థితిలోనున్న ఎన్నో విలువైన గ్రంథాల్ని సేకరించి భద్రపరిచారు. వేంకటేశ్వరా ప్రాచ్య పరిశోధనా సంస్థలో, విద్యా శాఖాధికారిగా రాజమండ్రిలో ఉపాధ్యాయునిగా కూడా పనిచేశారు. శూద్రకుని వత్సరాజ చరిత్రను నవలగా రాశారు. నన్నెచోడుడి 'కుమార సంభవం' కావ్యాన్ని పరిష్కరించి ప్రకటించి నన్నెచోడుడు నన్నయ కంటే ముందువాడని కవి గారు చేసిన ప్రతిపాదన పండిత లోకంలో ఒక సంచలనం. మెకంజీ కైఫీయత్తుల్ని తెలుగీకరించారు. క్రీడాభిరామం, నీతిసార ముక్తావళి, ప్రబంధ మణిభూషణం, పరతత్వ రసాయనం, అనర్ఘ రాఘవం, త్రిపురాంత కోదాహరణం, శ్రీరంగ మహత్యం, సకాలనీతి సమ్మతం వంటి గ్రంథాలను సేకరించి విశ్లేషణాత్మక పీఠికలతో ప్రకటించారు. వైజయంతి, భారతి, ఆంధ్ర సాహిత్య పరిషత్తు పత్రిక, సరస్వతి మొదలైన పత్రికలలో అనేక విలువైన వ్యాసాలు రాశారు. వాల్మీకి చరిత్రనూ, తరిగొండ వెంగమాంబ, గణపవరపు వెంకటకవి, సోమనాథ సోమయాజి, కస్తూరి భట్టరాజు, చింతపల్లి కవుల్ని వెలుగులోనికి తీసుకువచ్చింది మానవల్లి వారే. తెలంగాణమంతా పర్యటించి 'లిథిక్ రికార్డ్స్ ఆఫ్ హైదరాబాద్ స్టేట్' అనే శాసనాల సంకలన గ్రంథాన్ని ప్రతిబింబాలతో పాటుగా ప్రకటించారు. ఇన్నింటిలోకీ యావత్ తెలుగు జాతి ఆయనకు రుణపడి తీరాల్సిన మహోన్నత కార్యం, మహానుభావుడు అన్నమయ్యను వెలికితీసిన మహత్కార్యం. అదొక్కటి చాలు ఆయన్ని తెలుగు జాతి సారస్వత ఉద్ధారక సమున్నతుడుగా గుర్తించడానికి. డబ్లిన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్ స్టడీస్‌లో సీనియర్ ప్రొఫెసర్‌గా పనిచేసిన మెయిల్స్ డిల్లోన్ తాను పారిస్‌లో విద్యార్థిగా ఉన్నప్పుడు తన అభిమాన టీచర్ సిల్వైన్ లేవి తనకి మొట్టమొదటిసారిగా, రామకృష్ణ మహాకవి గారినే పరిచయం చేశారనీ, ప్రాచీన సంస్కృత సాహిత్యంలో ఎన్నో సందేహాలను కవిగారు నివృత్తి చేశారని అన్నారు. మానవల్లి వారు సంస్కృతంలో నలుగురు ప్రాచీన కవులు రాసిన చతుర్భాణిని 1922లో పరిష్కరించి ఇవ్వగా పాట్నాలోని ఒక ప్రచురణ సంస్థ ముద్రించిందనీ, దానిని తాను డార్జిలింగ్ వద్దగల కుర్సియాంగ్ రేడియో స్టేషన్‌కి డైరెక్టర్‌గా ఉన్నప్పుడు 1967, 1968 సంవత్సరాలలో తెలుగులోకి అనువదించాననీ ప్రత్యేకంగా ఒక అధ్యాయమే కేటాయించి వెల్లడించారు బాలాంత్రపు రజనీకాంతరావు గారు.


మహాపండితుడు, అనుపమేయ సారస్వత సేవకుడు అయిన మానవల్లి వారు తన చివరి దశలో ఆర్థిక సమస్యలతో చెప్పరాని బాధలు అనుభవించారు. కుమారులిరువురూ కలిసి రాలేదు. ప్రభుత్వం గుర్తించి ఎంతో కొంత గౌరవ భృతి ఏర్పాటు చేసింది. తుదకు తిరుపతి వీధుల్లో తిరుగుతూ బిచ్చమెత్తుకుంటున్న మానవల్లి వారిని అక్కడి రిక్షా వాళ్ళు చేరదీయగా ఒక హోటలు వారు దయతలచి భోజనం పెట్టేవారట. అలాంటి దుర్భర పరిస్థితుల్లో తన 91 ఏట 20–9–1957న ఆయన తిరుపతిలో మరణించారు.

ప్రాచీన గ్రంథాల అన్వేషణలో నేపాల్, బరోడా, బికనీర్, ట్రావెంకోర్, లాహోర్, జోధ్‌పూర్, కేరళ, కలకత్తా... ఇలా దేశం నలుచెరుగులా తిరిగిన మరో తెలుగు కవి కానీ, పరిశోధకుడు కానీ ఆనాటికి, ఈనాటికీ కూడా ఎవరూ లేరు. మారుమూల గ్రామాల్లో సంప్రదాయ పండితులు ఇవ్వడానికి నిరాకరించిన గ్రంథాల్ని ఊరికే చూసి ఇస్తానని తీసుకుని మొత్తం గ్రంథాన్ని మనసులో పెట్టుకుని తిరిగి వచ్చాక వాటిని పొల్లుపోకుండా నకలు చేసేవారట కవిగారు. అందుకేనేమో తిరుమల రామచంద్ర 'ఆయన ధారణశక్తి శక్తిస్వరూపిణి. ఆయన మెదడొక పావురాల గూడు. అవసరమైన శ్లోకాలు ఆ అరల నుంచి కర్పూరకాంతుల కపోతాలలాగ వెలుపలికి వచ్చేవి...' అని అన్నారు. ఒకనాడు దేశం యావత్తు గౌరవించిన మానవల్లి రామకృష్ణకవి ఈ రోజు తెలుగు జాతికి సైతం విస్మృతుడయ్యారు. నిత్యం అన్నమాచర్యుల కీర్తనలతో మారుమోగే ఏ ఇంట్లోనూ, కనీసం ఆ వేంకటేశ్వరుని సన్నిధి పరిసరాలలో కూడా అసలు ఆయన గురించి తెలిసిన వారు లేరు. మానవల్లి వారి పేరుతో ఒక పురస్కారం ఏర్పాటు చేస్తే విశేష పరిశోధన చేసే వారికి ప్రోత్సాహంగా వుంటుంది. వేటూరి ప్రభాకర శాస్త్రి మొదలుకుని తిరుమల రామచంద్ర వరకూ ఎందరో విజ్ఞాన జిజ్ఞాసువులకు మార్గదర్శకులుగా నిలిచిన రామకృష్ణ కవి విస్మృత జీవితాన్ని వెలుగులోనికి తీసుకురావడమే ఆయనకు మన తరం ఇవ్వదగ్గ కనీస సార్థక నివాళి.

○ గౌరవ్

(నేడు మానవల్లి రామకృష్ణ కవి 150వ జయంతి)

ఇందిరమ్మరాజ్యంలో ఇదేమి న్యాయం?



హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయానికి సంబంధించిన లేదా ఆ విశ్వవిద్యాలయ పరిధిలో గత ఐదు దశాబ్దాలుగా ఉన్న నాలుగువందల ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం అమ్మకానికి పెట్టడం మా లాంటి వాళ్ళని కలవరపెడుతున్నది. రెండున్నర దశాబ్దాలు అధ్యాపకుడిగా బోధన చేయడం వల్ల కూడా ఆ విశ్వవిద్యాలయం పట్ల ఒక ఆత్మీయత, అభిమానం ఏర్పడ్డాయి. ఆ కాలంలో పనిచేసిన చాలా మంది నాలాగే ఆశ్చర్యపోతున్నారు. ఇది విశ్వవిద్యాలయ స్వంత సమస్య కాదు, విశాల సమాజానికి, విద్యారంగానికి, విశ్వవిద్యాలయాల భవిష్యత్తుకి, తెలంగాణ సమాజ అస్తిత్వానికి సంబంధించిన సమస్య.

హైదరాబాద్ విశ్వవిద్యాలయానికి ఒక ప్రత్యేక చరిత్ర ఉంది. ఇటు తెలంగాణ, అటు ఆంధ్రా ప్రాంతంలో తీవ్రంగా జరిగిన ఉద్యమాల పురిటి నొప్పుల నుండి ఇది పుట్టింది. 1960 చివరలో తెలంగాణ ఉద్యమం, అలాగే 70లలో జరిగిన జై ఆంధ్ర ఉద్యమాలకు పరిష్కారంగా అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ ప్రభుత్వం ఒక ఒడంబడిక చేసుకున్నది (సిక్స్ పాయింట్ ఫార్ములా). ఈ ఒడంబడిక అమలులో చట్టపరమైన సమస్యలు తలెత్తకుండా దీనికి 32వ రాజ్యాంగ సవరణ ద్వారా చట్టబద్ధత కల్పించారు. ఈ ఆరు అంశాలలో హైదరాబాద్ విశ్వవిద్యాలయం రెండవ పాయింట్‌లో చేరింది. బహుశా భారత రాజ్యాంగంలో ప్రస్తావింపబడని ఒకే ఒక్క విశ్వవిద్యాలయం హైదరాబాద్ విశ్వవిద్యాలయం. ఈ విశ్వవిద్యాలయంలో ఏ మార్పులు చేయాలన్నా బహుశా 32వ రాజ్యాంగ సవరణను సవరించవలసి ఉంటుంది.

హైదరాబాద్ విశ్వవిద్యాలయానికి 1973లో రూపకల్పన జరిగింది. ప్రొ. గురు బక్స్‌సింగ్‌ను మొదటి వీసీగా నియమించారు. విశ్వవిద్యాలయానికి సరోజినీ నాయుడు నివసించిన గోల్డెన్ త్రెషోల్డ్‌ని ఆ కుటుంబం చాలా ఉదారతతో ఇచ్చింది. ఇక్కడ గాంధీ నాటిన ఒక మొక్క కూడా విలువైన జ్ఞాపకంగా ఉంది. విశ్వవిద్యాలయ నిర్మాణానికి కావలసిన భూమిని ఇచ్చే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంది. మొదట మొహదీపట్నం దగ్గర ఉన్న దాదాపు 800ల ఎకరాల కంటోన్మెంట్ భూమి ఇవ్వచూపారు. మొదటి వీసీ ఒక విశిష్టమైన విశ్వవిద్యాలయ నిర్మాణం కావాలంటే కనీసం రెండు వేల ఎకరాలు కావాలని ప్రతిపాదించినప్పుడు రెండు వేల రెండువందల ఎకరాలను కేటాయించారు. వీసీ ఒక కోటి రూపాయలతో కాంపౌండ్ వాల్ నిర్మాణం చేపట్టారు. ఈ సందర్భంలో విశ్వవిద్యాలయ కాంపౌండ్ వాల్‌కి ఇంత ప్రాధాన్యం ఏమిటని అప్పటి రిజిస్ట్రార్ జార్జిని అడిగితే, 'పంజాబీలకు భూమి విలువ తెలుసు. ఇది అన్యాక్రాంతం కాకుండా కాపాడవలసి ఉంటుందని ఆయన భావిస్తున్నారు' అన్నాడు. ఇప్పుడు ఆలోచిస్తే గురు బక్స్‌సింగ్ ఎంత దూరదృష్టిగలవారో అర్థమవుతుంది.

ఇందిరాగాంధీ ప్రత్యేక శ్రద్ధ వల్ల, అప్పటి రాష్ట్ర ప్రభుత్వం భూమిని ఇవ్వడం వల్ల, ఈ భూమిని రిజిస్టర్ చేయించాలని కాని, లీజ్ డీడ్ చేసుకోవాలని కానీ ఎవ్వరికీ అనిపించలేదు. ఒక్కసారి ప్రభుత్వం విశ్వవిద్యాలయానికి స్థలం ఇచ్చాక మళ్లీ దాంట్లో చేయి పెడుతుందని ఎవ్వరూ ఊహించలేదు. హైదరాబాద్ నగరం చాలా వేగంగా విస్తరించడం, ప్రైవేటు ముఠాలు పుట్టుకరావడం ఒక విషాదం. బహుశా భారతదేశంలో ఏ పట్టణానికి కూడా ఇంత ప్రభుత్వ లేదా ప్రజల భూమి లేదు. నిజాం రాజ్యంలో హైదరాబాద్ చుట్టూ భూమి సర్ఫెఖాస్ అంటే రాజ్యానికి చెందిన భూమి. దేశ విభజన తర్వాత చాలామంది నవాబులు పాకిస్థాన్‌కు వెళ్లడంతో వాళ్ళు వదిలేసిన భూమి, పెద్ద పెద్ద ప్యాలెస్‌లు ప్రభుత్వపరమయ్యాయి. భాషా రాష్ట్రాలు ఏర్పడ్డ తర్వాత ఏ ప్రభుత్వరంగ సంస్థకైనా భూమి ఏ రాష్ట్రం వారు ఇస్తారూ అంటే ఆంధ్రప్రదేశ్ ముందువరుసలో ఉండేది. అందుకే హైదరాబాద్‌లో ఎన్నో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు వెలిసాయి. మొదట్లో ప్రభుత్వ భూమి హైదరాబాద్ నగర అభివృద్ధిలో కీలకమైన పాత్ర నిర్వహించింది.

పంతొమ్మిది వందల ఎనభై, తొంభైలలో ఆర్థిక సంస్కరణల ముద్దు పేరుతో అభివృద్ధి దిశ పూర్తిగా మారింది. ప్రైవేటీకరణ, సరళీకరణ, ప్రపంచీకరణ ప్రభంజనం వీచడంతో, అంతకాలంగా ప్రభుత్వ భూమి అంటే ప్రజల భూమి అనే ప్రజాస్వామ్య భావన క్రమక్రమంగా క్షీణించి పాలకుల ఆలోచనని, అవగాహనను ఆక్రమించుకున్నది. ప్రభుత్వ భూములను ప్రైవేటు వ్యక్తులు నయానా, భయానా ఆక్రమించుకొనడం హైదరాబాద్ నగర స్వరూప స్వభావాలను, రూపురేఖలను మార్చివేసింది. భూదాహం విపరీతంగా పెరిగింది.

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమ కాలంలో ఎన్నో నినాదాలు వచ్చినా 'ప్రభుత్వ భూమి అంటే ప్రజల భూమి' ఒక నినాదంగా మారలేదు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమ కాలంలో కేసీఆర్‌తో సహా టీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు తమ పదవులకు రాజీనామా చేయడంతో హైదరాబాద్ విశ్వవిద్యాలయ విద్యార్థులు వారికి అభినందన సభ నిర్వహించారు. ఆ సభలో కేసీఆర్, జయశంకర్, నేను ముగ్గురమే ప్రసంగించాం. ఈ ప్రసంగంలో, తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో జోక్యం చేసుకోవద్దని, దీనిని హైదరాబాద్ ఉమ్మడి సంస్కృతిలో భాగంగా భావించాలని కోరినపుడు కేసీఆర్ స్పందిస్తూ, విశ్వవిద్యాలయ ప్రతిపత్తిని కాపాడుతామని హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు ఆయన ప్రభుత్వం ఎప్పుడూ జోక్యం చేసుకోలేదు. ఒక సందర్భంలో కేటీఆర్ హైదరాబాద్ విశ్వవిద్యాలయానికి అంత భూమి ఎందుకు అని అడిగితే, "మీరు విదేశాలలో కూడా ఉన్నారు కదా. స్టాన్‌ఫర్డ్ విశ్వవిద్యాలయానికి ఎనిమిదివేల ఎకరాల భూమి ఉంది. హార్వర్డ్ విశ్వవిద్యాలయానికి ఐదువేల ఎకరాలు ఉంది. విశ్వవిద్యాలయం అంటే కేవలం భవనాలే కాదు, విద్యార్థులు నిరంతరంగా ప్రకృతిలో జీవించడం వల్ల వాళ్ళ ప్రాపంచిక దృక్పథం పరిధి పెరుగుతుంది. ప్రకృతి సంపద పిల్లల సంతోషానికి కూడా దోహదపడుతుంది," అని చెప్పవలసి వచ్చింది.

ఈ విశ్వవిద్యాలయ భూమిలో కొంతభాగం కొన్ని ప్రభుత్వ సంస్థలకు ఇచ్చారు. ఆ రోజుల్లో బస్సు సౌకర్యం లేకపోవడం వలన రోడ్డు రవాణా సంస్థకి కొంత భూమి ఇస్తే బస్సు సౌకర్యం మెరుగుపడుతుందని భావించాం. చంద్రబాబునాయుడు రంగారెడ్డి జిల్లా హెడ్‌క్వార్టర్స్‌కు కొంత భూమి కావాలంటే ఇచ్చిన భూమిలో పూర్తి నిర్మాణం జరిగాక అది ట్రిపుల్ ఐటీ (IIIT)కి ఇచ్చారు. ఏ సంస్థకు ఇచ్చినా ప్రజాప్రయోజనానికి మాత్రమే ఇచ్చారు.

ఒక దశలో ఉర్దూ యూనివర్సిటీకి భూమి కావాలని అప్పటి కేంద్ర విద్యామంత్రి బొమ్మయ్, సెక్రటరీ వైద్యనాథ్ అయ్యర్ ఇద్దరూ స్వయానా విశ్వవిద్యాలయానికి వచ్చి అడిగారు. అప్పటి వీసీ ప్రొ. గోవర్ధన్ మెహతాతో సహా అధ్యాపకులు భూమి ఇవ్వడానికి అంగీకరించలేదు. ప్రొ. మెహతా ఒక అరగంట పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ చేసి హైదరాబాద్ నగరం పర్యావరణ రీత్యా బాగా దెబ్బతిన్నదని, ఈ భూమి పట్టణానికి ఊపిరితిత్తుల్లా (Lung Space) పనిచేస్తున్నదని, ఇది ఇలా లేకపోతే పర్యావరణం దెబ్బతింటుందని చెప్తే మంత్రి బొమ్మయ్, మీకు అంత అభ్యంతరం ఉంటే, మేము వేరే స్థలం చూస్తామని వెళ్ళిపోయారు. ఇదీ ఒక విశ్వవిద్యాలయాన్ని గౌరవించే తాత్వికత, సంస్కారం ఉన్న రాజకీయ నాయకుడి స్పందన.

హైదరాబాద్ విశ్వవిద్యాలయం పరిధిలో ఉన్న భూమిని రిజిస్ట్రేషన్ చేసుకోకపోవడం అన్న ఒక్క లోపం వల్ల న్యాయవ్యవస్థ కూడా అది ప్రభుత్వ భూమే అనే జడ్జిమెంట్ ఇవ్వవచ్చు. భూమి నిజానికి ప్రజలది. విశ్వవిద్యాలయం ప్రజలది. ఈ విశ్వవిద్యాలయం విద్యార్థులు చాలామంది ఐఏఎస్ అధికారులుగా, ఇద్దరు మంత్రివర్గ సభ్యులుగా ఉన్నారు. ఇక్కడి విద్యార్థులు దేశవిదేశాల్లో ఉన్నారు. విశ్వవిద్యాలయానికి అత్యంత ప్రతిష్ఠ ఉంది. ఇంతకన్నా ఏ సంస్థ ఐనా సమాజానికి ఏం ఇవ్వగలదు? అయినా ప్రకృతి సంపదను బజారులో పెట్టి అమ్మడం ఎలాంటి భవిష్యత్తును సూచిస్తున్నది? ప్రజా ప్రభుత్వాలకి చారిత్రక స్పృహ లేకపోవడం చాలా ప్రమాదం.

విశ్వవిద్యాలయం భూమిని ప్రభుత్వ భూమి అని వెనక్కు తీసుకోవడం చూస్తే ఒక సంఘటన గుర్తుకు వస్తున్నది. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల ముందు పాలమూరు అధ్యయన వేదిక ఆ జిల్లాకు కృష్ణా నీళ్ల కేటాయింపులో న్యాయమైన వాటా రాలేదని ముప్పై గంటల నిరాహార దీక్ష శిబిరాన్ని నిర్వహించింది. ఒక గ్రామీణ పేద మహిళ ఆ శిబిరం దగ్గర నిలబడి ఆసక్తిగా ప్రసంగాలు వింటుంటే, ఆమెను కూడా మాట్లాడమని నిర్వాహకులు ప్రోత్సహించారు. ఆమె మాట్లాడుతూ ఇందిరాగాంధీ తనకు రెండు ఎకరాల భూమి ఇస్తే కష్టపడి తన పిల్లలను చదివించాననీ, కాని పిల్లలకి ఉద్యోగాలు రాలేదు సరికదా టీఆర్ఎస్ ప్రభుత్వం ధరణి పేర ఆ భూమి ప్రభుత్వ భూమి అని బలవంతంగా వెనక్కి తీసుకున్నదని తెలిపింది. తానిప్పుడు మహబూబ్ నగర్ పట్టణంలో పనిమనిషిగా మారానని తనకు మళ్ళీ ఇందిరమ్మ రాజ్యమే కావాలని ఆవేశంగా మాట్లాడింది. హైదరాబాదు విశ్వవిద్యాలయ భూమి కూడా ఈ సంఘటనకు చాలా దగ్గరగా ఉన్నది. ఇందిరాగాంధీ వ్యక్తిగతంగా చొరవ తీసుకొని ఇప్పించిన భూమిని ఇందిరమ్మ రాజ్యమే వెనక్కు తీసుకోవడాన్ని మనం ఎలా అర్థం చేసుకోవాలి?



• ప్రొ. జి. హరగోపాల్

హైదరాబాద్ విశ్వవిద్యాలయం పరిధిలో ఉన్న భూమిని రిజిస్ట్రేషన్ చేసుకోకపోవడం అన్న ఒక్క లోపం వల్ల న్యాయవ్యవస్థ కూడా అది ప్రభుత్వ భూమే అనే జడ్జిమెంట్ ఇవ్వవచ్చు. ఆ భూమి నిజానికి ప్రజలది. విశ్వవిద్యాలయం ప్రజలది. ప్రజాప్రభుత్వాలకి చారిత్రక స్పృహ లేకపోవడం ప్రమాదం. ఇందిరాగాంధీ వ్యక్తిగతంగా చొరవ తీసుకొని ఇప్పించిన భూమిని ఇందిరమ్మ రాజ్యమే వెనక్కు తీసుకోవడాన్ని మనం ఎలా అర్థం చేసుకోవాలి?

నల్లబంగారానికి రాజకీయ రంగు!

తెలంగాణలో కొంగు బంగారం సింగరేణి. కానీ నేడు నల్లబంగారాన్ని ఉత్పత్తి చేసే ఈ సింగరేణి సంస్థ భవిష్యత్తుపై సర్వత్రా చర్చ జరుగుతున్నది. నాడు లక్షా 16 వేల మంది కార్మికులతో కళకళలాడిన ఈ ప్రాంతం నేడు కార్మికుల సంఖ్య తగ్గించడంతో ప్రాభవం కోల్పోయింది. భవిష్యత్తు తరాలకోసం ఆలోచించకుండా నాటి కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాల నిర్లక్ష్యంతో ఈ పరిస్థితి వచ్చింది.

90వ దశకంలో నూతన పారిశ్రామిక ఆర్థిక విధానాలు అమలు చేయడం వలన సింగరేణి కంపెనీ సిక్ ఇండస్ట్రీ జాబితాలోకి వెళ్లింది. సింగరేణిని ఆదుకోవాలని నాటి బీజేపీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి రూ.650కోట్ల మారటోరియం ప్రకటించారు. దీనికి తోడు కార్మికులు ఉద్యోగులు, అధికారులు, యూనియన్ నాయకులు సింగరేణికి జవసత్వాలు అందించి నష్టాల్లో ఉన్న సంస్థను లాభాల్లోకి తీసుకురావడమే కాకుండా రెండు దశాబ్దాలుగా బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధిస్తున్నారు.

2020జూన్‌లో మోదీ తొలిసారి పారదర్శక బొగ్గుగనుల కమర్షియల్ వేలాన్ని ప్రారంభించారు. నాటి నుండి 11 విడతలుగా బొగ్గు మంత్రిత్వ శాఖ ఈ వేలాన్ని నిర్వహిస్తున్నది. కానీ సింగరేణి కంపెనీ ఆ బొగ్గు బ్లాకుల వేలంలో రాజకీయ ఒత్తిడుల వల్ల పాల్గొనడం లేదు. ఈ పరిస్థితికి కారణం నువ్వంటే నువ్వంటూ బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు పరస్పర ఆరోపణలు చేసుకుంటున్నాయి. కానీ తమ వల్ల సింగరేణికి జరిగిన నష్టంపై నోరెత్తడం లేదు.



కానీ తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం వచ్చిన తరువాత కోల్‌బెల్ట్ ప్రాంతం ఒక రాజకీయ అవకాశంగా మారింది. ఓపెన్ కాస్ట్ మైనింగ్‌లను వ్యతిరేకించి, అవసరమయితే కుర్చీ వేసుకుని ఓపెన్ కాస్ట్‌లను తగ్గిస్తానని చెప్పిన బీఆర్ఎస్ పార్టీ ఏకంగా 17 ఓపెన్ కాస్ట్ గనులను తీసుకువచ్చింది. ప్రైవేటీకరణను అడ్డుకుంటామని చెప్పిన రాజకీయ పార్టీల హామీలన్నీ పక్కనే ఉన్న గోదారి పాలయ్యాయి. ఇప్పుడు సంస్థలో 30 వేల మందికి పైగా కాంట్రాక్టు కార్మికులున్నారు. ఆనాడు ఒక లక్షా 16వేల మంది ఉన్న పర్మినెంట్ కార్మికుల సంఖ్య నేడు 39వేలకు పడిపోయింది. ఈ మార్చి 31 నాటికి మరో రెండు వేల మంది పదవీ విరమణ కానున్నారు. ఈ పరిస్థితికి కారణం నువ్వంటే నువ్వంటూ బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు పరస్పర ఆరోపణలు చేసుకుంటున్నాయి. కానీ తమ వల్ల సింగరేణికి జరిగిన నష్టంపై నోరెత్తడం లేదు.

ఒకవైపు దేశవ్యాప్తంగా బొగ్గుకు డిమాండ్ పెరిగిపోతున్న దశలో ఉత్పత్తిని పెంచాల్సిన అవసరం ఉంది. ఉత్పత్తి పెరగాలంటే కొత్త బొగ్గు గనులను దక్కించుకోవాల్సిన ఆవశ్యకత ఉంది. సింగరేణి కార్మిక సంఘం ఎన్నికల సమయంలో 10 అండర్‌గ్రౌండ్ బొగ్గు గనులకు అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ శ్రీరాంపూర్‌లో జరిగిన సభలో వేదిక పక్కనే శంకుస్థాపన చేశారు. ఇప్పటికీ ఆ శిలాఫలకాలు భద్రంగా ఉన్నాయి. కానీ ఒక్క అండర్‌గ్రౌండ్ బొగ్గు గని కూడా ప్రారంభం కాలేదు. అవి గనక ప్రారంభమై ఉంటే సుమారు 30వేల మందికి ఉద్యోగాలు వచ్చేవి.

ఇలా ఉండగా అప్పటి యూపీఏ-1, యూపీఏ-2 హయాంలో జరిగిన బొగ్గు కుంభకోణం వల్ల ప్రత్యక్షంగా లక్షా రూ.80వేల కోట్లు, పరోక్షంగా రూ.10లక్షల కోట్ల మేర నష్టం జరిగినట్లు కాగ్ రిపోర్ట్ తెలిపింది. సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని అవకతవకలు జరిగిన బొగ్గు బ్లాకులను రద్దుచేసి పారదర్శక వేలానికి ఆదేశించింది. ఈ మేరకు అన్ని పక్షాలను సంప్రదించి ప్రధాని నరేంద్ర మోదీ కొత్త చట్టాన్ని తీసుకువచ్చారు. 2020జూన్‌లో మోదీ తొలిసారి పారదర్శక బొగ్గుగనుల కమర్షియల్ వేలాన్ని ప్రారంభించారు. నాటి నుండి 11 విడతలుగా బొగ్గు మంత్రిత్వ శాఖ ఈ వేలాన్ని నిర్వహిస్తున్నది. కానీ సింగరేణి కంపెనీ ఆ బొగ్గు బ్లాకుల వేలంలో రాజకీయ ఒత్తిడుల వల్ల పాల్గొనడం లేదు. బీఆర్ఎస్ హయాంలో నూతన చట్టానికి అనుగుణంగా ఒరిస్సా రాష్ట్రంలోని నైనీ బ్లాక్‌ను తీసుకున్నారు. అదేవిధంగా తాడిచర్ల ఓపెన్ కాస్ట్ మైన్‌ను సింగరేణి, జెన్ కో నుండి తప్పించి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రైవేటు సంస్థకు అప్పగించి తెలంగాణలోని బొగ్గు బ్లాకుల వేలంలో పాల్గొనకుండా మా బ్లాకులు మా రాష్ట్రానికే ఇవ్వాలని వితండ రాజకీయాలు చేసింది. కొత్త చట్టానికి పార్లమెంట్‌లో అప్పటి బీఆర్ఎస్ ఎంపీలు మద్దతు పలికి చట్టానికి అనుకూలంగా ఓటువేసి అదే చట్ట ప్రకారం బొగ్గు బ్లాకుల వేలంలో పాల్గొనలేదు. ఫలితంగా ఐదేళ్ల కాలం గడిచిపోయింది. ప్రస్తుతం సింగరేణి చేతిలో బొగ్గు గనులు తగ్గడంతో కార్మికులు కూడా తగ్గుతున్నారు.

ఈ దశలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలి. తెలంగాణలో బొగ్గు గనుల వేలానికి నిబంధన ప్రకారం దరఖాస్తు చేసుకోమని పలుమార్లు కేంద్ర బొగ్గుగనుల శాఖా మంత్రి కిషన్‌రెడ్డి కోరినా ప్రభుత్వం పట్టించుకోలేదు. మరోవైపు కోల్‌బెల్ట్ ప్రాంత బీజేపీ నేతలతో కలిసి హోంశాఖా సహాయ మంత్రి బండి సంజయ్ కూడా బొగ్గు గనుల శాఖా మంత్రిని కలిసిన సందర్భంలో వేలంలో పాల్గొంటే సింగిల్ టెండర్‌గా తెలంగాణకే కేటాయిస్తామని చెప్పినా కూడా టెండర్ ఫారాన్ని తీసుకున్న నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం అవినీతి, ఓటుబ్యాంకు రాజకీయాల కోసం బిడ్డింగ్‌లో పాల్గొనలేదు. దీంతో కోల్‌బెల్ట్ ప్రాంత కార్మికులకు, సింగరేణి సంస్థకు అన్యాయం జరిగింది.

కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాజకీయాలకు అతీతంగా ముందుకు సాగుతున్నామని, భవిష్యత్తులో తెలంగాణ ట్రిలియన్ డాలర్ల ఆర్థిక సంపదతో దేశంలో ముందుంటామని చెబుతూనే, ఢిల్లీలో ఇటీవల పత్రికా కాంక్లేవ్‌లో విలేకరులు అడిగిన ప్రశ్నకు ఉచితాల వలన రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాలేదనీ, కనీస మౌలిక వసతులు కూడా కల్పించలేకపోతున్నామనీ, ఆరు గ్యారంటీల అమలు చేయలేమనీ చెప్పకనే చెప్పారు. ఈ స్థితిలో ఆర్థిక వనరులు పెంచుకోవాల్సిన అవసరాన్ని ముఖ్యమంత్రి గుర్తించాలి. తెలంగాణకు ప్రధాన ఆదాయవనరు అయిన సింగరేణి ప్రభుత్వానికి ఆర్థిక పరిపుష్టిని అందించడంలో అగ్రభాగాన ఉంటుంది. అలాంటి సింగరేణిని కాపాడుతూ కార్మికుల సంఖ్యను పెంచడం ద్వారా కోల్‌బెల్ట్ ప్రాంతాన్ని కాపాడవచ్చు. సింగరేణి సంస్థ ద్వారా ప్రభుత్వం బొగ్గు బ్లాకుల వేలంలో పాల్గొని బ్లాకులను దక్కించుకోవాలి. భవిష్యత్తులో కొత్త బ్లాక్‌లలో ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయం ద్వారా ఆయా బొగ్గుగనులలో స్థానికులకే ఉద్యోగాలు కల్పించడంతో పాటు డిపెండెంట్ ఉద్యోగాలు కల్పించి కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలి. ఇంధన రంగంలో 2047కల్లా స్వతంత్రంగా అభివృద్ధి సాధించాలన్న ప్రధానమంత్రి మోదీ ఆకాంక్షల మేరకు 'బొగ్గు రంగంలో ఆత్మనిర్భర్‌లో భాగంగానే బొగ్గు బ్లాకులు వేలం జరుగుతున్నది.

▪ ఎస్. కుమార్
జాతీయ కార్యదర్శి, బీజేపీ ఎస్సీ మోర్చా

స్ఫూర్తి ప్రదాత..

నీ స్థైర్యానికి నిలువెల్లా వందనం
నీ తెగువ స్ఫూర్తి చందనం
ఓ సునీతా విలియమ్స్
భూమ్మీద నీ పాద ముద్రలు మోపి
స్ఫూర్తి వచనమై వర్ధిల్లు
దీప్తి వాక్కువై నినదించు

నీ స్పేస్ వాక్ ఘనత
అబ్బుర పడుతుంది జనత
అంతరిక్ష వ్యోమగామి
అందుకోవమ్మా.. ఆత్మీయ సెల్యూట్

సంక్షుభిత సమయాన
నీ స్థితప్రజ్ఞత స్థిర విజ్ఞత
అనన్యం అమేయం అమోఘం
జయహో విలియమ్స్ జయహో
మానవ సంకల్ప శక్తికి
మణిహారం తొడిగిన సునీతా....
బ్రహ్మరథం పడుతుంది నీకు భవిత...

నీ పట్టుదల మాకు అమరం
చరిత్ర పుటల్లో నువ్వు కీర్తి శిఖరం
ఓ శాస్త్రీయ పరిశోధనా విధాతా
రాబోవు తరాలకు స్ఫూర్తి ప్రదాతా
జయహో.. సునీతా జయహో..!

– డా.కటుకోఝ్వల రమేష్

విశ్వ సోదరి సునీత

నవ మాసాల మాతృగర్భంలా
అంతరిక్షంలో అలుపెరగక
శ్వాస కోశంతో పోరాటం
తొమ్మినెలల అకుంఠిత దీక్ష
విశ్వానికి ఆత్మవిశ్వాసం అందిస్తూ
అంతరిక్ష శాస్త్రానికి ఆభరణమై
ఆత్మవిశ్వాసానికి కొత్త నిర్వచనం
సునీతా విలియమ్స్ రాకతో
పుడమి పునీతం.
నిన్ను సూర్యుణ్ణి చూసినట్టు
తలెత్తుకొని చూస్తున్నామమ్మా!

– ఈతకోట సుబ్బారావు





నీటి పారుదలకు పెద్దపీట

నీటిపారుదల రంగానికి పెద్దపీట వేస్తూనే.. నగరాభివృద్ధికి కూడా భారీ మొత్తంలో నిధులను కేటాయించింది రాష్ట్ర ప్రభుత్వం. ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క బుధవారం శాసన సభలో ప్రవేశపెట్టిన 2025-26 వార్షిక బడ్జెట్‌లో ఉమ్మడి ఓరుగల్లు పరిధిలోని కాళేశ్వరం, దేవాదుల సహా పలు ప్రాజెక్టులు, సరస్సులు, వాగుల అభివృద్ధికి రూ.4,028.59కోట్లు కేటాయించారు. అలాగే వరంగల్‌ను ఎడ్యుకేషన్, హెల్త్, ఐటీ హబ్‌గా అభివృద్ధి చేయడంతో పాటు టు టైర్ సిటీగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోనున్నట్టు ప్రకటించారు. వీటితో పాటు ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు, నియోజకవర్గాల్లో నైపుణ్య కేంద్రాలు, ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల ఏర్పాటు లాంటి అంశాలను ప్రస్తావించారు. అలాగే ప్రజా సంక్షేమంలో భాగంగా యువతకు రాజీవ్ యువవికాసం, అన్నదాతలకు రైతుభరోసా పథకాలకు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు, చేనేతలకు లబ్ధి చేకూరేలా పలు పథకాలకు నిధుల కేటాయింపు జరపడం పట్ల ఆయా వర్గాల వారు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. ఇక అంగన్వాడీ పోస్టుల భర్తీకి ప్రకటన చేసిన నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో ఖాళీగా ఉన్న 435 కార్యకర్తలు, 400 ఆయాల పోస్టులు భర్తీ అవుతాయన్న ఆశలు చిగురించాయి.


- హనుమకొండ, ఆంధ్రజ్యోతి

- ఉమ్మడి జిల్లాలోని ఇతర ప్రాజెక్టులకు రూ.1,343.59కోట్లు
- పలు రంగాలకు రూ.495.93కోట్లు
- నగర సమగ్రాభివృద్ధి దిశగా మరిన్ని అడుగులు
- భూగర్భ డ్రెయినేజీకి పెద్దమొత్తంలో నిధులు సమకూరే అవకాశం
- ప్రతీ నియోజకవర్గానికి నాలెడ్జ్ సెంటర్, ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు
- భర్తీకానున్న అంగన్వాడీ టీచర్ల పోస్టులు
- యువ వికాసం కింద 92వేల మందికి లబ్ధి!
- హైదరాబాద్-వరంగల్ మధ్య ఇండస్ట్రియల్ కారిడార్
- విద్య, వైద్య, ఐటీ హబ్‌గా వరంగల్



రాష్ట్ర బడ్జెట్‌లో ఓరుగల్లుకు భారీగా నిధుల కేటాయింపు

భట్టి విక్రమార్క పద్దులో కాళేశ్వరం నిర్వహణకు రూ.2685కోట్లు



రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని కాళేశ్వరం, దేవాదుల సహా పలు ప్రధాన నీటిపారుదల ప్రాజెక్టులు, సరస్సులు, వాగుల అభివృద్ధికి పెద్ద మొత్తంలో నిధులు కేటాయించింది. మొత్తం రూ.4028.59 కోట్లు ఇస్తున్నట్టు ప్రకటించగా.. ఇందులో సింహభాగం కాళేశ్వరం ఎత్తిపోతలకు రూ. 2,685కోట్లు ఇచ్చింది. జె చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్వహణ, మరమ్మతులకు రూ.77.43కోట్లు, పరివాహక ప్రాంతాభివృద్ధి పథకం కింద దేవాదులకు రూ.307 కోట్లు, ఏఐబీపీ కింద రూ.435కోట్లు, రామప్ప సరస్సుకు రూ.2కోట్లు, లక్నవరానికి రూ.2కోట్లు, గుండ్లవాగుకు రూ.10కోట్లు, వరద నీటి ప్రాజెక్టుకు రూ.38.37కోట్లు, పాకాల సరస్సు నిర్వ హణ, అభివృద్ధికి రూ.33.39కోట్లు కేటాయించారు. కాగా కంతనపల్లి ప్రాజెక్టుకు రూ.283.9కోట్లు, రామప్ప సరస్సు నిర్వహణ, సుందరీ కరణకు రూ.20 కోట్లు, ములుగులోని పాలెంవాగుకు రూ.35కోట్లు,

మిగతా 7వ పేజీలో...

ఉమ్మడి జిల్లాలోని ప్రాజెక్టులకు బడ్జెట్‌లో కేటాయింపులు జరిగాయిలా..

- కాళేశ్వరం ఎత్తిపోతలకు రూ.2,685కోట్లు
- దేవాదుల : రూ.77.43 కోట్లు
- దేవాదుల (కాడా కింద) : రూ. 307 కోట్లు.
- దేవాదుల (ఏఐబీపీ) : రూ. 435 కోట్లు.
- రామప్ప సరస్సు : రూ.22కోట్లు
- లక్నవరం : రూ.2కోట్లు
- గుండ్లవాగు : రూ.10కోట్లు
- వరదనీటి ప్రాజెక్టు : రూ.38.37కోట్లు
- పాకాల : రూ.33.39కోట్లు
- కంతనపల్లి : రూ.283.9కోట్లు.
- ములుగు పాలెంవాగు : రూ. 35 కోట్లు.
- వాజేడు మోడికుంట వాగు : రూ.99.50 కోట్లు.
- మొత్తం : రూ.4,028.59కోట్లు

ఇతర రంగాలకు ఇలా..

- కాళేశ్వరం టూరిజం సర్క్యూట్‌కు : రూ.10కోట్లు.
- కాకతీయ విశ్వవిద్యాలయానికి : రూ. 50 కోట్లు.
- వరంగల్, కరీంనగర్ జిల్లాలకు కలిపి అభివృద్ధి కోసం : రూ.41కోట్లు.
- కాళోజీ నారాయణ రావు హెల్త్ యూనివర్సిటీకి : రూ. 20కోట్లు.
- వరంగల్ మహానగర పాలక సంస్థకు : రూ. 50 కోట్లు.
- వరంగల్ స్మార్ట్ సిటీ పథకం కింద : రూ.170.09 కోట్లు.
- అమృత్ పథకం కింద : రూ.154.84కోట్లు
- మొత్తం : రూ.495.93 కోట్లు

వీటితో పాటు వరంగల్ మహానగర అభివృద్ధిలో భాగంగా ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న భూగర్భ డ్రెయినేజీ వ్యవస్థ నిర్మాణానికి రూ.4,170కోట్లు అంచనా వ్యయం కాగా, అందులో తొలివిడతగా ఈ బడ్జెట్ నుంచి రూ.2500కోట్లు వచ్చే అవకాశం ఉంది.

కేసీఆర్ హయాంలోనే దేవాదులకు జీవం

- 95 శాతం మూడో దశ పనులు పూర్తి చేశాం
- 15 నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం
- బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పెద్ది సుదర్శన్‌రెడ్డి

హనుమకొండ టౌన్, మార్చి 19: దేవాదుల ప్రాజెక్టుకు మాజీ సీఎం కేసీఆర్ ప్రభుత్వమే జీవం పోసిందని బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ది సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. దేవాదుల ప్రాజెక్టు మూడో దశ పనులు 95 శాతం బీఆర్ఎస్ హయాంలోనే పూర్తిచేశామని తెలిపారు. ఈ 15 నెలల్లో సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని అన్నారు. యేడాది కిందటే ప్రాజెక్టు పనులపై దృష్టి పెడితే రైతుల పంటలకు సాగునీరు అందేదని అన్నారు. 20శాతం కమీషన్ ఇవ్వనందుకు కాంట్రాక్టర్లకు బిల్లులు విడుదల చేయని మంత్రులు రైతుల గురించి, సాగునీటి ప్రాజెక్టుల గురించి మాట్లాడడం సిగ్గుచేటని దుయ్యబట్టారు. త్వరలో దేవాదుల పంప్‌హౌస్‌ను సందర్శిస్తామని తెలిపారు. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్న మంత్రులకు ప్రజల చేతుల్లో గుణపాఠం తప్పదని హెచ్చరించారు. సాగునీళ్లు అందించలేక సుమారు 60వేల ఎకరాల పంటలు ఎండిపోయాయని, దీనికి కారణం కాంగ్రెస్ ప్రభుత్వమేనని దుయ్యబట్టారు. రాష్ట్రంలో నీటి ఎద్దడికి కేసీఆరే కారణమని మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించడం మానుకోవాలన్నారు. సమ్మక్క సాగర్ బ్యారేజీ నిండా నీరున్నా పంటలు ఎండిపోవడానికి కారణం మంత్రులకు విషయ పరిజ్ఞానం, చిత్తశుద్ధి లేకపోవడమేనన్నారు. గతంలో బీఆర్ఎస్ పార్టీలో కేసీఆర్ పక్కన ఉండి ఉప ముఖ్యమంత్రిగా పనిచేసిన కడియం శ్రీహరి.. పార్టీలు మారడంపై దృష్టి పెట్టి ప్రాజెక్టులను విస్మరించడంతో ఈ దుస్థితి ఏర్పడిందన్నారు. కాంగ్రెస్ నాయకులు పర్సంటేజీల కోసం కక్కుర్తిపడి ప్రాజెక్టుల నిర్వహణపై శ్రద్ధ పెట్టకపోవడంతో వరంగల్ ఉమ్మడి జిల్లాకు కరువు వచ్చిందన్నారు. పంటలు ఎండి పోయిన రైతులకు ఎకరానికి రూ.20వేలు నష్టపరిహారం అదించాలని పెద్ది డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ తాళ్లపెల్లి జనార్ధన్‌గౌడ్, కో ఆర్డినేటర్ పులి రజినీకాంత్, మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్, సీనియర్ నాయకులు సల్వాజి రవీందర్‌రావు, నయీమొద్దీన్, బండి రజినీకుమార్, చాగంటి రమేష్, పోలపెల్లి రాంమూర్తి, ఖలీల్, శ్రీకాంతాచారి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

చర్చా.. రచ్చా..?!

- నేడు బల్దియా బడ్జెట్ సమావేశం
- 2025- 26 బడ్జెట్ ప్రకటన
- ఈయేడు 40 శాతం రెట్టింపు ఉండే అవకాశం



వరంగల్ కార్పొరేషన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ బడ్జెట్ సమావేశం గురువారం బల్దియా కార్యాలయంలో జరుగనుంది. వార్షిక మిగులు నిధులతో పాటు ఈ యేడు బడ్జెట్ ప్రకటన చేయనున్నట్లు బల్దియా సెక్రెటరీ అలివేలు వెల్లడించారు. అయితే 2025-26 బడ్జెట్ సమావేశం జరుగుతుందా? లేక వాయిదా పడుతుందా? అనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. మేయర్ సుధారాణి తీరుపై అసంతృప్తితో ఉన్న కొందరు కార్పొరేటర్లు సమావేశం సాగేందుకు సహకరిస్తారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల గ్రేటర్ పరిధిలోని 66 డివిజన్‌ల కార్పొరేటర్లకు ప్రత్యేక నిధుల నుంచి అభివృద్ధి కోసం డివిజన్‌కు రూ.30లక్షల చొప్పున ప్రకటించారు. అయితే ఇప్పటికీ ఆ నిధులు విడుదల చేయక పోవడం, టెండర్లు పిలువక పోవడం, ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టకపోవడంపై కొందరు కార్పొరేటర్లు గుర్రుగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో వారు సమావేశాన్ని అడ్డుకుంటామని చర్చించుకుంటున్నట్లు సమాచారం.

కౌన్సిల్ హాలులో..

బల్దియా కౌన్సిల్ హాల్ వేదికగా గురువారం ఉదయం 11 గంటలకు బడ్జెట్ సమావేశం జరుగనుంది. 2025-26 సంవత్సరాల ఆధారంగా అంచనాలను రూపకల్పన చేసి కౌన్సిల్ సమావేశం ముందుకు తెచ్చి బడ్జెట్‌ను ప్రకటిస్తారు. మేయర్ గుండు సుధారాణి అధ్యక్షతన ఈ బడ్జెట్ రూపకల్పన ముసాయిదాను వెల్లడిస్తారని బల్దియా అధికారులు వెల్లడించారు. ఈ సమావేశంలో 1/3 కోరం సభ్యులు హాజరైన తర్వాత బల్దియా అకౌంట్స్ అధికారి సరిత బడ్జెట్ అంచనాలను వెల్లడించనున్నారు. మెజారిటీ సభ్యుల ఆమోదం మేరకు బడ్జెట్ ప్రకటన జరుగుతుంది.

రూ.1,071.48 కోట్ల బడ్జెట్?

హైదరాబాద్ తర్వాత రెండో అతి పెద్ద నగరంగా వరంగల్ నగరం గుర్తింపు పొందడంతో ఇక్కడి అధికారులు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఈ యేడు సుమారు రూ.1500కోట్లు అవసరం ఉన్నట్టు అంచనాలు రూపొందించి ప్రతిపాదనలు పంపించారు. దీంతో రాష్ట్ర పురపాలక అభివృద్ధి శాఖ అభివృద్ధి, విపత్తు, ప్రత్యేక పరిస్థితుల అవసరాల నిమిత్తం వివిధ గ్రాంట్ల ద్వారా రూ.800కోట్లు విడుదల చేయనున్నట్టు తెలిసింది. పన్నుల రూపంలో రూ.200కోట్లు వసూలయ్యే నిధులతో వ్యయం, ఖర్చులతో పాటు 2025-26 బడ్జెట్‌ను రూ.1,071.48కోట్ల బడ్జెట్‌ను ప్రకటించేందుకు రంగం సిద్ధం చేసినట్టు విశ్వసనీయ సమాచారం. కిందటేడుకంటే ఈ యేడు 40 శాతం బడ్జెట్ వృద్ధి చెందినట్టు అధికారులు వెల్లడించారు. ఈ బడ్జెట్ నిధులతో నగరంలో మిగిలి ఉన్న పనులతో పాటు మరిన్ని అభివృద్ధి పనులకు టెండర్లు పిలిచి నిధులు ఖర్చు చేస్తారు.

కిందటేడు కంటే 40శాతం రెట్టింపు

గత యేడాది బల్దియా బడ్జెట్ కంటే ఈ యేడాది 40శాతం రెట్టింపుగా ఉండొచ్చనే ప్రచారం జరుగుతోంది. 2024-25బల్దియా బడ్జెట్ రూ.650.12 కోట్ల అంచనాలతో రూపొందించినా.. అనుకున్న మేరకు అధికారులు సక్సెస్ కాలేకపోయారనే విమర్శలు వస్తున్నాయి. పలు డివిజన్ లలో రోడ్లు, డ్రైనేజీలు, కమ్యూనిటీ హాళ్లు, స్మశాన వాటికలు నిర్మాణం జరిగినా బిల్లులు చెల్లించడం లో అధికారులు దృష్టి సారించలేకపోయారు. దీం తో ప్రకటించిన రూ.650.12కోట్లకు ఇప్పటివరకు ప్రభుత్వతోపాటు బల్దియా సొంత ఆదాయం నుంచి రూ.306 కోట్లు మాత్రమే మంజూరైనట్లు తెలిసింది.

వర్గీకరణ, బీసీ బిల్లుల చట్టబద్ధతపై సంబురాలు

- కాంగ్రెస్ భవన్‌లో ఆనందోత్సాహాలు
- రేవంత్, భట్టి చిత్రపటాలకు క్షీరాభిషేకం



డీసీసీ భవన్ వద్ద ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

హనుమకొండ సిటీ, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ, బీసీల రిజర్వేషన్ బిల్లులకు చట్టబద్ధత కల్పించడంపై హనుమకొండ జిల్లా కాంగ్రెస్ నేతలు సంబురాలు జరిపారు. బుధవారం హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఎస్‌సీ, బీసీ సెల్ కాంగ్రెస్ నేతలు వేరు వేరుగా సంబురాలు జరిపారు. మిఠాయిలు పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆదేశాల మేరకు వేడుకలు నిర్వహించినట్లు నేతలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్సీ సెల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు డాక్టర్ పెరుమాండ్ల రామక్రిష్ణ మాట్లాడుతూ.. ఎస్‌సీ వర్గీకరణ బిల్లుకు అసెంబ్లీలో చట్టబద్ధత కల్పించడం చారిత్రాత్మకమని పేర్కొన్నారు. వర్గీకరణ కోసం మూడు దశాబ్దాల సుదీర్ఘ పోరాటం జరిగిందన్నారు. వర్గీకరణపై అత్యున్నత న్యాయస్థానం తీర్పు వెలువడిన వెంటనే ముఖ్యమంత్రి స్పందించి రాష్ట్రంలో అమల్లోకి తెస్తామన్నారు. ఆ మేరకు రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రణధీర్, మేరీ, సుధాకర్ తదితర నాయకులు పాల్గొన్నారు. కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా చైర్మన్ బొమ్మతి విక్రమ్ మాట్లాడుతూ.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ బిల్లు తీసుకురావడంలో ముఖ్యమంత్రి చొరవ ప్రశంసనీయమని కొనియాడారు. బీసీల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. అన్ని వర్గాలకు న్యాయం జరిగేలా కాంగ్రెస్ పాలన ఉందన్నారు. సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యమని మరో సారి స్పష్టమైందని విక్రమ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జీడబ్ల్యూఎంసీ ఫ్లోర్ లీడర్ తోట వెంకన్న, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బంక సరళాదేవి, కార్పొరేటర్ పోతుల శ్రీమాన్, జగన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రులకు ఎంజీఎం గోస పట్టదా?



మాట్లాడుతున్న గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి

- బీజేపీ నేతలు ప్రేమేందర్‌రెడ్డి, గంటా రవికుమార్
- ఎంజీఎం ఎదుట బీజేపీ ఆధ్వర్యంలో మహాధర్నా

వరంగల్ మెడికల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నుంచి ఇద్దరు మంత్రులు ఉన్నా ఎంజీఎం ఆస్పత్రి గోస పట్టడం లేదని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి విమర్శించారు. ఎంజీఎం ఆస్పత్రి దయనీయస్థితిపై 'వరంగల్ ప్రజల ఆత్మగౌరవ పోరాటం' పేరుతో బుధవారం ఎంజీఎం వద్ద బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంటా రవి కుమార్ ఆధ్వర్యంలో మహాధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎంజీఎం ఆస్పత్రిలో కనీసం వీల్‌చైర్లు, స్ట్రెచర్లు, బెడ్లు, ఆక్సీజన్, 2డీ, ఈసీజీ లాంటి మౌలిక వసతులు కూడా లేదని విమర్శించారు. ఎంజీఎంలో సరైన బెడ్లు లేకపోవడంతో ఒకే బెడ్డుపై ఇద్దరు, ముగ్గురిని పడుకోబెట్టాల్సిన దుస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. మరుగుదొడ్లు కంపు కొడుతున్నా ఎవరికీ పట్టడం లేదని, రోగులు నిత్యం ముక్కు మూసుకొని వార్డులలో గడపాల్సిన దుస్థితి నెలకొందని అన్నారు. సీఎం వద్దకు వెళ్లి ఎంజీఎం దుస్థితిని వివరించే స్థితిలో స్థానిక మంత్రులు లేరన్నారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు మాట్లాడుతూ.. ఎంజీఎంపై బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. ఎంజీఎం అభివృద్ధికి చర్యలు తీసుకోకుంటే బీజేపీ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, మాజీ మేయర్ టి.రాజేశ్వర్‌రావు, రాష్ట్ర ఎస్సీమోర్చా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ పగడాల కాళీప్రసాద్, కంభంపాటి పుల్లారావు, కుసుమ సతీష్, రత్నం సతీష్, వన్నాల వెంకటరమణ, చాడ శ్రీనివాస్‌రెడ్డి, బాకం హరిశంకర్, డాక్టర్ గోగుల రాణా ప్రతాప్‌రెడ్డి, రాష్ట్ర, జిల్లా నాయకులు, వివిధ మోర్చాల నాయకులు, పదాధికారులు పాల్గొన్నారు.

కాళోజీ వర్సిటీ వీసీగా నందకుమార్‌రెడ్డి బాధ్యతలు


బాధ్యతలు స్వీకరిస్తున్న డాక్టర్ పీవీ నంద కుమార్‌రెడ్డి

వరంగల్ మెడికల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లోని కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉప కులపతిగా డాక్టర్ పీవీ నంద కుమార్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. వరంగల్‌లోని ఆరోగ్య విశ్వవిద్యాలయం వీసీ చాంబర్‌లో బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు బాధ్యతలు స్వీకరించారు. ఈ నెల 18వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం డాక్టర్ నంద కుమార్‌రెడ్డిని వీసీగా నియమిస్తూ జీవో ఎంఎస్ నెంబరు 59ను ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. నారాయణపేట జిల్లాకు చెందిన డాక్టర్ నంద కుమార్‌రెడ్డి రాములమ్మ - పుల్లారెడ్డి దంపతులకు జన్మించారు. ప్రాథమిక విద్యాభ్యాసం నుంచి ఇంటర్ వరకు నారాయణపేటలోనే కొనసాగింది. హైదరాబాద్‌లోని రెడ్డి హాస్టల్‌లో ఉంటూ గాంధీ ప్రభుత్వ ఆస్పత్రిలో ఎంబీబీఎస్, ఉస్మానియా ఆస్పత్రిలో ఎంఎస్ ఆప్తమాలజీ విద్య అభ్యసించారు. 1982-83 లో ఉమ్మడి ఖమ్మం జిల్లా కామయ్యపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిగా ప్రభుత్వ సేవలను ప్రారంభించారు. ఆ తరువాత రంగారెడ్డి జిల్లాలోని పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో విధులు నిర్వర్తించారు. 1998లో హైదరాబాద్‌లోని సరోజిని కంటి ఆస్పత్రిలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా, 2014లో ప్రొఫెసర్‌గా, సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టారు. అడిషనల్ డైరెక్టర్ హోదాలో ప్రభుత్వ సర్వీసుల నుంచి ఉద్యోగ విరమణ పొందారు. అప్పటి నుంచి పదేళ్లుగా రాష్ట్రంలోని పలు ప్రయివేట్ వైద్య కళాశాలలో ప్రిన్సిపాల్‌గా, డీన్‌గా కొనసాగారు. 2023-24 కాలంలో వరంగల్‌లోని ఫాదర్ కొలంబో ఆస్పత్రి డీన్‌గా కొనసాగారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2010-2015 మధ్య కాలంలో ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ పాలకవర్గ సభ్యుడిగా, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడిగా పని చేశారు. ఆయనకు కుమార్తె నేహారెడ్డి, ఇద్దరు కుమారులు డాక్టర్ నిశాంత్‌రెడ్డి, డాక్టర్ నిఖిల్‌రెడ్డి ఉన్నారు. కాగా, కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉపకులపతిగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ నందకుమార్‌రెడ్డికి విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ సంధ్య, వివిధ విభాగాల అధిపతులు, ఉద్యోగులు, వైద్య సంఘాల నేతలు అభినందనలు తెలిపారు.

కొనసాగుతున్న దేవన్నపేట పంప్ హౌస్ పనులు

మోటార్లు ఆన్‌చేయకుండానే వెళ్లిపోయిన మంత్రులు

హనుమకొండ టౌన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండలోని దేవన్నపేట దేవాదుల పంప్‌హౌస్ స్టేజ్-3 మోటార్ల పనులు కొనసాగుతున్నాయి. కొన్ని సాంకేతిక సమస్యల వల్ల ట్రయల్ రన్ పనులను మంగళవారం రాత్రి పొద్దుపోయే వరకు ఉండి మోటార్లను ఆన్ చేసి వెళతామన్న రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేసిన విషయం తెలిసిందే. బుధవారం నీటిపారుదల శాఖ అధికారులు ఆస్ట్రియా నుంచి మోటార్లను పంపిణీ చేసిన ఇంజనీర్ల బృందం మరమ్మతులు కొనసాగిస్తున్నారు. దీంతో ట్రయల్ రన్‌పనులు నిలిచిపోయాయి. బుధవారం సాయంత్రం వరకు కూడా ఆ పనులు పూర్తి కాకపోవడంతో మరో రెండు రోజులు మరమ్మతు పనులు కొనసాగనున్నట్టు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. మోటార్ల మరమ్మతు పనులకు మరో రెండు పట్టనున్నట్టు అధికారులు స్పష్టం చేయడంతో మంగళవారం అర్ధరాత్రి వరకు నిట్ అతిథి గృహంలో వేచి ఉన్న మంత్రులు.. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఉండడంతో మోటార్లను ఆన్ చేయకండా వెళ్లిపోయారు.

సమ సమాజ నిర్మాణానికి రాజ్యాంగం దోహదం

- ఉమ్మడి ఏపీ హైకోర్టు రిటైర్డు జడ్జి జస్టిస్ చంద్రయ్య
- కేయూలో ముగిసిన 75 ఏళ్ల భారత రాజ్యాంగ సదస్సు



మాట్లాడుతున్న ఉమ్మడి ఏపీ హైకోర్టు రిటైర్డు జడ్జి జస్టిస్ చంద్రయ్య

కేయూ క్యాంపస్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): భారత సమ సమాజ నిర్మాణానికి భారత రాజ్యాంగం దోహదపడుతుందని ఉమ్మడి ఏపీ హైకోర్టు రిటైర్డు జడ్జి జస్టిస్ జి.చంద్రయ్య పునరుద్ఘాటించారు. రెండు రోజులుగా కేయూ సెనెట్ హాల్‌లో కేయూ ఎస్సీ, ఎస్టీ సెల్ నేతృత్వంలో '75 ఏళ్ల భారత రాజ్యాంగం మైలురాళ్లు, సమస్యలు - సవాళ్లు' అనే అంశంపై నిర్వహించిన జాతీయ సదస్సు బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా కేయూ ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్ తుమ్మల రాజమణి అధ్యక్షతన జరిగిన సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన జస్టిస్ చంద్రయ్య మాట్లాడారు.

రాజ్యాంగం అందరిదన్నారు. భవద్గీత, ఖురాన్, బైబిల్‌తో పాటు రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ అధ్యయనం చేయాలని పిలుపునిచ్చారు. వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి రిజర్వేషన్లు వచ్చాయన్నారు. దేశం సెక్యులర్ విధానంలో అన్నివర్గాలను కలుపుకుని ముందుకు పోతుందన్నారు. భాష వైరుధ్యాలు, మత పోరాటాలు అర్థరహితమన్నారు. స్వామి వివేకనంద ప్రజ్ఞా గొప్పదన్నారు. ఆయన అమెరికాలో దేశం ఔన్నత్యంపై చేసిన ప్రసంగం గొప్పదన్నారు. అన్ని మతాల సారం ఒక్కటేనన్నారు. దేశ ప్రజలను రక్షించేంది భారత రాజ్యాంగమేనని అన్నారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌కు రుణపడి ఉండాలని కోరారు. రాజ్యాంగాన్ని రక్షించుకోవాలని చెప్పారు. హైదరాబాద్ హెచ్‌సీయూ రిటైర్డు ప్రొఫెసర్, ప్రముఖ సామాజిక వేత్త ప్రొఫెసర్ జి.హరగోపాల్ మాట్లాడుతూ.. రాజ్యాంగ వ్యవస్థను ప్రజలు గౌరవిస్తున్నారని అన్నారు. పాలకులు రాజ్యాంగ విలువలకు తిలోదకాలు ఇస్తున్నారని విమర్శించారు. సొంత ఎజెండాతో పాలన సాగిస్తున్నారని ధ్వజమెత్తారు. చరిత్రలో పాసిస్టు విధానాలు ఓడిపోయి, సోషలిస్టు భావాలు బలపడ్డాయని విశ్లేషించారు. సోవియేట్ పతనంతో ప్రపంచ వ్యాప్తంగా అనేక కీలక మార్పులు వచ్చాయన్నారు. మానవ హక్కులు, స్వేచ్ఛను రాజ్యం హరిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. మాజీ ఎంపీ ఎ.సీతారాంనాయక్ మాట్లాడుతూ.. రాజ్యాంగం కల్పించిన అవకాశాలతోనే రిజర్వేషన్లు వచ్చాయన్నారు. కేయూ యూజీసీ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఆర్.మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ.. మన రాజ్యాంగం ప్రపంచంలోనే గొప్పదన్నారు. సదస్సు డైరెక్టర్ డాక్టర్ తుమ్మల రాజమణి మాట్లాడుతూ.. కీలక అంశాల ప్రతిపాదనలతో పరిశోధన పత్రాలు వచ్చాయన్నారు. ఈ సదస్సులో ఉమ్మడి ఏపీ హైకోర్టు రిటైర్డు జడ్జి జస్టిస్ పీఎల్ నారాయణ, ఎన్‌ఐఎల్‌సీఈ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం.ఎర్రగట్టు స్వామి, డాక్టర్ రాధికారాణి, ప్రొఫెసర్ కందకట్ల సుధాకర్, డాక్టర్ కుంట అయిలయ్య, స్వర్ణలత, వెంకట గోపినాథ్, రంగారెడ్డి, నరసింహరావు, ఆదిరెడ్డి, డాక్టర్ ఎడ్ల ప్రభాకర్, డాక్టర్ శ్రీధర్‌కుమార్‌లోథ్, డాక్టర్ ఎన్.సుజాత, డాక్టర్ వంగాల సుధాకర్, స్కాలర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

భద్రకాళి శేషుకు ఆగమ విద్యున్మణి బిరుదు

తిరుపతిలో పండిత సత్కారం


భద్రకాళి శేషు

హనుమకొండ కల్చరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ఈసారి ఉగాదిని పురస్కరించుకొని రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రఖ్యాతి గాంచిన వైఖానస, పాంచరాత్ర శైవ, స్మార్త ఆగమ పండితులను 9 మందిని సత్కరిస్తోంది. ఇందులో వరంగల్ నగరానికి చెందిన భద్రకాళి ఆలయ ప్రధాన అర్చకుడు బండారి శేషగిరిరావు ఉండటం విశేషం. ఈనెల 25వ తేదీన సాయంత్రం తిరుపతిలో జరిగే జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయ వార్షికోత్సవ సభలో భద్రకాళి శేషును వైదిక స్మార్త ఆగమంలో నిష్ణాతులైన పండితులుగా గుర్తించిన క్రమంలో వారికి ఆగమ విద్యున్మణి బిరుదుతోపాటు కొంత నగదు పురస్కారంతో సత్కరించనుండటం విశేషం. గతంలో శేషుకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దేవాదాయశాఖలో ఆగమ పరీక్షల అధికారిగా వ్యవహరించారు. రాష్ట్ర అర్చక వెల్ఫేర్ కమిటీ సభ్యులుగా వ్యవహరించారు. వరంగల్ పోతన విజ్ఞానపీఠంలో పౌండరీక యాజ్ఞ బ్రహ్మశ్రీ దెందులూరి వెంకటేశ్వర ఘనపాటి ఆధ్వర్యంలో నిర్వహించిన విద్వత్ సభలో ఆగమ సామ్రాట్ బిరుదును అందుకున్నారు. ఆంగ్ల విద్యలోనూ ప్రావీణ్యులు, సంగీత శాస్త్ర అధ్యయనం చేశారు. ఆగమ శాస్త్రాన్ని పార్నంది లక్ష్మీనారాయణశర్మ వద్ద వైదిక ఆగమ చక్రవర్తి ఎల్లంబట్ల సీతారామశాస్త్రి వద్ద ఆగమ శాస్త్ర అధ్యయనం చేశారు. వేద అధ్యయనాన్ని ఎల్లబంట్ల లక్ష్మీ అవధాని, పాలకుర్తి నర్సింహమూర్తి అవధాని వద్ద అభ్యసించారు.

రేపు వరంగల్‌కు రైల్వే జీఎం రాక

స్టేషన్ అభివృద్ధి పనులను తనిఖీచేయనున్న అరుణ్‌కుమార్

గిర్మాజీపేట, మార్చి19(ఆంధ్రజ్యోతి): దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ శుక్రవారం వరంగల్‌కు వస్తున్నారు. అమృత్ భారత్ రైల్వేస్టేషన్ పథకం కింద రూ.25 కోట్లతో చేపట్టిన వరంగల్ రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులను ఆయన తనిఖీ చేస్తారు. ఎయిర్‌పోర్టుల తరహాలో ప్రయాణికులకు మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు రైల్వేశాఖ అమృత్‌భారత్ పథకం కింద కరీంనగర్, రామగుండం, వరంగల్ రైల్వేస్టేషన్‌లను అభివృద్ధి చేస్తున్న విషయం తెలిసిందే. ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో వర్చువల్‌గా ప్రారంభించేందుకు ముందస్తుగా ఈ రైల్వేస్టేషన్‌లను జీఎం తనిఖీ చేస్తున్నారు. శుక్రవారం ఉదయం 4 గంటలకు జీఎం అరుణ్‌కుమార్ ప్రత్యేక రైలులో ఉన్నతాధికారులతో కలిసి బయలుదేరి నిజామాబాద్ మీదుగా 8.30 గంటలకు ముందుగా కరీంనగర్‌కు చేరుకుంటారు. అక్కడ రైల్వేస్టేషన్‌ను తనిఖీ చేసి అనంతరం మధ్యాహ్నం 1 గంటకు రామగుండం రైల్వేస్టేషన్‌ను తనిఖీ చేస్తారు. పలు అభివృద్ధి పనులను పరిశీలిస్తారు. తర్వాత మధ్యాహ్నం 3 గంటలకు కాజీపేటకు చేరుకుని రైల్వేపైలట్‌లతో భద్రతపై సమీక్షా చేసి తగిన దిశానిర్దేశం చేస్తారు. అనంతరం వరంగల్ రైల్వేస్టేషన్‌కు చేరుకుంటారు. జీఎం టూర్ నేపథ్యంలో అధికారులు అభివృద్ధి పనులను ముమ్మరం చేశారు.

మార్కెట్ కొత్త పాలకవర్గం కొలువుదీరేదెన్నడో?

- ప్రకటించి 50 రోజులు గడుస్తున్నా ఫలితం శూన్యం
- ప్రమాణ స్వీకారానికి నోచుకోని నూతన కమిటీ


ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీ

వరంగల్ వ్యవసాయం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ (ఏనుమాముల) వ్యవసాయ మార్కెట్ కమిటీకి రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్ల తరువాత ఎట్టకేలకు కొత్త పాలక వర్గాన్ని నియమించింది. చైర్‌పర్సన్‌గా ఎర్ర ప్రియాంక, వైస్ చైర్మన్‌గా బండి జనార్దన్‌తో పాటు పాలకవర్గ సభ్యులను నియమిస్తూ 28 జనవరి 2025న ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఆ మరుసటిరోజు నుంచే ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. మార్చి ఏడు వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉండ టంతో కొత్త పాలకవర్గం బాధ్యతలు చేపట్ట లేదు. ఒక్క రోజు అవకాశం ఇచ్చినా బాగుండే దని కొత్త పాలకవర్గం నిట్టూర్చింది. ఇదిలా ఉండగా, వరంగల్ తూర్పుతో పాటు వర్ధన్న పేట నియోజకవర్గం నుంచి కొందరు ముఖ్య నాయకులకు మార్కెట్ కమిటీలో అవకాశం కల్పిస్తామని చెప్పి చేయలేదని సోషల్ మీడి యాలో ఆరోపణలు చేశారు. అది అధిష్ఠానానికి ఫిర్యాదు చేసేవరకు పోయింది. దీంతో కొత్త పాలకవర్గంలో మార్పులు చేర్పులు చేస్తారని ప్రచారం జరిగింది. ప్రస్తుతం ఎన్నికల కోడ్ ముగిసింది. పాలకవర్గాన్ని ప్రకటించి యాభై రోజులవుతోంది. అయినా ఇప్పటివరకు పాలకవర్గం కొలువు దీరకపోవడంతో ఈ పాలకవర్గం కొనసాగుతుందా..? లేక మొత్తానికే మార్చుతారా.? లేదా మార్పులు చేర్పులు చేస్తారా.. అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కానీ, ఈ అనుమానాలను నూతన పాలకవర్గం కొట్టిపారేస్తోంది. ప్రమాణ స్వీకారోత్సవానికి ఐదారుగురు మంత్రులను, ఎంపీలను, ఎమ్మెల్యేలను, పార్టీ ప్రతినిధులను పిలిచి పెద్ద ఎత్తున కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, ఈ విషయంలో అందరి సమయం తీసుకోవడం కోసం జాప్యం జరుగుతోందని చెబుతోంది. ఏదీ ఏమైనా కొత్త పాలకవర్గం వెంటనే కొలువుదీరి, మార్కెట్లోని సమస్యలను పరిష్కరించాలని మార్కెట్ వర్గాలు కోరుతున్నాయి.

బడ్జెట్‌లో విద్యా రంగానికి తీవ్ర అన్యాయం

ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు

కేయూ క్యాంపస్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి తీవ్ర అన్యాయం జరిగిందని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు బుధవారం ఆరోపించారు. రూ.3 లక్షల కోట్ల బడ్జెట్‌లో విద్యకు 10 శాతం నిధులను కేటాయించకపోవడం శోచనీయమని, గత ఎన్నికలకు ముందు 15 శాతం నిధులు ఇస్తామని ప్రకటించారని వివరించారు. విద్య కమిషన్ 20 శాతం నిధులు ఇవ్వాలని సూచించదన్నారు.

రాష్ట్రంలో అనేక పాఠశాలలకు హాస్టల్స్‌లేవని, మౌలిక సదుపాయాలు, పరిశోధనకు నిధులు లేక వర్సిటీలు కొట్టుమిట్టాడుతున్నాయని పేర్కొన్నారు.

తక్షణమే పరిహారం చెల్లించాలి

టెక్స్‌టైల్ పార్కు బాధిత రైతుల నిరసన

వరంగల్ కలెక్టరేట్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో భూములు కోల్పోయి నష్టపరిహారం అందని కొంత మంది రైతులు బుధవారం వరంగల్ ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. తమకు వెంటనే పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ గీసుగొండ మండలం శాయంపేట హవేలి రైతులు ఆందోళనకు దిగారు. టెక్స్‌టైల్ పార్కులో భూములు కోల్పోయిన వారిలో కొంత మందికి మాత్రమే పరిహారం అందించి రెవెన్యూ అధికారులు చేతులు దులుపుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్నేళ్ల క్రితమే టెక్స్‌టైల్ పార్కు కోసం భూములను తీసుకున్న రెవెన్యూ అధికారులు నష్టపరిహారం చెల్లించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ విషయంలో అధికారులు స్పందించకుంటే తమకు చావే శరణ్యమని పురుగుల మందు డబ్బాతో నిరసన తెలిపారు. ఇప్పటికైనా తమ బాధను కలెక్టర్, ఆర్డీవో, స్థానిక ఎమ్మెల్యే అర్థం చేసుకొని నష్టపరిహారం అందేలా చర్యలు చేపట్టాలని వేడుకున్నారు.

ఈ కార్యక్రమంలో బాధిత రైతులు సముద్రాల యాకస్వామి, పులుగు సరస్వతి, ఆకుల విజయలక్ష్మీ, రాజ్, రాజవ్వ, హరీష్, మహేందర్, అనిల్, దిలీప్, లక్ష్మీ, సాంబయ్య, సృజన్, నరసింహా, కొమురయ్య, పార్వతమ్మ, వీరస్వామి, లక్ష్మీ, అమెన తదితరులు పాల్గొన్నారు.

నేడు పండ్ల మార్కెట్ ప్రారంభం

- చకచకా ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు


ములసమ్మకుంటలో పండ్ల మార్కెట్ ఏర్పాటుకోసం భూమి చదును చేయిస్తున్న మార్కెటింగ్‌శాఖ జేడీ శ్రీనివాస్

వరంగల్ వ్యవసాయం, మార్చి19 (ఆంధ్రజ్యోతి): వరంగల్ (ఏనుమాముల) వ్యవసాయ మార్కెట్ పరిధిలోని ముసలమ్మకుంట గోదాముల వద్ద ఏర్పాటు చేసిన పండ్ల మార్కెట్‌ను గురువారం అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, స్థానిక ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు ప్రారంభిస్తారని మార్కెట్ కార్యదర్శి గుగులోతు రెడ్యా తెలిపారు. ఈ మేరకు మామిడికాయల సీజన్ ప్రారంభమైనందున ముసలమ్మకుంటలో పండ్ల మార్కెట్ ఏర్పాటు చేసేందుకు మార్కెటింగ్ శాఖ అధికారులు యుద్ధప్రాతిపాదికన పనులు చేయిస్తున్నారు. బుధ వారం మార్కెటింగ్‌శాఖ జాయింట్ డైరెక్టర్, మార్కెట్ పర్సన్ ఇన్‌చార్జి ఉప్పుల శ్రీనివాస్, మార్కెట్ కార్యదర్శి గుగులోతు రెడ్యా ముసలమ్మ కుంట లోని గోదాముల వద్ద మార్కెట్ పనులను పరిశీలించారు. డోజర్లను పెట్టి భూమిని చదును చేయించారు. మామిడి మార్కెట్‌కు ఉమ్మడి జిల్లాతో పాటు ఇతర జిల్లాలనుంచి పెద్ద ఎత్తున ట్రాక్టర్లు, డీసీఎంలు, లారీలు రానున్నందున భూమిని చదును చేయించడంతో పాటు లైట్లు, వాష్‌రూంలు, తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నారు.

'ఆంధ్రజ్యోతి' కథనంతో కదిలిన యంత్రాంగం

మూడేళ్లుగా పండ్ల మార్కెట్ లేక వ్యాపారులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనానికి యంత్రాంగం స్పందించింది. పండ్ల వ్యాపారులు, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులతో మార్కెటింగ్‌శాఖ అధికారులు, జిల్లా కలెక్టర్ సమావేశమై పండ్ల మార్కెట్ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు.

ఇక యువ వికాసమే..

- నిరుద్యోగ యువతలో చిగురించిన ఆశలు
- ప్రారంభమైన దరఖాస్తుల స్వీకరణ
- తెరుచుకున్న ప్రత్యేక పోర్టల్
- దరఖాస్తు చేసుకునేందుకు ఆసక్తి చూపుతున్న యువత
- ఇంకా జారీ కాని మార్గదర్శకాలు
- యూనిట్ల ఏర్పాటుపై కొరవడిన స్పష్టత

హనుమకొండ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రేవంత్ రెడ్డి ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పేరుతో కొత్త పథకాన్ని ప్రారంభించింది. యువవికాస పథకం కోసం రూపొందించిన ప్రత్యేక పోర్టల్‌ను తెరిచి తమ వివరాలను నమోదు చేశారు. పోర్టల్ అడిగిన వివరాల మేరకు సమాచారాన్ని పొందుపరిచారు. అయితే అధికారులకు ఈ పథకానికి సంబంధించిన మార్గదర్శకాలు ఇంకా అందలేదు. ప్రస్తుతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల అధికారులకే యువవికాస పథకం అమలు పర్యవేక్షణను అప్పగించారు. మొదటిరోజు ఎంత మంది దరఖాస్తు చేసుకున్నది తెలియరా లేదు. ఏప్రిల్ 5వ తేదీ నాటికి పెద్ద సంఖ్యలోనే యువతీ యువకులు దరఖాస్తులు దాఖలు చేసు కునే అవకాశం ఉన్నట్టు అధికారులు భావిస్తున్నా రు. దాఖలైన దరఖాస్తులను గ్రామాల్లో అయితే స్థానిక ఎంపీడీవోలు, అర్బన్ ప్రాంతంలో అయితే తహసీల్దార్‌లు పరిశీలించి అర్హులైనవారి జాబితాల ను రూపొందిస్తారు.తుది జాబితాను కలెక్టర్లు పరి శీలించి అర్హులైన వారిని ఎంపిక చేస్తారు. యూని ట్ల విషయంలో స్పష్టత లేదని చెబుతున్నారు.

యువతకు చేయూత

యువతను ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేసేందుకు తీసుకువస్తున్న ఈ పథం కింద మంగళవారం నుంచి దరఖాస్తులను దాఖలు చేయడం ప్రారంభమైంది. యువ వికాస పథకం అమలులోకి వస్తుండడంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నిరుద్యోగ యువతలో ఆశలు చిగురిస్తున్నాయి. ఇన్నాళ్లు చేసేందుకు ఉద్యోగం లేక, స్వయం ఉపాధి కల్పనకు డబ్బులు లేక సతమతమవుతున్న యువతలో ఈ పథకం కొత్త ఉత్సాహాన్ని నింపనున్నది. దరఖాస్తుల దాఖలుకు విద్యావంతులైన యువతీ యువకులు ఉత్సాహంగా ముందుకు వస్తున్నారు. తెలంగాణ సంక్షేమ శాఖ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కార్పొరేషన్ల సహకారంతో ఈ పథకం అమలు కానున్నది. ఈ కార్పొరేషన్ల ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేయనున్నది.

రూ.5లక్షల వరకు..

యువత సొంతవ్యాపారాలుచేసుకోవడం ద్వారా ఆర్థికంగా నిలదొక్కుకునేదుకు రూ.3లక్షల నుంచి రూ.5లక్షల వరకు ప్రభుత్వం ఆర్థిక సాయం చేయనున్నది. ఈ సాయం కోసం దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం షెడ్యూల్ కూడా విడుదల చేసింది. ఏప్రిల్ 5 వరకు అర్హులైనవారు ఈ పథకం కోసం దరఖాస్తు చేసుకోవచ్చని ప్రభుత్వం తెలిపింది. ప్రభుత్వం రూ.6వేల కోట్లతో ఈ పథకాన్ని రూపొందించామని, తెలంగాణ వ్యాప్తంగా 5 లక్షల మంది యువతకు తగ్గకుండా సాయం చేయనున్నట్టు తెలిపింది. ఈ లెక్కన వరంగల్, హనుమకొండ జిల్లాల్లో 31250 మంది యువతీ యువకులకు లబ్ధి చేకూరనున్నది.

31 వేల మందికి లబ్ధి

ఉమ్మడి వరంగల్ జిల్లా మొత్తం జనాభా 38,20,369. కాగా, వీరిలో 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయసు కలిగిన యువత 13,37,129 మంది ఉన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం ప్రకారం వరంగల్, హనుమకొండ జిల్లాల్లో మొత్తం 31,250 మందికి ఆర్థిక సాయం అందనున్నది. జిల్లాల వారిగా చూసుకుంటే హనుమకొండ జిల్లా జనాభా 10,62,247 మంది కాగా యువత 3,71,786 మంది, వరంగల్ జిల్లాలో మొత్తం 7,37,148 మంది కాగా వీరిలో యువత 2,58,001 మంది ఉన్నారు. వీరి నుంచి దరఖాస్తులు అందిన తర్వాత అర్హులైన వారిని ఎంపిక చేసి ఆర్థిక సాయం అందచేస్తారు. ఒక్కో జిల్లాలో అర్హతను బట్టి సగటున సుమారు 14వేల నుంచి 15వేల మందికి ఆర్థిక సహాయం అందగలదన్నది అధికారుల ప్రాథమిక అంచనా.

ప్రత్యేక పోర్టల్

ఈ పథకం అర్హత, ఎంపిక విధానం వివరాలన్నీ https://tgobmms.cgg.gov.in/ పోర్టల్‌లో పొందుపరిచారు. మరిన్ని వివరాలకు సంక్షేమ శాఖల జిల్లా అధికారులు, కార్పొరేషన్ల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లను సంప్రదించవచ్చు. ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజనులు ఐటీడీఏ అధికారులను సంప్రదించాల్సి ఉంటుంది. రాజీవ్ యువ వికాస పథకం కింద కేటగిరీ -1,2,3 వారీగా రుణాలను ఖరారు చేస్తారు. ఇందులో 80శాతం రాయితీ ఉంటే మిగతా20 శాతం లబ్ధిదారు భరించడమో లేదా బ్యాంకుకు అనుసంధానం చేయడమో జరుగుతుంది. కేటగిరీ-2 కింద రూ.లక్ష నుంచి రూ. 2లక్షల వరకు రుణాలు ఇస్తారు. ఇందులో 70 శాతం రాయితీ లభిస్తుంది. కేటగిరీ-3 కింద రూ.3లక్షలలోపు రుణాలు ఇచ్చి 60 శాతం రాయితీ ఇవ్వనున్నది. ఏప్రిల్ 6 నుంచి 31వరకు దరఖాస్తుల పరిశీలన కొనసాగుతుంది. లబ్ధిదారుల్లో అర్హులను ఎంపిక చేసి తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజున రాయితీ రుణాల మంజూరు పత్రాలు ఇస్తారు.

గేట్‌లో 1,369వ ర్యాంక్ సాధించిన సాయిప్రీతం



భీమదేవరపల్లి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఆలిండియా గేట్‌లో మండలంలోని వీర్లగడ్డ తండాకు చెందిన గుగ్లోతు సాయిపీత్రం 1369వ ర్యాంక్ సాధించినట్లు ఆయన తల్లిదండ్రులు గుగ్లోతు రాధ-రవీందర్ తెలిపారు. ప్రస్తుతం సాయిప్రీతం ఒడిస్సాలోని భువనేశ్వర్‌లో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగంలో ఐఐటీ చదువుతున్నాడు. బుధవారం ప్రకటించిన ఆలిండియా గేట్ ర్యాంక్‌లో సాయిప్రీతంకు 1369 ర్యాంక్ రావడంతో పలువురు తండాకు చెందిన కాంగ్రెస్ నాయకులు గుగ్లోతు రమేష్‌నాయక్ హర్షం వ్యక్తం చేశారు. సాయిప్రీతం తండ్రి రవీందర్ విద్యుత్ శాఖలో పనిచేస్తున్నాడు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
పత్తి	7100	5800
మక్కలు (బిల్టీ రకం)	2233	2100
పల్లికాయ (సూక)	7200	6500
పల్లికాయ (పచ్చిది)	4450	3400
కందులు	6905	5540
పెసళ్లు	7209	4645
తేజ మిర్చి	13100	9000
వండర్‌హాట్	16000	11500
యూఎస్341	13100	9500
దేశీ	30000	25500
సింగిల్ పట్టి	31000	28000
దీపిక	15800	15245
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం

నీటి పారుదలకు పెద్దపీట

(5వ పేజీ తరువాయి)

మోడికుంట వాగు అభివృద్ధికి రూ.99.50 కోట్లు ఇచ్చారు. కాగా బడ్జెట్‌లో పురపాలక సంఘాలు, పట్టణాభివృద్ధి పద్దు కింద రూ.10వేల కోట్లను కేటాయించగా.. దానిలో నుంచి వరంగల్ నగరంలో రూ.4,170కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న భూగర్భ డ్రెయినేజీకి తొలివిడతగా రూ.2500కోట్ల వరకు నిధుల కేటాయింపు జరగవచ్చునని భావిస్తున్నారు. ముఖ్యంగా వరంగల్ నగర సమగ్రాభివృద్ధికి రూ.6500కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేయనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి పలు వేదికలపైనేకాకుండా మూడు రోజుల క్రితం స్టేషన్‌ఘనపూర్‌లో జరిగిన బహిరంగ సభలో కూడా ప్రకటించారు ఈ దృష్ట్యా పట్టణాభివృద్ధికి నిర్దేశించిన పద్దుల నుంచి నిధులు పెద్దమొత్తంలో వచ్చే అవకాశాలున్నట్లు అంచనా వేస్తున్నారు. కాగా వరంగల్ నగరంలో మెట్రో రైల్, ఐటీ పార్క్, విస్తరణకు కూడా నిధుల ఊసే లేదు. మడికొండ, కొడకండ్ల చేనేత పార్కులు, స్టేషన్‌ఘనపూర్‌లో లెదర్ పార్క్‌నకు సంబంధించిన నిధుల ప్రస్తావన కూడా లేదు. కాళేశ్వరం, దేవాదుల, ఎస్ఆర్ఎస్‌పి, గుండ్లవాగు ప్రాజెక్టులకు, రామప్ప, పాకాల సరస్సులకు బడ్జెట్‌లో కొంత మేరకు నిధులు కేటాయించడం పట్ల రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఇక కాళేశ్వరం టూరిజం సర్క్యూట్‌కు రూ. 10 కోట్లు, కాకతీయ విశ్వవిద్యాలయానికి రూ 50 కోట్లు, వరంగల్, కరీంనగర్ జిల్లాలకు కలిపి రూ 41 కోట్లు, కాళోజీ నారాయణ రావు హెల్త్ యూనివర్సిటీకీ రూ. 20కోట్లు, వరంగల్ మహానగర పాలక సంస్థకు రూ.50కోట్లు, వరంగల్ స్మార్ట్ సిటీ పథకం కింద రూ. 170.09 కోట్లు, అమృత్ పథకం కింద రూ. 154.84 కోట్లు కేటాయించారు.

టైర్ టు సిటీస్

ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క బడ్జెట్ ప్రసంగంలో వరంగల్‌ను ఎడ్యుకేషన్, హెల్త్, ఐటీ హబ్‌గా అభివృద్ధి చేయడంతో పాటుగా టుటైర్ సిటీగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోనున్నట్లు ప్రకటించడం కాస్త ఊరట కలిగించింది. నిజామాబాద్, ఖమ్మంతో పాటు వరంగల్‌ను టూ టైర్ సిటీలుగా అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే పలు చర్యలు తీసుకుంటోందని, రానున్న రోజుల్లో ఈ దిశగా మరిన్ని ప్రణాళికలను అమలు చేయనున్నట్లు చెప్పారు.

ఇండస్ట్రియల్ కారిడార్

గత బడ్జెట్‌లోలాగానే ఈ సారి కూడా హైదరాబాద్-వరంగల్ ఇండస్ట్రియల్ కారిడార్ గురించి మరోసారి ప్రస్తావించారు. జాతీయ రహదారి-163కు ఇరు పక్కల వ్యూహాత్మక గ్రోత్ కారిడార్‌ను ఏర్పాటు చేయడం వల్ల పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తాయనీ, ప్రాంతీయ పారిశ్రామికీకరణకు ఊతం లభిస్తుందన్నారు.

మేనిఫెస్టోలోని హామీలకు ఆమడదూరంగా..



విద్యాశాఖకు గతేడాది కంటే 0.20శాతం కేటాయింపులు తగ్గాయి. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పేర్కొన్న 15 శాతం హామీకి ఆమడ దూరంలో కేటాయింపులున్నాయి. ఈ ఏడాది రూ.3,04,965 కోట్ల బడ్జెట్‌లో.. విద్యకు కేటాయించింది 23,108 కోట్లు(7.57శాతం)మాత్రమే. గతేడాది రూ.274,058కోట్లలో.. విద్యకు కేటాయించింది 21,292కోట్లు(7.77శాతం). అంకెల్లో రూ.1,816 కోట్లు పెరిగినట్లుగా ఉన్నప్పటికీ శాతాల్లో చూస్తే గతేడాది కంటే తగ్గింది. విద్యాశాఖలో ఉన్న 26,067 పాఠశాలలకు గాలికొదిలేసి రెసిడెన్షియల్, యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్ల గురించి మాత్రమే ప్రభుత్వం మాట్లాడుతోంది. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పొందుపరిచిన విధంగా విద్యకు 15శాతం నిధులు కేటాయించాలి.

- పి.చంద్రశేఖర్‌రావు, టీఎస్‌యూటీఎఫ్ జనగామ జిల్లా అధ్యక్షుడు

యువతకు చేయూత

రాజీవ్ యువ వికాసం పథకం కింద బడ్జెట్‌లో రూ.6వేల కోట్లు కేటాయించడంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు పారిశ్రామిక యూనిట్ల స్థాపనకు రుణ సహాయం లభించే అవకాశాలున్నాయి. ఉమ్మడి జిల్లాలో 13లక్షల మంది యువత ఉండగా వీరిలో సుమారు 91వేల మందికి ఈ పథకం కింద లబ్ధి చేకూరనుంది. రాజీవ్ యువ వికాసంపై ఉమ్మడి జిల్లా యువత పెద్ద ఎత్తున ఆశలు పెట్టుకున్నది. యూనిట్ల ఏర్పాటుకు రూ.3లక్షల నుంచి రూ.5లక్షల వరకు ఆర్థిక సాయం లభించనుంది.

అంగన్వాడీ పోస్టుల భర్తీ

14వేలకు పైగా అంగన్వాడీ పోస్టులను భర్తీ చేయనున్నట్టు చేసిన ప్రకటనతో ఉమ్మడి జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాలకు మంచిరోజులు రానున్నాయని ఆశిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాల్లో 435 అంగన్వాడీ కార్యకర్తలు, 400 ఆయాల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. బడ్జెట్ ప్రసంగంలో మంత్రి ప్రస్తావించినట్టుభర్తీ జరిగితే ఉమ్మడి జిల్లాకు లబ్ధి చేకూరుతుంది. అంగన్వాడీ టీచర్లు, ఆయాల కొరత తీరుతుంది. అంగన్వాడీ కేంద్రాల పనితీరు మెరుగుపడుతుంది.

వ్యవసాయానికి ప్రాధాన్యం

బడ్జెట్‌లో వ్యవసాయానికి పెద్ద పీట వేయడంతో ఉమ్మడి జిల్లాలోని రైతులకు లబ్ధి చేకూరే అవకాశం ఉంది. వ్యవసాయానికి బడ్జెట్‌లో రూ.24,439కోట్లు, రైతు భరోసాకు రూ.18వేల కోట్లు కేటాయించారు. ఉమ్మడి జిల్లాలో 11 లక్షల మందికిపైగా రైతులు ఉన్నారు. పది లక్షల ఎకరాలకు పైగా పంటలు సాగవుతున్నాయి.



ఎత్తిపోస్తున్న దేవాదుల నీరు (ఫైల్)

పంచాయతీరాజ్‌కు భారీగా నిధులు

బడ్జెట్‌లో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధికి కూడా భారీగా రూ.31,605కోట్లను ప్రభుత్వం కేటాయించింది. రానున్న గ్రామ పంచాయతీ, స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని జరిపిన ఈ కేటాయింపుల వల్ల ఉమ్మడి జిల్లాలోని 1,680 గ్రామ పంచాయతీలకు ప్రయోజనం చేకూరనుంది. నిధులు లేక నీరసించిపోతున్న పంచాయతీలకు ఈ కేటాయింపులు కొంత ఊరటనివ్వనున్నట్టు భావిస్తున్నారు.

సంక్షేమ రంగానికి ఊతం

బడ్జెట్‌లో సంక్షేమ రంగానికి ఊతమిచ్చారు. పెద్ద మొత్తంలో నిధుల కేటాయింపును ప్రతిపాదించారు. ఎస్సీ సంక్షేమానికి రూ. 40,232 కోట్లు, ఎస్టీ సంక్షేమానికి రూ.17,169 కోట్లు, బీసీ సంక్షేమానికి గతంలో ఎప్పుడూ లేనంతగా రూ.11,405 కోట్లు, మైనారిటీ సంక్షేమానికి రూ.3,591కోట్లను కేటాయించారు. దీంతో ఉమ్మడి జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు ఆర్థికంగా, సంక్షేమ పరంగా లబ్ధి చేకూరనున్నట్టు అంచనా.

చేనేత రంగానికి మొండి చేయి


చేనేత రంగానికి సర్కార్ మొండి చేయి చూపింది. బడ్జెట్‌లో రూ.371 కోట్లను మాత్రమే విదిల్చింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 10వేలకుపైగా చేనేత కుటుంబాలున్నాయి. చేనేత కార్మికుల సంక్షేమానికి ఇటీవలే పలు పథకాలను ప్రకటించిన ప్రభుత్వం వాటి అమలుకు అవసరమైన నిధుల కేటాయింపులో మాత్రం పిసినారితనం ప్రదర్శించిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్లు

రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్టు ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో 12నియోజకవర్గాల్లో ఒక్కొక్కటి చొప్పున 12అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్లు అందుబాటులోకి రానున్నాయి. విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంచడం, పోటీ పరీక్షలకు వారిని సన్నద్ధం చేయడం, వివిధ ఉద్యోగాలకు వారు సమర్థవంతంగా పోటీ పడేట్టు తీర్చిదిద్దడం ఈనాలెడ్జ్ సెంటర్ల ఏర్పాటు ఉద్దేశ్యం.

ఇంటగ్రేటెడ్ స్కూళ్లు

విద్యావ్యవస్థ బలోపేతానికి యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని తీసకువచ్చిన ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 58 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేయనున్నది. భట్టి బడ్జెట్‌లో ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ కులమతాలలకు సంబంధం లేకుండా ఈ ఇంటిగ్రేటెడ్ స్కూళ్లలో బోధన ఉండనున్నదన్నారు. ప్రతీ నియోజకవర్గంలో కనీసం ఒక ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఉండనున్నట్టు తెలిపారు. ఈ లెక్కన ఉమ్మడి వరంగల్ జిల్లాలో త్వరలో అన్ని హంగులతో కూడిన 12 ఇంటిగ్రేటెడ్ స్కూళ్ళు ఏర్పాటు కానున్నాయి.



కాంగ్రెస్ మేనిఫెస్టో బుట్ట దాఖలు




ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి 7.57శాతం నిధులతో రూ.23,108కోట్లు మాత్రమే కేటాయించడాన్ని టీపీటీఎఫ్ తీవ్రంగా నిరసిస్తుంది. కొఠారి కమిషన్ రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి కనీసం 30శాతం నిధులు కేటాయించాలని చేసిన సిఫారసులు అమలు చేయలేకపోయినా, కనీసం కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో విద్యారంగానికి 15శాతం నిధులు కేటాయిస్తామన్న హామీని ఈసారి కూడా ప్రభుత్వం నిలబెట్టుకోలేదు. అభివృద్ధికి మూలం విద్యారంగం అని చెబుతూనే నిధులు కేటాయించకపోవడం పాలకుల డొల్లతనానికి నిదర్శనం. ఈ కేటాయింపులు విద్యను ప్రైవేటుపరం చేయడానికి పాలకుల పన్నాగంగా

- డి.శ్రీనివాస్, టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు

బడ్జెట్‌పై ఎవరేమన్నారంటే..

బుధవారం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజారంజకమని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించగా.. విపక్షాలు, సంఘాలు మాత్రం ఇది ప్రజా వ్యతిరేక బడ్జెట్ అంటూ పెదవివిరుస్తున్నాయి. అంకెల గారడీ తప్ప ఒరిగిందేమీ లేదని ఆయా పార్టీలు, సంఘాల నాయకులు పేర్కొంటున్నారు.

ప్రజా వ్యతిరేక బడ్జెట్



ఇది ప్రజా, రైతు వ్యతిరేక బడ్జెట్. కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్‌లో రైతులకు మొండి చేయి చూపింది. వ్యవసాయ బడ్జెట్‌ను తగ్గించింది. రైతుబీమా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు నిధులు పూర్తి స్థాయిలో కేటాయించలేదు. ఈ బడ్జెట్‌తో ఆరు గ్యారెంటీల అమలు అసాధ్యం. మహిళలకు ఇస్తామన్న రూ.2500 పథకానికి నిధులు కేటాయించలేదు. నిరుద్యోగ భృతి ఊసేలేదు. తులం బంగారంపై స్పష్టతలేదు. మొత్తంగా ఇది రాష్ట్రాన్ని సంక్షోభంలోకి నెట్టేవిధంగా ఉంది.

- పెద్ది సుదర్శన్‌రెడ్డి, బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే

నగరాభివృద్ధికి నిధులు శూన్యం



రాష్ట్ర బడ్జెట్‌లో వరంగల్ నగరాభివృద్ధితో పాటు విద్య, వైద్య, వ్యవసాయం, గృహనిర్మాణ రంగాలకు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమానికి సక్రమంగా నిధులు కేటాయించక పోవడం దురదృష్టకరం. ఎన్నికల హామీలకు బడ్జెట్‌కు ఎలాంటి పొంతన లేదు. వరంగల్ మహానగరంలో అండర్ డ్రెయినేజీకి నిధులు, మామునూర్ ఎయిర్‌పోర్టు అభివృద్ధి, నిధులపై స్పష్టత లేదు. మహాలక్ష్మి పథకం ద్వారా రూ.2500 ఇస్తామన్న ప్రభుత్వం.. ఆ పథకానికి నిధులు అందించకుండా కేవలం రూ.4వేల కోట్లు కేటాయించారు. 30లక్షల కుటుంబాలు ఇళ్లు లేని వారుండగా, కేవలం 4,50లక్షల మందికి మాత్రమే ఇండ్లు ఇవ్వడానికి ప్రతిపాదనలు పెట్టారన్నారు. రేషన్‌కార్డుల ద్వారా పేదలకు 14రకాల సరుకులు ఇచ్చేందుకు కేటాయింపు లేదన్నారు.

- ప్రభాకర్‌రెడ్డి, సీపీఎం హనుమకొండ జిల్లా కార్యదర్శి

అన్ని రంగాలకు అరకొర నిధులే...



కాంగ్రెస్ సర్కారు బడ్జెట్‌లో అన్ని రంగాలకు అరకొర నిధులే కేటాయించింది. గొప్పలు తప్ప హామీలు నెరవేర్చడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైంది. హామీలకు బడ్జెట్‌లో నీళ్లు వదిలారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పేరుగొప్ప... ఊరు దిబ్బ అన్న చందంగా ఉంది. ఆర్భాటమే తప్ప ఆచరణ లేదు. వ్యవసాయం, నీటిపారుదల, విద్య, వైద్యం, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల సంక్షేమానికి కేటాయింపులు చేయలేదు. ఈ బడ్జెట్ ఏ విధంగానూ రాష్ట్రాభివృద్ధికి దోహదపడేదిగా లేదు.

- ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు

అంకెల గారడీగా రాష్ట్ర బడ్జెట్



రాష్ట్ర బడ్జెట్ అంకెల గారడీగా ఉంది. మౌళిక రంగాలను విస్మరించిన ఈ బడ్జెట్‌లో కేటాయింపులు అంకెల్లో పెంచి చూపడం వల్ల అదనపు ప్రయోజనం ఏమి లేదు. రూ.3లక్షల20వేలకోట్ల వార్షిక బడ్జెట్‌లో రాష్ట్రంలోని ప్రజలు ఎదుర్కొంటున్నసమస్యలు పరిష్కారానికి సరిపోవు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ బాటలోనే కాంగ్రెస్ కూడా కేటాయింపుల సంఖ్యలు, అంకెల్లో మాత్రమే తేడా చూపుతోంది. గ్రామీణా, పేద ప్రజలకు విద్య, వైద్యం, ఉపాధి అందని ద్రాక్షలా మారిందన్నారు.

- కొత్తపల్లి రవి, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ మానుకోట జిల్లా సహాయ కార్యదర్శి

ముస్లిం మైనారిటీలకు బడ్జెట్‌లో రూ.3వేల కోట్లు

- రాజీవ్ యువ వికాస్, ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో ప్రాధాన్యత
- రాష్ట్ర మంత్రి సీతక్క వెల్లడి
- ములుగులో ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందు కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

ములుగు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ముస్లిం మైనారిటీల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రస్తుత బడ్జెట్‌లో రూ.3వేల కోట్లను కేటాయించడం జరిగిందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీశిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. బుధవారం సాయంత్రం ములుగు జిల్లా కేంద్రంలోని లీలా గార్డెన్స్‌లో ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేసిన అనంతరం ఉపవాసదీక్ష విరమించారు. వారితో కలిసి విందు చేసిన సీతక్క మతపెద్దలకు ఖర్జూర తినిపించారు. 500 మంది ముస్లిం విద్యార్థులు విదేశాలలో చదువుకునేందుకు ప్రభుత్వం ఓవర్సీస్ పథకం ద్వారా ఆర్థిక సాయం చేసిందన్నారు. పేద లబ్ధిదారులకు రాజీవ్ యువ వికాస్, ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ప్రాధాన్యతనిస్తామని, అర్హులకు రుణాలు, ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పారు. జిల్లా కేంద్రంలో షాదీఖానా నిర్మాణాన్ని త్వరలో చేపడుతామని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల సమగ్రత, హక్కులను కాపాడేందుకు రేవంత్‌రెడ్డి సర్కారు కృషి చేస్తోందన్నారు. ముస్లింలు రాష్ట్ర ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు.

మతసామరస్యంతో అందరూ మెలగాలని, అన్నదమ్ముల్లా కలిసి ఉంటూ సంప్రదాయాలు, విశ్వాసాలను పరిరక్షించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ టీఎస్.దివాకర, ఎస్పీ శబరీశ్, అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, ముస్లిం మతపెద్దలు పాల్గొన్నారు.

భద్రకాళి ఆలయానికి మొండి చేయి

వరంగల్ కల్చరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : బడ్జెట్‌లో వరంగ ల్ భద్రకాళి అమ్మవారి ఆలయాన్ని రాష్ట్ర ప్రభుత్వం విస్మరించింది. దేశంలోనే రెండో మాడవీధులు గల దేవాలయంగా తీర్చిదిద్దాలని, ఆలయానికి రాజగోపురాలను నిర్మించాలని, భద్రకాళి చెరువులో ఐల్యాండ్ నిర్మించాలని భావించి కుడా ఆధ్వర్యంలో ప్రభుత్వం రూ. 30కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభించగా పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. వాటితో పాటు కార్యాలయం, అన్నదాన సత్రం ఇతర నిర్మాణాలకు దాదాపు రూ.50కోట్ల పైచిలుకు నిధులు అవసరం అని బడ్జెట్ అంచనాలు కూడా రూపొందించారు. కానీ రోజురోజుకూ ఖర్చు పెరుగుతుండడంతో కేటాయించిన నిధులతో పనులు పూర్తయ్యే పరిస్థితి కనబడడం లేదు. బుధవారం రాష్ట్ర బడ్జెట్‌లో ప్రభుత్వం దేవాదాయ శాఖకు రూ.190 కోట్లు కేటాయించగా అందులో భద్రకాళి ఆలయానికి మొండిచేయి చూపారు.

పదో తరగతి పరీక్ష కేంద్రాల వద్ద 163 సెక్షన్

హనుమకొండ టౌన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు మార్చి 21 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు జరుగనున్న నేపథ్యంలో వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో పరీక్ష కేంద్రాల వద్ద 163 సెక్షన్ భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్) యాక్ట్ అమలులో ఉంటుందని బుధవారం వరంగల్ పోలీసు కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పరీక్షల సందర్భంగా 500 మీటర్ల దూరం వరకు ఇద్దరికి మించి ఉండరాదని, ఎలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలు, మైక్‌లు, డీజేలతో ఊరేగింపులు, ధర్నాలు నిర్వహించరాదని పేర్కొన్నారు. పరీక్ష సమయంలో ఇంటర్నెట్ సెంటర్ జిరాక్స్ షాపులు మూసి వేయాలని సూచించారు. వివిధ వర్గాల ప్రజలు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు పోలీసులకు సహకరించాలని సూచించారు. ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని సీపీ తెలిపారు.

లస్కర్ల నియామకం ఇప్పట్లో లేనట్టే?

- చేతులెత్తేసిన నీటిపారుదల శాఖ అధికారులు
- ఎమ్మెల్యేల ఒత్తిడితో నిలిచిపోయిన నియామకాలు

హనుమకొండ టౌన్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సాగునీటి కాల్వలు, చెరువుల తూములు పర్యవేక్షణ కోసం ప్రభుత్వం ఆయా గ్రామాల నుంచి లస్కర్లను నియవించేందుకు రెండు నెలల కిందట జీవో జారీ చేసింది. ఈ నియామక ప్రక్రియను హనుమకొండలోని చింతగట్టు నీటిపారుదల శాఖ ప్రధాన కార్యాలయంలో లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించింది. 225 పోస్టులకు గాను ఇప్పటి వరకు 4500 పై చిలుకు దరఖాస్తులు వచ్చినట్లు నీటి పారుదల శాఖ అధికారులు పేర్కొన్నారు.

చేతులెత్తేసిన అధికారులు

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, జనగామ, హనుమకొండ, వరంగల్ జిల్లాల పరిధిలో మొత్తం 225 లస్కర్ల నియామకానికి దరఖాస్తులను స్వీకరించారు. ఇప్పటికే ఎమ్మెల్యేలు వారి అనుచరుల కోసం తమ లెటర్ ప్యాడ్‌ల ద్వారా రెఫరెన్స్ చేయడంతో అధికారులపై ఒత్తిడి పెరిగిందని, ఎటూ తేల్చలేక నియామకాలను నిలిపివేసినట్లు సర్కిల్‌లోని ప్రధాన కార్యాలయ అధికారులు తెలిపారు. ఒకవైపు అధికార పార్టీ ఒత్తిడి, మరో వైపు ఉద్యోగుల సంబంధించిన వారికి నియమించాలని ఒత్తిడి పెరగడంతో ఈ నియామకాలను చేపట్టడం లేదని అధికారులు చెబుతున్నారు.

అధికారులు - ప్రజా ప్రతినిధులు

లస్కర్ల నియామకంలో అధికారులు వర్సెస్ స్థానిక ప్రజా ప్రతినిధులుగా మారింది. ఒకరికంటే ఒకరికి తాము చెప్పిన వారినే లస్కర్లుగా నియమించాలని కొంత మంది ఎమ్మెల్యేలు అధికారులకు అల్టిమేటం జారీ చేయడంతో అధికారులు ఎమ్మెల్యేలు చెప్పిన వారిని నియమించుకుంటే భవిష్యత్తులో పనులు చేయడం కష్టతరమవుతుందని తాత్కాలికంగా లస్కర్ల నియామకంలో తలదూర్చడం లేదని అధికారులు చెబుతున్నారు.

దరఖాస్తుదారుల ఆందోళన

లస్కర్ల నియామకం కోసం ఎంతో మంది నిరుద్యోగులు ఉన్నత చదువులు చదివి రెండు నెలలుగా దరఖాస్తు చేసి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. అధికారుల నుంచి స్పష్టమైన నిర్ణయం తెలుపకపోవడంతో ఎదురు చూస్తున్నట్లు నిరుద్యోగులు చెబుతున్నారు. ఆలస్యమైన కొద్ది కొంత మంది బ్రోకర్లకు నిరుద్యోగులను మోసం చేస్తూ డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా అర్హులైన వారిని గుర్తించి ఎస్ఆర్ఎస్‌పీ కాల్వలపై పర్యవేక్షణ కోసం వెంటనే నియామకాలు చేపట్టాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు.

జనహితమే వారి అభిమతం..

- సోషల్ మీడియా గ్రూప్ వేదికగా సామాజిక సేవా కార్యక్రమాలు
- ఆపన్నులకు అండగా సనాతన హిందూ సేవా సమితి
- నెలనెలా చందాలు వేసుకుంటూ చేయూతనందిస్తున్న సభ్యులు

కరీమాబాద్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): జనహితమే తమ అభిమతంగా ఓ సోషల్ మీడిగా గ్రూప్ వేదికగా పలు సామాజిక సేవా కార్యక్రమాలను చేపడుతూ.. కష్టాల్లో ఉన్న వారికి అండగా నిలుస్తున్నారు 'సనాతన హిందూ సేవా సమితి' సభ్యులు. నగరంలోని శివనగర్ ప్రాంతానికి చెందిన విద్యాసాగర్-స్వరాజ్యం దంపతుల చిన్న కుమారుడైన నగేష్ మొదటి నుంచి సేవా గుణం కలిగిన వ్యక్తిగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఓ ఎలక్ట్రికల్ గూడ్స్ ఏజెన్సీని నిర్వహించే ఆయన తనకు వచ్చే ఆదాయంలో కొంత సేవా కార్యక్రమాలకు వినియోగిస్తుంటారు. ఇలా 2010 నుంచి తన స్వంత ఖర్చులతో పలువురికి సాయం చేస్తున్నారు. వేసవిలో చలివేంద్రాల ఏర్పాటు, మజ్జిగ పంపిణీ, అనాధాశ్రమాల్లో అన్నదానాలు, పర్వదినాల్లో ప్రసాదాల వితరణ, అనారోగ్యంతో ఉన్న వారికి ఆర్థిక చేయూత, ఇబ్బందుల్లో ఉన్న వారికి నిత్యవసర సరుకులు అందించేవారు. ఈ క్రమంలోనే సోషల్ మీడియా వేదికగా ఆయన సామాజిక సేవకు పిలుపునిచ్చారు. సామాజిక సేవ చేయాలన్న ఆసక్తి ఉన్న వారు తనతో చేతులు కలపొచ్చని సమాచారమిచ్చారు. ఈ క్రమంలో ఆయనతో కలిసి పనిచేసేందుకు పలువురు ముందుకు వచ్చారు. ప్రతి నెల మా వంతుగా తోచిన సహాయాన్ని పేదల సహాయార్థం అందజేస్తామని నగరానికి చెందిన మిట్టపెల్లి వేణు, అనుమాండ్ల రాజేందర్, మండల లక్ష్మణ్, అంచూరి వేణుగోపాల్, ప్రతాపగిరి గణేష్. నగేష్‌కు తోడయ్యారు. అలా 'సనాతన హిందూ సేవా సమితి' పేరుతో సోషల్ మీడియా వేదికగా గ్రూపు ఏర్పడింది. 2024 సెప్టెంబరు 10న తాళ్లపల్లి నగేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ గ్రూపు ద్వారా చేసే పలు సామాజిక సేవా కార్యక్రమాలు ఆయా ప్రసార మాధ్యమాల్లో చక్కర్లు కొట్టాయి. దాంతో మరికొంత మంది ఆ గ్రూపులో సభ్యులుగా చేరి వారి సేవా భావాన్ని చాటుకోవడం ప్రారంభించారు. ప్రస్తుతం సనాతన హిందూ సేవా సమితి వ్యవస్థాపకుడిగా తాళ్లపల్లి నగేష్, అధ్యక్షుడిగా మిట్టపెల్లి వేణు, ఉపాధ్యక్షుడిగా అనుమాండ్ల రాజేందర్, కోశాధికారిగా మండల లక్ష్మణ్, సలహాదారులుగా అంచూరి వేణుగోపాల్, ప్రతాపగిరి గణేష్‌తో పాటుపలువురు సభ్యులుగా కొనసాగుతూ సేవలు అందిస్తున్నారు.

విరాళాలతోనే సేవా కార్యక్రమాల నిర్వహణ...

సనాతన హిందూ సేవా సమితి ఆధ్వర్యంలో సేకరించిన విరాళాలతోనే సేవా కార్యక్రమాలనునిర్వహిస్తున్నారు. రూ.100నుంచి మొదలు రూ.1000 వరకు ఎవరి ఆర్థిక స్థితిని బట్టి వారు ప్రతి నెల విరాళాలు చెల్లిస్తున్నారు. కేవలం ఆరుగురు సభ్యులతో ప్రారంభమైన ఈ సనాతన హిందూ సేవా సమితి గ్రూపులో ప్రస్తుతం 230 మంది సభ్యులున్నారు. నెలకు సుమారు రూ.35వేల విరాళాలు సమకూరుతుండగా.. వాటితో సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. ఈ విరాళాల సొమ్మును ఎలా వినియోగించామనే లెక్కలను నెల చివరలో గ్రూపులో పెట్టి తమ పారదర్శకతను చాటుతున్నారు. ఈ సేవా సమితి స్థాపించిన ఆరు నెలల వ్యవధిలో సుమారు 40కిపైగా పలు సామాజికసేవా కార్యక్రమాలను నిర్వహించారు. అలాగే డ్రగ్స్ నివారణ కోసం ఇటీవల వరంగల్ నార్కోటిక్, వరంగల్ పోలీసు శాఖ, జర్నలిస్టుల సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టిన డ్రగ్స్ ఫ్రీ తెలంగాణ 2కే రన్ కార్యక్రమంలో తమ సభ్యులతో పాల్గొని తమ సామాజిక బాధ్యతను చాటుకున్నారు. నగరంలోనే కాకుండా జనగామ, ములుగు, ఏటూరునాగారం, ఉప్పల్ కమాలాపూర్, పర్వతగిరి, ఐనవోలు, ఇలా పలు ప్రాంతాల్లో తమ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నారు. ఇబ్బందుల్లో ఉన్నవారి గురించి తమ గ్రూపు సభ్యుల్లో ఎవరికి సమాచారం అందినా వెంటనే సాయం అందిస్తున్నారు. కొన్ని పేద కుటుంబాలకు రెండు నెలలకు సరిపడా నిత్యవసర సరుకులు, రోడ్డు ప్రమాదాల్లో గాయాలైన వారికి ఉచితంగా మందులు ఇవ్వడం లాంటివి కూడా చేస్తున్నారు.



సనాతన హిందూ సేవా సమితి ఆధ్వర్యంలో పేదలకు సరుకులను అందిస్తున్న కమిటీ సభ్యులు

ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే నిజమైన మానవత్వం..



ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడమే నిజమైన మానవత్వం. సాటి మనిషి కష్టాల్లో ఉన్నప్పుడు ఇచ్చే చేయూతతో వారి కళ్లలో కనిపించే ఆనందంతో మనసుకు సంతృప్తి. సాయం పొందిన పేదవారి కళ్లలో కనిపించే ఆనందానికి వెల కట్టలేం. ప్రతీ ఒకరు ఇబ్బందుల్లో ఉన్న వారికి సహాయపడే గుణాన్ని కలిగి ఉండాలి. అప్పుడే నిస్వార్థ సమాజం రూపుదిద్దుకుంటుంది.

- తాళ్లపల్లి నగేష్, సనాతన హిందూ సేవా సమితి వ్యవస్థాపకుడు

విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఏబీవీపీ ధర్నా

హనుమకొండ కలెక్టరేట్, మార్చి19(ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఏబీవీపీ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏబీవీపీ నాయకులు నినాదాలు చేశారు. అనంతరం కలెక్టరేట్‌లోకి చొచ్చుకువెళ్లారు. వెంటనే సుబేదారి పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి ఏబీవీపీ నాయకులతో మాట్లాడి ధర్నా విరమించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ ప్రాంత కార్యన వి ఎతి సభ్యులు ఆరెపల్లి సుజిత్ మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలని, విద్యా శాఖకు 15శాతతం కేటాయించడం సిగ్గుచేటని, వెంటనే 15శాతం కేటాయించాలని, అలాగే రాష్ట్రవిద్యాశాఖ మంత్రిని నియమించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో ఏబీవీపీ నాయకులు అసజ్, శ్రవణ్, భరత్, శ్రీజ, శ్రీకాంత్, రోహిత్ పాటు పెద్ద సంఖ్యలో ఏబీవీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటర్ల నమోదుకు సహకరించాలి

వరంగల్ ఈస్ట్ రిటర్నింగ్ అధికారి అశ్విని తానాజీ వాకడే

వరంగల్ కార్పొరేషన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): నూతన ఓటర్ల నమోదుకు రాజకీయ పార్టీలు సహకరించాలని వరంగల్ తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే కోరారు. బుధవారం బల్దియా కార్యాలయంలో వివిధ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ.. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సమావేశం ఏర్పాటు చేశామని, రివిజన్ షెడ్యూల్‌లో భాగంగా 2025 ఏప్రిల్ 1 నుంచి ఓటరు నమోదు కార్యక్రమం ఉంటుందని అన్నారు. అదే విధంగా ఈసీ రేషియో, జనరల్ రేషియో ప్రకారం యువ ఓటర్ల నమోదుకు తగిన చర్యలు చేపట్టాలని అన్నారు. పోలింగ్ స్టేషన్‌ల వారిగా ఓట్ల తొలగింపు నమోదు కార్యక్రమాలపై దృష్టి సారించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వరంగల్ తహసీల్దార్ ఇక్బాల్‌తో పాటు వివిధ పార్టీల నాయకులు శ్యాంసుందర్, హరిశంకర్, రజినీకాంత్, ఎమ్డీ అబ్దుల్లాలతో పాటు పలువురు పాల్గొన్నారు.

వేగంగా కమర్షియల్ ట్రేడ్ వసూలు చేయండి

వరంగల్ నగరంలో వేగవంతంగా కమర్షియల్ ట్రేడ్ వసూలు చేయాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. బుధవారం కమర్షియల్ ట్రేడ్ పన్ను వసూళ్లపై డీసీలు, ప్రజారోగ్య విభాగం అధికారులకు బల్దియా కార్యాలయంలో కమిషనర్ దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ట్రేడ్ వసూళ్లలో వేగం పెంచడానికి శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, రెవెన్యూ అధికారులు, జవాన్లు బృందాలుగా ఏర్పాలు చేయాలన్నారు. 7 కాజీపేట, 7 కాశిబుగ్గ సర్కిల్ కార్యాలయాలకు బృందాలను ఏర్పాటు చేసి పెద్ద మొత్తంలో కమర్షియల్ ట్యాక్స్‌లు వసూలు చేయాలని అన్నారు. ఒక ప్రణాళికాబద్ధంగా ట్రేడ్ లైసెన్స్ వసూలు చేయాలని అన్నారు. ఇంకా రెవెన్యూ అధికారులు గడువులోగా లక్ష్యాన్ని చేరుకోవాలని లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, డిప్యూటి కమిషనర్లు ప్రసన్నరెడ్డి, రాజేందర్, ఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్‌తో పాటు ఐటీ సిబ్బంది పాల్గొన్నారు.



వివిధ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ

మహిళల పథకాలకు బడ్జెట్‌లో చోటేదీ ?

» ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి » కుట్టుమిషన్ల పంపిణీ



మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, దాస్యం వినయ్ భాస్కర్,పెద్ది సుదర్శన్‌రెడ్డి

హనుమకొండ టౌన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్‌లో ఎన్నికలకు ముందు మహిళలకు ఇచ్చిన హామీలకు చోటు కల్పించలేదని ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో పోచంపల్లి ఫౌండేషన్, ఏపీఎల్ హెల్త్ కేర్ ఆర్థిక సాయంతో మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ చేశారు. బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డిలతో కలిసి శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందించి ఉచితంగా కుట్టు మిషన్లు అందించారు. ఈ సందర్భంగా పోచంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. మహిళలు ఒకరిపై ఆధారపడ కుండా ఉండేందుకు కుట్టు మిషన్లతో శిక్షణ అందించి ఆర్థికాభివృద్ధికి తోడ్ప డుతున్నట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం హైదరాబాద్ తర్వాత వరంగల్ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిందని, వరంగల్‌కు టెక్స్‌టైల్ పార్కును తీసుకొచ్చిందని తెలి పారు. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో మహిళల అభివృద్ధి, సంక్షేమానికి పెద్ద పీట వేశామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ వరంగల్ పశ్చిమ కోఆర్డినేటర్ పులి రజినీకాంత్, బీఆర్ ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో విద్యా రంగానికి తక్కువ నిధులు

కేయూ క్యాంపస్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి తక్కువ నిధులను కేటాయించడం సరికాదని హనుమకొండ ఎస్ఎఫ్ఐ అధ్యక్ష కార్యదర్శులు స్టాలిన్, మంద శ్రీకాంత్ ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం కేయూ మొదటి గేటు ఎదుట విద్యకు తక్కువ నిధులు కేటాయించడాన్ని నిరసిస్తూ బడ్జెట్ ప్రతులను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా రంగానికి 30 శాతం నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రిని నియమించి విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

పీడీఎస్‌యూ నేతృత్వంలో..

రాష్ట్ర బడ్జెట్‌లో విద్య రంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం మొండి చెయ్యి చూపిందని నిరసిస్తూ బుధవారం కేయూ మొదటి గేటు వద్ద పీడీఎస్‌యూ నేతృత్వంలో బడ్జెట్ ప్రతులను దహనం చేసిన నిరసన వ్యక్తం చేశారు. పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాచకొండ రంజిత్ నేతృత్వంలో జరిగిన నిరసన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కేయూ పీడీఎస్‌యూ ప్రధాన కార్యదర్శి పవన్ కల్యాణ్, జిల్లా నేతలు ముషారఫ్, ఆదిత్య, ఠాకూర్, యుగేందర్, రాజు, బబ్లూ తదితరులు పాల్గొన్నారు.

అరకొర నిధులతో అభివృద్ధి ఎలా సాధ్యం ?

వరంగల్ ఎడ్యుకేషన్ (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో అరకొర నిధులు కేటాయించి విద్యారంగాన్ని ఎలా అభివృద్ధి చేస్తారని పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా ప్రధానకార్యదర్శి మర్రి మహేష్ ప్రశ్నించారు. విద్యారంగాన్ని విస్మరిస్తూ బడ్జెట్‌లో అరకొర నిధులు కేటాయించడాన్ని నిరసిస్తూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో హనుమకొండలోని కేడీసీలో బడ్జెట్‌ప్రతులను దహనం చేశారు. అనంతరం మహేష్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని విస్మరించి పేద, మధ్య తరగతి వారికి విద్యను దూరం చేసే విషపు కుట్రను పన్నుతున్నాయన్నారు. ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వాలు కుయుక్తులు పన్నుతున్నాయని విమర్శించారు. బడ్జెట్‌లో విద్యారంగానికి 7.57 శాతం నిధులు కేటాయించడం రాష్ట్రంలో విద్యారంగంపై కాంగ్రెస్ ప్రభుత్వానికున్న చిత్తశుద్ధిని బహిర్గతం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గణేష్, రాజేష్, అనిల్, సాయి, వంశీ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఒకే దేశం.. ఒకే ఎన్నిక

బీజేపీ రాష్ట్ర నాయకుడు అమరేందర్‌రెడ్డి

హనుమకొండ టౌన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): 'వన్ నేషన్.. వన్ ఎలక్షన్' విధానంతో దేశ భవిష్యత్తు మారుతుందని బీజేపీ రాష్ట్ర నాయకుడు రావు అమరేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం హనుమకొండ హంటర్‌రోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్‌లో జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి ఆధ్వర్యంలో 'ఒకే దేశం.. ఒకే ఎన్నిక బీజేపీ దృష్టి కోణం' అనే అంశంపై వర్క్‌షాపు నిర్వహించారు. ఒకే ఎన్నికపై సంపద వ్యయ నియంత్రణ, శాశ్వత అభివృద్ధి ఎన్నికల కమిషన్‌పై భారం తగ్గింపు, రాజకీయ స్థిరత్వం వంటి ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని రావు అమరేందర్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ డాక్టర్ టి.రాజేశ్వర్‌రావు, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, రాష్ట్ర నాయకులు రావు పద్మారెడ్డి, చాడా శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ పగడాల కాళీప్రసాద్, దొంతి దేవేందర్‌రెడ్డి, కె.సంపత్‌రెడ్డి, సంద్ర మధు, జిల్లా, డివిజన్, మండల కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇది మా స్థలం.. పనులు చేస్తే బాగుండదు..

అభివృద్ధి పనులను అడ్డుకున్న బల్దియా అధికారి సతీమణి

వరంగల్ కార్పొరేషన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): 'ఈ ప్రభుత్వ భూమి మాదే.. మా ఆయన బల్దియాలో పెద్ద సారూ.. ఇక్కడ ఎలాంటి అభివృద్ధి పనులు చేసినా మర్యాదగా ఉండదు.' అని బల్దియాలో పనిచేసే ఓ ఉన్నతాధికారి భార్య కాంట్రాక్టర్‌కు చుక్కలు చూపిస్తోంది. కాంట్రాక్టర్, స్థానిక ప్రజలు తెలిపిన వివరాల ప్రకారం.. డ్రైనేజీ కాలువ నిర్మాణం కోసం వరంగల్ పోతన నగర్‌లో రూ.19.50 లక్షల వ్యయంతో స్మార్ట్ సిటీ నిధులు కేటాయించింది. హనుమకొండకు చెందిన ఓ ఎ-1 కాంట్రాక్టర్ టెండర్‌లో పనులు దక్కించుకున్నాడు. 15 రోజుల కిందట కాంట్రాక్టర్ పోతననగర్ నుంచి రఘునందన్ కాలనీ వరకు 20 మీటర్ల మేరకు పనులు మొదలు పెట్టాడు. కాగా, మూడు రోజుల కిందట బల్దియా ఉన్నతాధికారి సతీమణి.. ఈ నాలా స్థలం అంతా తమదేనని, ఇక్కడ ఎలాంటి అభివృద్ధి పనులు, నిర్మాణాలు చేపట్టకూడదంటూ తనతో పాటు మరో ఇద్దరు మహిళలను కూడ బెట్టుకుని అభివృద్ధి పనులను అడ్డుకుంది. ఇది ప్రభుత్వ నాలా స్థలమని కాంట్రాక్టర్ ఎంత చెప్పినా వినకుండా పనులను అడ్డుకుని అక్కడి కూలీలపై దాడికి దిగే ప్రయత్నం చేసింది. ఇలా.. రెండురోజుల పాటు కాంట్రాక్టర్‌తో పాటు కూలీలకు చుక్కలు చూపించింది. అసలే ఉన్నతాధికారి భార్య.. ఎదురిస్తే తమకు బిల్లులు రాకుండా అవుతుందోమోనని భయపడి కాంట్రాక్టర్ ఒక అడుగు వెనకేశాడు. ఇప్పటికే రూ.10లక్షల వరకు మెటీరియల్‌తో పాటు కూలీలకు ఖర్చు చేశామని, ఇప్పుడు ప్రభుత్వ స్థలాన్ని తమ స్థలమని చెప్పడం ఎంత వరకు న్యాయమని కాంట్రాక్టర్ ప్రశ్నిస్తున్నాడు. ఇప్పటికైనా బల్దియా అధికారులు పనులను పరిశీలించి మధ్యలో మిగిలి పోయిన డ్రైనేజీ నిర్మాణ పనులు పునరుద్ధరించే విధంగా సహకరించాలని సదరు కాంట్రాక్టర్ వేడుకుంటున్నాడు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

మడికొండ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : కాజీపేట మండలం కడిపికొండలోని డబ్బాల చౌరస్తా వద్ద గ్రేటర్ వరంగల్ 44,45వ డివిజన్ల కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా దర్గా పీఏసీఎస్ మాజీ చైర్మన్ గంగుల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టి తీర్మానం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి దశాబ్దాల బీసీల కలను సాకారం చేశాడని కొనియాడారు. ఈసందర్భంగా సీఎంకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు కట్కూరి రమేష్, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

మడికొండలో..

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లును అసెంబ్లీలో ప్రవేశట్టి బీసీల కల నిజం చేసినందుకు మడికొండ చౌరస్తాలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. మెట్టుగుట్ట చైర్మన్ రఘుచందర్, మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సారంపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, భైరి లింగమూర్తి, కుర్ల మోహన్, బిల్ల రవీందర్, గుర్రం అమర్‌నాథ్, వస్కుల శంకర్, ఎడబోయిన ప్రభాకర్, వస్కుల నాగరాజ్, నీలం రజినీ వేణుయాదవ్, వస్కుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే బీసీలకు సామాజిక న్యాయం

వడ్డెపల్లి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్‌తోనే బీసీలకు సామాజిక న్యాయం సాధ్యమవుతుందని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందని తెలంగాణ విశ్వ బ్రాహ్మణ, విశ్వకర్మ ఐక్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రోజు భిక్షపతి అన్నారు. బుధవారం గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ గోపాల్‌పూర్‌లోని తెలంగాణ విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఐక్య సంఘం సమావేశం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు శృంగారపు వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్రోజు భిక్షపతి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీల కుల గణన చేపట్టి 42 శాతం రిజర్వేషన్లను అసెంబ్లీలో ఆమోదించిందన్నారు. సమావేశంలో తెలంగాణ విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఐక్య సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు కురిమిళ్ల రమేష్, జిల్లా నాయకులు రుద్రోజు మణీంద్రనాథ్, కలకోటి శ్రీధర్, కంచెర్ల కమలాకరాచారి, బాలోజీ రవి, బాలోజీ భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగట్టు జాతర హుండీ లెక్కింపు

హసన్‌పర్తి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఎర్రగట్టు వెంకన్న జాతర ఆదాయం రూ.16,33,296 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి వెంకట్రావు తెలిపారు. బుధవారం అంబాల క్రాస్‌రోడ్డులోని ఎర్రగట్టు వేంకటేశ్వ ర స్వామి ఆలయంలో జాతర హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐదు రోజుల పాటు జాతర సందర్భంగా వచ్చిన ఆదాయాలను ఆలయ ఈవో వెంకట్రావు ప్రకటించారు. మొత్తం జాతర ఆదాయం రూ.16,33,296 లు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు వేదాంతం పార్థసారధాచార్యులు, ఆరుట్ల శ్రీధరాచార్యులు, శ్రీనివాస్, ఆరెల్లి, వెంకటస్వామి, కనపర్తి రాజు, శీలం రమేష్, పోతరాజు ప్రభాకర్, సట్కూరి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో విద్యా రంగానికి తీవ్ర అన్యాయం

కేయూ క్యాంపస్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): బడ్జెట్‌లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం జరిగిందని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు కంపాటి పృథ్వీ, ఉపాధ్యక్షుడు బి.నరసింహరావులు ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం కేయూ గెస్ట్‌హౌస్‌లో నిర్వహించిన పీడీఎస్‌యూ సమావేశంలో పృథ్వీ హాజరై మాట్లాడారు. సమావేశంలో పీడీఎస్‌యూ రాష్ట్ర నేతలు అజయ్, కేయూ నేతలు వి.కావ్య, అనూష, గణేశ్, యాదగిరి, శ్రీజ, మల్లేశ్, సాధన, శేఖర్, లోకేశ్, చారి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ఆశావర్కర్ల ధర్నా



ధర్నా చేస్తున్న ఆశావర్కర్లు

హనుమకొండ కలెక్టరేట్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఆశావర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ టీజీ ఆశావర్కర్స్ యూనియన్, సీఐ టీయూ ఆధ్వర్యంలో బుధవారం హనుమకొండ కలెక్టరేట్ ఎదుట ఆశావర్కర్లు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆశావర్కర్లు పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ కలెక్టరేట్ గేటు తీసుకుని లోపలికి చొచ్చుకుని పోయే ప్రయత్నం చేయగా సుబేదారి పోలీసులు అడ్డుకున్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్, ఆశావర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాసు మాధవి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బొట్ల చక్రపాణి, పెద్ద సంఖ్యలో ఆశావర్కర్లు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

వాగ్దేవిలో జాతీయ స్థాయి కాన్ఫరెన్స్

హనుమకొండ టౌన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ నయీంనగర్‌లోని వాగ్దేవి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో బుధవారం 'ఇంటర్ ప్రీమియర్ షిప్ అండ్ ఇన్నోవేషన్ త్రూ ఎంఎస్ఎం' ఈ పేరిట జాతీయ స్థాయి కాన్ఫరెన్స్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ హిమాచల దాసరాజు హాజరై మాట్లాడారు. యువత ప్రాముఖ్యత, ఏఐ విశిష్టత, స్థిరమైన స్వదేశీ పరిశ్రమలను బలోపేతం చేయడం, నూతన పరిశ్రమలకు తోడ్పడడం, ఉద్యోగావకాశాలను సృష్టించడం ద్వారా ఎంఎస్ఎంఈ పరిశ్రమ దేశ ఆర్థికాభివృద్ధిలో ముఖ్యపాత్ర నిర్వహి స్తుందన్నారు. దేశం నలుమూలల నుంచి 50 మందికి పైగా పరిశోధన పత్రాలు సమర్పించినట్లు మహేందర్‌కుమార్ తెలిపారు. ప్రొఫెసర్లు కట్ల రాజేందర్, అమరవేణి, రాజిరెడ్డి, కళాశాల అకడమిక్ డైరెక్టర్ వాహినీదేవి, ప్రిన్సిపాల్ ఎ.శేషాచలం, కాన్ఫరెన్స్ కన్వీనర్స్ పి.సుగుణాకర్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్, ఎ.రజినీకుమార్, డి.కిశోర్‌కుమార్, టి.అనూష, సీహెచ్. కరుణ, డి.చంద్రకళ నాయక్, ఎస్.శాంభవి, స్వాతి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రుద్రేశ్వరాలయంలో హైకోర్టు రిటైర్డు జడ్జి పూజలు

హనుమకొండ కల్చరల్ (ఆంధ్రజ్యోతి): వేయిస్తంభాల ఆలయాన్ని బుధవారం రాష్ట్ర హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి, బీసీ సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ జస్టిస్ చంద్రయ్య, జస్టిస్ నారాయణలు సందర్శించారు. జిల్లా కోర్టు న్యాయమూర్తి రమేశ్‌బాబు ఆదేశాలకు అనుగుణంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఉపేంద్రశర్మ జడ్జీలకు స్వామివారి శేషవస్త్రాలను బహూకరించి మహాదాశీర్వచనం చేశారు.

సీపీని కలిసిన రిటైర్డ్ పోలీసు అధికారులు

హనుమకొండ టౌన్ (ఆంధ్రజ్యోతి): మామునూరు పోలీసు బెటాలియన్ రిటైర్డ్ పోలీసు అధికారులు బుధవారం సీపీ సన్‌ప్రీత్‌సింగ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ పోలీసు అధికారుల అసోసియేషన్ అధ్యక్షుడు రంగరాజు ప్రకాష్, వైస్ ప్రెసిడెంట్ చిలుమల్ల సత్తయ్య, జయంధర్‌రెడ్డి, గాజుల కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ అండ్ హెల్త్ ఫోరం జిల్లా కమిటీ ఎన్నిక

హనుమకొండ కలెక్టరేట్ (ఆంధ్రజ్యోతి): మెడికల్ అండ్ హెల్త్ ఫోరం జిల్లా కమిటీని హనుమకొండ టీఎన్‌జీవోస్ భవన్‌లో బుధవారం ఎన్నుకున్నారు. టీఎన్‌జీఓస్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు రాజేశ్వర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజేష్‌ఖన్నా, కోశాధికారి మహబూబ్‌అలీతో పాటు పూర్తి కమిటీని ఎన్నుకున్నారు. ఈ కమిటీని టీఎన్‌జీఓస్ నాయకులు ఆకుల రాజేందర్, సోమయ్య, కోశాధికారి పనికెల రాజేష్ సన్మానించారు.

రేపటి నుంచి కేయూలో జాతీయ సదస్సు

కేయూ క్యాంపస్ (ఆంధ్రజ్యోతి): మార్చి 21, 22 తేదీల్లో కేయూ రాజనీతిశాస్త్ర విభాగం నేతృత్వంలో ప్రజాస్వామ్య దేశంలో సంకీర్ణ ప్రభుత్వాల ప్రాధాన్యత అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు జరుగుతుందని కేయూ రాజనీతిశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ సంకినేని వెంకట్ వెల్లడించారు. బుధవారం కేయూ రాజనీతిశాస్త్ర అల్యూమినీ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో సదస్సు వివరాలను తెలిపారు. సదస్సును విజయవంతం చేయాలని కోరారు. రాజనీతిశాస్త్ర విభాగం బీవోఎస్ చైర్మన్ గడ్డం కృష్ణయ్య, సత్యనారాయణ, వి.నాగరాజు, స్కాలర్లు పాల్గొన్నారు.

కేయూ వీసీని కలిసిన సీపీ



సీపీకి బొకే ఇస్తున్న వీసీ

కేయూ క్యాంపస్ : పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ బుధవారం కేయూ వీసీ కర్నాటి ప్రతాప్‌రెడ్డిని వర్సిటీలోని తన చాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. వర్సిటీలోకి పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్‌ను వీసీ ప్రతాప్‌రెడ్డి ఆదరంగా స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందజేశారు. వర్సిటీలోని అంతర్గత అంశాలపై చర్చించారు.

పార్ట్‌టైమ్ అధ్యాపకుల నోటిఫికేషన్‌ను విడుదల చేయాలి

కేయూలో అభ్యర్థుల నిరసన

కేయూ క్యాంపస్ (ఆంధ్రజ్యోతి): కాకతీయ వర్సిటీలో పార్టుటైమ్ అధ్యాపకుల నోటిఫికేషన్‌ను వెంటనే విడుదల చేయాలని అభ్యర్థులు బుధవారం కేయూలో నిరసన తెలిపారు. వర్సిటీ లైబ్రరీ ఎదుట రాష్ట్ర ప్రభుత్వం, వర్సిటీ ఉన్నతాధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వీసీ స్పందించి నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కేయూ డాక్టరర్స్ అసోషియేషన్ నేతలు డాక్టర్ వంగ మల్లేశ్, డాక్టర్ చంద్రరావు, డాక్టర్ మోహన్‌రెడ్డి, ఎమ్డీ పాషా, డాక్టర్ బానోత్ స్వామి, డాక్టర్ సురాసి కృష్ణ, డాక్టర్ కే కుమారస్వామి, రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

యూత్ పార్లమెంట్‌కు విద్యార్థుల ఎంపిక

కేయూ క్యాంపస్ (ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్-25 జిల్లా స్థాయి ఎన్ఎస్ఎస్ స్టూడెంట్స్ ఎంపికలు మార్చి 22, 23 తేదీల్లో కేయూ కామర్స్ విభాగం సెమినార్ హాల్‌లో నిర్వహిస్తామని ఎన్ఎస్ఎస్ కేయూ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ తెలిపారు. వరంగల్, ములుగు, హనుమకొండ జిల్లాలకు చెందిన విద్యార్థులు మై భారత్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేసిన వీడియోల ఆధారంగా స్క్రీనింగ్ చేసి ఎంపిక 150 మందిని ఎంపిక చేశామని చెప్పారు. కేయూ వీడియోల స్క్రీనింగ్ కమిటీలో ప్రొఫెసర్ సవితాజ్యోత్స్న, టి. సునిత, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ తాళ్లపల్లి మనోహర్, వైస్ ప్రిన్సిపాల్ మమత, పీవో రాధిక తిప్పని తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి జిజ్ఞాస పోటీల్లో పింగిళి విద్యార్థుల ప్రతిభ

వరంగల్ ఎడ్యుకేషన్ (ఆంధ్రజ్యోతి): కళాశాల విద్యా కమిషనరేట్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి జిజ్ఞాస పోటీల్లో హనుమకొండలోని పింగిళి మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభను కనబరిచారు. మూడు విభాగాల్లో ప్రథమ స్థానాలు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ బి.చంద్రమౌళి తెలిపారు. పోటీల్లో పాల్గొన్న అధ్యాపకులు డాక్టర్ జి. సుహాసిని, డాక్టర్ ఎం. అరుణ, డాక్టర్ కె. శ్రీనివాస్, విద్యార్థులను అభినం దించారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ డి.సురే ష్‌బాబు, జిజ్ఞాస కోఆర్డినేటర్ డాక్టర్ ఎం. ప్రశాంతి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి

హనుమకొండ కలెక్టరేట్ (ఆంధ్రజ్యోతి): టీజీఎస్పీడీసీఎల్ పరిధిలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి సవరణ చేసిన ఆదాయ ఆవశ్యకత, రిటైల్ సరఫరా ధరలు, క్రాస్ సబ్సిడీ సర్‌చార్జీల ప్రతిపాదనలపై కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం బహిరంగ విచారణ జరిగింది. ముందుగా టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి కంపెనీ సమగ్ర సమాచారాన్ని తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి(టీజీఈఆర్‌సీ) చైర్మన్ డాక్టర్ జస్టిస్ దేవరాజు నాగార్జున్ వినియోగదారులకు వివరించారు. టీజీఎస్పీడీసీఎల్ వ్యవసాయ వినియోగదారులందరికీ అంతరాయం లేని విద్యుత్ సరఫరా ఇస్తున్నామని, ఎస్పీడీసీఎల్ పరిధి వ్యవసాయ ఆధార ప్రదేశం అని, 45శాతం విద్యుత్ డిమాండ్ ఉంటుందని అన్నారు. ఎస్పీడీసీఎల్ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులు వివరించారు. విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం నియోగదారులకు ప్రజావాణి గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నామన్నారు. అభ్యంతరాలు వ్యక్తం చేసిన ఆబ్జెక్టర్‌కు సీఎండీ వరుణ్‌రెడ్డి సమాధానాలు ఇచ్చారు. చైర్మన్ దేవరాజు నాగార్జున్ మాట్లాడుతూ.. గ్రామ గ్రామాన వినియోగదారులకు చైతన్యం కల్పించేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. గ్రామాల్లో క్యాంపులు చేపట్టాలన్నారు. అక్కడే సమస్యలు పరిష్కరించేలా సత్వర చర్యలు తీసుకోవాలన్నారు. ఎటువంటి విద్యుత్ టారిఫ్ పెంపు లేదన్నారు. అనంతరం మౌనిక అనే మహిళ తన భర్త విద్యుత్ షాక్‌తో మరణించినా నష్టపరిహారం రాలేదని తెలపడంతో వెంటనే సీఎండీ రూ.5 లక్షలు మంజూరు చేసి దేవరాజు నాగార్జున, మౌనికకు చెక్కు అందజేశారు.

క్రీడలతో విద్యార్థుల్లో మానసిక వికాసం

కేయూ రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రం

కేయూ క్యాంపస్ (ఆంధ్రజ్యోతి): క్రీడలతో విద్యార్థులతో మానసిక వికాసం సాధ్యమవుతుందని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రం అన్నారు. బుధవారం కేయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం నేతృత్వంలో క్యాంపస్ కళాశాల పీజీ స్టూడెంట్స్‌కు టోర్నమెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ తాళ్లపల్లి మనోహర్, క్యాంపస్ కళాశాల పీడీ డాక్టర్ పి. కుమారస్వామిల నేతృత్వంలో జరిగిన క్యాంపస్ కళాశాల క్రీడల టోర్నమెంట్‌కు రిజిస్ట్రార్ రామచంద్రం ముఖ్యఅతిథిగా హాజరై క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రం మాట్లాడుతూ.. క్రీడలతో విద్యార్థులతో స్నేహభావం పెరుగుతుందని, పట్టుదల, కష్టపడే తత్వం అలవాడుతోందని చెప్పారు. ప్రిన్సిపాల్ మనోహర్ మాట్లాడుతూ.. విద్యార్థులకు మార్చి 27 వరకు క్రికెట్, వాలీబాల్, అథ్లెటిక్స్, చెస్, టెన్నికాయిట్, టేబుల్ టెన్నిస్‌తో పాటు ఇతర క్రీడాపోటీలు జరుగుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో కేయూ క్యాంపస్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మమత, హాస్టల్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్, స్పోర్ట్స్ బోర్డు డైరెక్టర్ ప్రొఫెసర్ వై.వెంకయ్య, పీడీ కుమారస్వామి, క్రీడాకారులు పాల్గొన్నారు.బుధవారం కబడ్డీతో పాటు ఇతర క్రీడల్లో విద్యార్థులు తలపడ్డారు.

బీసీ సంఘాల పోరాట ఫలితమే రిజర్వేషన్లు

వడ్డెపల్లి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : బీసీ సంక్షేమ సంఘం పోరాట ఫలితమే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లు శాసన సభలో ఆమోదం పొందిందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భైరి రవికృష్ణ గౌడ్ అన్నారు. బీసీలకు 42 శాతం బిల్లు శాసన సభలో ఆమోదం పొందడాన్ని పురస్కరించుకొని బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. బీసీ సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు దాడి మలయ్య యాదవ్, బచ్చు ఆనందం, తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొనగాని యాదగిరి గౌడ్, కాసగోని అశోక్, తమ్మల శోభారాణి, నాగరాజు, సులోచన, ప్రమోద, పంజాల మధుగౌడ్, మేరుగు శంకర్, సుమన్‌రాజు, నగేష్, అజయ్, నితిన్ తదితరులు పాల్గొన్నారు.



రాహుల్‌గాంధీ, సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న బీసీ నాయకులు

మహిళలు ఎదగాలి

హసన్‌పర్తి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : మహిళలు సమాజంలో ఎదగాలని అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్, కేయూ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ కె.అనితారెడ్డి అన్నారు. మండలంలోని సుమతిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో 'మహిళా శక్తి, వారి హక్కులు' అనే అంశంపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ ఐ.రాజశ్రీ రెడ్డి, డాక్టర్ కె.అనితారెడ్డి, కళాశాల మహిళా రక్షణ సెల్ అధ్యక్షురాలు డాక్టర్ ఎన్.శ్రీవాణి, ఎం.శ్వేత, వివిధ విభాగాధిపతులు ఇ.సుదర్శన్, కె.మహేందర్, ఏవో వేణుగోపాల స్వామి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఒకేసారి 582 మందికి కారుణ్య ఉద్యోగాలు

» నేడు సీఎంచేతుల మీదుగా నియామక పత్రాల పంపిణీ

వికారాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): స్థానిక సంస్థల్లో కారుణ్య నియామకాల కోసం ఎదురుచూస్తున్న బాధిత కుటుంబాలకు శుభవార్త. గురువారం సాయంత్రం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించే కార్యక్రమంలో బాధిత కుటుంబాల వారసులు సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకోనున్నారు. కారుణ్య నియామకాల కింద జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్న వారసుల్లో 582 మంది అర్హులు ఉన్నట్లు గుర్తించారు. సీఎం ఆదేశాలతో జెడ్పీ, మండల పరిషత్తుల్లో ఉన్న 524 ఆఫీసు సబార్డినేట్, నైట్ వాచ్‌మెన్ పోస్టులను జూనియర్ అసిస్టెంట్ పోస్టులుగా అప్‌గ్రేడ్ చేశారు. అలాగే కొత్తగా మరో 58 జూనియర్ అసిస్టెంట్ సూపర్‌న్యూమరరీ పోస్టులను సృష్టించారు. దీంతో ఎంతోకాలంగా కారుణ్య నియామకాల కోసం ఎదురుచూస్తున్న 582 మందిని జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగాల్లో నియమించేందుకు మార్గం సుగమమైంది.



వియోనా ఫిన్‌టెక్ సంస్థ చైర్మన్ రవీంద్రనాథ్‌తో కలిసి "గ్రామ్ పే" డిజిటల్ చెల్లింపులను ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు,

డిజిటల్ ఆర్థిక వ్యవస్థను విస్తరించడంలో సాంకేతికతది కీలక పాత్ర: మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ ఆర్థిక వ్యవస్థను విస్తరించడంలో సాంకేతికత కీలక పాత్ర పోషిస్తుందని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. వియోనా ఫిన్‌టెక్ సంస్థ అభివృద్ధి చేసిన "గ్రామ్ పే" డిజిటల్ చెల్లింపుల్ని మంత్రి హైదరాబాద్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డిజిటల్ చెల్లింపులు, గ్రామీణ వాణిజ్యాన్ని ప్రోత్సహించడం వల్ల గ్రామీణ ప్రజలు ఆర్థిక సేవలకు చేరువవుతారని అన్నారు. గ్రామ్ పే వ్యవస్థలో గ్రామస్థాయి వ్యాపారులు కీలకపాత్ర పోషిస్తారని, రైతులు, చిన్న వ్యాపారులు, కళాకారులు తమ ఉత్పత్తులను విస్తృత మార్కెట్‌కు తీసుకెళ్లే అవకాశం ఈ వేదిక ద్వారా పొందుతారని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. గ్రామీణ, పట్టణ, దేశాల మధ్య ఉన్న ఆర్థిక అంతరాన్ని తగ్గించడమే లక్ష్యంగా గ్రామ్ పే పనిచేస్తుందని వియోనా ఫిన్‌టెక్ సంస్థ చైర్మన్ రవీంద్రనాథ్ తెలిపారు. గ్రామ్ పే ఒక సాధారణ చెల్లింపు ప్లాట్‌ఫామ్ మాత్రమే కాదని నిజమైన ఆర్థిక సమగ్రత వైపు సాగుతున్న ఉద్యమమని ఆయన పేర్కొన్నారు.

అందాల పోటీలతో కేటీఆర్‌కొచ్చిన ఇబ్బందేంటి?

» అఖిలపక్షాన్ని ప్రధానితో కలిపించే బాధ్యత బీజేపీదే: పొన్నం

హైదరాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి):హైదరాబాద్‌లో అందాల పోటీలు పెడితే కేటీఆర్‌కు వచ్చిన ఇబ్బందేంటని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. అందాల పోటీలకు హైదరాబాద్ వేదిక కావద్దని ఆయన అనుకుంటున్నారా, అంత అర్హత ఈ నగరానికి లేదని భావిస్తున్నారా, ఇక్కడ అందాల పోటీలు జరుగుతుంటే ఎందుకు ఈర్ష పడుతున్నారని ప్రశ్నించారు. ఈ పోటీలకు ప్రభుత్వం రూ. 250 కోట్లు ఖర్చు చేస్తుందన్నది అవాస్తవమని అన్నారు. బీసీ రిజర్వేషన్ కోసం అఖిలపక్షాన్ని ప్రధాని మోదీతో కలిపించే బాధ్యత బీజేపీ రాష్ట్ర నేతలదేనని, త్వరలోనే ప్రభుత్వ ఆధ్వర్యంలో అఖిలపక్షం ఢిల్లీకి వెళ్లి ప్రధానిని కలుస్తుందని తెలిపారు. ఎల్బీ నగర్ ఎమ్మెల్యే వాఖ్యలపై హైదరాబాద్ ఇంచార్జి మంత్రిగా తనుక ఫిర్యాదు వచ్చిందని, బీఆర్ఎస్ పార్టీ అహంకారానికి సుధీర్ రెడ్డి వ్యాఖ్యలు నిదర్శనమని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

మూటలు మోసింది కేటీఆరే: మంత్రి సీతక్క

హైదరాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీకి మూటలు మోసే బడ్జెట్ అంటూ కేటీఆర్ వ్యాఖ్యలు ఆయన మానసిక పరిణితికి అద్దం పడుతున్నాయని మంత్రి సీతక్క అన్నారు. వాస్తవానికి ఇతర రాష్ట్రాలకు మూటలు మోసింది కేటీఆరేనని, అవి తీసుకున్నవారంతా ఆగమయ్యారని ఎద్దేవా చేశారు. రాష్ట్రాన్ని మోయలేనంత అప్పుల్లో ముంచిందే బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, అలాంటిది అప్పుల గురించి కేటీఆర్ మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. ఇది బీఆర్ఎస్‌లా ఆహా.. ఓహో భజన బడ్జెట్ కాదని, వంద శాతం వాస్తవిక బడ్జెట్ అని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

మనుస్మృతి అమలే బీజేపీ లక్ష్యం: మహేశ్‌గౌడ్

హైదరాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం స్థానంలో మనుస్మృతిని అమలు చేయాలన్నదే బీజేపీ లక్ష్యమని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ ఆరోపించారు. ఈ కుట్రలో భాగంగానే రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పైన కేంద్రమంత్రి అమిత్‌షా అనుచిత వ్యాఖ్యలు చేశారని అన్నారు. గాంధీభవన్‌లో బుధవారం జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమ సన్నాహక సమావేశం జరిగింది. మహేశ్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, సీడబ్ల్యూసీ సభ్యుడు వంశీచంద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేశ్‌గౌడ్ మాట్లాడుతూ, అంబేడ్కర్‌పైన అమిత్‌షా అహంకార పూరిత వ్యాఖ్యలు క్షమించరానివని అన్నారు.

రాష్ట్ర ప్రజలకు వాతావరణశాఖ చల్లటి వార్త

» పలు జిల్లాలకు వర్షసూచన.. తగ్గనున్న ఉష్ణోగ్రతలు

కొద్ది రోజులుగా ఎండలతో అల్లాడిపోతున్న రాష్ట్ర ప్రజలకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం చల్లటి వార్తను అందించింది. ద్రోణి ప్రభావం కారణంగా శుక్రవారం రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది. రాగల 2 రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణంగా కొనసాగే అవకాశముందని, ఆ తర్వాత మూడు రోజులు స్వల్పంగా తగ్గుతాయని తెలిపింది. బుధవారం మంచిర్యాల జిల్లా భీమారంలో అత్యధికంగా 41.8 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైనట్లు వెల్లడించింది. రాష్ట్రంలోని 17 జిల్లాల్లో 40 డిగ్రీలకు పైగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు రికార్డయినట్లు వాతావరణశాఖ తెలిపింది.

సీఎం రేవంత్‌ను దూషించిన వ్యక్తి అరెస్ట్

ఇనుగుర్తి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : సీఎం రేవంత్‌రెడ్డిని దూషించిన కేసులో మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండలం చిన్నముప్పారం గ్రామానికి చెందిన దర్శనం వెంకటయ్యను హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు అరెస్ట్ చేశారు. కాంగ్రెస్ సర్కారు పాలనపై ఓ యూట్యూబర్ అడిగిన ప్రశ్నకు వెంకటయ్య అసభ్య పదజాలంతో సమాధానమిచ్చాడు. సీఎం రేవంత్‌రెడ్డిని తీవ్రంగా బూతులు తిట్టాడు. ఇటీవల సోషల్ మీడియాలో ఆ వీడియో వైరల్ అయింది. దీంతో యూట్యూబర్‌తో పాటు వెంకటయ్యపై పోలీసులు కేసు నమోదు చేశారు. యూట్యూబర్‌ను ఇప్పటికే అరెస్ట్ చేయగా, బుధవారం చిన్నముప్పారం వచ్చిన హైదరాబాద్ పోలీసులు వెంకటయ్యను అదుపులోకి తీసుకున్నారు.

మద్యం కొత్త బ్రాండ్ల దరఖాస్తులకు గడువు పెంపు

» ఏప్రిల్ 2 వరకు పొడిగించిన ఎక్సైజ్ శాఖ

హైదరాబాద్ సిటీ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కొత్త బ్రాండ్ల మద్యం విక్రయానికి దరఖాస్తు చేసుకోవడానికి మార్చి 15 వరకు ఉన్న గడువును ఎక్సైజ్ శాఖ పొడిగించింది. ఏప్రిల్ 2 వరకు ఇందుకు దరఖాస్తు చేసుకోవచ్చని తాజాగా ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు వెల్లడించారు. మరికొంత గడువు ఇవ్వాలని కొన్ని కంపెనీల నుంచి వినతులు వచ్చిన నేపథ్యంలో ఏప్రిల్ 2 వరకు గడువు పెంచుతున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ కమిషనర్ చెవ్వూరు హరికిరణ్ ఒక ప్రకటనలో తెలిపారు.

స్మితా సబర్వాల్ కారు అద్దె నెలకు రూ.63 వేలు!

» వ్యవసాయ వర్సిటీ నుంచి 90 నెలల పాటు మొత్తం 56.70 లక్షల చెల్లింపు

» వర్సిటీ నుంచి అద్దె ఎందుకు చెల్లించారు?

» ఏజీ ఆడిట్‌లో అధికారుల అభ్యంతరం



రాజేంద్రనగర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): సీనియర్ ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్‌కు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి 90 నెలల పాటు వాహన అద్దె చెల్లించారు. కారుకు నెలకు రూ.63000 చొప్పున రూ.56.70 లక్షలు చెల్లించారు. ఆమెకు ఇలా ఎందుకు చెల్లించాల్సి వచ్చిందని ఆడిట్ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలిసింది. గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి కార్యాలయ(సీఎంవో) అదనపు కార్యదర్శి హోదాలో ఉన్న స్మితాసబర్వాల్‌కు వ్యవసాయ వర్సిటీ నుంచి వాహన అద్దె ఎందుకు చెల్లించారనే అంశంతోపాటు ఆర్థిక, విధానపరమైన మరో 12 అంశాలపై కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఏజీ ఆడిట్ అధికారుల బృందం ప్రశ్నించినట్లు సమాచారం. 2024 ఆగస్టు నుంచి డిసెంబరు వరకు వ్యవసాయ వర్సిటీలో నిర్వహించిన ఆడిట్‌లో ఈ అంశాలు బయటకు వచ్చాయి. వీటిపై ఇటీవల జరిగిన వర్సిటీ పాలకమండలి సమావేశంలో చర్చించినట్లు తెలిసింది. 12 అభ్యంతరాల్లో ప్రస్తుత పర్యాటక శాఖ కార్యదర్శి స్మితా సబర్వాల్‌కు చెల్లించిన వాహనం అద్దె విషయంపై ఆధారాలు ఉండడంతో ఆ అంశం ప్రధాన చర్చకు దారి తీసినట్లు సమాచారం. 2016 అక్టోబరు నుంచి 2024 మార్చి వరకు స్మితా సబర్వాల్‌కు నెలకు రూ.63 వేలను కారు అద్దె రూపంలో చెల్లించారు. వర్సిటీ ద్వారా నెలనెలా అద్దెకు తీసుకుని చెల్లించిన ఇన్నోవా వాహనం టీఎస్08ఈసీ6345 ట్యాక్సీ ప్లేట్ కాదని తేలింది. పవన్ కుమార్ అనే వ్యక్తి పేరు మీద ఉన్నట్లు గుర్తించారు. స్మితా సబర్వాల్ నుంచి ప్రతి నెలా వాహనం అద్దె రశీదులు రావడంతో వర్సిటీ యాజమాన్యం డబ్బు చెల్లించింది.

ఎవరికీ నోటీసులివ్వలేదు: జానయ్య, వీసీ

గత సంవత్సరం ఆగస్టు నుంచి డిసెంబరు వరకు జరిగిన ఏజీ ఆడిట్‌లో ఆర్థిక, విధాన పరమైన 12 అంశాలకు సంబంధించి అభ్యంతరాలు వచ్చాయి. వాటిపై పాలకమండలిలో చర్చించాం. ఆడిట్ అభ్యంతరాలన్నీ వాస్తవమని చెప్పలేం. నిజంగా తప్పు జరిగితే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం. సర్కారు సూచన మేరకు చర్యలు తీసుకుంటాం. ఇప్పటి వరకు ఎవరికీ నోటీసులు ఇవ్వలేదు.

● స్మితా సబర్వాల్‌కు నెలకు రూ.63 వేల చొప్పున 90 నెలల పాటు వాహన అద్దె చెల్లించడంపై ఆడిట్ అభ్యంతరాలు వచ్చాయని వర్సిటీ రిజిస్ట్రార్ విద్యాసాగర్ చెప్పారు. బిల్లు పెట్టింది ఎవరు? దానికి ఆమోదం తెలిపింది ఎవరు? అనే విషయాలపై కూడా పూర్తి స్థాయిలో విచారణ జరిపితే బాగుంటుందని ఆయన వ్యాఖ్యానించడం గమనార్హం.

వర్గీకరణ ఎవరికీ వ్యతిరేకం కాదు

మాదిగలకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దే యత్నం.. ఉద్ధండులైన లాయర్లతో కోర్టును మెప్పించాం

» చిక్కులు రాకుండా బిల్లు పెట్టి ఆమోదించాం

» రాహుల్ వల్లే వర్గీకరణ సాధ్యమైంది

» 10లక్షల మందితో సభ నిర్వహించి.. కృతజ్ఞతలు చెప్పండి

» మరో 4 రాష్ట్రాల్లో అమలు చేయిస్తారు

» అవకాశాన్ని అందిపుచ్చుకోండి.. మాకు అండగా నిలవండి: సీఎం రేవంత్



అసెంబ్లీ కమిటీ హాల్‌లో ఎస్సీ సంఘాల ప్రతినిధులతో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి దామోదర రాజనర్సింహ

హైదరాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ... ఎవరికీ వ్యతిరేకం కాదని, మాదిగ సామాజిక వర్గానికి జరిగిన అన్యాయాన్ని సరిదిద్దే ప్రయత్నమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. భవిష్యత్తులో న్యాయపరమైన ఇబ్బందులూ తలెత్తకుండా పకడ్బందీగా ప్రక్రియ పూర్తి చేసి.. వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో ఆమోదించుకున్నామన్నారు. వచ్చిన ఈ అవకాశాన్ని ఒడిసి పట్టుకుని సద్వినియోగం చేసుకోవాలని మాదిగ, మాదిగ ఉప కులాల నేతలకు పిలుపునిచ్చారు. శాసనసభలో ఎస్సీ వర్గీకరణ బిల్లుకు ఆమోదం లభించిన నేపథ్యంలో మంత్రి దామోదర రాజనర్సింహ ఆధ్వర్యంలో మాదిగ, మాదిగ ఉపకులాల నేతలు బుధవారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి ధన్యవాదాలు తెలిపారు. అసెంబ్లీలోని కమిటీ హాల్‌లో జరిగిన సమావేశంలో టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, వేముల వీరేశం, మందుల సామేలు, కవ్వంపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వర్గీకరణ పోరాటంలో అమరులైన వారికి నివాళులర్పిస్తూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై భిన్నాభిప్రాయాలున్నా.. తానున్నానంటూ రాహుల్‌గాంధీ భుజం తట్టడంతో క్రమ పద్ధతిలో బిల్లును ఆమోదించగలిగామన్నారు. రాహుల్‌గాంధీ పట్టుదలే లేకుంటే ఎస్సీ వర్గీకరణ అమలు చేసే శక్తి తనకు వచ్చి ఉండేదే కాదన్నారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత ఎస్సీ వర్గీకరణకు సానుకూలంగా ఉన్నామంటూ తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని అసెంబ్లీలో తాను సావధాన తీర్మానాన్ని ప్రవేశ పెడితే.. అప్పటి ప్రభుత్వం తనను, సంపత్‌కుమార్, సండ్ర వెంకట వీరయ్యను సభ నుంచి బహిష్కరించిందని గుర్తు చేశారు. ఆ తర్వాత విధిలేని పరిస్థితిలో తాను పెట్టిన తీర్మానాన్నే సభ ఏకగ్రీవంగా ఆమోదించాల్సి వచ్చిందన్నారు. ఈ అంశంపై అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్తామన్న అప్పటి ప్రభుత్వం.. పదేళ్ల పాటు పట్టించుకోలేదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత.. సుప్రీం కోర్టులో ఏళ్ల తరబడి వాయిదా పడుతున్న వర్గీకరణ కేసుపై దృష్టి పెట్టామన్నారు. అభిషేక్ సింఘ్వీ, సిద్ధార్థ్ లూథ్రా వంటి ఉద్దండులైన న్యాయవాదులను పెట్టి ప్రభుత్వం తరఫున బలమైన వాదనలు వినిపించామన్నారు. ఏడుగురు జడ్జిలతో కూడిన బెంచ్‌ను మెప్పించడంతో తీర్పు అనుకూలంగా వచ్చిందన్నారు. సుప్రీం కోర్టు తీర్పు వెలువడిన వెంటనే ప్రక్రియను ప్రారంభించామని, ఉత్తమ్ చైర్మన్‌గా మంత్రివర్గ ఉపసంఘాన్ని వేశామన్నారు. ఆ సంఘం ఆరు సార్లు సమావేశమై.. సుప్రీం కోర్టు తీర్పుపై న్యాయ సమీక్ష జరగాలని సూచించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో జస్టిస్ షమీమ్ చైర్మన్‌గా ఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఆ కమిషన్.. 59 కులాల పరిస్థితులను లోతుగా అధ్యయనం చేసి విశ్లేషణతో కూడిన 199 పేజీల నివేదిక ఇచ్చిందన్నారు. ఆ నివేదిక ఆధారంగా ఎలాంటి అభివృద్ధి ఫలాలు దక్కని, అతి తక్కువ జనాభా ఉన్న వారిని గ్రూప్-1 కింద(1శాతం), పర్వాలేదనుకున్న వారిని గ్రూప్-2 కింద(9శాతం), రిజర్వేషన్లతో మెరుగైన ఫలితాలు సాధించుకున్నవారిని గ్రూప్-3 కింద(5శాతం) చేర్చామన్నారు. దీని ప్రకారం మాదిగ, మాదిగ ఉప కులాలకు సుమారుగా పది శాతం రిజర్వేషన్ అందుబాటులోకి వచ్చిందన్నారు.

మంద కృష్ణ నాకు మంచి మిత్రుడే కానీ!

మంద కృష్ణ మాదిగ తనకు మంచి మిత్రుడేనని, వ్యక్తిగతంగానూ తమ మధ్య మంచి సంబంధాలే ఉన్నాయని సీఎం రేవంత్ వెల్లడించారు. తమ మధ్య చిన్నపాటి భిన్నాభిప్రాయలు కూడా లేవన్నారు. అయితే, తన కంటే ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డినే మంద కృష్ణ ఎక్కువగా నమ్ముతున్నారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మాదిగ ఆడబిడ్డ రాణికుముదినిని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్‌గా నియమించామన్నారు. ఉస్మానియా వర్సిటీకి వీసీగా కుమార్, ఆర్ట్స్‌కాలేజీ ప్రిన్సిపల్‌గా కాశింను నియమించామన్నారు. బాసర ట్రిపుల్ ఐటీ వీసీగా, పబ్లిక్ సర్వీస్ కమిషన్, విద్యా కమిషన్ సభ్యులుగా మాదిగ సామాజిక వర్గం వారికి అవకాశం ఇచ్చామన్నారు. వర్గీకరణ కొలిక్కి వచ్చే వరకూ నోటిఫికేషన్లు విడుదల చేయబోమని చెప్పి.. దానికి కట్టుబడ్డామన్నారు. వచ్చిన అవకాశాన్ని ఒడిసి పట్టుకుని.. నిలబెట్టుకోవాలని మాదిగ, మాదిగ ఉపకులాల నేతలకు రేవంత్ సూచించారు. అవకాశాలు వచ్చిన వారు.. ఇబ్బందుల్లో ఉన్న మరో పది మందికి సాయం చేయాలని కోరారు. మాదిగ, మాదిగ ఉపకులాల అభివృద్ధికి తమ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. మాదిగలూ తమ పార్టీకి అండగా నిలబడాలని కోరారు.

పది లక్షల మందితో సభ పెట్టండి

పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన ధర్మయుద్ధం సభ తరహాలో.. ఎస్సీ వర్గీకరణ విజయోత్సవ సభను పది లక్షల మందితో నిర్వహించాలని మాదిగ, మాదిగ ఉప కులాల నేతలకు సీఎం రేవంత్ సూచించారు. ఆ సభకు రాహుల్‌గాంధీని తీసుకువస్తామని చెప్పారు. భారీఎత్తున సభ పెట్టి కృతజ్ఞతలు తెలిపితే.. ఆ ఉత్సాహంతో మరో నాలుగు రాష్ట్రాల్లో వర్గీకరణను ఆయన అమలు చేయిస్తారన్నారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో వర్గీకరణ అమలైతే.. సహజంగానే మిగతా రాష్ట్రాలకూ సెగ తగులుతుందన్నారు.

ఇంధన శాఖకు 'భట్టి' వెలుగులు

» 21,221 కోట్ల కేటాయింపులు

» గతేడాదితో పోల్చితే 4,811 కోట్లు అధికం



హైదరాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క రాష్ట్ర శాసనసభలో బుధవారం ప్రవేశపెట్టిన 2025-26 బడ్జెట్ ప్రతిపాదనల్లో తన సొంత ఇంధన శాఖకు కేటాయింపుల్లో అగ్ర తాంబూలం ఇచ్చారు. ప్రగతి పద్దు కింద రూ.19,590 కోట్లు, నిర్వహణ పద్దు కింద రూ.1,630 కోట్లు కలిపి ఇంధన శాఖకి మొత్తం రూ.21,221 కోట్లను కేటాయించారు. ఇంధన శాఖ బడ్జెట్ రూ.20 వేల కోట్లను దాటడం ఇదే తొలిసారి. ఈ శాఖకు 2023-24లో రూ.12,727కోట్లు, 2024-25లో రూ.16,410కోట్లను కేటాయించగా, తాజాగా కేటాయింపులు గణనీయంగా పెరిగాయి. గ్రీన్ ఎనర్జీ పాలసీ-2025 కింద పెట్టుబడిదారులకు రాయితీ, ప్రోత్సాహకాలను అందించడానికిబడ్జెట్‌లో రూ.754.7 కోట్లను కేటాయించింది. ఎంపిక చేసిన గ్రామాల్లో 100 శాతం మేర సౌర విద్యుదీకరణకు రూ.1,132.05 కోట్లను కేటాయించింది. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నందుకుగాను డిస్కమ్‌లకు చెల్లిస్తున్న రూ.8,260కోట్ల సబ్సిడీని ప్రభుత్వం యథాతథంగా కొనసాగించింది. గృహజ్యోతి పథకం సబ్సిడీ మొత్తాన్ని రూ.1,825.01కోట్ల నుంచి రూ.1,509.4కోట్లకు తగ్గించింది. డిస్కమ్‌లకు ఆర్థిక సహాయాన్ని రూ.50 కోట్ల నుంచి భారీగా రూ.1,509.4 కోట్లకు పెంచింది. జెన్‌కోకు సహాయంగా రూ.754.7 కోట్లతోపాటు విద్యుత్ కేంద్రాల నిర్మాణానికి ఇచ్చే రుణాలను రూ.144.63 కోట్ల నుంచి రూ.1,590.67 కోట్లకు పెంచింది.

గ్రామీణాభివృద్ధికి 31వేల కోట్లు!

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు ప్రభుత్వం రూ.31,605కోట్లు కేటాయించింది. గతేడాది కేటాయించిన రూ.29,816 కోట్లతో పోల్చితే రూ.1,789 కోట్లు ఎక్కువ. వీటిలో 'చేయూత ఫించన్ల పథకం' అమలుకే రూ.14,861కోట్లు కేటాయించింది. కూలీలకు ఆత్మీయ భరోసా పథకం కింద ఏటా రూ.12వేల చొప్పున చేయూత ఇవ్వడానికి రూ.600కోట్లు, స్వయంశక్తి మహిళా సంఘాల రుణాలపై వడ్డీ మాఫీకి రూ.1,511కోట్లు ప్రతిపాదించారు.

'కల్యాణ లక్ష్మి'కి రూ.1,241 కోట్లు!

కళ్యాణలక్ష్మి పథకం కింద ఆడబిడ్డల పెళ్లికి బడ్జెట్‌లో తెలంగాణ ప్రభుత్వం రూ. 1,241.4 కోట్లు కేటాయించింది ఇందులో ఎస్సీలకు రూ.187.15 కోట్లు, ఎస్టీలకు రూ.130.15 కోట్లు, బీసీలకు రూ. 614.24 కోట్లు కేటాయించింది. ఇక, షాదీముబారక్ పథకం కింద మైనార్టీలకు రూ.309.86 కోట్ల సాయం ప్రతిపాదించింది.

హైదరాబాద్‌లో మెక్ డొనాల్డ్స్ ఆఫీసు

2వేల మందితో నెలకొల్పేందుకు సంస్థ సుముఖం

» సీఎం రేవంత్‌ను కలిసిన ప్రతినిధులు

» తెలంగాణ తో పెట్టుబడుల ఒప్పందం



సీఎం రేవంత్‌తో మెక్‌డొనాల్డ్స్ చైర్మన్, సీఈవో క్రిస్ కెంప్‌జిన్స్కీ, సీఎస్ శాంతికుమారి, జయేష్ రంజన్

హైదరాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): అమెరికాకు చెందిన బహుళ జాతి సంస్థ మెక్‌డొనాల్డ్స్. తెలంగాణ ప్రభుత్వంతో కీలక ఒప్పందం చేసుకుంది. సంస్థ విస్తరణలో భాగంగా మెక్‌డొనాల్డ్స్ ఇండియా గ్లోబల్ కార్యాలయాన్ని హైదరాబాద్‌లో నెలకొల్పేందుకు ముందుకు వచ్చింది. 2 వేల మంది ఉద్యోగులతో ఈ ఆఫీసును నెలకొల్పనుంది. అసెంబ్లీలోని ముఖ్యమంత్రి చాంబర్‌లో బుధవారం సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన మెక్‌డొనాల్డ్స్ చైర్మన్, సీఈవో క్రిస్ కెంప్‌జిన్స్కీ, ఆ సంస్థ ప్రతినిధులు ఈ మేరకు చర్చలు జరిపారు. ప్రభుత్వ భాగస్వామ్యంతో తమ కార్యాలయ ఏర్పాటుకు సంబంధించి పెట్టుబడుల ఒప్పందం చేసుకున్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి పాల్గొన్నారు. మెక్‌డొనాల్డ్స్ ప్రతినిధుల బృందంలో సీఈవోతో పాటు గ్లోబల్ బిజినెస్ సర్వీసెస్ అధ్యక్షుడు స్కై ఆండర్సన్, చీఫ్ గ్లోబల్ ఇంపాక్ట్ ఆఫీసర్ జాన్ బ్యానర్, గ్లోబల్ ఇండియా హెడ్ దేశాంత కైలా ఉన్నారు. మెక్‌డొనాల్డ్స్ గ్లోబల్ ఆఫీస్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసేందుకు ముందుకు రావటంపై సీఎం రేవంత్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ గ్లోబల్ సెంటర్ కోసం పలు రాష్ట్రాలు పోటీ పడుతున్నా.. తెలంగాణనే ఎంచుకోవడం తమకు గర్వకారణమన్నారు. కార్యాలయ ఏర్పాటుకు ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. గడిచిన 15 నెలల్లో రాష్ట్ర ప్రభుత్వం నైపుణ్య అభివృద్ధికి చేపట్టిన కార్యక్రమాలను మెక్‌డొనాల్డ్స్ ప్రతినిధులకు సీఎం వివరించారు. సంస్థకు అవసరమైన శిక్షణ, నిపుణులైన ఉద్యోగులను నియమించుకునేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ సేవలు వినియోగించుకోవాలని సూచించారు. యూనివర్సిటీని స్కిల్ జోన్‌గా ఉపయోగించుకొని, ఇక్కడ శిక్షణ పొందిన వారికి గ్లోబల్ ఆఫీస్‌లోనే కాకుండా, దేశ విదేశాల్లోని మెక్‌డొనాల్డ్స్ ఆఫీసులు, ఔట్‌లెట్లలో ఉద్యోగాలు కల్పించాలన్నారు. మెక్‌డొనాల్డ్స్‌కు అవసరమైన అన్ని వ్యవసాయ ఉత్పత్తులను సరఫరా చేసేందుకు స్థానిక రైతులకు అవకాశం కల్పించాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. తద్వారా రైతుల ఆదాయం పెరుగుతుందని, రాష్ట్ర వ్యవసాయ ఆర్థిక వ్యవస్థకు తోడ్పడుతుందని అభిప్రాయపడ్డారు. కాగా, బెంగళూరు లాంటి ఇతర నగరాలతో పోలిస్తే హైదరాబాద్‌లో ప్రతిభావంతులైన నిపుణులతో పాటు మెరుగైన మౌలిక సదుపాయాలు, నాణ్యమైన జీవన ప్రమాణాలున్నాయని మెక్ డొనాల్డ్స్ సీఈవో క్రిస్ కెంప్‌జిన్స్కీ అన్నారు. అందుకే హైదరాబాద్‌ను తమ గ్లోబల్ ఇండియా ఆఫీస్ సెంటర్‌గా ఎంచుకున్నామని చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా మెక్ డొనాల్డ్స్ నిర్వహిస్తున్న సామాజిక అభివృద్ధి కార్యక్రమాలను ఆయన వివరించారు. తదుపరి సంప్రదింపులు, ప్రభుత్వం సహకారంతో రాష్ట్రంలోనూ ఇటువంటి కార్యక్రమాలను చేపడతామని అన్నారు. ప్రస్తుతం తెలంగాణలో 38 మెక్‌డొనాల్డ్స్ ఔట్‌లెట్లున్నాయని, ఏటా 3 లేదా 4 కొత్త ఔట్‌లెట్లను విస్తరించే ప్రణాళిక ఉన్నాయని తెలిపారు. కొత్తగా గ్లోబల్ ఇండియా ఆఫీసు ఏర్పాటుతో రాష్ట్రంలోని యువతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు.

ఉగాది నుంచి సన్నబియ్యం పంపిణీ

» సూర్యాపేట జిల్లా మట్టపల్లిలో ప్రారంభించనున్న సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్

హైదరాబాద్, హుజూర్‌నగర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): సన్నబియ్యం పంపిణీ ఉగాది పండుగ రోజున ప్రారంభంకాబోతోంది. పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సొంత నియోజకవర్గమైన హుజూర్‌నగర్‌లో ఈ పథకాన్ని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం మట్టపల్లి గ్రామంలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సన్నబియ్యం పథకాన్ని ప్రారంభించనున్నారు. ఈ నెల 30న ఉగాది పర్వదినం సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆహ్వానం మేరకు సూర్యాపేట జిల్లా మఠంపల్లికి సీఎం రానున్నట్లు తెలిసింది. మట్టపల్లి లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు పూజల్లో పాల్గొని పంచాంగ శ్రవణంలో పాల్గొన్న అనంతరం సన్న బియ్యం పంపిణీని ప్రారంభించనున్నారని సమాచారం. అనంతరం మట్టపల్లిలో భారీ బహిరంగ సభలో సీఎం ప్రసంగించనున్నారు. హుజూర్‌నగర్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు కూడా సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్ శంకుస్థాపన చేసే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ఉగాది సందర్భంగా నియోజకవర్గంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు పెద్దఎత్తున ప్రారంభించనున్నారు. సీఎం రాక సందర్భంగా మంత్రి ఉత్తమ్ గురువారం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. మట్టపల్లి పుణ్యక్షేత్రం, భారీ బహిరంగసభ స్థలాన్ని పరిశీలించనున్నారు. కాగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తామని హామీ ఇచ్చింది. అందుకనుగుణంగా ఏర్పాట్లు చేస్తోంది. ఈ క్రమంలోనే రైతులను సన్నాల సాగు వైపు మళ్లించేందుకు బోనస్ పథకాన్ని ప్రకటించింది. ధాన్యం కనీస మద్దతు ధరపై అదనంగా క్వింటాలుకు రూ.500 చెల్లిస్తామనడంతో రైతులు సన్నాల సాగు విస్తీర్ణం పెంచారు. రాష్ట్రంలో పేదలకు సన్న బియ్యం పంపిణీ చేసేందుకు ఏడాదికి 24 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం కావాలి. ఈ స్థాయిలో బియ్యం కావాలంటే 36 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం అవసరం. ఏడాదిలో రెండు సీజన్లలో సేకరించే సన్నధాన్యాన్ని బియ్యంగా మార్చి ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు పంపిణీ చేసేలా ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. ప్రస్తుతం రాష్ట్రంలో 89.95 లక్షల రేషన్ కార్డులుండగా.. 2.81 కోట్ల మంది లబ్ధిదారులున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభించిన నేపథ్యంలో ఈ సంఖ్య పెరిగే అవకాశముంది.







చిత్రజ్యోతి

SINCE 1965

నాన్నకు ప్రేమతో..


'దక్ష' లో మోహన్‌బాబు



ప్రస్తుతం మంచు కుటుంబంలో యుద్ధవాతావరణం నెలకొని ఉంది. ముఖ్యంగా తండ్రీకొడుకులు మోహన్‌బాబు, మనోజ్ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమని మండే పరిస్థితి. ఒకరిపై ఒకరు కేసులు పెట్టుకున్నారు. తను సంపాదించిన ఆస్తులు, కట్టుకున్న ఇల్లు మనోజ్ ఆక్రమించాడని మోహన్‌బాబు స్వయంగా రంగారెడ్డి కలెక్టర్ ఆఫీసుకు వెళ్లి ఫిర్యాదు చేశారు. పోలీసుల సాయంతో మనోజ్‌ను హైదరాబాద్ జల్‌పల్లిలో ఉన్న తన ఇంటి నుంచి వెళ్లగొట్టారు మోహన్‌బాబు. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో మోహన్‌బాబు పుట్టిన రోజు వేడుకలు బుధవారం జరిగాయి. తండ్రి పుట్టినరోజు సందర్భంగా మనోజ్ సోషల్ మీడియాలో ఓ పోస్టు పెట్టారు. 'హ్యాపీ బర్త్‌డే నాన్నా.. మనమంతా కలసి వేడుకలు చేసుకునే ఈ రోజు మీ పక్కనే ఉండే అవకాశాన్ని కోల్పోయా. మీతో కలసి ఉండే క్షణాల కోసం ఎదురు చూస్తున్నా.. లవ్ యూ' అని ఆ పోస్టులో పేర్కొన్నారు. మనోజ్ పెట్టిన ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. మరి దీనిపై మోహన్‌బాబు ఎలా స్పందిస్తారో వేచి చూడాలి.

విశ్వామిత్రకు పుట్టినరోజు శుభాకాంక్షలు

తన తండ్రి మోహన్‌బాబు పుట్టినరోజు సందర్భంగా నటి మంచు లక్ష్మీప్రసన్న ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ముఖ్య పాత్రధారిగా తను నిర్మిస్తున్న 'దక్ష' చిత్రంలోని లుక్‌ను షేర్ చేసి "మా ప్రొఫెసర్, డాక్టర్. విశ్వామిత్రకు పుట్టినరోజు శుభాకాంక్షలు" అని పేర్కొన్నారు. 'కన్నప్ప' సినిమాలో మోహన్‌బాబు మహదేవ శాస్త్రిగా కనిపించనున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలోని 'ఓం నమః శివాయ' అనే పాటలో ఆయన పాత్రకు సంబంధించిన వీడియో గ్లింప్స్‌ను విడుదల చేసి శుభాకాంక్షలు తెలిపారు మేకర్స్

కడుపుబ్బా నవ్వించే చిత్రం


సప్తగిరి

సప్తగిరి కథానాయకుడిగా నటించిన చిత్రం 'పెళ్లికాని ప్రసాద్'. అభిలాష్‌రెడ్డి గోపిడి దర్శకత్వంలో కె.వై.బాబు, భానుప్రకాష్ గౌడ్, సుక్కా వెంకటేశ్వర్ గౌడ్, వైభవ్‌రెడ్డి ముత్యాల నిర్మించారు. దిల్‌రాజు నిర్మాణ సంస్థ శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ సినిమాను విడుదల చేస్తోంది. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతున్న సందర్భంగా మీడియాతో ముచ్చటించారు సప్తగిరి. "దర్శకుడు అభిలాష్ ఈ కథ చెప్పేటప్పుడే సినిమా విజయంపై పూర్తి నమ్మకం వచ్చేసింది. అందరినీ కడుపుబ్బా నవ్వించే చిత్రమిది. ఎక్కడా బోర్ కొట్టదు. దర్శకుడు అభిలాష్ రాసిన సంభాషణలు, వినోదాత్మక సన్నివేశాలు, శేఖర్ చంద్ర అందించిన సంగీతం ఈ సినిమాకు ప్రధానాకర్షణ. సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది" అని చెప్పారు.

అద్భుతమైన అనుభూతినిచ్చేలా...



హర్ష రోషన్, కార్తికేయ దేవ్, స్టీవెన్ మధు, నిహాల్ కోదాటి, సాన్వీ మేఘన ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'టుక్ టుక్'. సుప్రీత్ కృష్ణ దర్శకత్వంలో రాహుల్ రెడ్డి, లోక్కు శ్రీ వరుణ్, శ్రీరాముల రెడ్డి నిర్మించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతోన్న సందర్భంగా ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. కార్యక్రమంలో దర్శకుడు సుప్రీత్ మాట్లాడుతూ "ప్రేక్షకులకు అద్భుతమైన అనుభూతినిచ్చేలా సరికొత్తగా ఉంటుందీ సినిమా. అందరి మనసులు గెలుచుకుంటుంది" అని అన్నారు. "సినిమా తప్పక విజయం సాధిస్తుంది" అని నిర్మాత రాహుల్ రెడ్డి చెప్పారు.

బ్యాక్ టు హైదరాబాద్



మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న భారీ చిత్రం రెండో షెడ్యూల్ పూర్తయింది. ప్రియాంక చోప్రా హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రాన్ని డాక్టర్ కె.ఎల్.నారాయణ నిర్మిస్తున్నారు. పదిహేను రోజులుగా ఒడిశాలోని కోరాపుట్ జిల్లాలో ఈ సినిమా షూటింగ్ జరిగింది. సిమిలిగుడ సమీపంలోని మాలి, పుట్‌సేల్, బాల్డ ప్రాంతాల్లో కీలక సన్నివేశాలు చిత్రీకరించారు. మంగళవారం రాత్రితో షెడ్యూల్ పూర్తి కావడంతో చిత్ర యూనిట్ హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమైంది. యాక్షన్ అడ్వెంచర్ కథాంశంతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు రాజమౌళి.

అందమైన ప్రేమకథ



వినయ్‌కుమార్, శ్రావణి మజ్జరి, అరవింద్ ముదిగొండ, నేమిన తార ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'కాలమేగా కరిగింది'. సింగార మోహన్ దర్శకత్వంలో మరే శివశంకర్ నిర్మించారు. ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా ఈ శుక్రవారం విడుదలవుతోందీ చిత్రం. తాజాగా, నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో హీరో వినయ్‌కుమార్ మాట్లాడుతూ "కలహాలే లేని అందమైన ప్రేమకథ ఇది" అని అన్నారు. "ఈ కవితాత్మక చిత్రం అందరినీ ఆకట్టుకుంటుంది. మంచి విజయం సాధిస్తుంది" అని దర్శకుడు శింగార మోహన్ చెప్పారు. "ఇదో స్వచ్ఛమైన ప్రేమకథ. సినిమా అద్భుతంగా ఉంటుంది" అని నిర్మాత మరే శివశంకర్ తెలిపారు.

మహిళల సమస్యలపై..



షెరాజ్ మెహదీ కథానాయకుడిగా స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఓ అందాల రాక్షసి'. విహాన్షీ హెగ్డే, కృతి వర్మ కథానాయికలు. సురీందర్ కౌర్ నిర్మించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతోన్న సందర్భంగా చిత్రబృందం ప్రీరిలీజ్ వేడుక నిర్వహించారు. హీరో షెరాజ్ మెహదీ మాట్లాడుతూ "ఇది చిన్న చిత్రమైనా.. పెద్ద విజయం సాధిస్తుంది. అన్ని వర్గాల ప్రేక్షకుల ఆదరణ పొందుతుంది" అని చెప్పారు. హీరోయిన్ కృతి వర్మ మాట్లాడుతూ "ఈ సినిమా కథ వినగానే గూస్‌బంప్స్ వచ్చాయి" అని చెప్పారు. హీరోయిన్ విహాన్షీ హెగ్డే మాట్లాడుతూ "మహిళల సమస్యలపై తీసిన చిత్రమిది" అని తెలిపారు.







సోషల్‌మీడియా, సొంత పత్రికలో తప్పుడు వార్తలు

బీఆర్ఎస్‌పై మండిపడ్డ డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): నిజం కూడా ప్రచారంలో ఉండాలని.. లేకపోతే అబద్ధం నిజంగా మారి రాష్ట్రాన్ని, దేశాన్నే కాదు ప్రపంచాన్ని కూడా నాశనం చేస్తుందని భట్టి వ్యాఖ్యానించారు. బడ్జెట్ ప్రసంగం సందర్భంగా ఆయన బీఆర్ఎస్‌పై పరోక్షంగా విరుచుకుపడ్డారు. ప్రభుత్వం చేసే ప్రతి చర్యను శంకిస్తూ, నిరాధారమైన విమర్శలు చేయడమే కొందరు పనిగా పెట్టుకున్నారని ధ్వజమెత్తారు. సోషల్ మీడియాలో, సొంత పత్రికలో తప్పుడు వార్తలతో ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఇటువంటి విమర్శలను సమర్థంగా తిప్పికొడుతూ వాస్తవాలను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేడం తమ బాధ్యత అన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ బడ్జెట్ ప్రసంగాల్లో సుతిమెత్తగా మీడియాతో పాటు అప్పటి విపక్ష కాంగ్రెస్‌పై విమర్శలు చేయగా.. తాజాగా భట్టి సూటిగానే దాడి చేశారు

ప్రసంగంలో సూక్తులతో..

భట్టి తన ప్రసంగంలో పలు సూక్తులను ప్రస్తావించారు. విద్యకు ప్రాధాన్యం ఇవ్వడంపై అంబేడ్కర్ చేసిన వ్యాఖ్య 'విద్య అనేది సింహపు పాలవంటిది. అవి తాగిన వారు గర్జించకుండా ఉండలేరు' అని పేర్కొన్నారు. 'నీకు కనిపించిన బలహీనుడైన నిరుపేద ముఖాన్ని గుర్తు తెచ్చుకో. నువ్వు తీసుకున్న చర్య అతనికి ఉపయోగపడుతుందో లేదో అని నిన్ను నువ్వు ప్రశ్నించుకో' అన్న మహాత్ముడి సూక్తితో పాటు శ్రీశ్రీ మహాప్రస్థానంలోని 'కూటి కోసం కూలి కోసం పట్టణంలో బతుకుదామని తల్లి మాట చెవిన పెట్టక బయలుదేరిన బాటసారికి ఎంత కష్టం, ఎంత కష్టం' అనే వాక్యాల్నీ ప్రస్తావించారు. పలుచోట్ల ప్రసంగంలో మహాత్మాగాంధీతో పాటు అంబేడ్కర్‌ల సూక్తులు ప్రస్తావించడం ఆకర్షణగా నిలిచింది.

ఉగాది పచ్చడిలా ఉంది: కూనంనేని



హైదరాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): భారీ రుణభారం, సంక్లిష్ట ఆర్థిక పరిస్థితుల మధ్య ప్రభుత్వం సాహసోపేతమైన బడ్జెట్ ప్రవేశపెట్టిందని.. తీపి, చేదు కలగలుపు ఉగాది పచ్చడిలా 2025-26 బడ్జెట్ ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు. హామీల అమలు, సంక్షేమం, అభివృద్ధిలో సమతౌల్యం కోసం ప్రభుత్వం ప్రయత్నించిందని పేర్కొన్నారు. గొప్పలకు పోయి బడ్జెట్ అంచనాలు పెంచకుండా.. ఉన్నంతలో పన్నుల భారం లేకుండా వాస్తవికంగా బడ్జెట్ ప్రవేశ పెట్టారన్నారు. ఆరు గ్యారెంటీలకు రూ.56 వేల కోట్లు, సంక్షేమ పథకాలకు రూ.1.04 లక్షల కోట్లు కేటాయించడాన్ని సీపీఐ స్వాగతిస్తోందన్నారు.

ఇందిరమ్మ పాలన అంటే ఇన్ని మోసాలా?

- హామీలకు.. బడ్జెట్ అంకెలకు పొంతన లేదు
- బీజేఎల్పీ ఉపనేత పాయల్ శంకర్ విమర్శ

ఇందిరమ్మ పాలన అంటే ఇన్ని రకాల మోసాలా? అన్నట్లుగా కాంగ్రెస్ ప్రభుత్వ తాజా బడ్జెట్ ఉందని బీజేఎల్పీ ఉప నేత పాయల్ శంకర్ విమర్శించారు. ఇందిరమ్మ రాజ్యం తెస్తామని ఎన్నికలప్పుడు కాంగ్రెస్ ఇచ్చిన హామీలకు, బడ్జెట్‌లో పేర్కొన్న అంకెలకు ఎక్కడా పొంతన లేదన్నారు. 'రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు బీఆర్ఎస్ ప్రభుత్వం క్యాన్సర్ తెచ్చిందని మూడు రోజుల కిందట సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్య వాస్తవమేనని బడ్జెట్ నిరూపించింది. అయితే, ఆ క్యాన్సర్ ఏ దశలో ఉందో తేలాల్సి ఉందని శంకర్ వ్యాఖ్యానించారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ అద్దంలో రేవంత్ ముఖం చూపించినట్లుగా బడ్జెట్ ఉందని ఎద్దేవా చేశారు.

బడ్జెట్ సమావేశానికి హాజరుకాని కేసీఆర్

బడ్జెట్ సమావేశానికి బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ బుధవారం హాజరు కాలేదు. బడ్జెట్ నేపథ్యంలో అసెంబ్లీ సమావేశాల ప్రారంభంలో గవర్నర్ ప్రసంగం సందర్భంగా వచ్చిన ఆయన బడ్జెట్ సమావేశాల్లోనూ పాల్గొంటారని బీఆర్ఎస్ శ్రేణులు మొన్నటి వరకు చెప్పాయి. బడ్జెట్ ప్రవేశపెట్టే రోజైనా ప్రతిపక్ష నేత హోదాలో ఆయన అసెంబ్లీకి వచ్చి ఉండాల్సిందని అధికార పార్టీ నేతలు అభిప్రాయపడుతున్నారు.

ప్రవచనాలు ఎక్కువ.. పైసలు తక్కువ: కవిత



ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో 'ప్రవచనాలు ఎక్కువ పైసలు తక్కువ' అని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. ప్రభుత్వం రూ.30వేలకోట్లు అప్పు కట్టినట్టు చెబుతుండగా.. సీఎం రేవంత్ లక్షానలభై వేల కోట్లు అప్పులు కట్టామని చెబుతున్నారంటే అంతా అబద్ధమని తేలిపోయిందన్నారు. రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి కేసీఆర్ రూ.4లక్షల 37వేలకోట్లు అప్పు చేస్తే.. రూ.7లక్షల కోట్లు అప్పులు చేశారని ప్రచారం చేశారని మండిపడ్డారు. మధుసూదనాచారి మాట్లాడుతూ.. పరిపాలన చేతగాక కాంగ్రెస్ నేతలు పలాయన వాదం ఎంచుకున్నారని విమర్శించారు. ఎల్.రమణ మాట్లాడుతూ.. చేతగాని పాలనకు ఈ బడ్జెట్ నిదర్శనమన్నారు. దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఇది దగాకోరు దగుల్బాజీ బడ్జెట్ అని అన్నారు.

రవాణా శాఖకు రూ. 4,485 కోట్లు

రవాణా శాఖకు బడ్జెట్‌లో ప్రభుత్వం రూ.4,485 కోట్లు కేటాయించింది. మహిళలకు ఉచిత ప్రయాణం (మహాలక్ష్మి) పథకానికి రూ.4,305 కోట్లు కేటాయించింది. బడ్జెట్‌లో రవాణా శాఖకు కేటాయించిన మొత్తంలో అధిక భాగం ఉచిత ప్రయాణానికే సరిపోతుంది. అదనపు కేటాయింపులు లేకపోవడం వల్ల ఆర్టీసీ కార్మికుల పెండింగ్ సమస్యలు పరిష్కారం అయ్యే పరిస్థితి కనిపించడం లేదని జేఏసీ నేతలు వాపోతున్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు రూ.12,571 కోట్లు

కేంద్ర ప్రాయోజిత పథకాల కింద 4 వేల కోట్లు వస్తాయని అంచనా

హైదరాబాద్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల పథకానికి బడ్జెట్‌లో రూ.12,571 కోట్లు కేటాయించారు. ఇది గతేడాది కేటాయించిన రూ.9,184 కోట్లకన్నా రూ.3,387 కోట్లు అదనం. ప్రస్తుత బడ్జెట్‌లో కేంద్ర ప్రాయోజిత పథకాల్లో భాగంగా ప్రధానమంత్రి ఆవాస యోజన (గ్రామీణ, పట్టణ) పథకం కింద రూ.3,250 కోట్ల నుంచి రూ.4వేల కోట్ల వరకు వచ్చే అవకాశం ఉంటుందని అంచనా వేశారు. అసంపూర్తిగా ఉన్న 34,545 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు రూ.305 కోట్లు కేటాయించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద స్థలం ఉన్నవారు ఇంటిని నిర్మించుకునేందుకు, స్థలం లేని వారికి స్థలం ఇచ్చి రూ.5లక్షలు ఆర్థిక సాయం చేయనున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. ఈ పథకం కింద ఐదేళ్లలో 22.50 లక్షల ఇళ్లను నిర్మించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. మొదటి దశలో నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున 4,16,500ఇళ్లు, రిజర్వ్ కోటాలో మరో 33,500 ఇళ్లు కలిపి మొత్తం 4,50,000 ఇళ్లను నిర్మించాలని నిర్ణయించింది. వీటి నిర్మాణానికి ఏటా దాదాపు రూ.22,500 కోట్లు అవసరమవుతాయని అంచనా వేశారు. తాజా బడ్జెట్‌లో రూ.12,571 కోట్లు కేటాయించారు. దీని ప్రకారం (ఒక్కో ఇంటికి రూ.5లక్షల చొప్పున) రాష్ట్రవ్యాప్తంగా 2,51,420 ఇళ్ల నిర్మాణానికి సాయం అందనుంది. ఇక ఔటర్ రింగు రోడ్డును ఆనుకుని హైదరాబాద్ నలువైపులా శాటిలైట్ టౌన్‌షిప్‌లను ఏర్పాటు చేసి అల్పాదాయ, మధ్యతరగతి వర్గాలకు అందుబాటులో ఉండేలా గృహ సముదాయాలను నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు బడ్జెట్‌లో పేర్కొన్నారు.

5 రెట్ల అభివృద్ధే లక్ష్యం!



పదేళ్లలో 86 లక్షల కోట్లకు ఆర్థిక వ్యవస్థ.. అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన.. ఇదే తెలంగాణ నమూనా

- ఆ దిశగా కార్యాచరణ రూపొందిస్తున్నాం
- అన్ని వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా రాష్ట్ర బడ్జెట్
- బడ్జెట్ ప్రసంగంలో భట్టి



అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డితో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను రాబోయే పదేళ్లలో ఐదు రెట్లు అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. తెలంగాణ ఆర్థిక వ్యవస్థ పరిమాణం రూ.17.26 లక్షల కోట్లు (200 బిలియన్ డాలర్లు) అని.. పదేళ్లలో దీన్ని రూ.86.30 లక్షల కోట్లకు చేర్చే దిశగా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన.. ఈ మూడు అంశాలతో తెలంగాణ నమూనాను యావత్ దేశానికే ఆదర్శంగా నిలిపేందుకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో 'తెలంగాణ రైజింగ్-2050' ప్రణాళికతో రాష్ట్రంలో పాలనను కొనసాగిస్తున్నామన్నారు. 'రాష్ట్రానికి ఉన్నతమైన లక్ష్యాలను నిర్దేశించుకుంటూ సమగ్ర, స్థిరమైన అభివృద్ధితో తెలంగాణను నిర్మిస్తాం. ప్రతి పౌరుడికీ విద్య, ఆరోగ్యం, ఉపాధి, సామాజిక భద్రతను కల్పించే స్థాయికి రాష్ట్రాన్ని తీసుకెళ్లడమే మా లక్ష్యం' అని వెల్లడించారు. రాష్ట్రాన్ని ప్రగతి బాటలో నడిపించేందుకు అందరూ కలిసి వస్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు. రైతులు, వ్యాపారులు, విద్యార్థులు, మహిళలు, వృద్ధులు, కూలీలు, ఐటీ నిపుణులు.. ఇలా ప్రతి ఒక్కరినీ తమ ప్రభుత్వ అభివృద్ధి పథకాలు బలోపేతం చేస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన శాసన సభలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌ను ప్రవేశ పెట్టారు. మొత్తం వ్యయం రూ.3,04,965 కోట్లుగా, రెవెన్యూ వ్యయం రూ.2,26,982 కోట్లుగా, మూలధన వ్యయం రూ.36,504 కోట్లుగా ప్రతిపాదించారు. భట్టి బడ్జెట్ ప్రసంగం 101 నిమిషాల పాటు కొనసాగింది. "ప్రజాప్రతినిధులుగా తెలంగాణ భవిష్యత్‌ను తీర్చిదిద్దే అవకాశం, బాధ్యత మనపై ఉన్నాయి. సమష్టి కృషితో తెలంగాణను దేశానికే తలమానికంగా నిలిపేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. విభేదాలను అధిగమించి, నిర్మాణాత్మక చర్చలో పాల్గొని కలిసికట్టుగా పనిచేయడం మన విధి. రాజకీయాలకతీతంగా సభ్యులంతా బడ్జెట్‌లో సూచించిన ప్రగతిశీల చర్యలకు సంపూర్ణ మద్దతు ఇవ్వాలి" అని భట్టి విజ్ఞప్తి చేశారు. దశాబ్దకాలంగా అనేక సవాళ్లను ఎదుర్కొన్న రాష్ట్రం.. ప్రస్తుతం అభివృద్ధి బాటలో నడుస్తోందని గుర్తుచేశారు. కుల, మత భేదాల్లేకుండా అందరి అభ్యున్నతికి వనరుల పంపకం జరగాలన్న లక్ష్యంతో బడ్జెట్‌ను రూపొందించామని ప్రకటించారు. పదేళ్ల అరాచక పాలనతో ఛిద్రమైన తెలంగాణను గాడిలో పెడుతూ.. లక్ష్యాలను దృష్టిలో పెట్టుకొని పనిచేస్తున్నట్లు తెలిపారు. నీటిపారుదల శాఖకు 23,373 కోట్లను ప్రతిపాదించారు. 40% ప్రభుత్వ నిధులు, 60 % ప్రైవేట్ డెవలపర్ల పెట్టుబడితో 2028 దాకా 17 వేల కిలోమీటర్ల గ్రామీణ రహదారులను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. హోంగార్డుల రోజువారీ వేతనాన్ని రూ.921 నుంచి 1000కి పెంచినట్లు ప్రకటించారు.

అంతర్జాతీయ నగరంగా హైదరాబాద్

హైదరాబాద్‌ను అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దడానికి మాస్టర్ ప్లాన్ తయారు చేస్తున్నామని భట్టి చెప్పారు. అందులో భాగంగానే మూసీ నది పునరుజ్జీవ ప్రాజెక్టును చేపట్టామన్నారు. స్వచ్ఛ ఇంధనం, సుస్థిర అభివృద్ధితో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలపడానికి మెగా మాస్టర్ ప్లాన్-2050ని రూపొందించామని పేర్కొన్నారు. 19 ప్రాజెక్టులను నిర్ణీత వ్యవధిలోగా పూర్తి చేయడానికి స్పీడ్ (స్మార్ట్, ప్రోయాక్టివ్, ఎఫిషియంట్ అండ్ ఎఫెక్టివ్ డెలివరీ) పేరుతో కార్యాచరణను అమలు చేస్తున్నామని.. ఇందుకోసం పురపాలక శాఖకు రూ.17,677 కోట్లు కేటాయించినట్లు తెలిపారు.

రైతు భరోసాకు 18 వేల కోట్లు

25.35 లక్షల మంది రైతులకు రూ.20,616.89 కోట్లు రుణమాఫీ చేసినట్లు భట్టి తెలిపారు. వ్యవసాయ శాఖకు రూ.24,439 కోట్లు ప్రతిపాదించారు. పశువుల టీకాల కోసం వెటర్నరీ బయోలాజికల్ పరిశోధనా సంస్థను మామిడిపల్లికి తరలించి, రూ.300 కోట్లతో భారీగా విస్తరిస్తున్నట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో రెవెన్యూ అధికారుల పాత్రను పునరుద్ధరించి, భూ సమస్యలను వేగంగా పరిష్కరించే పాలనా వ్యవస్థను తీసుకొస్తున్నామని వివరించారు. త్వరలోనే కొత్త రేషన్ కార్డులను జారీ చేయనున్నామన్నారు.

మహాలక్ష్మితో 149 కోట్ల ఉచిత ప్రయాణాలు

మహాలక్ష్మి పథకంతో మహిళలు ఆర్టీసీ బస్సుల్లో 149.63 కోట్ల ఉచిత ప్రయాణాలు చేశారని భట్టి తెలిపారు. రూ.500కే సిలిండర్ పథకం కోసం రూ.433.20 కోట్లు, గృహ జ్యోతి కింద 50 లక్షల కుటుంబాలకు ఉచిత విద్యుత్తుకు రూ.1775.15 కోట్లు సబ్సిడీగా చెల్లించామని వివరించారు. హైదరాబాద్ నలువైపులా శాటిలైట్ టౌన్‌షిప్‌లను ఏర్పాటు చేసి, అల్పాదాయవర్గాలకు అందుబాటులో ఉండేలా గృహ సముదాయాలకు ప్రణాళికలను అమలు చేస్తున్నట్లు తెలిపారు.

యంగ్ ఇండియా స్కూళ్లు

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలతో పాటు ఇతర వర్గాల విద్యార్థులందరినీ ఒకే గొడుగు కిందికి తేవడానికి యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేయనున్నట్లు భట్టి ప్రకటించారు. 58 స్కూళ్ల నిర్మించడానికి రూ.11,600 కోట్లతో అనుమతులు ఇచ్చామని వివరించారు. మైనారిటీ గురుకులాలను యంగ్ ఇండియా గురుకులాల్లో విలీనం చేయనున్నట్లు చెప్పారు. తెలంగాణ యువతను నిపుణులుగా తీర్చిదిద్దడానికి ఫ్యూచర్ సిటీలో 200 ఎకరాల్లో ఏఐ సిటీని నెలకొల్పాలని నిర్ణయించినట్లు భట్టి ప్రకటించారు.

సామాజిక సమానత్వం కోసం ఎస్సీ వర్గీకరణ

సామాజిక సమానత్వం కోసం రాష్ట్రంలోని 59 ఎస్సీ ఉప కులాలను మూడు వర్గాలుగా విభజించాలని నిర్ణయం తీసుకున్నట్లు భట్టి చెప్పారు. రానున్న నాలుగేళ్లలో 2.1 లక్షల మంది పోడు రైతులకు ఇందిర గిరి జలవికాసం కింద రూ.12,600 కోట్లతో సోలార్ పంపుసెట్లు అందించనున్నట్లు ప్రకటించారు. ఎస్సీ సంక్షేమానికి రూ.40,232 కోట్లు, ఎస్టీ సంక్షేమానికి రూ.17,169 కోట్లు ప్రతిపాదించారు. 96 శాతం కవరేజ్‌తో బీసీ కుల గణన సర్వే చేశామన్నారు. గ్రేటర్ పరిధిలో విద్యుత్తు అంతరాయాల నిరోధానికి అమలవుతున్న విద్యుత్తు అంబులెన్స్ సర్వీస్‌ను రాష్ట్రవ్యాప్తంగా విస్తరించనున్నామన్నారు.

తగ్గిన నిరుద్యోగిత

కేంద్ర గణాంక శాఖ సర్వే ప్రకారం 2023 జూలై నుంచి సెప్టెంబరు మధ్య తెలంగాణ నిరుద్యోగిత రేటు 22.9 శాతంగా ఉండగా.. 2024 జూలై-సెప్టెంబరు మధ్య 18.1 శాతానికి తగ్గిందని, ప్రభుత్వం అమలు చేస్తున్న నైపుణ్య శిక్షణ, నియామకాల వల్లే ఇది సాధ్యమైందని భట్టి గుర్తు చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఆర్థికంగా వెనకబడిన వర్గాల యువత కోసం రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రారంభించామన్నారు.

ఇందిర మహిళా శక్తి మిషన్..

ఇందిర మహిళా శక్తి మిషన్ కింద రూ.20 వేల కోట్ల రుణాన్ని అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని భట్టి చెప్పారు. 214 ఇందిర మహిళా శక్తి క్యాంటీన్లు ప్రారంభించామని, 22 ఇందిర మహిళా శక్తి భవనాల కోసం రూ.110 కోట్లు కేటాయించామని తెలిపారు. ప్రతి మండలంలో పొదుపు సంఘాలతో రైస్ మిల్లులు, మినీ గోదాములు స్థాపించి, ధాన్యం మిల్లింగ్ చేసి, ఎఫ్‌సీఐకి సరఫరా చేసే బాధ్యతను అప్పగించనున్నట్లు చెప్పారు.

బడ్జెట్ సమగ్ర స్వరూపం ₹ (రూ. కోట్లలో)



	2023-24 (వాస్తవ)	2024-25 (బడ్జెట్ అంచనా)	2024-25 (సవరించిన అంచనా)	2025-26 (బడ్జెట్ అంచనా)
రెవెన్యూ వసూళ్లు	1,69,293	2,21,242	2,02,107	2,29,720
మూలధన వసూళ్లు	61,496	69,572	64,501	74,646
మొత్తం వసూళ్లు	2,30,789	2,90,814	2,66,608	3,04,366
రెవెన్యూ వ్యయం	1,68,514	2,20,945	1,96,219	2,26,982
మూలధన వ్యయం	43,917	33,487	33,088	36,504
రుణాలు, అడ్వాన్సులు	6,860	19,626	19,626	21,351
రుణాల చెల్లింపు	12,532	17,001	17,001	20,028
మొత్తం వ్యయం	2,31,825	2,91,059	2,65,934	3,04,865
రెవెన్యూ మిగులు	779	297	5,888	2,738
ద్రవ్య లోటు	49,977	49,255	46,764	54,010

భట్టికి సీఎం ఆలింగనాలు!

- బడ్జెట్‌కు ముందు.. తర్వాత కౌగిలింత
- బల్లలు చరుస్తూ భట్టి ప్రసంగానికి అధికార పార్టీ సభ్యుల మద్దతు..
- సిగ్గు.. సిగ్గు.. గోవిందా.. నినాదాలు

హైదరాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క బడ్జెట్‌ను ప్రవేశపెట్టడానికి అసెంబ్లీలోకి రాగానే సీఎం రేవంత్ రెడ్డి ఆప్యాయంగా కౌగిలించుకున్నారు. బడ్జెట్ ప్రవేశపెట్టిన అనంతరం కూడా మరోమారు ఆలింగనం చేసుకున్నారు. బుధవారం ఉదయం 11:06 గంటలకు బడ్జెట్ ప్రతులతో భట్టి సభలోకి రాగానే మంత్రులంతా భట్టిని అభినందించారు. ఉదయం 11:07 గంటలకు బడ్జెట్ ప్రసంగం ప్రారంభమవ్వగా.. ప్రసంగానికి సమర్థనగా బల్లలు చరుస్తూ అధికార పార్టీ సభ్యులు నినాదాలు చేశారు. ఇటు ఆకుపచ్చ కండువాలతో సభకు వచ్చిన బీఆర్ఎస్ సభ్యులు బడ్జెట్ ప్రసంగం జరుగుతున్నంత సేపు 'షేమ్.. షేమ్.. సిగ్గు.. సిగ్గు..' నినాదాలు చేశారు. పలు సందర్భాల్లో బీఆర్ఎస్ పదేళ్ల వైఫల్యాలపై అధికార పార్టీ సభ్యులు కూడా అవే నినాదాలతో బదులిచ్చారు. వైద్య రంగంపై భట్టి మాట్లాడుతుండగా.. గోవిందా.. గోవిందా.. అంటూ బీఆర్ఎస్ నినదించగా.. ప్రతిగా బీఆర్ఎస్ గోవిందా.. బీఆర్ఎస్ గోవిందా.. అంటూ అధికార పార్టీ సభ్యులు నినాదాలు చేశారు. రుణమాఫీపై మాట్లాడుతుండగా.. బోగస్.. బోగస్ అంటూ బీఆర్ఎస్ నినాదాలు చేయగా.. దానికి ప్రతిగా కాంగ్రెస్ కూడా నినాదాలు చేసింది. మధ్యాహ్నం 12:48 గంటలకు బడ్జెట్ ప్రసంగం పూర్తవ్వగా.. సీఎంతో పాటు మంత్రులు, అధికార పార్టీ ఎమ్మెల్యేలతో పాటు సీపీఐ పక్షనేత కూనంనేని సాంబశివరావు భట్టిని ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం సభను స్పీకర్ ప్రసాద్‌కుమార్ శుక్రవారం ఉదయం 10 గంటలకు వాయిదా వేశారు.

స్వీట్లు పంచిన వేముల వీరేశం..

ఎస్సీ వర్గీకరణ బిల్లుకు ఆమోదం లభించడంపై కాంగ్రెస్ నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సభలో అధికార, విపక్ష సభ్యులకు స్వీట్లు పంచారు. సభ్యులందరి వద్దకు వెళ్లి.. ప్రత్యేకంగా స్వీట్లు అందించారు.

మరోసారి అంకెల గారడీ

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



హైదరాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): 'అంకెల గారడీతో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను మరోసారి మోసం చేసింది. దున్నపోతుకు పాలు పిండినట్లుంది రాష్ట్ర బడ్జెట్. అట్టహాసంగా ప్రకటించిన గ్యారెంటీల అమలుపై ప్రజలు ఆశలు వదులుకునేలా పద్దుల రూపకల్పన ఉంది. 15 నెలల పాలన తర్వాత కూడా ఆరు గ్యారెంటీలు, 420 వాగ్దానాల అమలును పూర్తిగా విస్మరించారు. వివిధ ప్రాజెక్టులకు భారీ ప్రకటనలు చేసినా.. కేటాయింపులు, ఆచరణ శూన్యమని ఈ బడ్జెట్‌తో సుస్పష్టమైంది. 2024-25 బడ్జెట్‌లో జీఎస్టీ ఆదాయం రూ.58,594 కోట్లుగా చూపితే. సవరించిన అంచనాల్లో రూ.53,665 కోట్లని తెలిపారు. దీంతో జీఎస్టీ వసూళ్లు దాదాపు 8.5 శాతం తగ్గడానికి కారణాలు రాష్ట్ర ప్రభుత్వం చెప్పాలి. మద్యం వినియోగం పెంచడం ద్వారా ఆదాయం పెంపుపైనే దృష్టిపెట్టడం దురదృష్టకరం. రైతులు, నిరుద్యోగ యువత, విద్యార్థులు, మహిళలు సహా ప్రతి వర్గాన్ని మోసగిస్తూనే ఉన్నారు. బడ్జెట్ ప్రసంగంలో నిరుద్యోగ భృతి ఊసేలేదు. ఓట్లేసి గెలిపించిన రైతుల ఆకాంక్షలను తుంగలో తొక్కారు. కాంగ్రెస్ ప్రభుత్వం, చెప్పింది చేయకుండా.. చేయనిది చేసినట్లు చెప్పుకోవడం సిగ్గుచేటు' అని కేంద్ర మంత్రి జీ కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

6 గ్యారెంటీలకు పాతరేసేలా బడ్జెట్: సంజయ్


కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలకు పాతరేసేలా రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ ఉందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. అప్పులు చేయడం, ఆస్తుల అమ్మకం, అబద్ధాలు, అంకెల గారడీలో కాంగ్రెస్ సర్కారు బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని మించిపోయిందని విమర్శించారు. అప్పులు చేయడం, ఆస్తులు అమ్మడం తప్ప మరో మార్గం లేదన్నట్లుగా కాంగ్రెస్ పాలన ఉందన్నారు. ఆరు గ్యారెంటీలపై ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా వాటి అమలుకు కేటాయింపులు చేస్తూ సవరణలు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీల కంటే మైనారిటీలే కాంగ్రెస్ ప్రభుత్వానికి ముఖ్యమని బడ్జెట్ తేటతెల్లం చేసిందని పేర్కొన్నారు. కుల గణన పేరుతో బీసీ రిజర్వేషన్లలో కోత విధించిన కాంగ్రెస్.. బడ్జెట్ కేటాయింపుల్లో కూడా బీసీల సంక్షేమాన్ని గాలికొదిలేసిందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పెండింగ్ సమస్యలు, పీఆర్సీ ప్రస్తావనే లేదని చెప్పారు. కాంగ్రెస్ తిరోగమన పాలనకు నిలువుటద్దంలా బడ్జెట్ ఉందన్నారు. మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను గాలికొదిలేసినట్లు స్పష్టమైపోయిందని తెలిపారు.

ధరలు పెంచితేనే లక్ష్యాన్ని చేరేది!

- ఎక్సైజ్, రిజిస్ట్రేషన్ శాఖల నుంచి 46,710.62 కోట్ల ఆదాయమే లక్ష్యం
- ఏప్రిల్ తర్వాత భూముల విలువలు, మద్యం ధరలు పెరిగే చాన్స్

హైదరాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సంక్షేమ పథకాలకు అవసరమైన నిధులను సమకూర్చుకునేందుకుగాను ఆదాయాన్ని తెచ్చే కీలకమైన ఎక్సైజ్, రిజిస్ట్రేషన్ శాఖల పరిధిలో ధరలు పెంచక తప్పని పరిస్థితి కనిపిస్తోంది. భూముల విక్రయంతోపాటు మద్యం అమ్మకాలు, స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖల నుంచి అత్యధిక మొత్తంలో ఆదాయాన్ని రాబట్టుకోనున్నట్లు 2025-26 బడ్జెట్‌లో ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈమేరకు ఆర్థిక లక్ష్యాలను చేరుకునేందుకు రిజిస్ట్రేషన్ శాఖ నూతన భూముల విలువలను అమలు చేయడం, ఆబ్కారీ శాఖలో మద్యం ధరలను పెంచాలనే యోచనలో సర్కారు ఉన్నట్లు తెలిసింది. బడ్జెట్‌లో ఎక్సైజ్ శాఖ నుంచి రూ.27,623.36 కోట్లు, రిజిస్ట్రేషన్ శాఖ నుంచి రూ.19,087.26 కోట్ల ఆదాయాన్ని ప్రభుత్వం లక్ష్యంగా పేర్కొంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఎక్సైజ్ శాఖకు రూ.25,617.53 కోట్ల లక్ష్యం నిర్దేశించగా.. జనవరి వరకు సాధించినది రూ.15,585.35 కోట్లే. ఇందులో దరఖాస్తుల రుసుము రూ.2,600 కోట్లు ఉంది. ప్రభుత్వానికి అత్యధిక ఆదాయాన్ని తెచ్చి పెట్టే శాఖల్లో మూడో స్థానంలో ఉన్న రిజిస్ట్రేషన్ శాఖకు రూ.18,229 కోట్ల లక్ష్యం నిర్దేశించగా.. ఈ ఏడాది ఫిబ్రవరి వరకు వచ్చిన ఆదాయం రూ.12,867.13 కోట్లుగా ఉంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో సాధించిన రూ.14,588.06 కోట్ల లక్ష్యాన్ని కూడా చేరలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో ఎక్సైజ్, రిజిస్ట్రేషన్ శాఖల నుంచి వచ్చే ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకునేందుకు ఏప్రిల్ తర్వాత భూముల విలువలు, మద్యం ధరలు పెంచక తప్పని పరిస్థితి ఉందని అధికారులు చెబుతున్నారు. త్వరలోనే ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

నాలుగేళ్లుగా రాష్ట్ర ఆదాయం ఇలా..





ఆరు గ్యారెంటీలకు రూ.56 వేల కోట్లు

గత బడ్జెట్‌లో 49,315 కోట్ల కేటాయింపు.. ఖర్చు చేసిన మొత్తం 24,948 కోట్లు

6

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న ఆరు గ్యారెంటీలకు బడ్జెట్‌లో రూ.56,083 కోట్లు కేటాయించింది. గత బడ్జెట్‌లో ఇదే పథకాలకు చేసిన కేటాయింపులు రూ.49,315 కోట్లు కాగా చేసిన ఖర్చు చూస్తే రూ.24,948కోట్లు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి గత ఏడాది బడ్జెట్‌లో కేటాయింపులు లేకపోయినప్పటికీ రూ.52.90 కోట్లు ఖర్చు చేసింది. చేయూత పథకానికి గత బడ్జెట్‌లో రూ.14,861 కోట్లు ప్రతిపాదించగా.. రూ.12 వేల కోట్లు ఖర్చు చేసింది. ఇందిరమ్మ ఇళ్ల పథకానికి రూ.9184కోట్లు కేటాయించినా ఖర్చు చేసింది లేదు. రైతు భరోసాకు గత బడ్జెట్‌లో రూ.15 వేల కోట్లు ప్రతిపాదించగా.. మార్చి 31 నాటికి రూ.7500 కోట్లు ఖర్చు చేయనుంది. ఇదే పథకానికి ఈ సారి రూ.18వేల కోట్లను ప్రకటించింది.




పథకం	కేటాయింపు
మహాలక్ష్మి	4,305
గృహజ్యోతి	2,080
సన్న ధాన్యానికి బోనస్	1,800
రాజీవ్ ఆరోగ్యశ్రీ	1,143
గ్యాస్ సిలిండర్ రాయితీ	723
ఆత్మీయ భరోసా	600
ఇందిరమ్మ ఇళ్లు	12,571
చేయూత	14,861
రైతు భరోసా	18,000



హోంశాఖకు 10,188 కోట్లు

హైదరాబాద్, మార్చి19(ఆంధ్రజ్యోతి):బడ్జెట్‌లో హోంశాఖకు రూ.10,188కోట్లు కేటాయించారు. నిర్వహణ పద్దు రూ.9,337కోట్లు కాగా ప్రగతి పద్దు కింద రూ.851కోట్లను ప్రభుత్వం కేటాయించింది. గత ఏడాది కన్నా ఈసారి రూ.725కోట్లు అదనంగా కేటాయించారు. పోలీసు హౌసింగ్ రుణాల కోసం గత ఏడాది రూ.120కోట్లు కేటాయించగా.. ఈ సారి రూ.25కోట్లకు తగ్గించారు. ఐజీ ఇంటెలిజెన్స్ ఎస్ఆర్(సీక్రెట్‌సర్వీసు)కు రూ.12కోట్లు, నార్కొటిక్స్ కంట్రోల్‌బ్యూరో ఎస్ఆర్‌కు రూ.2.40కోట్లు ప్రతిపాదించారు. హైదరాబాద్‌లో మహిళల భద్రత కోసం సేఫ్ సిటీ ప్రాజెక్టుకు రూ.100కోట్లు కేటాయించారు. న్యాయశాఖకు రూ.2,453కోట్లు కేటాయించారు.



పర్యాటకానికి పెద్దపీట !

పర్యాటకరంగానికి ప్రభుత్వం పెద్దపీట వేసింది. ఈ ఏడాది పర్యాటక రంగ ప్రాజెక్టులు చేపట్టడానికి బడ్జెట్‌లో రూ.775 కోట్లు కేటాయించింది. ఇది గత ఏడాది కంటే రూ.262 కోట్లు అదనం కావడం గమనార్హం.వచ్చే ఐదేళ్లలో రాష్ట్రానికి రూ.15వేల కోట్లకు పైగా పెట్టుబడులు ఆకర్షించడంతోపాటు పర్యాటక రంగంలో మూడు లక్షల మందికి ఉపాధి కల్పన లక్ష్యంతో పర్యాటక రంగ విస్తరణకు ప్రభుత్వం కార్యాచరణ ప్రారంభించింది.



దేవాదాయ శాఖకు 241 కోట్లు

దేవాదాయ శాఖకు ప్రభుత్వం రూ.241.37 కోట్లు కేటాయించింది. అందులో ప్రగతి పద్దు కింద రూ.190 కోట్లు, నిర్వహణ పద్దు కింద రూ.51.37 కోట్లను కేటాయించింది. మహబూబ్‌నగర్ జిల్లా అమ్మాపురంలోని కురుమూర్తి దేవాలయ అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. గతంలో కురుమూర్తి జాతరకు వెళ్లిన సమయంలో సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం రూ.110 కోట్లతో ఇప్పటికే పనులు ప్రారంభించారు. అలాగే, వేములవాడ అభివృద్ధికి రూ.100 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది.



విద్యకు బడ్జెట్‌లో 11.3% నిధులు

గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి విద్యా శాఖకు భారీగా నిధులు కేటాయించారు. ప్రాథమిక, ఉన్నత, సాంకేతిక విద్యా శాఖకు రూ. 23108 కోట్లు కేటాయించిన సర్కారు.. సమీకృత గురుకులాలకు రూ.11,600 కోట్లను బడ్జెట్‌లో ప్రకటించింది. తొలిదశలో 58 నియోజకవర్గాల్లో వీటిని నిర్మించనుంది. ప్రాథమిక, ఉన్నత, సాంకేతిక విద్యాశాఖలకు గత ఏడాదితో పోలిస్తే ఈసారి రూ. 1,816 కోట్లు అధికంగా కేటాయించింది. సమీకృత గురుకుల భవనాల కేటాయింపులు కలుపుకొటే ఈసారి విద్యాశాఖ బడ్జెట్ రూ.34,708కోట్లకు చేరింది. మొత్తం బడ్జెట్‌లో ఇది 11.38శాతం కావడం గమనార్హం. ఈ సారి అదనంగా కేటాయించిన నిధులతో విద్యా కమిషన్ సిఫారసుల అమలుకు మార్గం సుగమమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.



మహా నగర అభివృద్ధిపై నజర్

రూ.10 వేల కోట్లకు పైగా కేటాయింపు

హైదరాబాద్ సిటీ, మార్చి19(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగర అభివృద్ధికి రూ.10 వేల కోట్లకు పైగా నిధులు కేటాయించారు. జీహెచ్ఎంసీకి రూ.3101.21 కోట్లు కేటాయించి.. ప్రాజెక్టుల విషయంలో ముందుకెళ్లేందుకు ఆర్థిక భరోసాఇచ్చింది. ఫ్లైఓవర్లు, నాలాల విస్తరణ, మౌలిక సదుపాయాల కల్పనకు ఏర్పాటు చేసిన హెచ్‌సీటీ ప్రాజెక్టుకు రూ.2,654 కోట్లు, వాటర్ బోర్డుకు రూ.3,385 కోట్లు కేటాయించింది.

అప్పుల భారం




8,06,298 కోట్లు

ఎఫ్ఆర్‌బీఎం పరిధిలో రూ. 5.04 లక్షల కోట్ల అప్పులు

- కార్పొరేషన్ల పేరిట ఉన్న అప్పు 3.01 లక్షల కోట్లు
- వీటికి 2025-26లో చెల్లించే వడ్డీలు, కిస్తీలు 39,396 కోట్లు
- రాష్ట్రంలో ఒక్కొక్కరి నెత్తిన 2,30,346 తలసరి అప్పు

హైదరాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంపై అప్పుల భారం పెరిగిపోతోంది. పాత అప్పులు, కొత్త బడ్జెట్‌లో తీసుకోబోయే అప్పులు కలిపి తడిసిమోపెడు కానున్నాయి. 2025-26లో తీసుకునే అప్పులతో కలిపి ఎఫ్ఆర్‌బీఎం పరిధిలో రాష్ట్ర అప్పు రూ.5,04,814 కోట్లుగా ఉంటుందని బడ్జెట్‌లో ప్రభుత్వం తెలిపింది. ఇది రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి (జీఎస్‌డీపీ)లో 28.1 శాతంగా ఉండనుంది. ఈ మొత్తం అప్పులో బహిరంగ మార్కెట్ రుణాలు రూ.4,07,059 కోట్లు, కేంద్ర ప్రభుత్వ రుణాలు రూ.23,719 కోట్లు, స్వతంత్ర ప్రతిపత్తి సంస్థల రుణాలు రూ.11,202 కోట్లు, స్మాల్ సేవింగ్స్, ప్రావిడెంట్ ఫండ్‌కు సంబంధించి రూ.21,787 కోట్లు, డిపాజిట్లు, రిజర్వ్ ఫండ్ రూ.41,048 కోట్లుగా ఉన్నాయి. ఇవి కాకుండా ఎఫ్ఆర్‌బీఎంకు ఆవల కూడా కార్పొరేషన్ల పేరిట అప్పులు ఉన్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరి 28 నాటికి కార్పొరేషన్ల అప్పులు మొత్తం రూ.3,01,484 కోట్లుగా ఉన్నాయని బడ్జెట్‌లో ప్రభుత్వం తెలిపింది. ఇందులో కార్పొరేషన్ల కోసం ప్రభుత్వం గ్యారెంటీలు ఇచ్చి, ప్రభుత్వమే స్వయంగా చెల్లించే అప్పులు రూ.1,17,109 కోట్లు కాగా, ప్రభుత్వ గ్యారెంటీలతో కార్పొరేషన్లు తీసుకుని, కార్పొరేషన్లే చెల్లించే రుణాలు రూ.1,24,419 కోట్లు అని వివరించింది. ఇవే కాకుండా ప్రభుత్వ గ్యారెంటీలు లేకుండా కార్పొరేషన్లు తీసుకున్న రుణాలు రూ.59,956 కోట్లు అని పేర్కొంది. ఇలా ఎఫ్ఆర్‌బీఎం పరిధిలో తీసుకున్న అప్పు రూ.5,04,814 కోట్లు, కార్పొరేషన్ల కోసం సేకరించిన అప్పు రూ.3,01,484 కోట్లు కలిపి మొత్తం అప్పు రూ.8,06,298 కోట్లుగా తేలుతోంది.



చెల్లించాల్సిన కిస్తీలు, వడ్డీలు..

ఇప్పటివరకు ఉన్న అప్పులకు సంబంధించి 2025-26 ఆర్థిక సంవత్సరంలో చెల్లించాల్సిన వడ్డీలు, కిస్తీలపై ప్రభుత్వం తాజా బడ్జెట్‌లో వివరణ ఇచ్చింది. పాత అప్పుల అసలు, కొత్త అప్పుల వడ్డీల కింద ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ.39,396.73 కోట్లు చెల్లించాల్సి ఉంటుందని తెలిపింది. ఇందులో కేవలం వడ్డీల కింద రూ.19,369.02 కోట్లు, కిస్తీల కింద రూ.20,027.71 కోట్లను చెల్లించనున్నట్లు పేర్కొంది. ఈ కిస్తీల్లో వేస్ అండ్ మీన్స్ కాకుండా ప్రభుత్వ రుణాలకు సంబంధించి రూ15,848.20 కోట్లు, కేంద్ర ప్రభుత్వ రుణాలకు రూ.440.85 కోట్లు, ఇతర రుణాలకు సంబంధించి రూ.3,738.66 కోట్లను చెల్లించాల్సి ఉంటుందని వివరించింది. ఇదిలా ఉండగా.. రాష్ట్ర ప్రజలపై తలసరి అప్పు భారం పెరిగిపోతోంది. పాత అప్పు, తాజా బడ్జెట్‌లోని అప్పుతో కలిపితే ఒక్కొక్కరి నెత్తిన రూ.2,30,346 భారం ఉంటుందని అంచనా. రాష్ట్ర బడ్జెట్ అప్పు, బడ్జెట్‌కు ఆవల తీసుకున్న అప్పులు కలిపి మొత్తం రూ.8,06,298 కోట్లుగా ఉన్నట్లు తేలుతోంది. ఇటీవల రాష్ట్ర ప్రణాళిక శాఖ విడుదల చేసిన 'అట్లాస్'లో రాష్ట్ర జనాభా 3,50,03,674 ఉందని తెలిపింది. దీని ప్రకారం తలసరి అప్పు రూ.2,30,346 ఉండనుంది.

అప్పుల చిత్రమిదీ..	తీసుకున్న అప్పు		చెల్లించిన రుణం		మిగులు రుణాలు	
	2023-24	2024-25	2023-24	2024-25	2023-24	2024-25
మార్కెట్ రుణాలు	49,618	56,940	9,341	13,118	3,14,546	3,58,368
కేంద్రం నుంచి రుణాలు	1,948	2,500	325	398	18.057	20,159
ఎన్ఎస్ఎస్ఎఫ్ బాండ్ల ద్వారా	0	0	827	1,389	4,723	3,334
ఆర్థిక సంస్థలు, బ్యాంకుల నుంచి	99,008	1,100	99,123	2,097	13,194	12,197
పీఎఫ్, బీమా ఫండ్స్ ద్వారా	3,468	3,181	1,568	2,226	16,862	17,816
రిజర్వ్ ఫండ్స్, డిపాజిట్ల ద్వారా	76,587	93,630	72,266	90,584	36,283	39,328
మొత్తం	2,30,629	1,57,351	1,83,451	1,09,812	4,03,664	4,51,203

జీఎస్‌డీపీ 16.12 లక్షల కోట్లు

- సేవారంగానిదే అత్యధిక వాటా.. 66.3%
- ఉపాధిలో అగ్రభాగాన వ్యవసాయ రంగం
- 42.7% మంది శ్రామికులకు అదే ఆధారం
- రాష్ట్రాలకు పన్నుల వాటాను 50%కి పెంచాలని రాష్ట్ర ప్రభుత్వ డిమాండ్



హైదరాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి (జీఎస్‌డీపీ) ఈసారి గణనీయమైన వృద్ధిని సాధించింది. ప్రస్తుత ధరల వద్ద 10.1 శాతం మేర వృద్ధి నమోదైంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో వేగంగా వస్తున్న మార్పుల ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కొంటూ.. ఇలాంటి స్థిరమైన వృద్ధిని సాధిస్తున్నామని ప్రభుత్వం ప్రకటించింది. 2024-25లో జీఎస్‌డీపీ రూ.16,12,579 కోట్లుగా ఉందని, గతేడాదితో పోలిస్తే 10.1శాతం మేర వృద్ధి నమోదైందని వెల్లడించింది. ఇదే సమయంలో స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) రూ.3,31,03,215 కోట్లు అని, వృద్ధి రేటు 9.9 శాతమని వివరించింది. కాగా, జీఎస్‌డీపీకి జోడించిన రాష్ట్ర స్థూల విలువ(జీఎస్‌వీఏ)లో సేవా రంగమే అత్యధిక వాటాను (66.3 శాతం) అందించింది. పారిశ్రామిక రంగం 16.4శాతం, వ్యవసాయం, దాని అనుబంధ రంగాలు 17.3 శాతం వాటా అందించాయి. వ్యవసాయం, దాని అనుబంధ రంగాలు జీఎస్‌డీపీలో తక్కువ వాటా కలిగి ఉన్నా.. రాష్ట్ర శ్రామిక రంగంలో మొత్తం 42.7 శాతం మందికి ఉపాధి కల్పిస్తుండటం గమనార్హం.

పరిశ్రమలతో 22.5% మందికి ఉపాధి

రాష్ట్రంలోని పరిశ్రమలు 22.5 శాతం మందికి ఉపాధి కల్పిస్తున్నాయి. ఔషధాలు, బయో టెక్నాలజీ, విద్యుత్తు వాహనాలు, పునరుత్పాదక శక్తి రంగాలలో రాష్ట్రాన్ని గ్లోబల్ తయారీ కేంద్రంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వ లక్ష్యంగా నిర్దేశించుకుంది. పారిశ్రామిక కారిడార్లు, ప్రత్యేక ఆర్థిక మండళ్లను అభివృద్ధి చేయడం ద్వారా పారిశ్రామిక రంగంలో మరిన్ని పెట్టుబడులు వస్తాయని, తద్వారా ఆర్థిక వ్యవస్థ మరింత స్థిరంగా, వేగంగా అభివృద్ధి చెందుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

పన్నుల వాటాను 50 శాతానికి పెంచండి

కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు పంపిణీ చేస్తున్న పన్నుల వాటాను ఇప్పుడున్న 41 శాతం నుంచి 50 శాతానికి పెంచాలని రాష్ట్రప్రభుత్వం డిమాండ్ చేసింది. కొత్త బడ్జెట్‌లో ఈ విషయాన్ని ప్రధానంగా ప్రస్తావించింది. రాష్ట్రానికి వచ్చిన 16వ ఆర్థిక సంఘానికి ఈ అంశంపై సమగ్ర నివేదికను సమర్పించామని తెలిపింది. కేంద్ర ప్రభుత్వం విధిస్తున్న సెస్సులు, అదనపు చార్జీల వల్ల రాష్ట్రాలకు ఆదాయం తగ్గుతున్నదని ఆందోళన వ్యక్తం చేసింది. 14వ ఆర్థిక సంఘం ద్వారా రాష్ట్రానికి 2.437 శాతం మేర వాటా లభిస్తే... 15వ ఆర్థిక సంఘానికి వచ్చేసరికి 2.102 శాతానికి తగ్గిందని తెలిపింది. అభివృద్ధిలో ముందున్న రాష్ట్రాలకు తక్కువ నిధులు కేటాయించడం అన్యాయమని, దేశ ఆర్థికవృద్ధికి దోహదపడుతున్న రాష్ట్రాలను ప్రోత్సహించే విధంగా పన్నుల పంపిణీ విధానం ఉండాలని తెలిపింది. రాష్ట్రాలకు కనీసం 50 శాతం వాటాను అందించాలని డిమాండ్ చేసింది. వాటాను నిర్ధారించే సమయంలో రాష్ట్రాల జీఎస్‌డీపీకి 50 శాతం వెయిటేజీ ఇవ్వాలని పేర్కొంది. కేంద్ర పన్నుల పంపిణీలో న్యాయమైన వాటాను సాధించడంతో పాటు ఆర్థిక వనరులను సద్వినియోగం చేసుకుని, ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి కృషి చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది.

తలసరి ఆదాయంలో అగ్రస్థానం


రాష్ట్ర తలసరి ఆదాయం రూ.3,79,751

దేశ సగటు కన్నా రూ.1,74,172 ఎక్కువ

తలసరి ఆదాయంలో దేశంలోనే తెలంగాణ అగ్రస్థానంలో ఉంది. బడ్జెట్ ప్రసంగంలో ప్రభుత్వం చెప్పిన ప్రకారం 2024-25లో ప్రస్తుత ధరల ప్రకారం రాష్ట్ర తలసరి ఆదాయం రూ.3,79,751గాఉంది. వృద్ధి రేటు 9.6శాతం. జాతీయ తలసరి ఆదాయం రూ.2,05,579 కంటే రాష్ట్ర తలసరి ఆదాయం రూ.1,74,172 అదనంగా ఉంది. దేశ తలసరి ఆదాయంతో పోల్చితే రాష్ట్ర తలసరి ఆదాయం 1.8రెట్లు ఎక్కువగా ఉంది. జిల్లాలవారీగా చూస్తే రంగారెడ్డిలో అత్యధికంగా రూ.10,55,913లక్షలు ఉండగా.. వికారాబాద్‌లో అత్యల్పంగా రూ.1,98,401ఉంది. మొదటి ఐదు స్థానాల్లో రంగారెడ్డి, హైదరాబాద్(రూ.5,54,105), సంగారెడ్డి(రూ.3,45,478), మేడ్చల్(రూ.3,43,130), కొత్తగూడెం(రూ.3,21,281) ఉన్నాయి.

నీటి పారుదలకు ప్రాధాన్యం

ప్రాధాన్య ప్రాజెక్టులకు రూ.8,774 కోట్లు




రైతు పక్షపాత ప్రభుత్వం మాది: మంత్రి ఉత్తమ్

హైదరాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): నీటిపారుదల శాఖకు రూ.23,354 కోట్లు కేటాయించారు. ఇందులో.. కృష్ణా, గోదావరి పరీవాహకంలో ప్రాధాన్య ప్రాజెక్టులకు రూ.8,774 కోట్లను ప్రతిపాదించారు. ఈ ప్రాజెక్టుల పూర్తితో 4,22,911 ఎకరాలను 2025-26లో సాగులోకి తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. రూ.23,354 కోట్లలో రుణాల చెల్లింపు, ఉద్యోగుల జీతభత్యాలు, ప్రాజెక్టుల నిర్వహణకు గాను రూ.12,500 కోట్లు పోతే.. మిగతా రూ.10,754 కోట్లను ప్రాజెక్టుల నిర్మాణాలకు వెచ్చించనున్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఈ శాఖకు రూ.19,349.24 కోట్లు కేటాయించగా.. 2023-24లో రూ.29,766 కోట్లు, 2024-25లో రూ.22,284.96 కోట్లను కేటాయించిన విషయం తెలిసిందే. గత ఏడాదితో పోలిస్తే.. ఈ సారి కేటాయింపులు రూ.1,069.99 కోట్లమేర పెరిగాయి. కాగా, తాజా బడ్జెట్ ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతి అని మరోసారి రుజువైందని మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి గుర్తుచేశారు. "నల్లగొండ జిల్లాలో లక్ష ఎకరాలకు సాగునీరు అందించేందుకు ఉదయ సముద్రం నుంచి బ్రాహ్మణ వెల్లెంల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పనులను పూర్తిచేస్తాం. నల్లగొండతోపాటు.. యాదాద్రి-భువనగిరి జిల్లాలో ఉన్న 107 ఫ్లోరైడ్ ప్రభావిత గ్రామాలకు సురక్షిత తాగునీటిని అందిస్తాం. మూసీ ప్రాజెక్టు పరీవాకంలో.. బునియాదిగాని కాలువ, పిల్లాయిపల్లి కాలువ, ధర్మారెడ్డి కాలువ కోసం రూ.266.65 కోట్లు కేటాయించాం. కృష్ణా బేసిన్‌కు తరలించే ప్రతి నీటి చుక్కను లెక్కించడానికి టెలిమెట్రీ కేంద్రాల ఏర్పాటుకు కృష్ణాబోర్డుకు తగిన నిధులను ఇస్తాం. పౌర సరఫరాల శాఖకు రూ.5734 కోట్లు కేటాయించడంతో లక్షల మందికి ఆహార భద్రత లభిస్తుంది. సన్నాలకు బోనస్ ప్రకటించడం వల్లే.. సాగు విస్తీర్ణం 25 లక్షల ఎకరాల నుంచి 40 లక్షల ఎకరాలకు చేరింది" అని ఆయన వ్యాఖ్యానించారు.

ప్రాజెక్టులకు కేటాయింపులిలా.. (రూ. కోట్లలో)	
కాళేశ్వరం ఎత్తిపోతల	2,684
పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల	1,714
కల్వకుర్తి ఎత్తిపోతల	1,058
ఏఎమ్మార్ ఎస్ఎల్‌బీసీ	1,150
డిండి ఎత్తిపోతల	950
రాజీవ్-భీమా ఎత్తిపోతల	891
మూసీ ప్రాజెక్టు	266.65

వెనకబడిన వర్గాల సంక్షేమానికి 11,405 కోట్లు

గత ఏడాదికన్నా రూ.2,205 కోట్లు అదనం



హైదరాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): వెనకబడిన వర్గాల సంక్షేమానికి బడ్జెట్‌లో రూ.11,405 కోట్లు కేటాయించారు. కులగణన సర్వే నివేదిక ఆధారంగా విద్యా, ఉద్యోగరంగాలతోపాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు నిర్ణయించి ఆయా వర్గాల సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల అమలుకు నిధులు కేటాయించారు. గత ఏడాది బీసీ సంక్షేమ పథకాలకు బడ్జెట్‌లో రూ.9,200 కోట్లు కేటాయించగా.. ఈసారి రూ.2,205 కోట్లు అదనంగా ప్రతిపాదించారు. ఇందులో వెనకబడిన వర్గాల సంక్షేమ పథకాల కోసమే రూ.10,397.15 కోట్లు, నిర్వహణ కింద రూ.1,008 కోట్లు కేటాయించారు. ఇక వివిధ కులాలకు చెందిన ఒక్కో కార్పొరేషన్‌కు ఈసారి రూ.50 కోట్ల చొప్పున కేటాయించారు. వాల్మీకిబోయ, కృష్ణబలిజ, వడ్డెర, విశ్వబ్రాహ్మణ, భట్రాజు, శాలివాహన, సగర, మున్నూరుకాపు తదితర ఆర్థిక సహకార సంస్థలకు భారీగా నిధులు కేటాయించారు. ఎంబీసీ కార్పొరేషన్‌కు రూ.400 కోట్లు, నాయిబ్రాహ్మణ కార్పొరేషన్‌కు విద్యుత్ చార్జీల రాయితీ కోసం రూ.100 కోట్లు కేటాయించారు. చేపల పెంపకం, మహిళలకు పంపిణీ చేసేందుకు చేనేత కార్మికులకు చీరల తయారీకి ఆయా పథకాల కింద నిధులు ఖర్చు చేయనున్నారు. స్వయం ఉపాధి పథకాలు, ఆర్థిక సాయం అందించే రాజీవ్ యువవికాసం, కల్యాణలక్ష్మి తదితర సంక్షేమ పథకాల కోసం రూ.400 కోట్లు కేటాయించారు.

బడ్జెట్‌లో ఆయా శాఖలకు కేటాయింపులు (రూ. కోట్లలో)

శాఖ	నిర్వహణపద్దు	ప్రగతి పద్దు	మొత్తం బడ్జెట్
వ్యవసాయం	1297	23142	24439
పశు సంవర్ధక శాఖ	1157	517	1674
బీసీ సంక్షేమం	1008	10397	11405
ఇంధన శాఖ	1630	19590	21221
ఆర్థికం	53771	237	54008
పౌరసరఫరాలు	119	5615	5734
సాధారణ పరిపాలన	481	631	1112
వైద్య ఆరోగ్యం	5667	6726	12393
ఉన్నత విద్య	3009	635	3643
హోంశాఖ	9337	851	10188
గృహనిర్మాణం	1583	12571	14154
పరిశ్రమలు	115	3783	3898
ఐటీ	3	771	774
నీటిపారుదల	11544	11829	23354
కార్మికశాఖ	479	421	900
న్యాయ శాఖ	1564	889	2453
లెజిస్లేచర్ సెక్రటేరియట్	224	31	255
మైనార్టీ	745	2846	3591
పురపాలక శాఖ	7640	10037	17677
పంచాయతీరాజ్	5260	26345	31605
ప్రణాళిక	122	3741	3863
రెవెన్యూ	2083	286	2369
ఎస్సీ సంక్షేమం	341	11220	11561
సెకండరీ ఎడ్యుకేషన్	16298	3166	19464
రవాణాశాఖ	114	4371	4485
రోడ్లు,భవనాలు	1921	3986	5907
గిరిజన సంక్షేమం	662	6860	7522
మహిళాశిశు సంక్షేమం	973	1888	2862
యువజన సంక్షేమం	174	1237	1411
అటవీ, పర్యావరణం	834	189	1023
మొత్తం	1,30,154	1,74,811	3,04,965

ఉద్యోగుల జీతభత్యాలు, సంస్థాగత వ్యయాలను నిర్వహణ పద్దుగా, అభివృద్ధి పనులకు కేటాయించే మొత్తాన్ని ప్రగతి పద్దుగా పరిగణిస్తారు.

'హ్యామ్'లో 17 వేల కి.మీ. రోడ్ల అభివృద్ధి!

రాష్ట్రంలోని 17వేల కిలోమీటర్ల రోడ్లను మూడేళ్లలో రూ.28వేలకోట్లతో హైబ్రిడ్ యాన్యుయిటీ విధానం(హ్యామ్)లో అభివృద్ధి చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. 40-60నిష్పత్తిలో ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో రోడ్లను అభివృద్ధి చేస్తామని పేర్కొంది. ఈ సారి రోడ్లు, భవనాల శాఖకు రూ.5,906.95 కోట్లు కేటాయించగా.. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం భూ సేకరణకు రాష్ట్ర వాటా కింద రూ.1,525 కోట్లు కేటాయించింది.



స్వల్పంగా మూలధన వ్యయం కేటాయింపులు పెంపు



రాష్ట్ర ప్రభుత్వం తాజా బడ్జెట్‌లో మూలధన వ్యయం కింద కేటాయింపులు స్వల్పంగా పెంచింది. గతేడాది (2024-25)తో పోలిస్తే రూ.3,018 కోట్లు అదనం. 2025-26లో మూలధన వ్యయం కింద బడ్జెట్‌లో రూ.36,504 కోట్లు కేటాయించింది. గతేడాది బడ్జెట్‌లో మూలధన వ్యయం కోసం 33,486.50 కేటాయిస్తూ ప్రతిపాదనలు చేసినా దాన్ని రూ.33,087.85 కోట్లకు సవరించింది. 2024-25లో గత జనవరి వరకూ 29,081.33 కోట్లు మాత్రమే వ్యయం చేసింది. గతేడాది కంటే అదనంగా రూ.3,018 కోట్లు పెంచి, తాజా బడ్జెట్‌లో మూలధన వ్యయం కింద రూ.36,504 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రతిపాదించింది.

హామీలకు గ్యారెంటీ!



(మొదటిపేజీ తరువాయి)

బుధవారం ప్రవేశపెట్టారు. మొత్తం వ్యయాన్ని రూ.3,04,965 కోట్లుగా ప్రతిపాదించారు. ఇందులో రెవెన్యూ వ్యయం రూ.2,26,982 కోట్లు, మూలధన వ్యయం రూ.36,504 కోట్లు. అలాగే, జీతాలు, పింఛన్లు, ఇతరత్రా ఖర్చుల వంటి నిర్వహణ పద్దు రూ.1,30,154 కోట్లు కాగా.. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు నిధులిచ్చే ప్రగతి పద్దు రూ.1,74,811 కోట్లు!! ప్రస్తుత (2024-25) ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం గత ఏడాది రూ.2,91,159 కోట్ల బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. అయితే, ఆశించిన మేర ఆదాయం రాకపోవడం, వ్యయాన్ని కూడా తగ్గించుకోవాల్సి రావడంతో ఈ బడ్జెట్‌ను రూ.2,65,934 కోట్లకు కుదించింది. అయినా.. రూ.39,030 కోట్ల (14.67%)ను పెంచి ఈ ఏడాది బడ్జెట్‌కు రూపకల్పన చేసింది. బడ్జెట్‌లో విద్య, వైద్యం, సంక్షేమం, వ్యవసాయం, సాగునీటి పారుదల, పురపాలక- పట్టణాభివృద్ధి, పంచాయతీరాజ్ రంగాలకు ప్రాధాన్యమిచ్చింది.

గ్యారెంటీలకే లక్ష కోట్లు!

సర్కారు ఆరు గ్యారెంటీలతోపాటు ప్రభుత్వ ప్రాధాన్య పథకాలకే రూ.1,04,329 కోట్లను కేటాయించింది. మొత్తం బడ్జెట్లో ఇది 34.21 శాతం కావడం గమనార్హం. ఇందులో ఆరు గ్యారెంటీ (రైతు భరోసా, చేయూత, ఇందిరమ్మ ఇళ్లు, ఆర్టీసీలో ఉచిత ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, సన్న ధాన్యానికి బోనస్, ఆరోగ్యశ్రీ, సబ్సిడీ సిలిండర్, ఆత్మీయ భరోసా)లకే రూ.56,084 కోట్లు ఖర్చు చేయనున్నట్లు పేర్కొంది. వీటితోపాటు రాజీవ్ యువ వికాసం, యంగ్ ఇండియా గురుకులాలు, 100 శాతం సౌర శక్తి గ్రామాలు, ఇందిరా గిరి జల వికాసం, టూరిజం ప్రాజెక్టులు, నగరాభివృద్ధి పథకాలకూ నిధులు కేటాయించింది. నిజానికి, ఇవన్నీ కొత్త పథకాలే అయినా.. బడ్జెట్‌కు ముందే వీటిని ప్రారంభించేసింది. అందుకే, ఈ బడ్జెట్లో తొలిసారిగా నిధులు కేటాయించింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ యువత ఒక్కొక్కరికి రూ.3 లక్షల ఆర్థిక సాయాన్ని అందించే 'రాజీవ్ యువ వికాసం' పథకాన్ని ఇటీవల ప్రారంభించిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో 5 లక్షల మందికి ఉపాధి కల్పించడానికి ఈ బడ్జెట్లో ఆయా సంక్షేమ శాఖల ద్వారా రూ.6000 కోట్లు ఖర్చు చేస్తామని స్పష్టం చేసింది. అలాగే, అన్ని కులాల విద్యార్థులూ ఒకే చోట చదువుకునేలా నియోజకవర్గానికో యంగ్ ఇండియా సమీకృత గురుకులాలను ఏర్పాటు చేస్తామని ప్రకటించిన సర్కారు.. ఇటీవల కొన్నిటికి శంకుస్థాపనలు కూడా చేసిన విషయం తెలిసిందే. అందుకే, వీటి నిర్మాణానికి ఏకంగా రూ.2,900 కోట్లను కేటాయించింది. గ్రామాల్లో నూటికి నూరు శాతం సౌర వెలుగులు విరజిమ్మే పథకానికి రూ.1500 కోట్లు కేటాయించింది. సీఎం రేవంత్ రెడ్డి గ్రామం కొండారెడ్డిపల్లి, కేసీఆర్ గ్రామం ఎర్రవల్లి వంటి గ్రామాలను 100 శాతం సౌరశక్తి గ్రామాలుగా మార్చాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఇక, గిరిజన రైతులకు సోలార్ పంపు సెట్లను అందించే 'ఇందిర గిరి జల వికాసం' పథకానికి ఈసారి నిధులు కేటాయించింది. అయితే, రాబోయే నాలుగేళ్లలో రూ.12,600 కోట్ల ఖర్చుతో 2.1 లక్షల పంపుసెట్లను అందించే ఈ పథకానికి ఈ ఏడాది కేవలం రూ.600 కోట్లనే కేటాయించడం గమనార్హం. ఇక, బడ్జెట్‌కు ముందే అమల్లోకి తెచ్చిన మరో పథకం 'ఇందిర ఆత్మీయ భరోసా'! దీనిని ఫిబ్రవరి 26న ప్రారంభించింది. ఈ పథకం కింద వ్యవసాయ రైతు కూలీలకు ఏడాదికి రెండు విడతల్లో రూ.12 వేల చొప్పున ఆర్థిక సాయాన్ని అందిస్తామని ప్రకటించింది. మొదటి దశలో 18,180 మంది లబ్ధిదారులకు రూ.6000 చొప్పున అందజేసింది. ఈ పథకానికి బడ్జెట్లో తొలిసారిగా రూ.600 కోట్లను కేటాయించింది. అంటే, రాబోయే ఆర్థిక సంవత్సరంలో 5 లక్షల మంది వ్యవసాయ కూలీలకు ఈ పథకాన్ని వర్తింపజేయనుందని తెలుస్తోంది!!

విద్యకు, ఇంటికి పెద్దపీట

బడ్జెట్లో రాష్ట్ర ప్రభుత్వం బలహీన వర్గాల ఇంటి నిర్మాణానికి, విద్యకు పెద్దపీట వేసింది. నిరుపేదలకు ఇంటిని నిర్మించి ఇచ్చే ఇందిరమ్మ ఇళ్ల పథకానికి రూ.12,571 కోట్లను కేటాయించింది. బడ్జెట్లో విద్యకు రూ.23,108 కోట్లు ఇచ్చింది. యంగ్ ఇండియా స్కూళ్లు, కాలేజీలు, వర్సిటీలకు కేటాయించిన నిధులు, డైట్ చార్జీలు దీనికి అదనం. అలాగే, యువతకు నియోజక వర్గానికో అంబేడ్కర్ నాలెడ్జ్ సెంటర్ ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. ఇక, రూ.2000 ఆసరా పింఛనును 4000కు పెంచుతామని ప్రకటించినా.. ఈసారి బడ్జెట్లో కేటాయింపులు పెద్దగా పెంచలేదు. ఈసారి 'నగరాభివృద్ధి' అనే కొత్త పథకాన్ని ప్రవేశపెట్టి.. దానికి వెయ్యి కోట్లు కేటాయించింది. ఈ ఏడాది ఎమ్మెల్యేలకూ భారీగానే నిధులు రానున్నాయి. స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్, నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమం (సీడీపీ) కింద బీఆర్ఎస్ హయాంలో కేవలం 800 కోట్లు మాత్రమే కేటాయించగా.. ఈసారి బడ్జెట్లో ఏకంగా 3,300 కోట్లు కేటాయించడం గమనార్హం.

మెట్రో, మూసీ, ఫ్యూచర్ సిటీ.. పీపీపీలే!

ప్రభుత్వ ప్రాధాన్య పథకాలైన మెట్రో విస్తరణ, ఆర్ఆర్ఆర్, మూసీ నది సుందరీకరణ, ఫ్యూచర్ సిటీ తదితర పథకాలకు బడ్జెట్లో నిధులు కేటాయిస్తారని భావించారు. కానీ, ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం భూ సేకరణ పరిహారానికి రూ.1,525 కోట్లు మినహా మిగిలిన వాటికి ఒక్క పైసా కేటాయించలేదు. దాంతో, వాటిని రుణాలు, పీపీపీ పద్ధతిలోనే చేపట్టనున్నారని అర్థమవుతోంది. మెట్రో రెండో దశ కింద 76.4 కి.మీ పొడవుతో 6 కారిడార్లను రూ.24,269 కోట్లను నిర్మించాలని నిర్ణయించింది. ఇందులో 30% నిధులను తాను సర్దాలని రాష్ట్ర ప్రభుత్వం భావించింది. కానీ... దీనికీ పైసా కేటాయించకపోవడం విశేషం. ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీకి ఎక్కువ నిధులు ఇస్తారనుకుంటే.. కేవలం రూ.100 కోట్లతో ప్రభుత్వం సరిపెట్టడం గమనార్హం.

రాష్ట్ర ప్రభుత్వ ఆదాయం ఆశ, నిరాశల మధ్య కొట్టుమిట్టాడుతోంది! రాష్ట్ర సొంత ఆదాయం అంచనా వేసిన మేరకు రావడంలేదు. ఉదాహరణకు.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పన్ను ఆదాయం రూ.1,38,181 కోట్లు అని అంచనా వేస్తే.. సవరించిన అంచనాలకు వచ్చేసరికి అదికాస్తా రూ.1,29,406 కోట్లకు తగ్గిపోయింది. అయినా వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.1,45,419 కోట్లు వస్తాయని అంచనా వేశారు. ఇందుకు ప్రధాన కారణం రిజిస్ట్రేషన్ ఆదాయమే. ఈ ఒక్క శాఖలోనే దాదాపు రూ.4,400 కోట్ల ఆదాయాన్ని పెంచేశారు. తద్వారా, భూముల విలువలు, రిజిస్ట్రేషన్ చార్జీల్లో భారీ పెరుగుదల ఉండనుందని స్పష్టమవుతోంది. అలాగే, మద్యంపై వచ్చే ఆదాయాన్ని కూడా దాదాపు రూ.2000 కోట్లు పెంచారు. ఇందుకు కొత్త బ్రాండ్లు రానుండడం, మద్యం వినియోగం పెరగనుండడం ఒక కారణం. వీటికితోడు చార్జీల పెంపు ఉండే

రాష్ట్రంలో నిరాశ.. కేంద్రంపై ఆశ

అంశాన్ని కొట్టిపారేయలేమని నిపుణులు చెబుతున్నారు. ఇక, పన్నేతర ఆదాయం కింద ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.35,208 కోట్లు వస్తుందని అంచనా వేశారు. కానీ, సవరించిన అంచనాల్లో దానిని రూ.25,814 కోట్లకు కుదించారు. కానీ, రాబోయే ఆర్థిక సంవత్సరానికి మాత్రం రూ.31,618 కోట్లకు పెంచేశారు. దాంతో, ఈ ఏడాది భూముల అమ్మకాలు భారీగానే ఉండనున్నాయని అర్థమవుతోంది. రాష్ట్రంలో ఆదాయం తగ్గినా కేంద్రం నుంచి వచ్చే నిధులు పెరుగుతుండడం సర్కారుకు కాస్త ఊరట. ఉదాహరణకు, బీఆర్ఎస్ సర్కారు ఉన్నప్పుడు గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద భారీగా అంచనాలు వేసినా.. నిధులు తక్కువగానే వచ్చేవి. 2023-24లో వచ్చింది కేవలం రూ.9,933 కోట్లే! కానీ, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.21,636 కోట్లు వస్తాయని అంచనా వేసుకుంటే.. రూ.19,836 కోట్లు వచ్చాయి. గత బడ్జెట్లతో పోలిస్తే ఈ విభాగంలోనే పది వేల కోట్ల వరకూ అదనంగా రావడం విశేషం. అలాగే, కేంద్ర పన్నుల్లో రాష్ట్ర వాటా నిధులు 2024-25 సవరించిన అంచనా 27,050 కోట్లు కాగా.. ఈసారి రూ.29,899 కోట్లు రావచ్చని అంచనా వేశారు. ఇక, వచ్చే ఆర్థిక సంవత్సరంలో కూడా సర్కారు భారీగానే అప్పులు చేయనుంది. బహిరంగ మార్కెట్ రుణాలుగా రూ.64,539 కోట్లు సేకరిస్తామని పేర్కొంది. ఫలితంగా.. రాష్ట్ర ప్రభుత్వ మొత్తం అప్పు ఎప్పట్లాగే రూ.8 లక్షల కోట్లకుపైనే ఉండనుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆదాయం తగ్గడంతో ఖర్చూ తగ్గిపోయింది. అయినా.. రాబోయే ఆర్థిక సంవత్సరానికి దాదాపు 15 శాతం అధికంగానే బడ్జెట్‌ను అంచనా వేయడం విశేషం!!



వైద్యానికి పెద్దపీట



హైదరాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): వైద్యఆరోగ్య శాఖకు బడ్జెట్‌లో సర్కారు పెద్దపీట వేసింది. నర్సింగ్, వైద్య కళాశాలల నిర్మాణం, బోధనాస్పత్రుల అభివృద్ధికి ప్రాధాన్యమిచ్చింది. ఆయా విభాగాల కోసం రూ.1024 కోట్లు కేటాయించింది. రాష్ట్ర ప్రభుత్వం ఈ సారి బడ్జెట్‌లో రూ.12,393 కోట్లు కేటాయించింది. గత ఏడాది రూ.11,468 కోట్లు కేటాయించగా, అదనంగా రూ.925 కోట్లు పెంచింది. మొత్తం బడ్జెట్‌లో వైద్యఆరోగ్య రంగానికి సర్కారు 4.06% నిధులను కేటాయించింది. ఇందులో నిర్వహణ వ్యయం కింద రూ. రూ.5667 కోట్లు, ప్రగతి పద్దు (జీతభత్యాలు మినహా అభివృద్ధి పనులకు కేటాయించే మొత్తాన్ని ప్రగతి పద్దు కింద పరిగణిస్తారు) కింద రూ.6726 కోట్లు కేటాయించింది. గత ఏడాది రాజీవ్ ఆరోగ్యశ్రీకి రూ.1065 కోట్లు కేటాయించగా.. ప్రస్తుత బడ్జెట్‌లో రూ.1143 కోట్లకు పెంచారు. అదనంగా రూ.78 కోట్లు చేర్చారు. ఉద్యోగుల ఆరోగ్య పథకం కింద రూ.580 కోట్లు కేటాయించారు. ఇందులో పెన్షనర్లకు రూ.150 కోట్లు, జర్నలిస్టుల ఆరోగ్య పథకం కింద రూ.45 కోట్లు కేటాయించారు. గత బడ్జెట్‌లో న్యూట్రియంట్ కిట్స్‌కు నిధులివ్వలేదు. కానీ ఈసారి రూ.167 కోట్లు కేటాయించింది.

వైద్యవిద్య సంచాలకుల (డీఎంఈ) పరిధిలోని ఆస్పత్రుల అభివృద్ధి, అవసరమైన పరికరాలు పరీక్షలు నిర్వహించే యంత్రాల కొనుగోలు తదితరాల కోసం రూ.3010 కోట్లు కేటాయించారు. వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల అప్‌గ్రేడేషన్ కోసం రూ.164 కోట్లు, టీవీవీపీ ఆస్పత్రుల్లో సర్జికల్స్, ఎక్విప్‌మెంట్స్, రీజెంట్స్ కొనుగోలు కోసం రూ.100 కోట్లు, ఈ హాస్పిటల్స్‌లో శానిటేషన్, సెక్యూరిటీ,పేషంట్ కేర్ సర్వీస్ కోసం రూ.116 కోట్లు కేటాయించారు. ఎంఎన్‌జే అభివృద్ధికి రూ.60 కోట్లు, ఎంఎన్‌జే అంకాలజీ ఇన్‌స్టిట్యూట్ ప్రాంతీయ క్యాన్సర్ కేంద్ర భవన నిర్మాణానికి రూ.4 కోట్లు కేటాయించారు. నిమ్స్ ఆస్పత్రికి రూ.27 కోట్లు ఇచ్చారు. జీహెచ్ఎంసీ పరిధిలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగుల సహాయకులకు సబ్సిడీ ఆహారాన్ని అందించేందుకు రూ. 169 కోట్లు కేటాయించారు. నూతన వైద్య కళాశాలల నిర్మాణం కోసం రూ.565 కోట్లు, డీఎంఈ పరిధిలోని ఆస్పత్రుల్లో డయాగ్నస్టిక్ పరికరాలు, డయాగ్నస్టిక్ రియెజెన్స్ డిస్పోజబుల్, శస్త్ర చికిత్సల కోసం అవసరమైన పరికరాల కొనుగోలు కోసం రూ.360 కోట్లు, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల ఏర్పాటు కోసం రూ.272 కోట్లు కేటాయించారు.

ప్రగతి పద్దు కింద కేటాయింపులు..

మెట్రోకు 1100 కోట్లు

పాతబస్తీ కారిడార్ పనులకు 500 కోట్లు

హైదరాబాద్ సిటీ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశ విస్తరణ పనులకు రాష్ట్ర బడ్జెట్‌లో రూ.1,100 కోట్లు కేటాయించారు. రెండో దశలో నాగోల్-శంషాబాద్ ఎయిర్‌పోర్టు, రాయదుర్గ్-కోకాపేట్ , ఎంజీబీఎస్-చాంద్రాయణగుట్ట (పాత బస్తీ) , మియాపూర్-పటాన్‌చెరు, ఎల్‌బీ నగర్-హయత్‌నగర్ మెట్రో పనులు చేపడుతున్న విషయం తెలిసిందే. రాష్ట్ర ప్రభుత్వం తాజా బడ్జెట్‌లో పాత బస్తీ కారిడార్‌కు రూ.500 కోట్లు, ఎయిర్‌పోర్టు కారిడార్‌కు రూ.100 కోట్లు, హెచ్ఎంఆర్ఎల్‌కు రుణాల కింద రూ.500 కేటాయించింది.



మూసీకి రూ.1500 కోట్లు


మూసీ నది అభివృద్ధి ప్రాజెక్టుకు ఈ బడ్జెట్‌లో కూడా రూ.1500 కోట్లు కేటాయించారు. గత ఏడాది కూడా ప్రగతి పద్దు కింద రూ.1500 కోట్లు కేటాయించినా ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు.

పరిశ్రమలశాఖకు పెరిగిన కేటాయింపులు

2014 తర్వాత తొలిసారి 3,527 కోట్లు



హైదరాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో పెట్టుబడులకు దేశ, విదేశీ కంపెనీలు ప్రత్యేక ఆసక్తి చూపిస్తున్న నేపథ్యంలో పరిశ్రమల శాఖకు ఈసారి రాష్ట్ర ప్రభుత్వం కేటాయింపులు భారీగా పెంచింది. గతేడాది రూ. 2,732 కోట్లు కేటాయించగా.. ఈసారి రూ. 3,527 కోట్లు ప్రతిపాదించింది. గతంతో పోలిస్తే రూ. 795 కోట్లు అధికం. గత జనవరిలో దావోస్ సమావేశాల్లో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని బృందం రికార్డు స్థాయిలో రూ. 1.78 లక్షల కోట్ల పెట్టుబడులు సేకరించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత కూడా పెట్టుబడులు ప్రవాహంలా వస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రారంభించిన విద్యుత్ వాహనాల పాలసీ, విద్యుత్ పాలసీలతో ఈ రంగాల్లోని దిగ్గజ అంతర్జాతీయ కంపెనీలు ఆసక్తి చూపిస్తున్నాయి. గతేడాది ప్రారంభించిన ఎంఎస్ఎంఈ పాలసీతో దేశీయ కంపెనీల పెట్టుబడులు పెరిగాయి. కొత్త కంపెనీల రాకతో ఉత్సాహంగా ఉన్న ప్రభుత్వం ఈసారి గతంలో ఎన్నడూ లేని విధంగా పరిశ్రమల శాఖకు రూ. 3,527 కోట్లు కేటాయించింది. చేనేత కార్మికులకు ఆర్థిక సహాయం, జౌళిశాఖ కోసం రూ. 237 కోట్లు కేటాయించారు. మహేశ్వరంలోని ఎలక్ట్రానిక్స్ మాన్యుఫాక్చరింగ్ క్లస్టర్ కోసం రూ. 21.50 కోట్లు, జహీరాబాద్ నిమ్జ్ భూసేకరణకు రూ. 125 కోట్లు, 10 ఫార్మా క్లస్టర్ల భూసేకరణ కోసం రూ. 50 కోట్లు బడ్జెట్టులో ప్రతిపాదించారు.



రైతు భరోసాకు పెరిగిన నిధులు

గతంలో ఏడాదికి 15 వేల కోట్లు.. ఈసారి బడ్జెట్‌లో 18 వేల కోట్లు



హైదరాబాద్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): రైతు భరోసా పథకానికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు పెంచింది. గతంలో ఏడాదికి రూ.15 వేల కోట్లు కేటాయిస్తుండగా ఈసారి రూ.18 వేల కోట్ల కేటాయించింది. రూ.3 వేల కోట్లు పెంచటం గమనార్హం. ఇదివరకు ఒక పంటకు రూ. 5 వేల చొప్పున.. రెండు పంటలకు కలిపి ఎకరానికి ఏడాదికి రూ.10 వేలు పంపిణీ చేయగా... ఈ యాసంగి సీజన్ నుంచి ఎకరానికి రూ.6 వేల చొప్పున పంపిణీ చేస్తున్నారు. అంటే రైతులకు ఇక నుంచి ఏడాదికి రూ.12 వేలు అందనుంది. ఈ నిధులు కోటిన్నర ఎకరాలకు సరిపోతాయి. వానాకాలంలో 150 లక్షల ఎకరాలకు రూ.6 వేల చొప్పున రూ.9 వేల కోట్లు, యాసంగిలో కూడా 150 లక్షల ఎకరాలకు రూ.9 వేల కోట్లు పంపిణీ చేయనున్నారు. బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తూ రూ.24,439 కోట్లు కేటాయించింది. ఇందులో రైతు భరోసాకు రూ.18 వేల కోట్లు పోగా... మిగిలిన రూ.6,439 కోట్లను ఇతర పథకాలకు ఖర్చు చేయనుంది. రైతు బీమా పథకానికి రూ.1,589 కోట్లు కేటాయించింది. 2024-25లో రైతు బీమాలో 42.16 లక్షల మంది లబ్ధిదారులను చేర్చారు. ఒక్కొక్కరికి రూ.3,400 చొప్పున రాష్ట్ర ప్రభుత్వం ప్రీమియం చెల్లించింది. పంటల బీమా పథకానికి రూ.1,300 కోట్లు, సన్నవడ్లకు క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ ఇచ్చే పథకానికి రూ.1,800 కోట్లు కేటాయించింది. వ్యవసాయ యాంత్రీకరణ, రైతు వేదికలకు నామమాత్రపు కేటాయింపులు చేశారు. మార్కెట్ స్థిరీకరణ నిధికి నిధుల కేటాయింపులు చేయలేదు. కాగా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు ప్రభుత్వం రూ.600 కోట్లు కేటాయించింది. ఒక్కొక్కరికి ఆరు నెలలకు రూ.6 వేల చొప్పున ఏడాదికి రూ.12 వేలు చెల్లించాలనేది ఈ పథకం లక్ష్యం. దీనికి 3.50 లక్షల మంది అర్హులను గుర్తించినట్లు గ్రామీణాభివృద్ధి శాఖ ప్రకటించింది. తాజా కేటాయింపుల ప్రకారం రూ.600 కోట్లతో 5 లక్షల మందికి లబ్ధి

సామాజిక ఆర్థిక సర్వేలో కీలక అంశాలు

30 మందికే 10లక్షల ఆరోగ్యశ్రీ


రాజీవ్ ఆరోగ్యశ్రీ వ్యయ పరిమితిని ప్రభుత్వం రూ.10 లక్షలకు పెంచాక.. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఆ మొత్తంలో వైద్య సేవలు పొందిన రోగులు 30 మంది మాత్రమే ఉన్నారు. రూ.5 లక్షల వరకు వినియోగించుకున్న వారు 170 కాగా.. రూ.50వేలకు పైబడిన సేవలను పొందిన వారు ఎక్కువగా ఉన్నారు. మొత్తానికి రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా లబ్ధి పొందిన వారు 2.92 లక్షల మంది ఉన్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది.

- కుటుంబ నియంత్రణలో భాగంగా రాష్ట్రంలో 1,35,713 మంది కండోమ్‌లను వాడుతుండగా, 1,10,016 మంది ఓరల్ పిల్స్‌ను వినియోగిస్తున్నారు. మరో 13,676 మంది కుటుంబ నియంత్రణ ఇంజెక్షన్లు చేయించుకున్నారు.
- రాష్ట్రవ్యాప్తంగా ఎన్‌సీడీ స్క్రీనింగ్‌లో 3.89 కోట్ల మందిని పరీక్షించగా, 56 లక్షల మంది రక్తపోటుతో.. 27 లక్షల మంది మధుమేహంతో బాధపడుతున్నట్లు తేలింది.



ఏయే రంగాల్లో ఎంతమేర ఉపాధి?

తెలంగాణ పట్టణ ప్రాంతాల్లో ట్రేడ్ అండ్ ఆటో మొబైల్ రిపేర్ రంగంలో 18.7% మంది ఉపాధి పొందుతున్నారు. ఆ తర్వాతి స్థానాలను తయారీ రంగం (16.7%), ఐటీసీ(11.1%), నిర్మాణ రంగం(11%), రవాణా- స్టోరేజీ రంగం(6.4%), విద్య(6.1%), వ్యవసాయం, అటవీ, మత్స్య రంగాలు(4.3%), స్వయం ఉపాధి(4.1%), బీమా-ఆర్థిక రంగం(3.1%), ఇతర విభాగాలు(14.4%) ఉన్నాయి.



200 ఎకరాల భూమి.. 12 చెరువులను కాపాడిన హైడ్రా

200 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా కాపాడింది. హైదరాబాద్ నగరంలో 12 పెద్ద చెరువులను సంరక్షించి, ఆక్రమణలకు గురి కాకుండా వాటికి రక్షణ ఏర్పాట్లు చేసింది. విపత్తు ప్రతిస్పందన బృందాల(డీఆర్ఎఫ్) సంఖ్య 42 నుంచి 72కు పెరిగింది.



రాష్ట్రంలో 24.69% అడవులు.. దేశంలో 3వ స్థానం

తెలంగాణలో అటవీ విస్తీర్ణం క్రమంగా పెరుగుతోంది. ప్రస్తుతం 27,688 చదరపు కిలోమీటర్ల అటవీ విస్తీర్ణం ఉంది. రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణంలో అడవుల వాటా 24.69%. ఛత్తీస్‌గఢ్, ఒడిసా తర్వాత.. తెలంగాణ దేశంలోనే మూడోస్థానంలో ఉంది. జిల్లాల వారీగా చూస్తే.. రాష్ట్రంలో అత్యధికంగా ములుగులో 64% అటవీ భూములున్నాయి. అత్యల్పంగా కరీంనగర్‌లో 2.29% మేర అడవులున్నాయి.



ఏడు పులులు.. 41 చిరుతలు

ఆల్ ఇండియా టైగర్ ఎస్టిమేషన్(ఏఐటీఈ)-2022 ప్రకారం రాష్ట్రంలో ఏడు పులులు, 41 చిరుత పులులున్నాయి. కవ్వాల్, అమ్రాబాద్ పులుల అభయారణ్యాల్లో వీటిని గుర్తించారు.

ఫోన్ల సంఖ్య 4.57 కోట్లు



తెలంగాణలో జనాభా కంటే సెల్ ఫోన్‌లు, ల్యాండ్ ఫోన్ల సంఖ్య ఎక్కువగా ఉంది. రాష్ట్రంలో 4.42కోట్ల సెల్‌ఫోన్‌లు, 15.2 లక్షలు ల్యాండ్‌లైన్ ఫోన్లున్నాయి.



1.71 కోట్ల వాహనాలు

రాష్ట్రంలో మొత్తం 1.71కోట్ల వాహనాలున్నాయి. వీటిలో సింహభాగం వాటా(73.52%) ద్విచక్ర వాహనాలదే. మిగతా కేటగిరీలో కార్లు, ఆటోరిక్షాలు, ఇతర మధ్యతరహా, భారీ, రవాణా వాహనాలున్నాయి.

నా భర్తది ముమ్మాటికి రాజకీయ హత్యే

» కేసీఆర్, కేటీఆర్, హరీశ్, గండ్ర ప్రమేయం

» నాగవెల్లి రాజలింగ మూర్తి భార్య సరళ

కృష్ణకాలనీ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): తన భర్తది ముమ్మాటికీ రాజకీయ హత్యేనని, ఈ ఘటనలో బీఆర్ఎస్ నేతలు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డిల ప్రమేయం ఉందని ఇటీవల హత్యకు గురైన భూపాలపల్లికి చెందిన సామాజిక కార్యకర్త నాగవెల్లి రాజలింగ మూర్తి భార్య సరళ ఆరోపించారు. బుధవారం భూపాలపల్లి ప్రెస్‌క్లబ్‌లో ఆమె మాట్లాడారు. తన భర్త పలు ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా అడ్డుకున్నారని, అతను అలా చేయకపోతే ఒక్క ప్రభుత్వ భూమి కూడా మిగిలేది కాదని అన్నారు. మేడిగడ్డ ప్రాజెక్టులో అవినీతి జరిగిందని, ప్రజాధనం వృథా అయిందని ప్రజల తరుపున కేసు వేశారని చెప్పారు. ఈ క్రమంలో ఇలాంటి వ్యక్తి ఉంటే భూ కబ్జాలకు అవకాశం ఉండదని, ప్రశ్నించే గొంతులను చంపేయాలనే కుట్రతోనే హత్య చేశారని వెల్లడించారు. సీఎం రేవంత్ రెడ్డి తమ కుటుంబానికి రక్షణ కల్పించాలని కోరారు. తన భర్త హత్య కేసును సీబీ సీఐడీతో విచారణ జరిపించాలని సీఎంకు విజ్ఞప్తి చేశారు.

ఆస్తిలో వాటా ఇవ్వకపోతే చంపేస్తా !

» భార్య వేధింపులతో భర్త ఆత్మహత్య

బంజారాహిల్స్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): భార్య వేధింపులు భరించలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన హైదరాబాద్ లక్ష్మీనర్సింహనగర్‌లో బుధవారం జరిగింది. కామారెడ్డి జిల్లా బాన్సువాడకు చెందిన మహ్మద్ నవాజ్ సినీ పరిశ్రమలో కెమెరామెన్‌గా పనిచేస్తున్నాడు. 2020లో శ్వేతారెడ్డిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. కొద్ది రోజులు కాపురం బాగానే సాగింది. అనంతరం శ్వేతారెడ్డి ఆస్తి కోసం నవాజ్‌ను వేధించడం మొదలు పెట్టింది. ప్రతి విషయంలోనూ గొడవ పడుతూ.. బాన్సువాడ, కరీంనగర్, బాలానగర్ పోలీసుస్టేషన్లలో భర్తపై కేసులు పెట్టింది. ఇదిలా ఉండగా, ఇద్దరూ కలిసి ఆరు నెలల క్రితం హైదరాబాద్‌లోని లక్ష్మీనర్సింహనగర్‌లో ఓ ఇంటిని అద్దెకు తీసుకున్నారు. ఇక్కడ కూడా పలు మార్లు ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఈ నెల 16న భార్య ఆస్తిలో వాటాతో పాటు రూ.30 లక్షలు ఇవ్వాలని వేధిస్తున్నదని నవాజ్ తన తల్లి సబేరా బేగంకు ఫోన్ చేసి చెప్పాడు. భోజనం పెట్టకుండా, నిద్రపోనివ్వకుండా వేధిస్తోందని వాపోయాడు. దీంతో నవాజ్ తల్లి.. శ్వేతారెడ్డికి ఫోన్ చేసి అడుడగా తనకు కావాల్సింది దక్కకపోతే కిరాయి మనుషులతో నవాజ్‌ను చంపిస్తానని బెదిరించింది. మరుసటి రోజు మరోసారి గొడవ జరగడంతో నవాజ్ తన తల్లికి ఫోన్ చేసి ఇదే తన చివరి ఫోన్ అని చెప్పాడు. కొద్ది సేపటికి అతను ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సబేరా ఫిర్యాదు మేరకు శ్వేతారెడ్డిపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు.

జీవన్‌రెడ్డికి దక్కని ఊరట

హైదరాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): భూఆక్రమణ కేసులో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డికి హైకోర్టులో చుక్కెదురైంది. ఆయనకు ముందస్తు బెయిల్ ఇవ్వడానికి హైకోర్టు నిరాకరించింది. అయితే.. ఇదే కేసులో నిందితులుగా ఉన్న జీవన్‌రెడ్డి భార్య రజిత, తల్లి రాజుబాయికి ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. భూమిని ఆక్రమించడంతోపాటు.. ఫామ్‌హౌస్‌ను కూల్చివేశారని.. అడ్డుపడిన వ్యక్తులపై దాడిచేశారని పేర్కొంటూ మోకిల, చేవెళ్ల పోలీస్‌స్టేషన్లలో జీవన్‌రెడ్డిపై రెండు కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల్లో ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ జీవన్‌రెడ్డి, ఆయన భార్య, తల్లి హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్లపై బుధవారం విచారణ చేపట్టిన జస్టిస్ లక్ష్మణ్ ధర్మాసనం.. జీవన్‌రెడ్డికి బెయిల్ ఇవ్వడానికి నిరాకరించింది.

శంషాబాద్-వియత్నాం కొత్త విమాన సర్వీసు

శంషాబాద్ రూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి నేరుగా వియత్నాంలోని హోచిమిన్ నగరానికి కొత్త విమాన సర్వీసు ప్రారంభమైంది. వియెట్‌జెట్ అందిస్తున్న ఈ సేవలను శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ అధికారులు బుధవారం ప్రారంభించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి జీహెచ్ఐఎల్ ఉన్నతాధికారులు, భాగస్వాములు హాజరయ్యారు. మంగళ, గురువారాల్లో ఈ విమాన సేవలు అందుబాటులో ఉంటాయని అధికారులు పేర్కొన్నారు.

ఎమ్మెల్యే మాగంటికి సుప్రీంలో ఊరట

న్యూఢిల్లీ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌కు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి పోటీ చేసిన గోపీనాథ్ కాంగ్రెస్ అభ్యర్థి అజారుద్దీన్‌పై విజయం సాధించారు. అయితే, గోపీనాథ్ ఎన్నికను రద్దు చేయాలని అజారుద్దీన్ హైకోర్టును ఆశ్రయించారు. అజారుద్దీన్ పిటిషన్‌ను కొట్టివేయాలని గోపీనాథ్ హైకోర్టులో కౌంటర్ పిటిషన్ వేశారు. అయితే, గోపీనాథ్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. దీన్ని సవాల్ చేస్తూ గతేడాది నవంబరు 6న గోపీనాథ్ సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. ఆ పిటిషన్ బుధవారం ద్విసభ్య ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. ఎమ్మెల్యే న్యాయవాదుల వాదనలను పరిగణలోకి తీసుకున్న ధర్మాసనం.. గోపీనాథ్ పిటిషన్ కొట్టివేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును రద్దు చేసింది. మరోసారి మొదటి నుంచి విచారణ చేపట్టాలని, సమగ్రంగా ఇరు పక్షాల వాదనలు విని, మరోసారి తీర్పు ఇవ్వాలని ఆదేశాల్లో స్పష్టం చేసింది.

కాంగ్రెస్ సర్కారు తీరుతో మాదిగలకు నష్టం

» నెల రోజులు వర్గీకరణ విజయోత్సవాలు: మందకృష్ణ

పంజాగుట్ట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ శాసనసభ మంగళవారం ఆమోదించిన ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టం ఖాళీ కొబ్బరిచిప్పతో సమానమని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. వర్గీకరణ వర్తింప చేయకుండానే ఉద్యోగ ఖాళీలను భర్తీ చేసిన ప్రభుత్వం నేడు వర్గీకరణ చట్టం చేయడం వల్ల మాదిగ నిరుద్యోగ యువతకు లాభం లేకుండా పోయిందని పేర్కొన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం మందకృష్ణ విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ చట్టం తెస్తూనే వర్గీకరణ ఫలాలు మాదిగలకు అందకుండా ప్రభుత్వం చేసిన కుట్రలను ప్రజల్లోకి తీసుకువెళతామని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ తమ విజయమని, రాష్ట్ర వ్యాప్తంగా నెల రోజుల పాటు విజయోత్సవ సభలు నిర్వహిస్తామని మందకృష్ణ మాదిగ ప్రకటించారు. ఆ సభల్లో ప్రభుత్వం, రేవంత్ తీరును ఎండగడతామని వెల్లడించారు.

ఎస్ఎల్‌బీసీలో కన్వేయర్ బెల్టు పునరుద్ధరణ

» టన్నెల్‌లో మట్టిని వేగంగా తరలించేందుకు అవకాశం



నాగర్‌కర్నూల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదంలో గల్లంతైన వారి జాడను కనుగొనేందుకు సహాయక చర్యలు నిరాటంకంగా కొనసాగుతున్నాయి. బుధవారం కన్వేయర్ బెల్టును పునరుద్ధరించడంతో సొరంగం లోపల పేరుకుపోయిన మట్టిని వేగంగా బయటకు తరలించే అవకాశం ఏర్పడింది. ఏడుగురి ఆచూకీ కోసం 18 విభాగాలకు చెందిన 703 మంది సిబ్బంది 24 గంటలు శ్రమిస్తున్నారు. షీర్ జోన్‌లో దాదాపు 5 వేల టన్నుల మట్టి, రాళ్లు ఉండగా ఇప్పటి వరకు లోకో ట్రైన్ ద్వారా 800 క్యూబిక్ మీటర్ల మట్టిని, టన్నెల్ బోరింగ్ యంత్రం విడి భాగాలను బయటకు తీసుకురాగలిగారు. ఈ ప్రక్రియ ఇదే స్థాయిలో కొనసాగితే మరో వారం లోపల మట్టి దిబ్బలు, రాళ్లను బయటకు తీసుకొచ్చే అవకాశం ఉంటుందని ఆర్మీ, నేవీ విభాగాలకు చెందిన నిపుణులు పేర్కొంటున్నారు. ఎండలు బాగా ముదిరిన నేపథ్యంలో సహాయక చర్యలకు కొంత ఇబ్బంది కలిగినా దాన్ని అధిగమించేందుకు కలెక్టర్, ఎస్పీ తగిన చర్యలు తీసుకుంటున్నారు. రెస్క్యూ ఆపరేషన్ నిర్వహిస్తున్న సిబ్బందికి తగిన పోషకాహారం అందించడంతో పాటు ఆక్సిజన్ కొరత లేకుండా చూస్తున్నారు.

సీఎం రేవంత్‌రెడ్డికి హైకోర్టులో ఊరట

» జన్వాడ ఫాంహౌస్‌పై డ్రోన్ ఎగరేసిన కేసు కొట్టివేత



హైదరాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి హైకోర్టులో ఊరట లభించింది. 2020లో నార్సింగి పోలీసులు ఆయనపై పెట్టిన డ్రోన్ ఎగరేసిన కేసును హైకోర్టు బుధవారం కొట్టివేసింది. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు మంత్రి కేటీఆర్‌కు చెందినదిగా పేర్కొంటున్న జన్వాడ ఫాంహౌస్‌పై అప్పటి మల్కాజిగిరి ఎంపీ రేవంత్‌రెడ్డి డ్రోన్ ఎగరేయడంతోపాటు ఫొటోలు తీశారని.. వాటిని ప్రింట్ చేసి, మీడియాకు అందజేశారనే ఆరోపణలతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో కొన్నిరోజులపాటు రేవంత్‌రెడ్డి జైలులో రిమాండ్‌లో ఉన్నారు. తప్పుడు ఆరోపణలతో పెట్టిన ఈ కేసును కొట్టివేయాలని కోరుతూ రేవంత్‌రెడ్డి హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం బుధవారం మరోసారి విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలను నమోదు చేసుకున్న ధర్మాసనం.. డ్రోన్ ఎగరేసిన చోటు నిషేధిత ప్రాంతమని చెప్పడానికి ఆధారాలు లేవని.. దర్యాప్తు సందర్భంగా పోలీసులు చేర్చిన అదనపు సెక్షన్లు కూడా కేసును నిరూపించేవిగా లేవని వ్యాఖ్యానించింది. ఈ మేరకు నార్సింగ్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేస్తూ తీర్పునిచ్చింది.

సీఎంను తిట్టిన వ్యవహారం.. కేటీఆర్‌పై కేసు కొట్టివేత

హైదరాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డిని అసభ్య పదజాలంతో కించపరిచిన వ్యవహారంలో మాజీ మంత్రి కేటీఆర్‌పై సైఫాబాద్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్‌ను హైకోర్టు కొట్టివేసింది. గత ఏడాది ఆగస్టు 20న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి 'చీప్ మినిస్టర్'.. 'ఢిల్లీ గులాం'.. అంటూ కేటీఆర్ ఎక్స్‌లో పోస్టు చేశారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే సచివాలయం పరిసరాల్లో ఉన్న చెత్తనంతా తొలగిస్తామని ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు. దీనిపై కాంగ్రెస్ నేత అనిల్‌కుమార్ యాదవ్ ఫిర్యాదు చేయడంతో.. సైఫాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. ఈ కేసును కొట్టివేయాలని కోరుతూ కేటీఆర్ హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. బాధ్యత గల హోదాలో ఉన్న కేటీఆర్ సీఎం స్థాయిలో ఉన్న వ్యక్తి గురించి ఇష్టారీతిన మాట్లాడటం సరికాదని ధర్మాసనం పేర్కొంది. రాజకీయ కక్షతో ఈ కేసు పెట్టారంటూ కేటీఆర్ తరపు న్యాయవాది వాదనలను వినిపించారు. ఇరువర్గాల వాదనలను విన్న ధర్మాసనం.. రాజకీయ నాయకులు హుందాగా వ్యవహరించాలని.. సామాజిక మాధ్యమాల వేదికగా అసభ్య పదజాలం వినియోగించడం మానేయాలని హితవు పలికింది. కేటీఆర్‌పై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేస్తూ తీర్పునిచ్చింది.

ఢిల్లీకి మూటలు పంపే బడ్జెట్

సంక్షేమానికి సమాధి.. అభివృద్ధి అడ్రస్ గల్లంతు.. ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసిన కాంగ్రెస్

» ఓట్లేసిన పాపానికి ప్రజల్ని నిలువునా ముంచారు

» 1.60 లక్షల కోట్ల అప్పు తెచ్చి ఏం చేశారో చెప్పాలి

» ఊసరవెల్లి ముదిరితే రేవంత్‌రెడ్డి: కేటీఆర్



హైదరాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్.. అసమర్థతకు, పరిపాలనా వైఫల్యానికి నిలువుటద్దమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ప్రజలకిచ్చిన మాటకు కాకుండా ఢిల్లీకి మూటలు పంపడం పైనే బడ్జెట్‌లో దృష్టి పెట్టారని ఆరోపించారు. ఒక్క మాటలో చెప్పాలంటే.. బడ్జెట్ పేదల కష్టాలను తీర్చేలా లేదని, ఢిల్లీకి మూటలు పంపేలా ఉందని అన్నారు. నమ్మి ఓటేసిన పాపానికి 4 కోట్ల మంది ప్రజలను కాంగ్రెస్ నిలువునా ముంచిందన్నారు. బుధవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద కేటీఆర్ మాట్లాడారు. బడ్జెట్ కేటాయింపులు చూస్తే కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు గోవిందా అని అర్థమవుతోందని, తెలంగాణ ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసిందని ధ్వజమెత్తారు. తొండ ముదిరితే ఊసరవెల్లి అవుతుందని, అదే ఊసరవెల్లి ముదిరితే రేవంత్‌రెడ్డి అవుతారని వ్యాఖ్యానించారు. రేవంత్‌రెడ్డి తెలివితక్కువతనం, నెగెటివ్ పాలిటిక్స్ వల్ల రాష్ట్ర ఆదాయం తగ్గిపోయిందని ఆరోపించారు. మీడియా ముందు రంకెలు వేయడంకాదని, అంకెలు ఎందుకు ఆగమయ్యాయో సీఎం చెప్పాలని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో చేనేతకు రూ.1200 కోట్లు కేటాయిస్తే.. ఇప్పుడు రూ.300 కోట్లు ప్రకటించి బడ్జెట్‌ను పరిమితం చేశారని విమర్శించారు. వైన్‌షాపుల్లో గౌడన్నలకు 25 శాతం రిజర్వేషన్, యాదవులకు ఆర్థిక చేయూత ప్రస్తావన అసలే లేదని, హైదరాబాద్ మహానగరం పెండింగ్ నగరంగా మారిపోయిందని ధ్వజమెత్తారు. తులం బంగారం పథకం, రైతుకూలీలకు రూ.12 వేలు ఇవ్వలేదని, పింఛన్లు రూ.4 వేలు ఇస్తామని చేతులెత్తేశారని, దళితులను వెన్నుపోటు పొడిచారని మండిపడ్డారు.

తెచ్చిన అప్పులను ఏం చేశారు?

రుణమాఫీ జరిగిందో, లేదో.. కాంగ్రెస్ వాళ్లకే అర్థం కావడం లేదని కేటీఆర్ ఎద్దేవా చేశారు. నిరుద్యోగ భృతి, విద్యాభరోసా కార్డు ఊసే లేదన్నారు. తమ హయాంలో ఏడాదికి రూ.40 వేల కోట్ల అప్పు చేస్తే గగ్గోలు పెట్టారని, కానీ.. ఇప్పుడు ఏడాదిలోనే రూ.1.60 లక్షల కోట్ల అప్పు చేశారని అన్నారు. ఈ మొత్తాన్ని దేనికి వినియోగించారో చెప్పాలని డిమాండ్ చేశారు. సంక్షేమానికి సమాధి, అభివృద్ధి అడ్రస్ గల్లంతు అయ్యాయని ఆరోపించారు. వారు చేపట్టేది యువ వికాసం పేరుతో కాంగ్రెస్ కార్యకర్తలకు రూ.6వేల కోట్లను పంచి పెడతామంటే తెలంగాణ ప్రజలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. తెలంగాణ ప్రయోజనాలు, ప్రజల సంక్షేమానికి పెనుముప్పులా ఉన్న ఈ బడ్జెట్‌ను బీఆర్ఎస్ వ్యతిరేకిస్తోందన్నారు.

భట్టి బడ్జెట్.. ఝూటా బడ్జెట్: హరీశ్



హైదరాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : భట్టి బడ్జెట్.. ఝూటా బడ్జెట్ అని.. కాంగ్రెస్ సర్కార్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అన్నీ అబద్ధాలు, అతిశయోక్తులే ఉన్నాయని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని సోనియా గాంధీతో ప్రజలకు ఉత్తరం రాయించారని.. ఈ బడ్జెట్‌లోనూ ప్రజలకు నిరాశే మిగిలిందని అన్నారు. మహాలక్ష్మి పథకంలో ఆడబిడ్డలకు నెలకు రూ.2,500 ఇచ్చేందుకు డబ్బుల్లేవు కానీ.. అందాల పోటీల కోసం బడ్జెట్‌లో రూ.250 కోట్లు పెట్టారని ధ్వజమెత్తారు. చేయూత కింద కొత్తవారికి పింఛన్ ఇవ్వలేదని.. వస్తున్న వారిలో 1.50 లక్షల మందికి కోతపెట్టారని ఆరోపించారు. బుధవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో హరీశ్‌రావు మాట్లాడారు. "మిగులు రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా చిత్రీకరిస్తున్నారు. కాంగ్రెస్ ఆలోచనా విధానం వల్లే తెలంగాణ దివాళా తీసింది. గత బడ్జెట్‌లో ఆరు ప్రాజెక్టులు పూర్తిచేస్తామన్నారు.. ఒక్కటైనా పూర్తి చేశారా..? రుణమాఫీ అయిపోయినట్లు ప్రచారం చేస్తున్నారు. నా నియోజకవర్గంలో రూ.2 లక్షలలోపు ఉన్న 10,150 మందికి రుణమాఫీ కాలేదు " అని హరీశ్‌రావు అన్నారు.

రాష్ట్ర ముఖచిత్రాన్ని మార్చే బడ్జెట్

» సీఎం రేవంత్‌రెడ్డి విప్లవ నాయకుడు

» బీసీ రిజర్వేషన్ల కోసం ప్రధాని మోదీ అపాయింట్‌మెంట్ కోరతాం: ఎంపీలు

» మెట్రో రెండోదశకు అనుమతులివ్వండి

» ప్రధాని మోదీకి ఎంపీ చామల లేఖ

న్యూఢిల్లీ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్.. రాష్ట్ర ముఖచిత్రాన్ని మార్చే బడ్జెట్ అని కాంగ్రెస్ ఎంపీలు అన్నారు. బడ్జెట్‌లో అన్ని వర్గాలకూ న్యాయం జరిగిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి విప్లవ నాయకుడని కొనియాడారు. బుధవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, సురేష్ షెట్కార్ మీడియాతో మాట్లాడారు. విజన్-2050 అమలును దృష్టిలో పెట్టుకొని బడ్జెట్‌లో కేటాయింపులు చేశారని తెలిపారు. దేశ తలసరి ఆదాయం కంటే తెలంగాణ తలసరి ఆదాయం ఎక్కువ అని పేర్కొన్నారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులను దశలవారీగా తీర్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని చెప్పారు. గత ప్రభుత్వం గొప్పల కోసం ఎక్కువ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం వాస్తవిక బడ్జెట్‌ను ప్రవేశ పెడుతోందని తెలిపారు. ఇక 42 శాతం బీసీ రిజర్వేషన్లపై త్వరలోనే ప్రధాని నరేంద్ర మోదీ అపాయింట్‌మెంట్ కోరతామన్నారు. బీసీ రిజర్వేషన్ల కోసం కేంద్రంతో కొట్లాటకైనా సిద్ధమేనని ప్రకటించారు. తెలంగాణకు రావాల్సిన నిధులపై పార్లమెంట్‌లో కేంద్రాన్ని నిలదీస్తామన్నారు. మరోవైపు హైదరాబాద్ మెట్రో రెండో దశకు అనుమతులు ఇవ్వాలని కోరుతూ ప్రధాని నరేంద్ర మోదీకి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి లేఖ రాశారు. మెట్రో విస్తరణ ప్రతిపాదనను తెలంగాణ ప్రభుత్వం గతేడాది నవంబరు 4న కేంద్రానికి సమర్పించిందని తెలిపారు. పత్రాలన్నీ కేంద్ర నిర్దేశించిన నిబంధనల ప్రకారమే ఉన్నందున మెట్రో రెండో దశకు సహకరించాలని కోరారు. ఎంపీ చామల లేఖకు ప్రధాని మోదీ సానుకూలంగా స్పందిస్తూ జవాబిచ్చారు.

నేను బీఆర్ఎస్ ఎమ్మెల్యేనే

» కాంగ్రెస్ సభ్యత్వం లేకుండానే ఫిరాయింపు ఎలా?

» సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేశా

» బీఆర్ఎస్ సభ్యత్వ రుసుం రూ. 5వేలు చెల్లిస్తున్నా

» అభివృద్ధి పనుల కోసం సీఎంను కలిస్తే పార్టీ మారినట్లు వక్రీకరించారు: ఎమ్మెల్యే గూడెం



పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): తాను బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నట్లు పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. ఇప్పటికీ బీఆర్ఎస్ సభ్యత్వం కింద ప్రతీ సంవత్సరం రూ.5వేలు చెల్లిస్తున్నామన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం సీఎంను కలిస్తే పార్టీ ఫిరాయించానంటూ వక్రీకరించారని చెప్పారు. ఇదే విషయాన్ని తెలియజేస్తూ సుప్రీంకోర్టుకు అఫిడవిట్‌ద్వారా తెలియజేశానన్నారు. సీఎం సమక్షంలో మహిపాల్‌రెడ్డి గతంలో కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు కథనాలు వెలువడ్డాయి. దీంతో పార్టీ ఫిరాయింపుల చట్టం ప్రకారం ఆయనపై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్ఎస్ నాయకత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్‌లో చేరికపై యూటర్న్ తీసుకున్న మహిపాల్‌రెడ్డి సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేయడం చర్చనీయాంశమైంది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఏనాడు పార్టీ నిర్ణయాలకు వ్యతిరేకంగా శాసనసభలో ఓటు వేయలేదని, పార్టీ విప్‌ను ధిక్కరించలేదని ఆయన తెలిపారు. పటాన్‌చెరు నియోజకవర్గ అభివృద్ధి కోసం ముఖ్యమంత్రిని కలిసినప్పటి ఫొటోల ఆధారంగా పార్టీ ఫిరాయించానని చెప్పడం సరికాదన్నారు. తాను కాంగ్రెస్ పార్టీ సభ్యత్వం తీసుకోకుండానే పార్టీ మారినట్లు ఎలా చెబుతారని ప్రశ్నించారు. ఈ అంశాలన్నింటినీ పొందుపరుస్తూ తాను వ్యక్తిగతంగా సర్వోన్నత న్యాయస్థానానికి అఫిడవిట్ ద్వారా విన్నవించానని మహిపాల్‌రెడ్డి తెలిపారు.

చెరువులో దూకి తల్లీకుమార్తె ఆత్మహత్య

సంగారెడ్డి క్రైం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి పట్టణ శివారులోని మహబూబ్‌సాగర్ చెరువులో దూకి తల్లీకుమార్తె ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ నెల 17న మెదక్‌లో అదృశ్యమైన వీరు సంగారెడ్డి చెరువులో బుధవారం నాడు విగత జీవులుగా కనిపించారు. సంగారెడ్డి పట్టణ సీఐ ఎస్.రమేష్ కథనం ప్రకారం.. మెదక్ పట్టణానికి చెందిన ముద్దుల సత్యనారాయణ ప్రభుత్వ ఉపాధ్యాయుడు. ఆయనకు భార్య విజయలక్ష్మి(52), కుమార్తె మణిదీపిక(27)లతో పాటు ఒక కుమారుడు ఉన్నారు. ఈ నెల 17వ తేదీన మెదక్ పట్టణం బ్రాహ్మణవీధిలోని తమ ఇంట్లో నుంచి విజయలక్ష్మి, మణిదీపిక ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయారు. తిరిగి ఇంటికి రాకపోవడంతో సత్యనారాయణ 18వ తేదీన మెదక్ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మెదక్‌లో అదృశ్యమైన తల్లీకుమార్తె సంగారెడ్డి పట్టణంలోని మహబూబ్‌సాగర్ చెరువులో బుధవారం శవాలుగా తేలారు. ఆ చెరువులోని గుర్రపు డెక్కను కొందరు వ్యక్తులు తొలగిస్తున్న క్రమంలో వారి మృతదేహాలు బయట పడ్డాయి. దీంతో పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరి ఆత్మహత్యకు కారణాలేమిటనే విషయమై దర్యాప్తు చేస్తున్నారు. భార్యాభర్తలు గొడవ పడేవారని పోలీసుల దర్యాప్తులో తేలింది. భర్త వేధింపులకు గురిచేస్తున్నాడంటూ గతంలో విజయలక్ష్మి మెదక్ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు అతనిపై గృహహింస చట్టం కింద కేసు నమోదు చేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.